Acc No: 2847

సారస్వత సౌరభము

(సారస్వత వ్యాస సంపుటి)

గ్రంథకర్త:
డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం, ఎం. ఏ., పిహెచ్. డి.,
ఆంధ్రోపన్యాసకుఁడు,
నిజాం కళాశాల, హైదరాబాదు.

Madhavi Book Centre,
OPP. ARYASAMAJ MANDIR,
SULTAN BAZAR,
HYDERABAD-27.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సహాయముతో
ప్రకటితము.

ప్రథమ ముద్రణము - మార్చి. 1970

ప్రతులు : 1000

హక్కులు : గ్రంథకర్తవి.

SARASWATHA SAURABHAMU

(Telugu literary essays)

By

Dr. G. V. Subrahmanyam, M. A. Ph. D.,
Lecturer in Telugu, Nizam College, HYDERABAD A.P.

894.8134
SUB
Acc No: 2847

మూల్యము :
రూ. 4. 50

ప్రాప్తిస్థానములు :

1. డా. జి. వి. సుబ్రహ్మణ్యం, ఎం. ఎ. పిహెచ్, డి.,
"శ్రీవాణి"—1-8-702/105; శంకరమఠము వెనుక
నల్లకుంట, హైదరాబాదు.

2. ఆంధ్ర సారస్వత పరిషత్తు,
తిలక్ రోడ్, హైదరాబాదు-1

3. శ్రీ పరమేశ్వర పబ్లికేషన్సు,
చిక్కడపల్లి, హైదరాబాదు-20

ముద్రణ :
శివాజీ ప్రెస్
సికింద్రాబాదు.

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ రథసారథులు

సారస్వత నవనీత శేవధులు —

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి

అంకితము

శా. పారావారగభీరభావుఁడవు, విస్ఫారాచ్ఛసత్కీర్తిసం
భారోదారగుణాఢ్యశీలుఁడవు, శోభావీచిరోచిర్మనీ
షారోమాంచితకావ్యగోష్ఠికలనాసాహిత్యసంవేదివౌ
శ్రీరామానుజరాయ! అందుకొనుమా స్వీకర్తవై నాకృతిన్.

శా. సారమ్మైన మహాంధ్రకావ్యసరసిన్ సంపుల్లరాజీవముల్
నీరంధ్రప్రభ లీనుచున్నఁ గని వానిన్ డాసి హర్షించి మే
ధారమ్యప్రతిభాంగుళల్ వరపి సంధానించి సాధించితిన్
సౌరభ్యప్రకరమ్ము; దీనిఁ గొనుమా సౌజన్యభవ్యాకృతీ!

మ. తెలఁగాణమ్మున మాతృభాషనిగళాల్ ద్రెంపంగ నుత్సాహులై
ఫలముం బొంద మహోద్యమంబు సలుపన్ పాగాల్ బిగంజుట్టి లోఁ
గలఁగం బాఱు నిరంకుశప్రభుతకుం గాలాంతపర్జన్యులై
వెలుఁగం గల్గిన వీరపార్థులకు గోవిందుండ! రామానుజా!

మ. తెలుఁగుల్ గూడి సమగ్రరాష్ట్రవిభవోత్తేజంబు లక్షించి లో
వెలుఁగుల్ నింపి సమైక్యసంస్కృతిసమావేశంబు సాధించుచో
కళలం బూర్ణశశిప్రభల్ నిగుడ రాకాసిద్ధి సాహిత్యవీ
థులకు న్నిత్యము గూర్చు నిర్మలయశశ్శ్రీధుర్య! రామానుజా!

మ. బహుధా భిన్నములైన లక్ష్యములతో బంధాల నిర్జించి లో
నహముల్ వెంచి యపూర్వకావ్యరచనావ్యాసంగసంగాత్ములౌ
బహిరంతర్ద్వివిధబోధ్యమానధిషణాప్రాగల్భ్యసారోద్ధతుల్
మహితుల్ కూడిన సంఘముల్ వెలయు నీమంత్రంబునన్ శాంతిమై.

శా. సాహిత్యంబును నీతివర్తనము సంస్థాపోషణప్రౌఢియున్
మోహాపేతవివేకసౌరభము సమ్మోదాత్మమిత్రాదృతుల్
నీహారాద్రిసమాత్మగౌరవము మన్నీల్ మెచ్చు ప్రాగల్భ్యమున్
సౌహిత్యంబుగ మేళవించిన గుణోత్సాహుండ! రామానుజా!

ఉ. మబ్బులు లేని వానవలె మాన్యమనీషిమిళిందపంక్తికిన్
అబ్బురపాటు కల్గ భవదాదరసారమరందధార తా
నబ్బును మైత్రిరూపమున నట్టిది నా కనుభూత మయ్యె; ఈ
కబ్బము నాఁడె నించినది కమ్మనితెమ్మెర సౌరభమ్ములన్.

ఉ. ఛాందసవృత్తి లేదు; గతి సాగుటకై చరణమ్ము లీడ్చుచున్
కుందిన జాడ లేదు; యతికోటుల యాగ్రహనిగ్రహాదులన్
నిందలు గొంట లేదు; గణనీయపదార్థవివేకసంగతిన్
పొందిక వీడ లేదు; నిను పొందెడు ఈకృతికిన్ సుధీమణీ!

శా. వ్యాసోల్లాసవిభావ మై, జలధరప్రాశస్త్యసంపాది యై
వాసిన్ కర్ణసుపర్వ మై, బహువిధోపాఖ్యానసంవేది యై
దేశీయాంధ్రపురాణవైభవము, వాగ్దేవీకళాపూర్ణిమల్
నీసమ్మోదము మీఱఁ దాల్చె కృతి; దీనిన్ నీవు పాలింపుమా!

ఆ మో ద వీ చి

డాక్టర్ పాటిబండ మాధవశర్మగారు
రీడరు, ఉస్మానియా విశ్వవిద్యాలయము
హైదరాబాదు.

చిరంజీవి డా. జి. వి. సుబ్రహ్మణ్యము వర్ధమానులైన విద్వద్విమర్శకులలో అగ్రశ్రేణియందు నిలువదగినవాడు. వేదవిద్యాప్రవణమైన విప్రకుటుంబమున పుట్టి పెరిగిన ఈచిరంజీవిచిత్తక్షేత్రము వంశానుగతమైన సనాతనసంస్కారముచే సంపన్నమై ప్రాక్తనజన్మవాసనాసిద్ధమైన ప్రతిభాబీజముయొక్క సత్వరప్రరోహ ప్రవర్ధనములకు సర్వథా యోగ్యమై యున్నది. అదృష్టవశమున బోధనమహనీయులైన ఆచార్యవర్యుల బోధనాసుధాసేచనము లభించి ఈతని ప్రతిభాలత ఆపాదచూడమును అచిరప్రరూఢకోరకాలంకృతమైనది. సాహిత్యతత్త్వవేత్తయైన అగ్రజుని వాత్సల్యమృదుపరామర్శచే ఆకోరకము సుకుమారముగా వికసించినది. వాని సౌరభములే ఈ సంపుటియందలి వ్యాసములు. ఇవి ఆంధ్రసాహిత్యోపాసకుల అంతరంగములను ఆమోదతరంగితములు కావింప గలవు.

చిరంజీవి సుబ్రహ్మణ్యము ఉస్మానియా విశ్వవిద్యాలయమున ఆంధ్రభాషా సాహిత్యములు అభిమానవిషయములుగా అధ్యయనము చేసి, ఎం. ఏ., పరీక్షయందు ప్రథమశ్రేణిలో ప్రథముడుగా ఉత్తీర్ణుడయ్యెను. మారన మార్కండేయ పురాణమును గూర్చి పరిశోధనము గావించి ప్రశస్తమైన సిద్ధాంతవ్యాసమును వ్రాసి డాక్టరేట్ పట్టమును సంపాదించెను. వీరరసము యొక్క విశ్వరూపమును నిరూపించు అపూర్వగ్రంథము రచించి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి బహుమతిని గెలుచుకొనెను. అకాడమీవారి ఆదేశము ననుసరించి బసవపురాణమునకు విపులపీఠికాలంకృతమైన సంక్షిప్తసంస్కరణమును సంతరించెను. ఆకాడమీవారి ఆదేశము ననుసరించియే రత్నములవంటి వ్యాసములను రెండుసంపుటములుగా సంకలనము చేసి సూక్ష్మసమీక్షారూపములైన విపులపీఠికలను వానికి పట్టబంధములుగా నమర్చెను.

చిరంజీవి సుబ్రహ్మణ్యము ప్రతిభాశాలి, వ్యుత్పన్నుడు, వివేకి. సంప్రదాయానురక్తి, వృద్ధోపసేవాసక్తి, ఈతని చిత్తమునకు చక్కని పరిపాకమును సంయమమును సమకూర్చినవి. విషయవిశ్లేషణమునకు కావలసిన సూక్ష్మదృష్టియు, విశ్లిష్టాంశముల సమన్వయమునకు కావలసిన క్రాంతదృష్టియు ఈతనికి చక్కగా అలవడి యున్నవి. విషయమున సమగ్రత, పరిశీలనమున శాస్త్రీయత, సిద్ధాంతీకరణమున తార్కికత, ఈతని రచనల సామాన్య లక్షణములు. ఇతనిని ఉత్తమ పరిశోధకుడుగా, విమర్శకుడుగా, రచయితగా రూపొందించినది ఈతని సర్వప్రవృత్తికి ప్రాణభూత మైన ఉత్సాహము.

ఇష్టానిష్టప్రకటనము విమర్శ కాదు; అట్టిది రాగద్వేషజుష్టము కనుక. గుణదోష నిరూపణము కూడ విమర్శ కాదు ; అట్టిది కేవలము శాస్త్రపరతంత్రము కనుక. తత్త్వావిష్కరణమే ఉత్తమవిమర్శ; అట్టిది పరమార్థనిరూపకము కనుక. జగత్తత్త్వమును దర్శించి దానిని కావ్యమున సౌందర్యరూపమున ఆవిష్కరించు కవికి ఋషిదర్శనమువంటి దర్శనము ఉండవలె నని భావించి పెద్దలు 'నానృషిః కురుతే కావ్యమ్' అని సూత్రించిరి. కావ్యతత్త్వమును దర్శించి, దానిని లోకహితార్థము తన వ్యాసమున ఆవిష్కరించు విమర్శకునకు కవిదర్శనమువంటి దర్శనము ఉండవలయును గనుక మనము 'నా కవి ర్విమృశేత్ కావ్యమ్' అని అనుసూత్రింపవచ్చును. ఋషికి గల దర్శనశక్తితోపాటు దృష్టమైన అర్థమును భావించి జగదానందకర మగు సుందరరూపమును ప్రదర్శించు వర్ణనానైపుణియు కవికి గలదు. సహృదయునకు కవికి గల భావనాశక్తి మాత్రమే కలదు. ఆ భావనాశక్తితో పాటు భావితమైన కావ్యార్థమును జగదితంకరమగు పరమార్థరూపమున ప్రదర్శించు వ్యాఖ్యాననైపుణియు విమర్శకునకు కలదు. సూక్ష్మార్థావాప్తి నిరత మైన ధీవ్యాపారము నైపుణము అని శారదాతనయుడు వివరించెను. అట్టిధీవ్యాపారము గల విమర్శకుఁడే ఉత్తమ విమర్శకుడు. చిరంజీవి సుబ్రహ్మణ్యము ఇట్టి విమర్శకుల కోవలోని వాడు.

లోకమున ఎల్లరు సహృదయులు కారు. కాని వారిశ్రేయస్సు నభిలషించి విమర్శకుడు కావ్యతత్త్వము నావిష్కరించి చూపును. సద్విమర్శ ఒక వంక సాహిత్యారాధన; వేఱొకవంక లోకారాధన. కావ్యము వేద మైనచో విమర్శ ఉపనిషత్తు. కవి ఋషి యైనచో విమర్శకుడును ఋషియే. ఋషి కానివాడు కావ్యము చేయగూడనిచో కవి కానివాడు విమర్శ చేయగూడదు.

తత్త్వావిష్కరణమే లక్ష్యముగా గల విమర్శకుడు ఉత్తమ పరిశోధకుడు కూడ కావలెను. రససూత్రవ్యాఖ్యానములను పరామర్శించుచు అభినవగుప్తపాదులు ఉత్తమపరిశోధన లక్షణ మిట్లు నిర్దేశించిరి.

శ్లో "తస్మాత్ సతా మత్ర న దూషితాని
మతాని తాన్యేవ తు శోధితాని
పూర్వప్రతిష్ఠాపిత యోజనాసు
మూలప్రతిష్ఠా ఫల మామనంతి"

'త దుచ్యతాం పరిశుద్ధ తత్త్వమ్'

సత్పురుషుల అభిప్రాయములకు దోష మాపాదింపరాదు. వాని యందలి దోషములను తొలగింపవలెను. ఆ తొలగించుటయే పరిశోధనము. పరిశోధనము వలన పరిశుద్ధతత్త్వము స్పష్టపడును. పూర్వప్రతిష్ఠితములైన మతములను సంయోజన చేయునపుడు మూలసిద్ధాంతమును శోధించి పరిశుద్ధరూపమును ప్రతిష్ఠింపవలెను. ఇది సంప్రదాయవేత్తలైన బుద్ధిమంతులు చేయుపని. చి॥ సుబ్రహ్మణ్యము ఇట్టి పరిశోధకుల కోవలోని వాడు. ఈవిధమైన పరిశోధన తపస్సు వంటిది కనుక పలువురు దానిజోలికి పోరు. తాళపత్ర గ్రంథములను సేకరించి, వ్రాతతప్పులు సవరించి పాఠాంతరములు సమకూర్చి ముద్రణమునకు సిద్ధముచేసి అదియొక పరిశోధన మని పలువురు తృప్తిపడుదురు. ముద్రితమయ్యు లోకుల అలసత కారణముగా అనాదృతిపాలైన ఒక మహాగ్రంథము యొక్క ఉపాదేయతను సహేతుకముగా స్పష్టముగా లోకులకు నివేదించుట పైదానికంటె మేలైన పరిశోధన మని నా యభిప్రాయము. చి॥ సుబ్రహ్మణ్యము ఇట్టి మేలైనపని కూడ చేసెను. మృతప్రాయమై యున్న మారన మార్కండేయ పురాణమును ఉజ్జీవింప చేసి కలకలలాడించెను. నక్రతిమింగలాదులకు భీతిలక మహాసముద్రమున మునిగి రత్నములను ముత్యములను పైకి తేగల ధైర్యశాలి ధీశాలి మాత్రమే ఇట్టి పనికి పూని నెగ్గగలడు!

భిన్నభిన్నగ్రంథములందు చెల్లచెదరై పడియున్న యంశములను సేకరించి, క్రోడీకరించి క్రమబద్ధమైన రూపమున ప్రదర్శించుటయు ఒక పరిశోధనగానే పరిగణింపబడుచున్నది. ఇది క్లేశముతో గూడిన పని. చి॥ సుబ్రహ్మణ్యా మిట్టి పనియు చేయగలడు. విజ్ఞానవీరుడైన అతని ఉత్సాహము నెదుట ఎంతటి క్లేశమును లేశమును గాదు.

కొన్ని విమర్శలు మేధావిలాస ప్రధానములుగా నుండును. అవి నిర్మాణాత్మకములై విజ్ఞానప్రదము లగును. కొన్ని విమర్శలు హృదయస్పంద ప్రధానములుగా నుండును, అవి సృజనాత్మకములై ఆనందప్రదములుగా నుండును. ఈ సంపుటియందు చి॥ సుబ్రహ్మణ్యము సమకూర్చిన వ్యాసములు వైవిధ్యశోభితములై ఆతని బహుముఖపరిశోధనాపాటవమునకును, వ్యాఖ్యాననైపుణికిని నిదర్శనములుగా నున్నవి.

'పురాణము – ఇతిహాసము' అనువ్యాసమున ఆ శబ్దముల నిరుక్తులు, వానిచే ప్రతిపాదింపబడు వస్తువులయొక్క స్వరూపములు, ఆ వస్తువుల నభివర్ణించు సారస్వత ప్రక్రియల లక్షణములు, అట్టి లక్షణములు గల గ్రంథముల లక్ష్యములు ప్రయోజనములు సూక్ష్మము, సర్వతోముఖము నైన దృష్టితో శాస్త్రీయమైన మార్గమున చర్చింపబడి సమగ్రముగా నిరూపింపబడినవి. పాశ్చాత్యుల 'మిత్, ఎపిక్' అనబడువాని స్వరూప స్వభావములు, వానియందలి భేదప్రభేదములు సునిశితముగా విమర్శింపబడి నిరూపింపబడినవి. వానికి పురాణేతిహాసములతో గల భేదసాదృశ్యములు పరిశీలింపబడి పురాణేతిహాసముల యొక్క విలక్షణత, ఉదాత్తత స్థాపింపబడినది. ఈ చర్చయందంతట వ్యాసకర్త ప్రదర్శించిన తటస్థభావము, సంయమము ప్రశంసనీయములు. పురాణేతిహాసముల ఆవిర్భావమునకు బీజములు వేదములలోని అర్థవాదములందే కలవు. అతీతార్థప్రధానములైన వీనియందలి వృత్తాంతముల ప్రాచీనతను లఙ్ లుఙ్ లిట్ అను త్రివిధలకారములచే నిర్దేశింపబడిన భూతకాలత్రయముతో సమన్వయించుటకు చేసిన ప్రయత్నము మౌలికముగా నున్నది. 'పరిక్రియా పురాకల్ప ఇతిహాస గతిర్ద్విధా'' అని రాజశేఖరుడు చేసిన ఇతిహాసగతిభేదములను పరక్రియా పురాకల్పము లనెడు అర్థవాదములతో అనుసంధించి అర్థముల ఏకవక్తృత్వ బహువక్తృత్వములనే రాజశేఖరుడు ఏకనాయకత్వ బహునాయకత్వములుగా రూపించెనని చేసినయూహ చమత్కారవంతమే కాక, సత్యవంతమునై యున్నది. 'బహుశః మీమాంసకులు చెప్పెడి ఈ అర్థవాదభేదములను రాజశేఖరుడు గ్రహించి తన కావ్యమీమాంసయందు స్థాపించియుండవచ్చును'- అని వ్యాసకర్త తన యూహలో శంకాలేశమునకు తావిచ్చుచున్నాడు. ఈయనక్కరలేదు. 'కావ్యమీమాంస' అను పేరే అతని మీమాంసాశాస్త్రాభినివేశమును చాటుచున్నది. 'పరక్రియ' అను అర్థవాదమే 'పరిక్రియ' అను ఇతిహాసభేదముగా రూపొందినది. ఈ పదములందలి స్వరభేదము యాదృచ్ఛికము కాదు. పరిక్రియా 'పరిష్క్రియ' అనుపదములకు అలంక్రియ అని అర్థము. అలం

కృతమైన ఇతిహాసభేదము పరిక్రియ. అందలి వస్తువు ఏకనాయక మగుటయే 'పరిక్రియ' లేక 'పరిప్రక్రియ'. నాయకైక్యము వస్త్వైక్యమునకును, రసైక్యము నకును కారణ మగును. కనుక పురాకల్పమైన ఇతిహాసమున రసమునకు ప్రాధాన్యము లేదు. అనగా సంపూర్ణకావ్యత్వము లేదు. కనుక దానికి పురాణత్వ శాస్త్రత్వములు సిద్ధించును. పరిక్రియ విశుద్ధమైన కావ్య మగును. కనుకనే రాజశేఖరుడు రామాయణమును పరిక్రియగా భారతమును పురాకల్పముగా పేర్కొనెను. ఈ దృష్టితో చూచినచో సంస్కృతమున పురాకల్పమైన భారతమును తెలుగున పరిక్రియగా వెలయించుటకు కవిత్రయమువారు యత్నించినట్లు కనిపించును.

'మేఘసందేశము-ప్రకృతివర్ణనము' అను వ్యాసము విషయవిశ్లేషణమునకును, విశ్లిష్టాంశముల సమన్వయ పూర్వక వ్యాఖ్యానమునకును చక్కని ఉదాహరణము. కాదాళిదాసు సాహిత్యముపై ఎంతయో సాహిత్యము పుట్టినది. ఆయన కవితాసౌభాగ్యమును గూర్చి క్రొత్త విశేషములు చెప్పుట ఒకపాటివానికి శక్యము గాదు. ఆయనప్రతిభ ఉన్మేషించినట్లెల్ల ఉన్మేషించగల విలక్షణప్రతిభ గలవానికే అది శక్య మగును. మేఘసందేశమున వస్తువు లేదు. ఉన్నదంతయు వర్ణనయే. విశేషించి జడమో చేతనమో అయిన ప్రకృతియొక్క వర్ణనమే. జడము, చేతనము అని మన మందుము. కాని, ఆమహాకవి భావనలో పడి ఆయన చైతన్యమున మగ్నమై ఆయన కావ్యప్రపంచమున అవతరించిన వస్తువులకు జడము చేతనము అన్న భేదము లేదు. ఆయన నదీపర్వతకాంతారాదుల వర్ణనలలో ఈ రహస్యమె ట్లిడియున్నదో వ్యాసకర్త చక్కగా నిరూపించెను. స్త్రీ పుంసయోగరూపమైన రతిభావమును జడప్రకృతియందు సైతము వర్షర్తు వెట్లు ఉద్దీపింప జేయునో పదార్థవిజ్ఞానశాస్త్ర సిద్ధాంతానుసారముగా వ్యాసకర్త నిరూపించినాడు. మేఘుని యాత్రను చతుర్విధపురుషార్థమయ మైన ఒకమహాపురుషుని జీవయాత్రగా కాళిదాసు ఉద్దేశించె నని యూహింప వచ్చును. పరోపకార మనెడి పరమధర్మము మేఘుని జీవితమునకు ప్రాతిపదిక. నానావిధశృంగారనాయిక లైన నర్మదాది నదీలలామలతో ఉపభోగించు కాముకు డాతడు. అట్టివాడు సరస్వతీ జలపానముచే అంతశ్శుద్ధుడై గంగాజలమున మునిగి పవిత్రుడై కైలాసగిరి కేగి పార్వతీపరమేశ్వరులను సేవించుటకు యోగ్యు డయ్యెను. తక్కిన నదులను శృంగారనాయికలుగా వర్ణించి, సరస్వతీగంగానదులను పుణ్యాంగనలుగా వర్ణించుటలో కాళిదాసుని ఆశయము క్షాళితకామకల్మషుని, సంచితపుణ్యుని కావించి మేఘుని కైలాసమునకు పంపుటయే యని వ్యాసకర్త చక్కగా భావించి నిరూపించెను.

మహాభారతమున కర్ణుని స్థాన మెట్టిదో అలంకారశాస్త్రానుసారముగా నిరూపింప నెవ్వరును ప్రయత్నించినట్లు కనపడదు. 'మహాభారతము, కర్ణుడు' అను వ్యాసమున వ్యాసకర్త అట్టి ప్రయత్నము చేసెను. నాయకపక్షమున అనునాయకోపనాయకులు ఉండుట ఆలంకారికులు గుర్తించి వారిలక్షణములను నిర్దేశించిరి. ప్రతినాయక పక్షమునను అట్టివారి యునికి సమంజసమే యని గుర్తించి కర్ణుడు ప్రతినాయకోపనాయకుడు అని వ్యాసకర్త శాస్త్రావిరుద్ధముగా సమర్థించెను; ప్రతినాయక పక్షమునం దుండియు లోకులయొక్క సానుభూతికి అత్యంతము పాత్రుడగుటకు కర్ణుని జీవితమున గల రహస్యములను నిపుణముగా కనిపెట్టి ప్రపంచించెను. ఈ వ్యాసమున సుబ్రహ్మణ్యము చేసినది కర్ణుని శీలమును పరిశీలించుట కాదు; భారతమున చెదరి పడియున్న ఆతని జీవితాంశములను అనుసంధించి ఆతని సమగ్ర జీవితముయొక్క యథార్థస్వరూపమును చిత్రించి చూపుట. ఇట్టి విమర్శలో వివేచనాత్మకమైన బుద్ధివ్యాపారముకంటె సమన్వయాత్మకమైన భావనావ్యాపారమునకే ప్రాధాన్యము. దీనిని చదువునప్పుడు కావ్యము చదునప్పటి యనుభవము వంటి అనుభవము కలుగును. ఇట్టి విమర్శయే సృజనాత్మకమైన విమర్శ యని నా అభిప్రాయము.

ఓరుగంటిలో శివభక్తులు బసవపురాణము వినుచుండగా చూచి ప్రతాపరుద్రదేవుడు 'ఆ పురాణంబు విధ మెట్లొకో' అని ఒక విప్రు నడిగెనట! ఆదూర్తవిప్రునకు దానివిధ మెట్టిదో తెలియదు. నేటివరకును తెలియలేదు. 'బసవపురాణ నిర్మాణము—జైనపురాణ ప్రభావము' అనువ్యాసమున చి॥ సుబ్రహ్మణ్యము బసవపురాణ స్వరూపమును చక్కగా ఆవిష్కరించెను. ఆర్షసంప్రదాయ సిద్ధములైన పురాణములయొక్క స్వరూపమును, తద్విరుద్ధములైన జైనపురాణములయొక్క లక్షణములను తదనుసారులైన శైవపురాణముల లక్షణములను వ్యాసకర్త సాకల్యముగా పరిశీలించి, వానికి గల భేదములను సాదృశ్యములను స్పష్టముగా నిరూపించెను. ఈవ్యాసమున ప్రతిపాదింప బడిన సిద్ధాంతము అపూర్వమైనది. విపులమైన సామగ్రిని సేకరించి అందలి అంశములను తులనాత్మకదృష్టితో సూక్ష్మముగా పరిశీలించి ఒక నవీనమైన సిద్ధాంతమునకు అభిముఖముగా నిపుణముగా సమన్వయించి సుబ్రహ్మణ్యము ఈ వ్యాసమును పరిశోధకులకు చక్కని ఒజ్జబంతిగా రూపొందించెను.

పురాణరచనలో ధర్మప్రతిపాదనమునకే తప్ప, కథాకథన శిల్పమునకు, రసపోషణమునకు, పాత్రచిత్రణమునకు ఏమాత్రమును అవకాశము లే దందురు.

అది సంస్కృత పురాణముల విషయమున నిజమైన కావచ్చును. కాని, తెలుగు పురాణములతీరు వేరు. అవి పుట్టిన కాలమును బట్టి అవి పట్టిన మార్గములు వేరైనవి. తెలుగున వెలసిన మొదటి మహాపురాణము మార్కండేయము. దానిని రచించినవాడు మారన. ఆతడు తిక్కనగారి శిష్యుడు. తిక్కనగారి ముద్ర ప్రత్యక్షముగా పడినవాడు. తిక్కన రసప్రవణుడు. వ్యాసభారతమును ఆయన తెనుగు బాసలో వినిర్మించెను. ఆ వినిర్మించుట రసపుష్టి కొరకు. ఆయన మహాభారతమును ప్రబంధమండలిగా నిర్మించెను. మారన కా రహస్యము తెలియును. మార్కండేయ పురాణమును గూడ ప్రబంధమండలిగానే ఆతడు నిర్మించెను; పురాణపరమార్థము చెడకుండునట్లు కావ్యపరమార్థమును పోషించెను. మారన నిర్మించినది వట్టి పురాణము కాదు; ప్రౌఢపురాణము. అనగా యథాస్థానమున రస భావబంధురమైనది; వివిధ కావ్యశిల్పములతో విలసిల్లినది. ఈ యంశమును తొలుత గుర్తించి నిరూపించినవాడు చి॥ సుబ్రహ్మణ్యము. ఒక పురాణమును కావ్యముగా దర్శించుట కెంతయో సహృదయత కావలయును. అట్లుగా నిరూపించుట కెంతయో ప్రజ్ఞ కావలెను. 'మారన హరిశ్చంద్రోపాఖ్యాన' మను వ్యాసమున వేదమున, మార్కండేయ పురాణమున, మారన గ్రంథమున హరిశ్చంద్రుని కథ ఎట్లు క్రమవికాసము పొంది, సుందర కావ్యస్వరూపమును ధరించినదో ఈ వ్యాసమున చక్కగా నిరూపింపబడినది. సన్నివేశకల్పనమున, కథానిర్మాణమున, పాత్రచిత్రణమున, రసపోషణమున, అంగాంగిరససమన్వయమున మారన ఎట్టి సుకుమారమైన శిల్పమును ప్రదర్శించెనో ఈవ్యాసమున ప్రత్యక్షర పరిశీలన పూర్వకముగా నిరూపింప బడినది. మరుగుపడి యున్న ఒక మాణిక్యమును మెరుగుపెట్టి మరులుకొల్పు నట్లు చేసి, సుబ్రహ్మణ్యము తెలుగువారికి కనువిప్పు కలిగించినాడు.

రాయలవారు వర్ణనాప్రియు లని జగ మెరిగిన సత్యము. ఆ వర్ణనలయందలి చమత్కారములు పలువు రెరిగిన రహస్యములు. ఎవరికిని తెలియని యొక రహస్యమును సుబ్రహ్మణ్యము కనిపెట్టినాడు. అది విల్లిపుత్తూరును, మధురను వర్ణించు పట్ల రాయలవా రవలంబించిన విలక్షణమైన ఔచిత్యము. విల్లిపుత్తూరు విరక్తుడైన విష్ణుచిత్తుని ఆవాసము. దానికి ప్రభువు మహావిష్ణువు. ఆ నగరమందలి వాతావరణమంతయు విష్ణుభక్తిగుంఫితమై యున్నదా యన్నట్లు రాయలవా రానగరమును వర్ణించిరి. మధురానగరమునకు ప్రభువు పాండ్యరాజు. అతని పేరు

మత్స్యధ్వజుడు. అనగా మన్మథుడు. అచ్చట సర్వమును శృంగారమయముగా నున్నదా యనునట్లు రాయలవా రా నగరమును వర్ణించెను. ఈ రెండునగరముల వర్ణనములయందు ఇట్టి సమన్వయసూత్ర మొకటి వ్యాపించి యున్నదని ఈవ్యాసకర్త నిరూపించిన తీరు మిక్కిలి ప్రౌఢముగా నున్నది.

వరూథిని అనగానే పెద్దనగారు తీర్చిన వరూథినియే ఎల్లరకును స్ఫురించును. కాని ఆమె అంతకు పూర్వము ఎన్నడో పుట్టినది. ఆమె తొలిసృష్టి సంస్కృత మార్కండేయ పురాణమున జరిగినది. ఆమె వరాప్సర, మహాభాగ, మౌలేయ, రూపశాలిని. మారన మార్కండేయ పురాణమున ఆమె అభిమానవతిగా, చతురవచోరచనాధురీణగా రూపొందినది. పెద్దన మనుచరిత్రమున ఆమె జాత్యహంకారవతిగా ప్రౌఢవచోనిపుణగా రూపొందినది. పురాణమున, పురాణకావ్యమున, ప్రబంధమున వరూథినీ పాత్రము పొందిన ఈ క్రమవికాసమును, ఆ వికాసమునందలి దశాంతరములను వ్యాసకర్త నిపుణముగా చిత్రించినాడు.

కావ్యమున వస్తువునకు సర్వప్రాధాన్యమును ప్రాచీను లంగీకరింప లేదు. వస్తువునందలి అపూర్వకల్పనలకు కూడ రసపర్యవసాయిత్వమునే విధించిరి. కేవలకల్పితకథలకు కావ్యార్హతయే వారు నిరాకరించిరి. పింగళి సూరన రచించిన అపూర్వకథా సంవిధాన మహనీయ మగు కళాపూర్ణోదయము రసవన్మహాప్రబంధముగా ఆంధ్రుల ఆదరము పొందినట్లు కనపడదు. అపూర్వవస్తుకల్పన, విచిత్ర వస్తుసంధానము దానికి ప్రాణములు. వస్తువునకు ప్రాధాన్య మిచ్చు పాశ్చాత్య సాహిత్య సంస్కారము బలసిన తరువాత కళాపూర్ణోదయము ప్రశస్తి హెచ్చినది. ఆ కథానిర్మాణవిలక్షణతను గురించి, అందలి తాత్త్విక రహస్యములను గురించి, ప్రేమసిద్ధాంతములను గురించి గ్రంథములు, వ్యాసములు బయలుదేరినవి. కథానిర్మాణమందలి చమత్కారములు నిరూపింపబడినవి గాని ఆ కథాంశములకు బీజము లన్వేషింపబడలేదు. అట్టి అన్వేషణకు కీలకము దొరకలేదు. ఆ కీలకమును సుబ్రహ్మణ్యము కనిపెట్టినాడు. సరస్వతీ చతుర్ముఖుల కేళీఘట్టమున బ్రహ్మ వాణితో పలికిన పలుకులలో సూరన ఈ కీలకమును నిక్షేపించినాడు. ఇది యొక గ్రంథగ్రంథి. ఈ ముడిని విప్పినచో గ్రంథరహస్యము గుప్పున గుబాళించును. 'కలభాషిణీ కథామూలము' అను వ్యాసమున గుబాళించిన సౌరభము ఈ రహస్యమే. 'అందు వాచ్యత తోచినట్టి నామజాతి క్రియాదిక సకలపదార్థ వాక్యార్థాంతరము లెవ్వి యవియ యుందు కలయవి' అను వాక్యమందలి 'వాచ్యత

తోచినట్టి' అను మాటలలో ఏదో రహస్యము దోబూచులాడుచున్నట్లు చి॥ సుబ్రహ్మ ణ్యమునకు తోచినది. ఆ తోచుట దైవికమే కాని దాని నన్వేషించి పట్టుకొనుటకు పురుషప్రయత్నము కావలెను. చి॥ సుబ్రహ్మణ్య మా ప్రయత్నము చేసి ఆ రహస్య మును సాధించినాడు. కలభాషిణీవృత్తాంతకల్పనకు మూలములైన బీజములు వాణీముఖ ప్రతిబింబ వర్ణనాఘట్టమున నిక్షిప్తములై యున్న వని అనుమానించి, నిశితముగా పరిశీలించి, వాణీచతుర్ముఖుల ముఖబింబముల యొక్కయు, మణిస్తంభ మునందలి తత్ప్రతిబింబముల యొక్కయు కదలికలయందు కలభాషిణీ కథయందలి సర్వకథాంతరములును కదలాడుచున్నట్లు కనిపెట్టెను; సూక్ష్మాతిసూక్ష్మ వివరము లతో ఆ కథాంశములకు మూలములైన బీజములను ఎత్తిచూపెను. కళాపూర్ణో దయ పరిశీలనమున సరిక్రొత్తయైన మార్గమును త్రొక్కి అనితరసాధ్యమైన రహ స్యమును సాధించి చి॥ సుబ్రహ్మణ్యము పింగళి సూరన ప్రతిష్ఠను మఱియొక మెట్టు పై కెక్కించెను.

జంటకవులుగా తిరుపతి వేంకటేశ్వర కవుల పాండిత్యము, స్వభావము, వ్యక్తిత్వము, వారికవిత్వముయొక్క ప్రశస్తి, సాహిత్యమునకు వారు చేసిన సేవ, మొదలగు నంశముల గూర్చియు బుద్ధ చరిత్రమును వా రాంధ్రీకరించిన తీరునుగూర్చియు చేసిన పరిశీలనములు ఆతని వివేచనా శక్తికి తార్కాణములుగా నున్నవి.

నాకు వ్యాకరణము రుచించదు. ఇంత సాహిత్యశిల్పదృష్టి గల సుబ్ర హ్మణ్యము మనస్సు వ్యాకరణము మీది కెట్లు పోయెనో ద్రుతస్వరూపమునుగూర్చి ఈతడు వ్రాసిన 17 పుటల వ్యాసమును చూచి ఆశ్చర్యపడితిని. ద్రుతమునుగూర్చి చెప్పదగినది ఇంత ఉన్నదా! ఇంకను ఏమైన ఉన్నదా! ఉండదు. ఉండనిచ్చుట సుబ్రహ్మణ్యము స్వభావము కాదు. ఎంతో విషయమును సేకరించుటయే కాక, సేకరించిన విషయములందలి విరోధాభాసములను సమన్వయించుచు ద్రుతముయొక్క వివిధావతారములను ఆత డేకసూత్రమున నడిపించి చూపెను. 'ఈ చిన్ని వ్యాసమున ద్రుతస్వరూప నిరూపణమును గూర్చి యథాశక్తి వ్రాయబడినది' అని చెప్పికొనెను. ఇది వినయముతో చెప్పుకొన్నమాట, విద్యాతృష్ణవలెనే వినయమును అతనికి జీవనిష్ఠమైన ఒక మహాగుణము. 'విద్య యొసగును వినయంబు, వినయమునను బడయు పాత్రత, పాత్రత వలన ధనము, ధనము వలనను ధర్మంబు, దానివలన నైహికాముష్మిక సుఖంబు లందు నరుడు' అని అనుభవ మహితులైన మహాత్ములు

చెప్పిన ఈ సూక్తికి సర్వదా లక్ష్యభూతు డగునట్లు పరమేశ్వరుడు ఈ చిరంజీవిని ఆశీర్వదించు గాక అని వేడుకొందును. ఇట్టి రచనలను పెక్కింటిని సమర్పించి ఆంధ్ర సరస్వతిని, ఆంధ్రలోకమును, ఆరాధించి ఈ చిరంజీవి చరితార్థు డగు గాక అని ఆశాసింతును.

ఇతి శివమ్.

పాటిబండ మాధవశర్మ

ఆశీస్సులు

ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు

రిటైర్డు - ఆంధ్ర శాఖాధ్యక్షులు,
ఆంధ్ర శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయములు.

తిరుపతి.
27-12-69.

చి॥ శ్రీ సుబ్రహ్మణ్యముగారికి, ఆశీర్వచనములు.

సారస్వత సౌరభము అనే మీ వ్యాససంపుటిని చాలభాగం చదివి సంతోషించాను. మీరు నిరుపమైన పాండిత్యము కలవారుగా, నిశితపరిశోధనదృష్టి కలవారుగా సరసవ్యాసకర్తలుగా లోకంలో ప్రతిష్ఠ గడించారు. అట్టి మీకు ఈ సంపుటిని గురించి నా అభిప్రాయము గాని, ఇంకొకరి అభిప్రాయము గాని ఆవశ్యకమని నే ననుకోను. అయినా మీ కోరికను త్రోసిపుచ్చలేక ఒకటిరెండు వాక్యాలు వ్రాస్తున్నాను.

పైన నేను పేర్కొన్నవి మీ సారస్వతయశమునకు కారణమైన ప్రజ్ఞలు. ఈ వ్యాససంపుటి కూడ ఆ ప్రజ్ఞావిశేషములకు అనుగుణముగానే ఉన్నది కాని భిన్నముగా లేదు. విశేషించి కళాపూర్ణోదయమునందలి సరస్వతీ చతుర్ముఖుల ప్రణయకలహాంశములకు మీరు చెప్పిన నూతనవ్యాఖ్యానము అపూర్వమును అద్భుతముగా నున్నది. ఆ గ్రంథకర్త, పింగళి సూరన, మి మ్మనుగ్రహించుగాక! మీకు గల వృద్ధసేవాతత్పరత మీకు సర్వదా రక్ష యగుగాక !

పింగళి లక్ష్మీకాంతం

ఆచార్య డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు

ఆంధ్ర శాఖాధ్యక్షులు,
ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాదు.

శ్రీ చి. డా. సుబ్రహ్మణ్యముగారాదరగౌరవములతో నర్పించిన సారస్వత సౌరభము నాఘ్రాణించి యానందము నందితిని. వారు ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసములు మూఁడును పుష్కలముగాఁ గల యువపుంగవులు. ఈ వ్యాససంపుటమందలి

ప్రతివ్యాసమును వారి నిశిత పరిశీలనమును, పాండితీ పరిపాకమును, శైలీరామణీయకమును జాటుచున్నది.

వారు మొదటివ్యాసమున పురాణేతిహాసముల లక్షణములను, పాశ్చాత్యుల ఎపిక్ మిత్తులకును వానికిని గల సంబంధమును జక్కఁగా విశదీకరించినారు. మేఘసందేశమునందలి కాళిదాసుని ప్రకృతి వర్ణన నైపుణ్యమును, ఆముక్తమందలి రాయలవర్ణన చాకచక్యమును, బసవపురాణమునఁ గల జైనపురాణ ప్రభావమును వారు నేర్పుతో నిరూపించినారు. వారు వరూధిని మానినీత్వమును వ్యక్తము చేసిన వ్యాసము మిక్కిలి సరసముగా నున్నది.

సరస్వతీ బ్రహ్మల కేళీవృత్తాంతమందే కలభాషిణీకళాపూర్ణుల యుదంతములు వ్యంగ్యముగను వాచ్యముగను గోచరించుచున్నవని వారు కావించిన సిద్ధాంతము నూతనమై వారి పరిశోధన ప్రాభవమును జాటుచున్నది.

జంటకవు లను వ్యాసమున వారు శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవుల ప్రతిభామన స్తత్త్వములను బాగుగాఁ బ్రకటించియున్నారు. బుద్ధచరిత్రను సంస్కృతాంగ్ల మూలములతోఁ బోల్చి, వారు చేసిన విమర్శన బహుపరిశ్రమసాధ్య మైనది.

మారన మార్కండేయ పురాణమందలి హరిశ్చంద్రోపాఖ్యానము విశిష్టతను, మహాభారతమున కర్ణపాత్రకుఁ గల ప్రాధాన్యమును వారు నిరూపించినతీరు ప్రశంసాపాత్రముగా నున్నది. ద్రుతస్వరూపమును నిరూపించుటలో వారు వివిధాంధ్ర వ్యాకర్తల యభిప్రాయములను నిశితముగాఁ బరిశీలించి యాథార్థ్యమును వెల్లడించినారు.

ఇందలి యొక్కొక్కవ్యాస మొక్కొక్క విశిష్టతతోఁ గూడి శ్రీ సుబ్రహ్మణ్యముగారి సర్వతోముఖ సామర్థ్యమును జాటుచున్నది. వారి శైలి నిర్దుష్టమై, విషయవివరణ దక్షమై, ప్రౌఢమై, విశదమై చదివిన కొలంది చదువవలె నను నుత్కంఠ కలిగించుచున్నది. వర్ధిష్యమాణులైన వారి వలన నాంధ్రభారతి కభినవాలంకృతు లెన్నో చేకూరు నను నాయాశయు నాశయమును సత్వరసిద్ధి నొందుఁ గాక యని భగవంతుని బ్రార్థించుచున్నాను.

దివాకర్ల వేంకటావధాని

8-1-70

డా. పల్లా దుర్గయ్య
రీడరు, ఉస్మానియా విశ్వవిద్యాలయము,
హైదరాబాదు.

ఇది సారస్వత సౌరభము. విమర్శక వ్యాసముల సంపుటి. కర్త డా. జి.వి. సుబ్రహ్మణ్యము. నిత్యసాహిత్య వ్యవసాయకు డీయన.

సాహిత్య మొక నందనవనము. అందలి అందాల తీవపందిళ్ళు ఆంధ్ర కావ్యపుష్పవాటికలు ; రసబంధుర పేటికలు.

కావ్యోద్యానములో విహరించి, సుకుమార కావ్యసమగర్భాంతరాళములు గవేషించి, పూలపాట పుక్కిలించి, పూలతావి పుడిసిలించి, తనిసిపోయి, తనిసి పోని విమర్శక పుష్పంధయము శ్రీ సుబ్రహ్మణ్యము.

తా నాస్వాదించిన రసములను, తా నాఘ్రాణించిన వాసనలను పదిమందికి పంచవలెనను బలీయమగు ఉబలాటమునకు ఫలితము ఈ సారస్వత సౌరభము.

దారి తెలియని ప్రవరునకు వరూథిని గారుడోత్కీర్ణభవనముజాడ తెలుపుటకు ఉపకరించినవి నాడు కస్తూరి పచ్చకప్పురముల ఘుమఘుమలు.

తీరు తెలియని జిజ్ఞాసువునకు ఆంధ్రసాహిత్యపు తెన్ను లెటిగించుటకు నేడు ఉపకరించునది ఈ సారస్వతసౌరభము.

ఇందలి వ్యాసములు పదునొకండును విషయవైవిధ్య విలసితములు. ఇందలి విమర్శనావిధానమును వినూత్నము. భారత, బసవపురాణ, మార్కండేయపురాణాదు లతిప్రాచీనములు. వరూథినీ కలభాషిణులును ప్రాతపడిన ప్రబంధ నాయికలే. ఐనను ప్రాతలో నుండియే ఏదో క్రొత్తవిషయము ఎత్తి చూపి, ఒత్తి చెప్పుటకు ఈ గ్రంథమం దంతటను ప్రయత్నము జరిగినది. ఇది యీ వ్యాసకర్త ప్రత్యేక గుణము. విషయపరిశీలనాసక్తి, విషయ వివేచనాశక్తి సర్వత్ర గోచరించును. కలభాషిణీ కథామూలము నరయుటకు జరిగిన యత్నములలో నిది ఆద్యము, అనవద్యము, నవ్యము, భవ్యము.

ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము, లోకకావ్యాద్యవేక్షణములు కవికి ఆవశ్యకము లనిరి. ఈ గుణములు మాత్రమే కాక కవిహృదయము నర్థము చేసికొనగల సహృదయము, అర్థము చేసికొనినదానిని సరళముగను సరసముగను స్పష్టము

గను ప్రకటించునట్టి భాషాశైలులును, సత్యాన్వేషణదృష్టియు సద్విమర్శకునకు ముఖ్యగుణములు. ఈ గ్రంథమునందలి విమర్శ ఏవంవిధ గుణవిలసితము.

ఈ వ్యాసములు చదివిన మీదట 'కవికంటె రసజ్ఞుఁ డెఱుఁగు' నను భావము పాఠకులకు కలుగును. ఇది శ్రీ సుబ్రహ్మణ్యముగారి విమర్శనపాటవము నకు గీటురాయి.

ఆంధ్రసారస్వతము నవలోడించి ఆంధ్రులకు 'వీరరసము' చూఱలిచ్చిన శ్రీ సుబ్రహ్మణ్యముగారి ఈ 'సారస్వతసౌరభము' సకలాంధ్ర సహృదయులకు బుద్ధి ఘ్రాణేంద్రియ సంతర్పణమును సంతరించుగాక !

హైదరాబాదు.
18-2-1970

పల్లా దుర్గయ్య

డాక్టర్ సి. నారాయణ రెడ్డిగారు

రీడర్, ఉస్మానియా విశ్వవిద్యాలయము,
హైదరాబాదు.

మలిమెట్టు

సాహిత్యవిమర్శ రెండురకాలు. ఒక గ్రంథాన్నో, ఒక ప్రత్యేక విషయాన్నో తీసుకొని అంగాంగపరిశీలనం చేసి అంతరంగంలో మునకలు వేసి చేతి కందిన ముత్యాలో రత్నాలో సేకరించి వలసినవారికి అందివ్వడం ఒకరకం. క్షుణ్ణమార్గ సంచారం కాకుండా, ఏవో ఒక సరికొత్త మెరుపుకోసం మథనపడి, నిదుర చెడి, ఏ సుముహూర్తానన్నో ఒక నవ్యాంశం తటిత్తులా మెరిస్తే దానికి కరచరణాలు కల్పించి, సమగ్రరూపం శిల్పించి ప్రాజ్ఞుల యెదుట ప్రదర్శించడం మరోరకం. ఈ సారస్వత సౌరభాన్ని సమాఘ్రాణిస్తే మిత్రుడు డా. సుబ్రహ్మణ్యం మలిరకా నికి చెందినవాడనే బోధపడుతుంది.

బసవపురాణ ముంది. ఈ కావ్యాన్ని గూర్చిన చర్చ లన్నీ సామాన్యంగా దేశికవిత, ద్విపదచ్ఛందస్సు, జానుతెనుగు, సాంఘిక జీవన చిత్రణం, వీరశైవ మతప్రాబల్యం మొదలైన అంశాలచుట్టే చంక్రమణం చేస్తుంటాయి. సుబ్రహ్మణ్యం ఎన్నుకున్న తెన్ను వేరు. బసవపురాణం పురాణమా ? ఎలా ? నిజానికి భారతభాగ వతాదులు పురాణాలు. బసవపురాణం పురాణకావ్య సంప్రదాయాన్ని ధిక్కరించిన అచ్చమైన దేశికావ్యం. మరి అది పురాణం ఎలా అయింది ? ఆరంభ మైంది

ఆలోచనాకదనం. అంతర్మథనం. ఫలితం – బసవపురాణం జైనపురాణ ప్రథా వాన్ని పుక్కిట బట్టుకున్న రచన అని నిగ్గుతేల్చడం. అందుకు ఉపస్కారకంగా సంస్కృతపురాణాల్లోని పంచలక్షణాలకు ప్రతిగా జైనులు తమ పురాణాల్లో నిబంధించిన ఉత్సవపంచలక్షణాలను పేర్కొని, వాటిని బసవపురాణంపట్ల అతిసమర్థంగా సమన్వయించి చూపడం.

అలాగే మహాభారతంలో కర్ణుణ్ని ఉపప్రతినాయకుడుగా (ఈనాటి Deputy Leader of the Opposition ని తలపిస్తున్న దీమాట) సిద్ధాంతీకరించి, అందుకు తగిన ఉపపత్తులను క్రోడీకరించి, 'రోషమయ మహాతరువు సుయోధను; డురుస్కంధ మందులోన కర్ణు' డన్న ఉద్యోగపర్వంలోని పద్యాన్ని గుండెకాయగా స్వీకరించి, మొత్తం వ్యాసం ఒకేఒక కేంద్రబిందువు చుట్టూ పరిభ్రమించేట్టు చేయడం.

మరి మేఘసందేశంలో ప్రకృతి వర్ణనల గూర్చి వ్రాస్తూ పత్రిపట్టిక ఇవ్వడంతోనో, ప్రకృతివర్ణనారామణీయక ప్రశంసలతోనో తృప్తిపడక యక్షుడు వర్షర్తువులో ఆషాడమేఘంతోనే ప్రణయసందేశం పంపవలసిన అవసరం ఏముందని వితర్కించుకోవడం మౌలికచింతనా లక్షణం. అందుకు సమాధానంగా వర్షారంభంలో చేతనాచేతన రూపమైన ప్రకృతి స్త్రీపుంసయోగరూపమైన మహాచైతన్యాన్ని భజిస్తూ ఉంటుందని వ్యాఖ్యానించి, యక్షుని విరహార్తిని వెల్లడించడానికి, సంయోగకాంక్షా దీప్తిని ప్రకటించడానికి వర్షామేఘం సిస్తులవస్తువుగా ఉపకరించిందని ప్రతిపాదించడం ఔచితీగర్భితంగా ఉంది.

మరి కలభాషిణీ కథామూలాన్ని త్రవ్వి చూపడంలోనూ ఈ మౌలికప్రయత్నమే కనిపిస్తుంది.

డా॥ సుబ్రహ్మణ్యం వివేచన ఉన్న భావుకుడు, రసజ్ఞత ఉన్న నిశితవిమర్శకుడు. విద్యావినయాలు సమప్రమాణంలో సంతరించుకున్న యువకుడు. ఉపరిశోధనలకంటె పరిశోధనలపట్ల ఆసక్తి ఉన్న సాధకుడు. సాహితీ విమర్శనారంగంలో ఇతడెక్కిన తొలిమెట్టు 'వీరరసం'. మలిమెట్టు 'సారస్వత సౌరభం'. మలిమెట్టుతోనే దిదృక్షువులకు మిరుమిట్లు గొల్పిన ఈ సాధకునికీ, పరిశోధకునికీ నా అభినందనలు.

హైద్రాబాదు
26–1–70

సి. నారాయణరెడ్డి

ముందుమాట

నేను కొన్నేండ్లుగా చేయుచున్న సాహిత్యార్చనకు ఫల మీ సారస్వత సౌరభము. అమృతపూర మైన ఆంధ్రసాహిత్య కాసారమున నిండుగావిరిసిన కావ్యారవిందములనుండి గ్రహించి నామనఃపేటికలో భద్రపఱచుకొనిన సుమనః పరిమళ మీ వ్యాస సంపుటి. దీని 'సాంధ్రావళి మోదముం బొరయు' నట్లుగ నందింపఁగలుగుచున్నందులకు నే నెంతయో ఆనందపడుచున్నాను.

నాకు చిన్ననాటనే సాహిత్యాభిరుచి యలవడినది. దానికి మాపెద్దలు కారకులు. నన్ను తనప్రక్కలో పరుండఁబెట్టుకొని యైదేండ్లప్రాయమునందే అమరశ్లోకములతోపాటు, ఆంధ్రమహాభారత భాగవతములందలి హృద్యపద్యములను నోటఁబట్టించిన మాపితృదేవుల అవ్యాజవాత్సల్యము నా చిత్తక్షేత్రమున సాహిత్యబీజముల నిక్షేపించినది. మాచిన్నన్నగారి మధురకావ్యగాననైపుణ్యము నాలో సాహిత్యముపై ననురాగము పెంచినది. మాపెద్దన్నగారి యపారసాహిత్యలక్షణ పరిజ్ఞానము నాసాహిత్యవ్యాసంగమునకు శాస్త్రీయమైన దృక్పథమును ప్రసాదించినది. నాపదునేనవయేట నాచేత ఆంధ్రమహాభారతము నామూలాగ్రముగా చదివించుకొని విన్న నాపెద్దలు నాచిత్తమున సారస్వత సంస్కారమును సంపన్నము చేసి పోషించిరి.

నాకు ఉన్నతవిద్యా బోధనమందు హిమనగోన్నతులైన ఆచార్యులు నాపుణ్యవిశేషమున లభించిరి. వారు లక్ష్మీరంజనులు; వాఙ్మయ దివాకరులు. వారు సాహిత్యకుసుమసంగ్రథనకళానైపుణ్యమును నాకు బోధించిరి; అధ్యాపకవృత్తిలో సాహిత్యారాధనము చేయు మని నిర్దేశించి నాసాహిత్య నౌకకు కర్ణధారులై నేటికిని నడపించుచున్నారు. నాజీవితమున కలిగిన మఱియొక అదృష్టము పండితప్రకాండుల శుశ్రూష; సుహృన్మూర్తులైన సాహిత్యవేత్తల సాహచర్యము. విద్వన్మణియైన డా. పాటిబండ మాధవశర్మగారి స్నేహము నాకొక అభినవభారతీ సాక్షాత్కారము కల్పించినది. సాహిత్యసౌరభ సమాఘ్రాణశిల్ప మాయనయొద్ద నేను నేర్చితిని. విశ్వనాథవారి విమర్శన వివేకము, రాళ్ళపల్లివారి సారస్వతాలోకము, పింగళివారి పలుకుల పొందిక, కట్టమంచివారి కవిత్వతత్త్వ విమర్శనము, వేదమువారి సాహిత్య దర్పణాలోకము, వజ్ఝలవారి వ్యాకరణ సంహితాసర్వస్వ స్వరూపము నా ఏకలవ్యభక్తికి

నిధానము లైనవి. మీదు మిక్కిలి సహృదయతామూర్తు లైన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి ప్రోత్సాహము నాకీయుద్యమమున జవసత్త్వములను కల్పించి నది. వీనికితోడు మిత్రమండలులు, రచయితల సంఘములు, సాహిత్యసదస్సులు, కవిసమాజములు నాలో సజీవసాహిత్య విమర్శను రూపుకట్టించినవి. ఇందరి స్నేహ వాత్సల్యములతో సాహిత్యక్షేత్రమున కాలూని నిలిచినవాఁడను నేను. విద్యార్థు లకు నానేర్చినంత సాహిత్యమర్మమును విప్పి చెప్పుచున్నాను; విద్వాంసులకు నేనేర్చినంత సారస్వత సౌరభము నుపాయనముగా నందించుచున్నాను.

క్రొత్త దేదైన చెప్పవలె నన్నప్పుడే కలముపట్టు అలవాటు నాకు. సాహిత్య సమాధిలో మనసున మెఱసిన నవ్యదివ్యానుభూతిని సహృదయుల ముందు సవినయ ముగా నుంచు ప్రయత్నమే నారచనావ్యాసంగము. ఈ వ్యాసము లట్టి ప్రయత్న ఫలములే. ఇందులో ప్రతివ్యాసము నందును ఒక్కొక నవ్యాంశమును ప్రతిపాదింప గలిగితి నని తలంచుచున్నాను. వాని యోగ్యతలు నిర్ణయించుభారము సహృదయ లోకముపై నున్నది. అట్టి సహృదయ లోకమునకు నా హృదయపూర్వకాభివంద నములు.

ఈ గ్రంథ మీరూపమున ప్రచురింపఁబడుటకు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారు చేసిన వేయిరూప్యముల ధనసహాయము ప్రధానకారణము. కావున అకాడమీ వారికి నా కృతజ్ఞతలు.

ఈగ్రంథము నంకితము గొని, బంగారమునకు తావియబ్బిన గౌరవమును నాకృతికి కల్పించిన సారస్వతాభిమానులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి నా హృదయపూర్వక మైన కృతజ్ఞాభివందనములు.

సౌరభమునకు మలయానిల సాహచర్య మబ్బింపఁ జేసినట్లు నావ్యాస సంపుటికి 'ఆమోదవీచి' నందించిన ఆర్ద్రహృదయులు సాహిత్యశిల్పవేత్తలు–డా. పాటిబండ మాధవశర్మగారికి నా నమోవాకములు.

నావాక్కుల కమృతాశీశ్శు లందించిన మరుదాచార్యతుల్యులు ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారికిని, వాఙ్మయ వార్నిధులు ఆచార్య డా. దివాకర్ల వేంకటా వధానిగారికిని, సాహిత్యవేత్తలు డా. పల్లా దుర్గయ్యగారికిని, నవ్యకవితా మన్మథులు డా. సి. నారాయణరెడ్డి గారికిని నాకృతజ్ఞతాభివందనములు.

ఈ వ్యాసములోఁ గొన్నింటి నిదివరకే ప్రచురించి ప్రచారమునకు దెచ్చిన ఆంధ్రప్రభ (సారస్వతాను బంధము), స్రవంతి పత్రికల యధిపతులకును, ఈ వ్యాసములందు ప్రతిపాదింపఁబడిన భౌతికశాస్త్ర విషయలు శాస్త్రవిరుద్ధ ములుగా లేవని చెప్పి నన్ను ప్రోత్సహించిన మిత్రులు శ్రీ అయలావజ్ఝల సత్య నారాయణమూర్తి గారికిని నా కృతజ్ఞతలు. జీవితవ్యాసమును తీర్చి దిద్దుటతోపాటు వ్యాసముల శుద్ధ ప్రతులను సిద్ధముచేయుటలో సాయపడిన శ్రీమతి చి॥ సుశీలకు నా ఆశీస్సులు. ఈ గ్రంథమును ముచ్చటగా ముద్రించి యిచ్చిన శివాజీ ప్రెస్ అధి పతులకును నాకృతజ్ఞతలు. ఎంత శ్రద్ధగా చూచినను ముద్రణమున కొన్ని దొసగులు దొరలుట తప్పలేదు. విజ్ఞులా దోసములు సవరించుకొని సహృదయభావముతో ఈ సారస్వత సౌరభమును సమాఘ్రాణింప ప్రార్థన !

సౌమ్య : భీష్మైకాదశి
ఫిబ్రవరి 16, 1970

గ్రంథకర్త

—x—

విషయసూచిక

1. పురాణము - ఇతిహాసము
2. మేఘసందేశము - ప్రకృతి వర్ణనము
3. మహాభారతము - కర్ణుఁడు
4. బసవపురాణ నిర్మాణము - జైనపురాణ ప్రభావము
5. మారన హరిశ్చంద్రోపాఖ్యానము
6. రాయలు - వర్ణనములు
7. వరూథిని
8. కలభాషిణీ కథామూలము
9. జంట కవులు
10. ద్రుత స్వరూపము
11. బుద్ధ చరిత్రము

సారస్వత సౌరభము

పురాణము - ఇతిహాసము

భారతీయులకు వేదములు పరమప్రమాణగ్రంథములు. వేదధర్మములు జనులకు సులభగ్రాహ్యము లగుటకై మహర్షులచేఁ దదర్థపర్యాలోచనరూపములుగా నిర్మింపఁబడిన ధర్మసంహితలు స్మృతులు. శ్రుతిస్మృతులలోని ధర్మములను విపులీకరించి దృష్టాంతరూపము లగు వివిధేతిహాసకథాకదంబముల ద్వారమున పామరపండిత మనోరంజకముగ బోధించు గ్రంథములు పురాణేతిహాసములు. శ్రుతిస్మృతులు ప్రభుసమ్మితము లయి ధర్మప్రబోధమును నిర్వహించుచుండ, పురాణేతిహాసములు మిత్రసమ్మితము లై లోకమునకు హితము నుపదేశించుచున్నవి.

వాజసనేయి బ్రాహ్మణోపనిషత్తు వేదములును, ఇతిహాసపురాణములును పరమేశ్వర నిశ్వాసరూపములని యభివర్ణించెను :

> "అస్య మహతో భూతస్య నిశ్శ్వసిత మేతద్య దృగ్వేదో
> యజుర్వేద స్సామవేదోఽథర్వాంగిరస ఇతిహాసః పురాణమ్".

మానవునకు శ్వాసనిశ్వాసలు ప్రాణసంకేతము లైనట్లే భగవంతునకుఁ బ్రాణస్థానములు వేదపురాణేతిహాసము లని యుపనిషత్తాత్పర్యము. అనఁగా జీవునకు శ్వాసముతో యావద్ద్రవ్యభావిత్వ మున్నట్లే భగవంతునకు వేదపురాణములతో యావద్ద్రవ్యభావిత్వ సంబంధము గలదని భావము. దీనివలన నుపనిషత్తులు వేదార్థముల కిచ్చిన యున్నతస్థానమును, ప్రామాణ్యగౌరవమును బురాణేతిహాసముల కిచ్చి గౌరవించినట్లు తెలియుచున్నది. ఛాందోగ్యోపనిషత్తు ఇతిహాసపురాణము పంచమవేద మని చాటి చెప్పుచున్నది :

> సహోవాచ "ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వణమ్
> చతుర్థ మితిహాసపురాణం పంచమం వేదానాం వేద మితి".

పంచమవేదము చతుర్వేదసారము. మహాభారత మాహాత్మ్యమును "ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అని నిపుణముముగాఁ బేర్కొనినది. కావున నితిహాసపురాణముల వలననే వేదము లెన్నగా బలపడుచున్నది. పురాణేతి

హాస విజ్ఞానమువలన వేదార్థము ప్రసన్న మగును. అనఁగా పంచమవేదము లైన పురాణేతిహాసములు వేదహృదయము విప్పిచెప్పు విశిష్టగ్రంథములు.

పురాణేతిహాసముల కత్యంతసాన్నిహిత్యము కలదు. వేదకాలము నుండియు నట్టి సంబంధము వానియందుఁ గానవచ్చుచున్నది. వేదబ్రాహ్మణములందు పురాణేతిహాసములు విడివిడిగాఁ బేర్కొనఁబడియున్నను శతపథబ్రాహ్మణాదులలో 'నితిహాసపురాణ' మను నేకపదద్వంద్వసమాసములు ప్రయోగింపఁ బడియున్నవి. సామాన్యముగా నట్టి ద్వంద్వసమాస మవినాభావసంబంధముగాని, యాజన్మవిరోధము గాని కల రెండువస్తువులను గలిపి చెప్పునపుడు వాడఁబడుచుండును గావున బురాణేతిహాసముల నవినాభావసంబంధము గల ద్వంద్వముగా నట్టిసమాసప్రయోగము సూచించుచున్నది.

పురాణేతిహాసముల స్పష్టమైనపరిగణన మథర్వవేదమునఁ దెలియవచ్చుచున్నది. వానితోపాటు గాథలు, నారాశంసలు, వాకోవాక్యములు,- అనువానిని గూడ నావేదము తెలుపుచున్నది. విద్యారణ్యసాయణాచార్యులు తమభాష్యములందుఁ బైవాని స్వరూపస్వభావములను గూర్చి పేర్కొనియున్నారు. "దేవాసురా స్సంయత్తా ఆసన్" అని యిట్లు పూర్వము జరిగినదట యనునట్లు పూర్వప్రసిద్ధవృత్తములను దెలుపునది యితిహాస మనియు, "ఇదంవా అగ్రే నైవ కించి దాసీత్"- ఇట్లు జగత్ప్రాగవస్థ నుపక్రమించి చెప్పెడి సర్గప్రతిపాదకమైన వాక్యజాతము పురాణ మనియు, విద్యారణ్యులు. సాయణాచార్యులు గాథాదుల నిట్లు నిర్వచించెను: "మహాహి మివ వై ప్రహ్లాదాత్" ఇత్యాదయో మన్త్రాః గాథాః। 'నరాః మనుష్యాః తత్ప్రశంసాపాదకాః శ్లోకాః నారాశంస్యః గాథాః'। 'సమానా సద ముక్షన్తి' ఇత్యాదికాః మనుష్య ప్రశంసాపరాః నారాశంసాః'। 'సవై గౌతమస్య పుత్రవృతో జనం ధావయేత్' ఇతి ఉక్తి ప్రత్యుక్తిరూపమ్ బ్రాహ్మణం (ప్రకరణం) వాకోవాక్యమ్".

పై వ్యాఖ్యాత లితిహాసాదులను వివేచించునపుడు వేదవాక్యములనే దృష్టాంతములుగా నిచ్చియుండుట గమనింపఁ దగిన యంశము. అనఁగా వేదవాక్యముల లోనే జగత్ప్రాగవస్థనుగూర్చి చెప్పెడి వాక్యములు పురాణము లనియు, దేవదానవ యుద్ధాది ప్రసిద్ధ విషయములను జెప్పు వాక్యసముదాయము లితిహాసము లనియు, దైవప్రశంసాత్మకము లైన మంత్రవాక్యములు గాథ లనియు, నరప్రశంసా రూపము లైన వాక్యములు నారాశంస లనియు, ఉక్తి ప్రత్యుక్తిరూపము లైనవి

వాకోవాక్యము లనియు, స్పష్టమగుచున్నది. దీనినిబట్టి వేదవాక్యములందే పురాణేతిహాస స్వరూపకల్పన మొనర్పఁబడిన దని భావింప వచ్చును; మఱియు సర్గ ప్రతిసర్గలక్షణవిశిష్ట మైనది పురాణ మనియు, దేవదానవవంశములకు సంబంధించిన కథన మితిహాస మనియు నథర్వవేదకాలమున భావింపఁబడుచుండె ననియు గ్రహింపవచ్చును.

నైఘంటికు లొనర్చిన పురాణశబ్దనిరుక్తు లిట్లున్నవి: "పురా భవ తీతి పురాణః"; "పురా పూర్వస్మిన్ భూత మితి పురాణమ్": "పురా భవమితి పురాణమ్"; "పురా నీయతే ఇతి పురాణమ్"; "పురా నవం భవతి పురాణమ్": "పురా + అనక్తి"; మొదలగునవి. ఇట్టి నైఘంటికనిరుక్తుల కాలంబనములు పురాణములందుఁ గలవు.

"యస్మా త్పురా హ్యనక్తీదం పురాణం తేన హి స్మృతమ్
నిరుక్త మస్య యోవేద సర్వపాపైః ప్రముచ్యతే॥"

— వాయుపురాణము

"పురా పరంపరాం వష్టి పురాణం తేనవై స్మృతమ్॥"

— పద్మపురాణము

"యస్మా త్పురా హ్యభూ చ్చైతత్పురాణం తేన తత్స్మృతమ్॥"

— బ్రహ్మాండపురాణము

"పురాతనస్య కల్పస్య పురాణాని విదు ర్బుధాః॥"

— మత్స్యపురాణము

వీనినిబట్టి పురాణము లనఁ జిరకాలమునఁ బుట్టిన వనియుఁ, బ్రాచీన విషయము లను దమయందుఁ బొందించుకొనిన వనియుఁ, బ్రాచీనకాలమున నవీనములుగా నుండిన వనియు, పురావిషయములందు జీవించెడి వనియుఁ, బ్రాక్తనవిషయాభిరతి కలిగిన వనియుఁ, బురాతన కల్పవస్తుకము లనియు నేర్పడుచున్నది.

ఇవి యన్నియు నిట్లుండ "పురాపి నవమ్ పురాణమ్" అను నిరుక్తి యొకటి ప్రసిద్ధి గాంచినది. దీనినిబట్టి పురాణములం దభివర్ణింపఁబడు వస్తువిశేషములు పురాతనము లయ్యును నవ్యములుగను, నిత్యనూతనములుగను భాసించుచుండు నని తాత్పర్య మేర్పడుచున్నది. పురాణములందలి యీ నవ్యతయే వాని

కుత్తమసాహిత్యగౌరవము నాపాదించుచున్నది. పురాణములందలి వస్తువులు పురాతనము లయ్యు నవి రచింపఁబడికాలమునుబట్టి యర్వాచీనములుగాఁ బొడగట్టుచున్నవి కావున నవ్యము లనఁబడుచున్న వని యీ నిరుక్తిని కొందఱన్వయించిరి. అట్లైనను పురాణ మన నతిప్రాచీన మైన దనెడి పూర్వనిరుక్తుల తాత్పర్యమున కెట్టి విప్రతిపత్తియు నేర్పడుటలేదు. కాని, పురాణములు ప్రప్రథమమున పురాణగాథా స్వరూపములై యుండినను క్రమముగా వానియం దర్వాచీనము లైన వస్తువిశేషము లెన్నియో చేరుచు వచ్చిన వని యీ నిరుక్తి స్పష్టము చేయుచున్నది.

పురాణవస్తులక్షణములను బరిశీలించి తత్స్వరూపనిర్వచనము చేయయత్నించిన ప్రాచీనులు పెక్కురు గలరు. వారందఱిలో నమరసింహుఁడు "పురాణం పఞ్చలక్షణ"మ్మని చెప్పిన నిర్వచనము కడు ప్రసిద్ధి కెక్కి యున్నది.

"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ
వంశానుచరితం చేతి లక్షణానాం తు పఞ్చకమ్"

సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరములు, వంశానుచరితము లను బంచలక్షణములు గలవి పురాణము లని యమరకోశము. వంశానుచరితస్థానమున 'భూమ్యాదేః సంస్థాన'మ్మను పాఠాంతర మొండు కనఁబడుచున్నది. ఈ పంచలక్షణ నిర్వచనమును మార్కండేయాగ్ని వాయు విష్ణు కూర్మ మత్స్యాది పురాణములు కూడ పేర్కొని యుండుటయే కాక, తల్లక్షణములను దమయందు యథావకాశముగా నంతరించుకొని యుండినవి. కావున ప్రాచీను లీ పంచలక్షణసూత్రము నతిప్రామాణ్యబుద్ధితో గ్రహించి యుండి రని భావింప వీలగుచున్నది.

ఈసూత్ర మంతప్రాచుర్య మందుట కాపంచలక్షణముల పరమసార్థక్యమే కారణము. పురాణము సర్గముతో నారంభింపఁబడు నని పైసూత్రనిర్దేశము. సర్గమునందు బ్రహ్మాండోత్పత్తి చెప్పఁబడును; విద్యారణ్యు లన్నట్లు జగత్ప్రాగవస్థకంటెఁ బ్రాచీనమైనవస్తువు సృష్టియందుఁ గానరాదు. పురాణ మచ్చటినుండి ప్రారంభమగుటకంటె నౌచిత్యము మఱొండు లేదు. ఆపైన 'ప్రతిసర్గము'నందు బ్రహ్మదులొనరించిన సృష్టివిధానము వివరింపఁబడి యుండును. అందు స్థావరజంగమాత్మకమైన సృష్టివైవిధ్యము విపులముగా వర్ణిత మగును. వంశములందు దేవాసురాది విభేదోత్పత్తియు, బ్రహ్మర్షి దేవర్షి వంశకర్తల చరిత్రములును వర్ణింపఁబడును.

కావున సృష్టింపఁబడిన జీవరాసులలో నేర్పడిన క్రమబద్ధమైన వికాస మిం దభి వర్ణింపఁబడును. మన్వంతరములందు ధర్మశాస్త్రప్రవర్తకులై భువిని శాసించెడు పదునలుగురు మనువుల యుత్పత్తియు, వారి పరిపాలన కాలములందలి విశేషములును, వర్ణింపఁబడును. అనఁగా నీ యంశమునందు వేదధర్మమును లోకమున నాచరింపఁజేయుట కేర్పడిన విశిష్ట సంస్థలవంటి మహావ్యక్తులను గూర్చిన కథలు కీర్తింపఁబడు ననుట. వంశానుచరితమున దేవమూలము లైన సూర్యచంద్రవంశములందు జన్మించి, ధర్మవీరు లయి ప్రసిద్ధి కెక్కిన మహారాజులచరిత్రములు వివరింపఁబడును. సర్గప్రతిసర్గ వంశములలో సృష్ట్యారంభమును, వేదోత్పత్తియు, దేవదానవాదుల యుత్పత్తివికాసములును వర్ణింపఁబడఁగా మన్వంతరవంశానుచరితములందు మానవజాతివ్యవస్థయుఁ, దత్పరిపాలనమును, దత్ప్రభువుల విధానమును దెలుపఁబడుచున్నవి. కావున వేదాదిధర్మములు దేవమానవసంఘములం దనుష్ఠితములగుక్రమ మీపంచలక్షణములందు నిర్దేశింపఁబడిన దనవచ్చును. మఱియొకమాటలోఁ జెప్పవలెనన్న నీ పంచలక్షణ సూత్రమునఁ బ్రపంచోత్పత్తి వికాసక్రమము భాసించుచున్నది. తద్వికాసమును బరమార్థానుసంధానదృష్టితో మిత్రసమ్మితముగాఁ బ్రపంచించెడి సారస్వతమూర్తులు పురాణములు !

ఇట్లే యితిహాసస్వరూపమును భావించుటకు నైఘంటిక నిరుక్తులు కొంత తోడుపడఁగలవు. "ఇతిహాసం పురావృత్త" మ్మని యమరసింహుఁడు.' ఇతిహాసః— ఇతిహ పారంపర్యోపదేశ అస్తే అస్మిన్ ఆస ఆధారే ఘఞ్. ధర్మార్థకామమోక్షాణాం ఉపదేశసమన్వితమ్ । పూర్వముక్తకథాయుక్తం ఇతిహాసం ప్రచక్షతే॥ ఇత్యుక్తలక్షణే పురావృత్తప్రకాశకే భారతాదిగ్రంథే"—అని శబ్దకల్పద్రుమము. వీనినిబట్టి యితిహాస మన పూర్వవృత్త మని స్థూలముగాఁ జెప్పవచ్చును. అది యిట్లు జరిగిన దని పారంపర్యముగాఁ జెప్పుకొనుచున్నకథయై యుండవలెను. అనఁగా నది చారిత్రకసత్యమై యుండవలెను. ఆకథ వట్టివార్తగా, నుదంతముగా నుండరాదు. చతుర్వర్గోపదేశసమన్వితమైన యుజ్జ్వలకథారూపమున నుండవలెను. కావున నితిహాసము పూర్వచరిత్రనిబంధనప్రాయ మై, నుజ్జ్వలోపదేశాత్మక మైన కథయై యుండవలె నని యేర్పడుచున్నది.

అభినవగుప్తుఁడు నాట్యశాస్త్రవ్యాఖ్యానమునఁ గర్మఫలసంబంధస్వభావము లైన యాగమికార్థము లెందుఁ బ్రత్యక్షపరిదృశ్యమానము లగుచుండునో యది

యితిహాస మని పేర్కొనెను.[1] అనఁగా నాగమములం దాయాపుణ్యపాపకర్మాదుల కాయాఫలములు లభించు నని చెప్పఁబడిన వాక్యతాత్పర్యములు ప్రత్యక్షపరిదృశ్యమానము లగునట్లు ఇతిహాసమందలి యితివృత్త ముండవలె నని నిర్దేశింపఁబడిన దనవచ్చును.

పై నైఘంటికోక్తులను బరామర్శించినచోఁ బురాణములకును, ఇతిహాసములకును గొట్టవచ్చినట్లు కానవచ్చెడి సామ్యము పురావస్తుసంబంధము. కాని, తత్సామ్యమునందును బురాణేతిహాసములకు భేదనిరూపణము చేసి చూపించినారు విద్యారణ్యులు. జగత్ప్రాగవస్థనుండి యారంభ మగునది పురాణ మనియు, దేవాసురుల గాథలు చెప్పునది యితిహాస మనియుఁ జెప్పుటలోనే యాభేదము కలదు. అనఁగాఁ బురాణ మత్యంతప్రాచీన మగు వృత్తమును జెప్పుచుండ నితిహాస మిది యిట్లని చూచి చెప్పినవారినుండి పరంపరగాఁ జెప్పఁబడుచు వచ్చెడి పురాతన చారిత్రక వృత్తమును జెప్పునని తాత్పర్యము.

సంస్కృతభాషలో భూతకాలికక్రియలకు లఙ్, లుఙ్, లిట్ అను త్రివిధ లకారములు చేర్చి అనాద్యతనాద్యతనానంతభూతకాలికార్థములను దెలుపుచుండుట కలదు. అనఁగా భూతమును బ్రాచీనులు ముప్పిధముగా భావించి రని స్పష్టపడుచున్నది. అమరసింహుఁడు పురాశబ్దమునకు చిరాతీతనికటాగామికార్థములు కల వని పేర్కొనుటయు దీని కుపబలకముగా నున్నది. ఇట్టి విభాగమునం దౌచిత్యము కలదు. లౌకికానుభవదృష్టితో వివేకించినప్పు డిది తెలియఁగలదు. మనకుఁ బ్రస్తుతము వర్తమానము. అది ప్రత్యక్షము. కొలదికాలము గడచినతరువాత నావిషయము వార్త యనఁబడును. మఱికొంతకాలము గడచుసరికి అది పరంపరాకథనరూపమున వెలసి చారిత్రకవృత్త మనఁబడును. అదియే చిరకాలమైన తరు

1. నాట్యశాస్త్ర, 1. 15 శ్లో. లోని "సేతిహాసమ్" అనుపదమున కొనర్చిన వ్యాఖ్యానము :

"ఇతిః = ఏవ మర్థే ప్రత్యక్షనిర్దేశం ద్యోతయతి। హః = ఇహ శబ్ద ఆగమః। ఆసః = ఆసనం. ఏవం ప్రకారాః ప్రత్యక్షపరిదృశ్యమానాః ఆగమికార్థాః కర్మఫలసంబంధస్వభావాః యత్ర ఆసతే తేన ఇతిహాసేన – సహేతి పాఠే మత్వర్థీయో అకారః। ఇతి జ్ఞానమ్ తస్యహాసో హర్షపూర్వకో వికాసో యతః ఇతి కేచిత్ — ఇతిహాస శ్చ - తల్లక్షణం ఇద్ధం కిల ఆసనం యత్ర రూపకభేదానాం భణ్యతే (దృశ్యతే)॥."

వాతఁ జెప్పఁబడినచో దాని చారిత్రకత్వముకంటె పురాతనత్వమే యధికముగా భాసించి పురావృత్త మనఁబడును. దీనిని జగత్సృష్టి కన్వయించుచో సర్గాది పురాలక్షణవిశిష్ట మైన వస్తువు నేఁడు పురాణవస్తు వనుటలో విప్రతిపత్తి లేదు. ప్రాచీన ప్రసిద్ధరాజచరిత్రము లితిహాసము లని గ్రహించుటలో నెట్టిసంకోచమును లేదు. అమరసింహుని మాటలలోఁ జెప్పిన- చిరభూతార్థము పురాణము, అతీతభూతార్థము ఇతిహాసము. ఈసత్యమును గుర్తించి భోజుఁడు "అతీతార్థప్రాధాన్యా దితిహాసః"[1] అని నిర్దేశించినాఁడు.

చతుర్విధపురుషార్థప్రబోధము నితిహాసములవలెనే పురాణములుకూడ నిర్వహించుచున్నవి. కాని, పురాణము లాయర్థములను త్రివిధభాషలలో[2] యథానుకూలముగాఁ జెప్పవచ్చును. ఇతిహాసములు తదర్థబోధ నైతిహాసికకథాముఖమున నిర్వహింపవలసియుండును. ఈభావమునే మఱియొకవిధముగాఁ జెప్పినచోఁ గర్మఫలరూపము లయిన యాగమికార్థములు ప్రత్యక్షపరిదృశ్యమానము లగునట్లు చెప్పవలె నను నియమము పురాణములం దానుషంగికముగను, ఇతిహాసములం దవశ్యముగను బాటింపఁబడు నని భావము. ఇతిహాసమునఁ జతుర్వర్గసాధకు లైన ప్రసిద్ధపురుషుల జీవితవృత్తములు వర్ణింపఁబడును. అందు వారు తమలక్ష్యసిద్ధికై యొనర్చు ప్రయత్నాదులఁగూర్చియుఁ, దత్ఫలసిద్ధినిగూర్చియు వివరముగా వర్ణింపఁబడును. వారి జీవితవృత్తములు కర్మఫలరూపములైన యాగమికార్థములకు దృష్టాంతరూపములుగా నుండును. ఇట్టికథార్థములచే వ్యంజిత మగునది చతుర్విధపురుషార్థప్రబోధము. పురాణమున నిట్టిప్రబోధము చారిత్రకసత్యమైన మహాపురుషజీవితకథావర్ణనముఖము

1. సరస్వతీకంఠాభరణము 2-368 శ్లో.వ.

2. సమాధిభాష-లౌకికభాష-పరకీయభాష-యనునవి త్రివిధభాషలు. సమాధిగమ్యములును, అతిగంభీరములు నైన వేదార్థములను సూత్రప్రాయమైన భాషలోఁ జెప్పుట సమాధిభాష. అతిసూక్ష్మములు నైన వేదతత్త్వములను సర్వజనసుబోధము లగునట్లు లౌకికభావముల తోడ్పాటుతో సార్థకాలంకారబంధురముగాఁ జెప్పుట లౌకికభాష. వేదార్థములను దృష్టాంతరూపము లైన కథేతిహాసముల ద్వారమున బోధించుట పరకీయభాష. సమాధిభాషను లౌకికభాష సరళము చేయును; సమాధిభాషలోఁ జెప్పఁబడిన ధర్మమును బరకీయభాష దృఢీకరించును. విష్ణుపురాణప్రథమాధ్యాయమునందలి సృష్టివర్ణనము సమాధిభాష. అదేతత్త్వము దేవీభాగవతశ్రీభాగవతములందు లౌకికభాషలోఁ జెప్పఁబడినది. వేదసమ్మతమైన సత్యధర్మమహిమను స్థాపించుటకై హరిశ్చంద్రోపాఖ్యానాదులు చెప్పుట పరకీయభాష.

ననే నిర్వహింపవలసిన యవసరము లేదు. కల్పితకథలద్వారమునగాని, ప్రతీకాత్మకగాథలవలన గాని, సమాధిలౌకికభాషలద్వారమున గాని ప్రబోధింపవచ్చును. కావున పురాణేతిహాసములు చతుర్వర్గప్రబోధైకదృష్టి కలవయ్యు భిన్నమార్గముల ననుసరించుచున్న వనవచ్చును.

క్రీ.పూ. 4వ శతాబ్దిప్రాంతమున వెలసిన కౌటిల్యుని యర్థశాస్త్రమున నితిహాసస్వరూపము తెలుపఁబడియున్నది. రాజుయొక్క దినచర్యను నిర్దేశించి చెప్పుచుఁ గౌటిల్యుఁడు-ప్రభువు పూర్వాహర్భాగమున హస్త్యశ్వప్రహరణ విద్యాభ్యాసమును, పశ్చిమాహర్భాగమున నితిహాసశ్రవణమును జేయవలె నని నిర్దేశించి, "పురాణ మితివృత్త మాఖ్యాయికోదాహరణం ధర్మశాస్త్రమర్థశాస్త్రం చేతిహాసః"[1]- అని యితిహాసస్వరూపమును బేర్కొనెను. ఈమాటలవలన నితిహాసమునందు కొంతపురాణము ప్రవర్తిల్లు ననియుఁ, గార్యకారణసంబద్ధమైన ప్రఖ్యాతవృత్తము నిబంధింపఁబడి యుండు ననియు, నాయకనాయకేతరులచేఁ జెప్పఁబడు కొన్నియాఖ్యాయికలును, దృష్టాంతరూపములైన కొన్నిగాథలును, ధర్మార్థశాస్త్రవిషయములును సంతరింపఁబడియుండు ననియు స్పష్టమగుచున్నది. ఈలక్షణము లన్నియు మహాభారతమున కన్వయించుచున్నవి. భారతారంభమున సర్గాదిలక్షణయుక్తమైన వస్తువు కలదు. దేవదానవవిభేదకథనము కలదు. తదంశలచే సంభూతులైన రాజులును, వారి వంశములును బేర్కొనఁబడినవి. చంద్రవంశప్రసిద్ధచక్రవర్తులచరిత్రములు కీర్తింపఁబడినవి. అందును పాండవకౌరవులవృత్తాంత మాధికారికవస్తువుగా విస్తరింపఁబడినది. వాసుదేవమాహాత్మ్య మాకథయందు వర్ణింపఁబడినది. ప్రసక్తానుపశమున బహువిధోపాఖ్యానములును, ధర్మార్థనీతిమోక్షశాస్త్రాదివిషయములు- నందు పొందుపఱుపఁబడి యున్నవి. మహాభారతము మోక్షశాస్త్ర మనియు, ధర్మశాస్త్ర మనియు, నర్థశాస్త్ర మనియు, నీతిశాస్త్ర మనియు, నితిహాస మనియు, పురాణ మనియు, మహాకావ్య మనియుఁ గీర్తింపఁబడుచున్నది. ఈయంశములను క్రోడీకరించి చూచినచో గౌటిల్యుఁడు వాచ్యముగాఁ జెప్పకపోయినను మహాభారతము నుపలక్షించియే యితిహాసస్వరూపము నట్లు నిరూపించెనని భావింప వలనుపడుచున్నది.

రాజశేఖరుఁడు పురాణము శాస్త్ర మనియు, నందు వేదములలోఁ జెప్పఁబడిన యాఖ్యానము లుపనిబద్ధములై యుండు ననియు, నది పంచలక్షణ సమంచిత

1. అర్థశాస్త్రము I. 5. పుట 10.

మనియుఁ దెలిపి, పురాణములలోని యొకవిధమైనభేదమే యితిహాసమని పేర్కొనెను. అట్టి యితిహాసగతి పరిక్రియాపురాకల్పభేదముచే ద్వివిధ మనియు, నందు పరిక్రియ యేకనాయక మనియు, పురాకల్పము బహునాయక మనియు నిర్దేశించెను.[1] వానికిఁ గ్రమముగా రామాయణమహాభారతము లుదాహరణములుగా నిచ్చెను. ఇందు రాజశేఖరుఁడు ఇతిహాసము పురాణాంతర్గత మైన దని భావించుట గమనింపఁదగినది. సృష్ట్యాదినుండి కలియుగరాజ వంశములవఱకు వ్యాపించియున్న మానవజాతియొక్క సమగ్రచరిత్రమును బురాణవాఙ్మయము సమీక్షించుచున్నట్లగుచున్నదికదా! అప్పుడు అతీతప్రధాన మగు నితిహాసము పురాణాంతర్భాగమే- వంశవంశానుచరితాంతర్గతమే- యగుచున్నదికదా! కావున నితిహాసము పురాణైకదేశమని భావించుటలో నెట్టి విప్రతిపత్తియును లేదు. ఇఁక రామాయణమహాభారతములందు పలభాక్కు లగు నాయకులు వరుసగా రాముఁడును, పంచపాండవులును నగుటచే వానిని రాజశేఖరుఁడు పరిక్రియాపురాకల్పము లని భావించియుండును. రాజశేఖరుఁ డీశబ్దములను దార్శనికుల పరిభాషనుండి గ్రహించినట్లున్నాఁడు. దార్శనికులు పరిక్రియాపురాకల్పము లనునవి యర్థవాదములుగాఁ బేర్కొనియుండిరి. అర్థవాదములు వస్తుతః నిందా - ప్రశంసా - పరకృతి - పురాకల్ప భేదముచే నాలుగువిధములు. మహాపురుషుఁ డొకఁడు పూర్వ మొనర్చిన యొకయంశమును బ్రమాణముగాఁ జూపించుట పరకృతి యనఁబడును. "అగ్ని యనువాఁడు సర్వభక్షకుఁడు కాఁగోరి అగ్ని నారాధించెను. సర్వభక్షకుఁ డయ్యెను"[2] అను పూర్వప్రవృత్తైతిహ్యమును బ్రమాణగాఁ జూపించుట పరకృతి. పూర్వ మొకనిచేఁ జెప్పఁబడిన యర్థమును బ్రతిపాదించునది పురాకల్పము. పూర్వ మగ్ని హోమములు మోయ నిష్టములేక నీటిలో దాగెను. దేవత లగ్ని నన్వేషించుచుండిరి. చేప లగ్ని నీటియందు దాగియుండె నని చెప్పినవి. అగ్ని తనరహస్యమును బయలు పఱచినందుల కాగ్రహించి చేపలను- 'లోకులు మిమ్ముల నిష్టమువచ్చిన ట్లెల్లఁ

1. "పరిక్రియా పురాకల్ప ఇతిహాసగతి ర్ద్విధా
స్యా దేకనాయకా పూర్వా, ద్వితీయా బహునాయకా".

కావ్యమీమాంస. 2 అధ్యా.

2. తైత్తిరీయ బ్రాహ్మణము. III. 1. IV. 1.

బంపెదవుగాక !' యని శపించెను-[1] అను పరవక్తృకార్థప్రతిపాదనము పురాకల్పము. ఇవి చెప్పఁబడినవిధము గమనించినచోఁ బరక్రియ యేకవక్తృక మనియు పురాకల్పము బహువక్తృక మనియు నేర్పడుచున్నది. ఒకవిధముగా నీరెండును అతీతార్థప్రధానములే. కాని పరకృతి యద్యతనభూతార్థము; పురాకల్ప మనద్యతన భూతార్థము. పరకృతియందు ప్రాచీనోదంతము ప్రప్రథమముగా నొకవక్తచేఁ జెప్పఁబడినది. పురాకల్పము పారంపర్యకథనముగా బహువక్తలచేతఁ జెప్పఁబడినది. బహుశః మీమాంసకులు చెప్పెడియీయర్థవాదభేదములను రాజశేఖరుఁడు గ్రహించి తనకావ్యమీమాంసయందు స్థాపించియుండవచ్చును. కాని, వాని సహజలక్షణము లగు నేకవక్తృబహువక్తృకత్వములను మార్చి యేకనాయకబహునాయకత్వములుగా నాతఁడు నిబంధించి యుండవచ్చును. 'పరక్రియా' శబ్దమును 'పరిక్రియ'గా మార్చి యుండవచ్చును. ఇతిహాసము పారంపర్యోపదిష్ట మైనదే కావున మీమాంసకుల మతము తద్విరుద్ధము కాదు.

సామాన్యముగా లాక్షణికులు వాఙ్మయమును శాస్త్రేతిహాసకావ్యము లని మువ్విధముగాఁ బరిగణించెదరు. అందు శాస్త్రము శబ్దప్రధాన మనియు, నితిహాస మర్థప్రధాన మనియు, కావ్య ముక్తిప్రధాన మనియుఁ బరిగణించెదరు. అగ్ని పురాణము ఇతిహాసమునకు నిష్ఠత ముఖ్యమని పేర్కొనినది.[2] అతీతార్థప్రధాన మగుటచే నితిహాసమునకు సత్యప్రతిపాదనము సహజలక్షణ మగుచున్నది. అది యర్థప్రధాన మగుటచే వేదాదులవలెఁ బ్రభుసమ్మితముగాఁ గాక, కావ్యమువలెఁ గాంతాసమ్మితముగాఁ గాక హితునివలె మిత్రసమ్మితముగాఁ బ్రబోధము నిర్వహించుచున్నది. ఆనందవర్ధనాచార్యుఁడు ధ్వన్యాలోకమున నితిహాస మగు మహాభారతమును 'శాస్త్రరూప కావ్యచ్ఛాయాన్వయిని' యని పేర్కొనెను. దాని వలన శాస్త్ర కావ్య మధ్యవర్తి యగు నితిహాసమునందుఁ గొంత శాస్త్రరూపమును, కొంత కావ్యచ్ఛాయయును అన్వయించి యుండునని యేర్పడుచున్నది. అనఁగా నితిహాసము

---

1. తైత్తిరీయ సూత్రము. II. vi, VI, 1.
   ఇవి కృష్ణయజ్వ 'మీమాంసాపరిభాష'యను గ్రంథమునుండి గ్రహింపఁబడినవి.

2. ''శాస్త్రే శబ్దప్రధానత్వం – ఇతిహాసేషు నిష్ఠతా ।
   అభిధాయాః ప్రధానత్వాత్ - కావ్యం తాభ్యాం విభిద్యతే"
   — అగ్నిపురాణము

శాస్త్రకావ్యచ్ఛాయల కొకవిధమైన సంగమస్థానము. శాస్త్ర మనఁగాఁ జతుర్వర్గ వ్యుత్పత్తి. కావ్య మనఁగా రసభావసమన్వితోక్తి. ఇతిహాసమునకు సహజలక్షణము అతీతార్థప్రధాన మైన సత్యవస్తుకథనము. ఇతిహాసమునకు శాస్త్రరూపకావ్య చ్ఛాయలు సమకూడినచో నుపదేశోపరంజకత్వములు సిద్ధించి, యొకనిండుదనము కలుగుచున్నది. సత్య, శివ, సుందరరూప మగుచున్నది.

పురాణము లితిహాసములవలెనే అర్థప్రధానములు, మిత్రసమ్మితములు. ఈ రెండును వేదార్థములనే యుపదేశించును. పురాణమున శాస్త్రవిషయ మధిక ముగాఁ జెప్పఁబడును. దృష్టాంతరూపమున బెక్కితిహాసకథాగాథాదులు పేర్కొనఁ బడుచుండును. ఇతిహాసమున శాస్త్రము సామాన్యముగా కథాగతి కొదిగియుండును. ఇతిహాసకథాకథనమునఁ బ్రధానవృత్తమునందు మందమయ్యు నొక యవిచ్ఛిన్నత భాసించును. దానియం దొక వస్త్వైక్యము గోచరించును. పురాణకథాకథనమునందు సామాన్యముగా వస్త్వైక్య ముండని కారణమున నవిచ్ఛిన్నతకు మాఱుగా ననుసంధాన మొండు భాసించును. అం దైక్యతకు బదు లేకవాక్యత శోభించును.

పురాణము లితిహాసములకంటె నధికముగా దైవలీలలను వర్ణించును. ఋషిదేవపితృగణముల వృత్తములు, శాస్త్రవ్రతాది నియమములు, స్వర్గనరకాది లోకానుభవవర్ణనలు, పుణ్యపాపఫలనిరూపణములు, పుణ్యతీర్థక్షేత్ర మాహాత్మ్యములు, వివిధశాస్త్రార్థసారసంగ్రహములు పురాణములందు స్వేచ్ఛగా వర్ణింపఁ బడును. ఇతిహాసములం దివి సందర్భవశమున నౌచిత్యవంతముగాఁ జెప్పఁబడుచుండును.

సంస్కృతమున వెలసిన ఇతిహాసములు రామాయణమహాభారతములు. ఇందు రామాయణ మాదికావ్య మను ప్రశస్తి గాంచి మహాకావ్యగౌరవము నందు కొనినది. మహాభారత మితిహాస మని ప్రసిద్ధి గాంచినది. పైన పేర్కొనఁబడిన యితిహాసలక్షణము లన్నియు మహాభారతమున కన్వయించుచున్నవి. పురాణముల వలెనే యదియును పంచమవేదఖ్యాతిఁ బడసి భారతీయవిజ్ఞానమణిదర్పణమువలె విరాజిల్లుచున్నది.

పురాణేతిహాసములు మాతాపుత్రికల వంటివి. కావున వాని రెండింటికిని కొన్ని పోలిక లున్నవి. పరిణత యైన పుత్రిక మాతవలె గౌరవప్రపత్తులను లోకమున సంపాదించుకొనును. పురాణపురంధ్రి పండినవిజ్ఞానకల్పకము. తత్పు

త్రిక తల్లక్షణములు కొన్ని ముద్రించుకొనిన మహితమాకందమూర్తి. వారిగుణము లందును, లక్ష్యములందును సామ్యము లుండును. కాని యవస్థలయందును, వ్యవస్థల యందును భేద ముండక తప్పదు.

భారతీయసాహిత్యములం దితిహాసపురాణము లెట్లు ప్రసిద్ధిఁ జెంది యున్నవో పాశ్చాత్యవాఙ్మయములందు Epics, Myths అట్లు విఖ్యాతిఁ బడసి యున్నది. వీని పుట్టుపూర్వోత్తరములకును, వికాసక్రమమునకును, స్వరూప నిర్మాణ సంవిధానములకును వానికిని సంబంధప్రభావములు చాల తక్కువ. కాని, సాహిత్యప్రక్రియలుగా వానికిని, వీనికిని సామ్యము కొంత కానవచ్చుచున్నది. పాశ్చాత్యవిమర్శకులు ప్రాచ్యపాశ్చాత్య సాహిత్యప్రక్రియాపర్యాలోచనము సేయుచు భారతీయము లైన యితిహాసపురాణములను గ్రమముగా Epics, Mythsగాఁ బరిగణించుట జరిగినది.

Epic poem సామాన్యముగా నొక సుదీర్ఘకథావృత్తము గల కావ్యమై యుండును. మహాసంగ్రామమువంటి యుద్వేగచైతన్యభావముచే నుత్తేజితమైన జాతియొక్క జీవితవృత్తమునుండి గైకొనఁబడిన యుజ్జ్వలములును, ప్రసిద్ధములు నైన సన్నివేశములతో నది నిర్మింపఁబడును. దానియందలి పాత్రలును, సన్నివేశములును మానవుని యౌదార్యౌన్నత్యములయందును, మహోన్నతలక్ష్యసాధన శక్తియందును సామాజికులకు విశ్వాసము నినుమడింపఁజేసి విశిష్టానందము నొడఁగూర్పఁ గలుగునట్లు చిత్రింపఁబడును.[1] Epic poem లో నితివృత్తమున కధిక ప్రాముఖ్యము కలదు. అందలి కథ రసభరితమై యుండవలెను. అందు మానవ జీవితానుభవముల కతీతములుగాని సంఘటనలు వర్ణింపఁబడుచు, వానిపైఁ బ్రభావము వేయుచున్న విధిప్రాబల్యము నెఱుకపఱచుచుండవలెను. దానివలన నొక మహాప్రబోధము గాని, మహాప్రయోజనము గాని సాధింపఁబడవలెను. అట్టి యుదాత్త వస్తువున కుచితమును, ఛందోలంకారబంధురము నైన కవిత్వశైలి దానియందు నిబంధింపఁబడును.[2] ఇట్టి లక్షణములతో నొప్పారు Epic స్వరూపస్వభావములచే నితిహాసము కన్న భిన్నమయ్యుఁ గొన్నియంశములందు సాదృశ్యము సంతరించుకొనుచున్నది. సుదీర్ఘకథాకథనము, ఉజ్జ్వలమైన జీవితవృత్తములు గలపాత్రలు,

1, From Virgil to Milton; By C. M. Bowra. పుట. 1.

2. The Epic – By L. Eber Crombe పుట. 51.

చారిత్రకసత్యనిష్ఠ, పురుషార్థ సాధనాత్మకమైన యున్నతజీవితలక్ష్యము, రసాత్మకమును ఉపదేశాత్మకము నైన యితివృత్త నిర్వహణము, కర్మఫలసంబంధనిరూపణాత్మకము లైన యాగమికార్థములు ప్రత్యక్షపరిదృశ్యమానము లగునట్లు చేయుట, ప్రసన్నగంభీరమైన శైలి—అనులక్షణములు ఇతిహాసమునందు వలెనే Epic నందును గాననగుచున్నవి. కాని భారతీయేతిహాసములు Epic poems కంటె నుత్తమము లైనవి. వీనియందుఁ గానఁబడు తాత్త్వికౌన్నత్యము, సార్వకాలిక విజ్ఞాననిధిత్వము, పంచమవేద మనఁబడు ప్రామాణికత్వము వానియందుఁ దత్సాహిత్యరంగమునఁ గానరావు. పాశ్చాత్యుల Epic లక్షణములు భారతీయుల మహాకావ్యలక్షణముల కత్యంతసన్నిహితమై యున్నవి. కాని, యితిహాస సమగ్ర స్వరూపలక్షణముల నవి ప్రతిబింబించుకొనలేదు.

పాశ్చాత్యవిమర్శకులు Epicను Authentic Epic అనియు, Literary Epic అనియు ద్విధాకరించిరి. Authentic Epicను Primary Epic అనియు, Epic of growth అనియు, Oral Epic అనియుఁ బిలిచెదరు. Literary Epic ను Secondary Epic అనియు, Epic of Art అనియు, Written Epic అనియు వ్యవహరించెదరు. విమర్శకులు వీనిని గుఱించి వివరించిన వాక్యములను క్రోడీకరించుకొనినచో వాని స్వరూపస్వభావముల నీ క్రిందివిధముగా భావింపవచ్చును.

భట్టులవంటి కథకు లొక సమకాలీన సత్వరప్రయోజన ముపలక్షించి వివిధకాలములందుఁ జెప్పఁబడుచుఁ బారంపర్యముగా వచ్చుచున్న కథలనుగాని, ప్రత్యక్షముగా లోకమున గనుగొన్న యద్భుతవీరదృశ్యములను గాని గానము చేయుచు వినిపించుచుండ వాని నొకచోట సంపుటీకరణము చేసినచో నది Authentic Epic అనఁబడును. సామాన్యముగా నిట్టివి యాశువుగాఁ జెప్పఁబడుచుండుటచే వక్తృభేదము ననుసరించి నూతనాంశములు పెక్కు లిందుఁ జేరుట కవకాశమున్నది. ఇవి సాధారణముగా ననేకవీరుల సాహసగాథలను వర్ణించుచుండుటచే బహునాయకములై యుండును. అందలిపాత్రలు గుణదోషమిశ్రమూర్తులైన మానవులై యుందురు. అందుఁ బ్రబోధము నిర్వహింపఁబడవలె ననెడి యాదర్శదృష్టికంటె వాస్తవికతను బ్రతిబింబింపఁ జేయవలె ననెడి యాసక్తి యధికముగాఁ గానఁబడుమ. అందలి కవితాశైలి సరళమును, శక్తిమంతమును, ధారాళము నై, నిరాడంబరముగా నొప్పారుచుండును.

ఒకమహాకవి మహాకవిత్వదీక్షావిధి నంది తా నొక యితిహాసమును రచింప సంకల్పించి ప్రయత్నపూర్వముగా నందు కావ్యశిల్పాదులను సంతరించి రచించిన కవితాగ్రంథవిశేషము Literary Epic. సామాన్యముగా నొక మహాసంఘటనము గాని, యొక యుజ్జ్వలచరిత్రాధ్యాయము గాని ముగిసిన వెంటనే వెలసిన యొక మహాకవి యద్భుతనభూతమైన యాచరిత్రను సమగ్రముగా సమీక్షించి, యొక తాత్త్వికసమన్వయముతో వస్త్వైక్యమును సంతరించి, యాలంకారికమైన ప్రౌఢ కవిత్వమున నొక మహాకావ్యముగా నిర్మించుచుండును. అది సార్వకాలీనమైన సాహిత్యప్రయోజనము నుపలక్షించి పఠనపాఠనముల కుపయోగపడునట్లు రచింపఁ బడును. సాధారణముగా నిది యేకనాయకమై యుండును. ఆనాయకుఁడు స్వయం సమర్థుఁడును దివ్యాదివ్యుఁడు నయి యుండుటయే కాక యొక్కొకసారి యొక జాతికిని, ఒకసంస్కృతికినిఁ బ్రతీకగానో-లేక-ప్రతినిధిగానో నిర్మింపఁబడవచ్చును. ఆనందముతోపాటు, ఉపదేశమును గూడ సామాజికుల కందించుట దీని ప్రధాన లక్ష్యము.

సంస్కృతమున వెలసిన యితిహాసముల కీవిభాగము సమగ్రముగా నన్వ యింపదు గాని స్థూలదృష్టితోఁ బరిగణించినచో మహాభారతము Authentic Epic అనియు, రామాయణము Literary Epic అనియు భావింపవచ్చును.

Myth అను పద మిప్పుడు అభూతకల్పన మను నర్థమున నిత్యవ్యవహార మున వాడఁబడుచున్నది. ఈపదము ప్రాచీనగ్రీకుభాషలో 'నోటితో నుచ్చరింపఁబడి నది యను నర్థము నిచ్చు 'Mythos' అను పదమునుండి జన్మించినది. ఆపద మాభాషలోనే కాలక్రమమున దైవములకును, అద్భుతావహములగు దైవలీలలకును సంబంధించినగాథ లను నర్థమున బ్రసిద్ధికెక్కినది. అది క్రమముగా నమాయకు లను మోసగించుటకై కల్పింపఁబడిన యద్భుతగాథ యను నర్థమున రూఢి కెక్కినది.

పాశ్చాత్యవిమర్శకులు Myth అనునది యనాదిమానవుఁడు భగవదారాధన రూపమైన పవిత్రకర్మతంత్రము నాచరించునప్పు డుచ్చరించిన వాక్యసముదాయము నుండి మొదట పుట్టియుండవచ్చు ననియు, నదియే క్రమముగాఁ దత్కర్మల నాచ రించిన వ్యక్తులయొక్కయు, దైవములయొక్కయు మహిమాన్వితములైన గాథలతో విస్తరించి యుండవచ్చు ననియు భావించుచున్నారు. ప్రాచీనులు ప్రకృతిశక్తులను, పితృదేవతలను, సురాసురప్రవృత్తులను, వన్యమృగాదులను, ఆదర్శప్రభువులను,

మాంత్రికులను, ఐంద్రజాలికులను, దైవములుగా రూపకల్పన గావించి,[1] వారి యందు మానవాతీతశక్తుల నారోపించి, యద్భుతకథలుగా వర్ణించియుందు రని యూహించుచున్నారు. మొత్తముమీఁద Myths చారిత్రకసత్యములు కావనియు, మానవాతీతశక్తులకు సంబంధించిన కల్పితగాథ లనియు (జాలమంది విమర్శకులు విశ్వసించుచున్నారు. ఇట్టికథ లభూతకల్పనలుగా నిప్పుడు కానవచ్చుచున్నను ప్రాచీను లాకథలు గాథలు పురాతనకాలమునం దెప్పుడో యొకప్పుడు జరిగియుండి యుండు నను విశ్వాసముతో నుండి రని ప్రొఫెసర్ మాలినొస్కివంటి విమర్శకులు భావించుచున్నారు; ఆగాథలయం దవి యెట్టిపురాతనవాతావరణములందుఁ బుట్టినవో వానియందుఁ బ్రపంచిత మయ్యెడి ప్రాచీనవిశ్వాసాదు లెట్టివో తెలుపునంశములు భద్రపఱచుట జరిగిన దనియు, తత్కథాకథనమున శ్రోతలు వానియందలి శబ్దములను, భావములను, వివరములను ప్రమాణబుద్ధితో గ్రహించి వానిపట్ల నెట్టి మార్పు చేర్పు లొనర్చుటకును సుముఖులై యుండెడివారు కారనియుఁ దలంచుచున్నారు.

Mythలలో దైవలీలలేకాక సర్గప్రతిసర్గాదులవంటి విషయములును, ఖగోళ రహస్యవిషయములును, స్వర్గనరకాది పరలోకవిషయములును, పుణ్యాపాపఫలానుభవవిశేషములును, నరు లొనర్చు ఆముష్మికపుణ్యకర్మలకు దేవతలు తృప్తులై లోకమునకు వా రొనర్చు ప్రత్యక్ష ప్రత్యుపకారాదులును, అట్లే దేవతల యాగ్రహచర్యలును వర్ణింపఁబడియున్నది. అతిప్రాచీన విషయములయొక్క విస్పష్టోత్పత్తి వికాసాదుల నెఱిఁగింప యత్నించిన కథలలోఁ గొన్నింట స్థానికచరిత్రలే పురాణగాథలుగాఁ బరివర్తనము చెందుటయుఁ గానఁబడుచున్నది. Mythలలో నభివర్ణితులైన దేవతలలో సూర్యున కధికోన్నతస్థానము గలదు. ఒకవిధముగా సర్వప్రపంచ పురాణవాఙ్మయము (mythologies) సూర్యునిచుట్టు తిరుగుచున్న దని చెప్పినను ఆశ్చర్యము లేదని విమర్శకులు భావించుచున్నారు.[2]

Myth యొక్క వైశిష్ట్యమును ప్రొఫెసర్ మాలినొస్కి యీ క్రింది వాక్యములలోఁ బ్రతిభావంతముగా నుడివియున్నాఁడు. "ఒకజాతియొక్క సంప్రదాయములను బలపఱచుటకు (Myth) పుట్టును. చరిత్ర కందని పురావృత్తమును సముజ్జ్వలాధ్యాత్మికదృష్టితో సముద్ధరించి, వ్యాఖ్యానించి, జాతియొక్క గౌరవప్రతిష్ఠల

---

1. The outlines of Mythology - by Lewis Spence P. 25.

2. The outlines of ythology — page 71-72.

నిరూపించుటయే 'మైథాలజీ' లక్ష్యము. 'మైథాలజీ' సర్వవాఙ్మయమునకు మూలభూత మైనది. అందుండియే ఇతిహాసము, కావ్యము, నాటకము-సర్వము జనించును. 'మైథాలజీ' మానవసంఘవ్యవస్థను శాసించును, ధర్మమును బోధించును, న్యాయమును సూచించును. శిల్పసుందర మైన కళయును, జ్ఞానబంధుర మైన శాస్త్రమును దానివాకిట భాసించును. కావున మానవుని ఆవేశములకును, యనుభూతులకును, ఆశలకును, ఆశయములకును, అంతరంగమునకును, అన్వేషణమునకును 'మైథాలజీ' యొక మణిదర్పణము వంటిది.[1]

పాశ్చాత్యులు భారతీయుల వేదపురాణేతిహాసములను గలిపి యుమ్మడిగా (Myths) అని గుర్తించియున్నారు. కాని, భారతీయులు శ్రుతిస్మృతులను శాస్త్రములుగను, పురాణేతిహాసములను శాస్త్రములకంటె భిన్నమైన సారస్వతప్రక్రియలుగను బరిగణించుట ప్రసిద్ధము. కావున పాశ్చాత్యులు చెప్పిన Myth యొక్క స్వరూపస్వభావములలో భారతీయుల వేదముల కేవి వర్తించునో, పురాణేతిహాసముల కేవి వర్తించునో వివేచింపవలసి యున్నది.

పురుషార్థసాధకుఁడైన మానవుని ధర్మాచరణమును విధిరూపమున నిర్దేశించునవి వేదాదు లగుటచే నవి శాసించు శాస్త్రము లనియు, నవి శబ్దప్రధానము లనియుఁ జెప్పఁబడుచున్నవికదా! అట్టి శబ్దప్రధానములైన కర్మతంత్రవిధులు Myth లలోఁ గలవని పాశ్చాత్యులు చెప్పుచున్నారు. వానియందుపయుక్తములైన శబ్దములకు మారుగా నదే యర్థము నిచ్చు నన్యశబ్దములను వాడినచో శ్రోతలు గర్హింతు రనుటయు దాని కుపబలకముగా నున్నది. వేదశాస్త్రములందలి ఋక్-సూత్రములకు నిట్టినియమము ప్రసిద్ధము కావున కర్మతంత్రముల (Rites) నభివర్ణించు Myth వేదతుల్యమైనది. తత్స్వరూపస్వభావముల నిర్దేశించు వాక్యసముదాయము స్మృతిగ్రంథసదృశమైనది. మఱియు వేదమున మంత్రబ్రాహ్మణములు కలవు. మంత్రము దైవస్వరూపమును శబ్దరూపమున వాచ్యము చేయు బీజాక్షరసంపుటి. బ్రాహ్మణము విధి-అర్థవాద - అనువాద భేదముచేఁ ద్రివిధము. ఇట్టి వానినే "Myth is, in the strict sense of the term, the description of a rite, its story, the narrative linked with it" అని Lewis Spence భావించియుండును.

---

1. Myth in Primitive Psychology—by Molinowski.

Mythology లోఁ గానఁబడు నిట్టి విధివాక్యములు గాక మిగిలినలక్షణములు కొన్ని పురాణముల కన్వయించుచున్నవి. సర్గప్రతిసర్గములు, పుణ్యపాపఫలరూపము లైన స్వర్గనరకభోగవరనాదులు, భగవల్లీలలు, పితృదేవతామహిమలు, ప్రకృతి శక్తులు పాత్రలుగాఁ గల గాథలు, సూర్యమహిమాభివర్ణితములగు కథలు, పురాణము లందును వర్ణింపఁబడుచున్నవి. మఱియు - పురాణములు వేదార్థోపబృంహితము లగుటచే Myths లోవలె rites కు సంబంధించిన విషయములు పురాణములం దుండుననుటలో వైరుధ్యము లేదు. పురాణములు వేదతుల్యము లనియు భారతీయులు భావించుచున్నారు కావునఁ బాశ్చాత్యుల Mythology కిని, పురాణవాఙ్మయము నకును గొంత సాదృశ్య మున్న దనుటలో విప్రతిపత్తి లేదు.

ప్రతిపాద్యాంశములను బట్టి Myths - Explanatory Myths అనియు, Aesthetic Myths అనియు రెండువిధములని C. M. Gayley విభజించెను.[1] విశ్వవిశ్వాంతరాళములలోని మహాద్భుతవిషయములను గూర్చియు, జీవితవిశేషాను భవములను గూర్చియు, ననాదిమానవుల కున్న యాసక్తిని దీర్చుటకై సత్యాన్వేషణ పరులైన కొందఱొనరించిన యూహాపోహలలో రూపులు దిద్దుకొనినకథలు Explanatory Myths. వానియందుఁ బ్రపంచసృష్టియు, మానవసృష్టిస్థితి వికాసములును, దేవాసురప్రవృత్తులును, మృత్యువు, పరలోకములు, ఆచారవ్యవ హారములు, పండుగపబ్బములు - ఇట్టివానినిగూర్చిన జిజ్ఞాసయు కథలుగా గాథలుగా నల్లుకొని కానఁబడుచుండును.

ఆహ్లాదమే పరమప్రయోజనముగా నిర్మింపఁబడిన యపూర్వకల్పనామహనీయ గాథాప్రపంచమును Aesthetic Myths అని యందురు. ఈకథలయం దపూర్వ విజ్ఞానవిశేషము లెన్నియో చెప్పఁబడును. కాని, వానివలన నాహ్లాదముకంటె వేఱొకప్రయోజనము కానరాదు. అందలి పాత్రలును, వాని మనోభావములును, సన్నివేశములును మానవసహజానుభవములకు దూరమై యున్నను భావనాబంధుర ములై యాబాలగోపాలమును జవులూరించును. పఠితలు వానివలన బొందెడి యఖండానందమున కాకథామాధుర్యమే పరమకారణము.

Aesthetic myths లోఁ జరిత్రాంశము లాధారముగా వెలసినవి కొన్నియుఁ, గేవలము కల్పనాకథలు కొన్నియుఁ గానవచ్చుచుండును. అట్టి భేద

1. The Classic Myth - Page. 431.

మును బురస్కరించుకొని C. M. గేలే Aesthetic myths ను Historical myths అనియు, Romantic myths అనియు, రెండువిధములుగా విభజించెను. చారిత్రకాంశము నొకదాని నాధారముగాఁ గొని, దాని కొక దివ్యవాతావరణమును, సాహసాత్మకకథాస్వభావమును, భావనాబంధురములును సంభావ్యతా గుణవిశిష్టములు నైన కల్పనలను జోడించికొని యొకమిశ్రకథామూర్తిగా రూపొందినది Historical myth అనఁబడును. దానియందు బలియు మైన విధిప్రభావము సర్వకథాజీవితమును శాసించుచున్నట్లు చిత్రింపఁబడుట గమనింపఁదగిన ముఖ్యాంశము. Romantic myth ఒకమహావీరుని యుజ్జ్వలచరిత్రము నభివర్ణించుకథ. అందు సన్నివేశములకంటెఁ గథానాయకపాత్ర చిత్రణమునకే ప్రాముఖ్య మీయఁబడుచుండును. అతని యాలోచనలయొక్కయు, ఆచరణలయొక్కయు, నిర్ణయములయొక్కయు గతి ననుసరించి సర్వకథాప్రవృత్తి వానిచుట్టు పరిభ్రమించుచుండుట యాకథలలోని ప్రత్యేకత.

పాశ్చాత్యులు Myth లను విభజించినవిధమును పురాణకథల కన్వయింపఁ జేసినచో వీనిలోని సర్గప్రతిసర్గవృత్తాంతములు Explanatory myths అనియు, మన్వంతరవంశవంశానుచరితములు Aesthetic myths అనియు స్థూలముగా నేర్పరుపవచ్చును. అందు వంశానుచరితములందలి యైతిహాసికమహాపురుషుల చరిత్రలు Historical myths అనియు, భావింపవచ్చును. కాని యిట్టిదృష్టితో పురాణకథలను విభజించినట్లు కానరాదు. కాని నవ్యులు పాశ్చాత్యవిమర్శనపద్ధతుల ననుసరించి పురాణకథల నిట్లు వర్గీకరించుచున్నారు. అయినను తత్పరిగణనము సర్గాదివిభాగముకన్న స్వాభావికమును, సార్థకమును గాఁజాలదు.

పాశ్చాత్యులు రామాయణమహాభారతములను Epics అనియు, Myths అనియుఁ గీర్తించిరి. వానిని Epics అనియే గుర్తించుట సమంజసము. కాని, వారి Epic భావనకును, మన యితిహాసస్వరూపసంభావనమునకును మౌలికమైన కొన్ని భేదము లుండుటవలననే యిట్టి చిక్కేర్పడినది. అది యట్లయినను పురాణములకును Myths కును స్వరూపస్వభావములందుఁ గొన్నిసమానలక్షణము లున్నవనుట తథ్యము !

మేఘసందేశము - ప్రకృతివర్ణనము

కాళిదాసమహాకవి రచించిన లఘుకృతులలో మేఘసందేశము మేలుబంతి. శాపగ్రస్తుఁ డైన యక్షుఁ డొకఁడు తనసతికి మేఘముఖమునఁబంపిన సందేశ మను కథావస్తువు కలిగియుండుటచే నాకావ్యమునకు మేఘసందేశ మను పేరుపెట్టఁబడినది. దానికి మేఘదూత మనియుఁ బ్రసిద్ధి కలదు. మేఘునిదౌత్యము నధికరించి యుంచఁ బడిన నామ మది. కాళిదాసుని యాకృతి సందేశకావ్య మనియు, దూతకావ్య మనియుఁ బిలువఁబడు నొకనూత్నకావ్యనిర్మాణప్రక్రియకు శ్రీకారము చుట్టినది. వాల్మీకిరామాయణమునందలి 'హనుమత్సందేశ' ఘట్టము మేఘసందేశకావ్యరచనకుఁ బ్రేరణ కల్పించి యుండవచ్చునని విమర్శకులు భావించుచున్నారు. అయినను ఈ కావ్యమున కున్న వ్యక్తిత్వము విశిష్టమైనది. హనుమత్సందేశము దీనివలె నొక స్వయంసమగ్రమైన కృతికాదు. అది యొక మహాకావ్యాంతర్భాగము. మేఘసందేశ మపూర్వకల్పనావిశేషావహమైన కవిప్రతిభనుండి యుద్భవించిన స్వతంత్రము, సమగ్రము నైన యొకకల్పితఖండకావ్యము. ఇది తరువాతి సందేశ-దూత-కావ్యము లకు మార్గదర్శకమై నేఁటికిని తన గురుగౌరవమును నిలుపుకొనుచున్నది.

మేఘసందేశము పూర్వమేఘ మనియు, ఉత్తరమేఘ మనియు రెండు భాగములుగా విభజింపఁబడినది. ఆత్మాశ్రయకవిత్వకాసార మైన యీకావ్యము కథాప్రధానమైనది కాదు; వర్ణనాప్రధానమైనది. కాళిదాసు తాను గడించిన యఖండ ప్రపంచానుభవమును రసదిదృక్షువై భావించి, యాత్మీయతాగుణము జోడించి, ప్రకృతికిని మానవునకును గల యవినాభావసంబంధమును సూక్ష్మేక్షికతో దర్శించి భావనాబంధురముగా రసనింభుపువలె నీకావ్యమును సృజించెను.

మేఘసందేశమున కథ యత్యంతముస్వల్పము. స్వాధికారప్రమత్తుఁ డైన యక్షుఁ డొకఁడు కుబేరునిశాపమునకు గురియై చిత్రకూటాద్రిప్రాంతమున (రామ గిర్యాశ్రమమున) సంవత్సరభోగ్య మైన ప్రియావియోగము ననుభవించుచు, నాషాఢ మాసారంభమున గనవచ్చిన యొకమేఘుము దూతగాఁ దనసందేశము నలకాపురియం

దున్న తనయర్ధాంగి కంపుట యిందలి వస్తువు. అలకాపురీగమనమునకు మార్గ నిర్దేశ మొనర్చుట పూర్వమేఘమందలి కథాంశము; అలకాపురమును, యక్షగృహమును, యక్షసతీవిరహావస్థను, యక్షసందేశమును వర్ణించుట యుత్తరమేఘమందలి యితివృత్తము. ప్రవాసవిప్రలంభశృంగారరసపోషణ మీకావ్యమునకుఁ బ్రాణము.

కవి రసభావములను వర్ణించును. వర్ణ్యవస్తువులను బ్రకృతినుండి గ్రహించును. అవి చేతనాచేతనములును, సాకారనిరాకారములు నై యొప్పుచుండును. అందు కన్నులతోఁ జూచినట్లు కొన్నింటిని, రమణీయవస్తుసాదృశ్యముతో భావింపఁదగినట్లు కొన్నింటిని, వ్యంగ్యార్థముచే నూహింపఁ దగినట్లు కొన్నింటిని కవి ప్రతిభతో వర్ణించును. కావ్యవస్తు వను భిత్తికపై వ్యుత్పత్తి యనెడి ధాతురాగముతో నలంకారములను రేఖలను గీచి ప్రతిభ యను కుంచెతో వర్ణములు నింపి లౌకిక జగత్తునకుఁ బ్రతిబింబ మైన రసమయజగత్తును కవి చిత్రించును. అందు చేతనాచేతనము లన్నియు సజీవమూర్తులై లోకవృత్తమునకు మణిదర్పణములవలె భాసించుచుండును.

యక్షుఁడు మేఘునిముఖమున బ్రియురాలికి సందేశ మంపఁదలఁచి యలకాపురిమార్గమును సూచించుచు, మార్గమధ్యమునందుఁ గల కొండలను, నదులను, వనములను, నగరములను, క్షేత్రములను, పశుపక్ష్యాదులను, నరనారీజనములను గథానుగుణముగ వర్ణించుటయే మేఘసందేశకావ్యమందలి ప్రకృతివర్ణనలస్వరూపము. వర్ణనము స్వరూపస్వభావభేదముచే ద్వివిధము. మేఘాసన్నకాలమునందలి ప్రకృతిబహిస్స్వరూపమును వర్ణించుట స్వరూపవర్ణనము. జీవప్రకృతిలో స్వభావపరిణామమును దెలుపుట స్వభావవర్ణనము. రసాత్ముఁడైన మేఘునిముఖమున వానిని సాధారణీకరించుట రసజ్ఞుఁడైన కాళిదాసు చేసినపని! చిత్రకూటాద్రిపైనుండి పుష్పకవిమాన మెక్కి యలకానగరము చేరునంతవఱకు మేఘునితోఁ బయనించిన ట్లాదృశ్యములు మన కనుభూతము లగును.

కాళిదాసు ప్రకృతివర్ణన చేయునపు డందలి చేతనాచేతనములయొక్క స్వరూపము నెంత రమణీయముగఁ జిత్రించెనో వానిస్వభావమునుగూడ నంత హృదయంగమముగా భావించి ప్రపంచించెను. స్వరూపచిత్రణముకంటె స్వభావవర్ణనము రసవంతమై మహాకవిప్రతిభకు నికషోపల మగును. కాళిదాసు వ్యంగ్యమార్గము ననుసరించి యట్టి ప్రకృతిస్వభావమును మేఘసందేశమునఁ బ్రపంచించినాఁడు.

యక్షుఁడు వప్రక్రీడాపరిణతగజప్రేక్షణీయ మైన మేఘమును గాంచెను. మేఘము కౌతుకాధానహేతువు. ప్రియురాలితోఁ గూడి సుఖమున్న వానికైనను మేఘదర్శనమువలన వలపు మోసులెత్తును. ఇఁక ప్రియావియోగదుఃఖ మనుభవించు చున్న యక్షునిమాట వేఱుగాఁ జెప్పవలెనా ? దేశాంతరగతులైన ప్రియులు మేఘో దయమును గాంచి యబలావేణిమోక్షణౌత్సుక్యమును దాల్చెదరఁట! అట్టివారిని మేఘుఁడు తనమంద్రస్నిగ్ధగర్జలచేఁ ద్వరపెట్టునఁట!

"యో బృన్దాని త్వరయతి పథిశ్రామ్యతాం ప్రోషితానాం
మన్ద్రస్నిగ్ధైర్ధ్వనిభి రబలావేణిమోక్షోత్సుకాని." — ఉ. మే. 38.

అని మేఘుఁడే తనస్వభావమును దెలియపఱచినాఁడు. కావున యక్షునిచిత్తవృత్తి మేఘోదయకాలమునందలి విరహుల సామాన్యమనఃప్రవృత్తి. అది స్త్రీపుంసప్రవృత్తులసంయోగాకాంక్షారూపమై ప్రకృతియందు వ్యాపించియుండును. కాలస్వభావము ననుసరించి భావించినను అది సమంజసమే యగును. వసంతఋతువు రత్యుద్దీపనమున కనువైనకాలము. ఆసమయమున స్త్రీపుంసయోగరూపమైన రతిభావమును ప్రకృతి భజించును. కాని, గ్రీష్మర్తువున మార్తాండతీవ్రతాపమునకు జీవప్రవృత్తి తప్తమై యలసమై యుండుటచే ప్రకృతి విరతిని భజించును. భూమిపై ధూళికణములుసైతమెండవేడిమికి వేఁగి పొడిపొడియై విడివడై పడియుండు నన్న కుసుమదళసదృశము లైన నరనారీచిత్తవృత్తుల విషయము వేఱుగాఁ జెప్పవలయునా ? అట్లు గ్రీష్మాతప సంతప్తములైనచిత్తములు మఱల చిగురింపఁ బ్రణయసుధాసేచనమువలె వానజల్లులఁ గురియునది మేఘము. వర్షధారలవలన ధూళికణములు రసార్ద్రములై ముద్దయగును. బీజములందలి జీవాణువులు పులకించి మొలకెత్తును; ప్రకృతియందలి స్త్రీపుంస ప్రవృత్తులు మఱల రతిచైతన్యమును భజించి పరస్పరపునస్సమాగమాకాంక్ష వహించును. కావున కాళిదాసు వర్షారంభసమయమున చేతనాచేతనరూపమైన ప్రకృతి యందు స్త్రీపుంససంయోగరూప మగు మహాచైతన్య మొందు వ్యాపించియుండు నను తాత్పర్యమును యక్షముఖమున మేఘసందేశమునం దంతటను వ్యంగ్యముగా నిబంధించెను. అది కావ్యకథానుకూలమును, శృంగారరసపోషకము నగుటచే సార్థక మగుచున్నది.

విరహార్తుఁడైన యక్షుఁడు అలకానగరమార్గమునందలి విశేషములను వర్ణించిచెప్పు వాక్యసముదాయమునం దంతర్లీనముగాఁ బైన పేర్కొనఁబడిన భావ

స్రోతస్విని ప్రవహించుచున్నది. శాపకారణముగా నతని కేర్పడిన బలవద్వియోగమువంటిది లోకమున నెవ్వరికిని కలుగకూడ దని యతనిభావము. పరస్పరసాన్నిహిత్యము గోరు ప్రేయసీప్రియులమధ్య గాని, సన్నిహితులై సుఖులై యున్న దంపతులనడుమగాని, వియోగము క్షణకాల మైనను కలిగినట్లు భావించుటకుఁగూడ యక్షునిచిత్త మంగీకరింపదు. అందువలన పయోదప్రయాణము ప్రణయసిద్ధిప్రమోదహేతువై ప్రణయజీవులను రంజింపవలె నని యతఁ డాశించెను. అతఁ డభిసారికలను వర్ణించినను, సిద్ధదంపతులను భావించినను, పార్వతీపరమేశ్వరుల నూహించినను వారికి మేఘునివలన వియోగవిలుప్తియు, సంయోగసంసిద్ధియుఁ గలుగవలె ననియే యాశించుటయు, మేఘుని దత్తదుచితవిధముల వర్తింపు మని నిర్దేశించుటయు గమనింపఁదగియున్నది. ఈక్రిందిశ్లోకము లంటుల కుదాహరణములు :

ఉజ్జయినీనగరమందలి యభిసారికలు :

"గచ్ఛన్తీనాం రమణవసతిం యోషితాం తత్ర నక్తం
రుద్ధాలోకే నరపతిపథే సూచిభేద్యై స్తమోభిః
సౌదామిన్యా కనకనికషస్నిగ్ధయా దర్శయోర్వీం
తోయోత్సర్గ స్తనితముఖరో మాస్మభూ ర్విక్లబా స్తాః."

— పూ. మే. 41.

అమ్రకూటమున సిద్ధదంపతులు :

"అమ్భోబిన్దుగ్రహణచతురాం శ్చాతకాన్ వేక్షమాణాః
శ్రేణీభూతాః పరిగణనయా నిర్దిశన్తో బలాకాః
త్వా మాసాద్య స్తనితసమయే మానయిష్యన్తి సిద్ధాః
సోత్కమ్పాని ప్రియసహచరీ సంభ్రమాలిఙ్గితాని."

— పూ. మే. 22.

మహాకాళక్షేత్రమున పార్వతీపరమేశ్వరులు :

"పశ్చాదుచ్చై ర్భుజతరువనం మణ్డలేనాభిలీనః
సాన్ధ్యం తేజః ప్రతినవజపాపుష్పరక్తం దధానః
నృత్యారమ్భే హర పశుపతే రార్ద్రనాగాజినేచ్ఛాం
శాన్తోద్వేగ స్తిమితనయనం దృష్టభక్తిర్భవాన్యా."

— పూ. మే. 40.

కైలాసనగమున పార్వతీపరమేశ్వరులు :

"హిత్వా తస్మిన్ భుజగవలయం శమ్భునా దత్తహస్తా
క్రీడాశైలే యది చ విహరే త్పాదచారేణ గౌరీ
భఙ్గీభక్త్యా విరచితవపుః స్తమ్భితాన్తర్జలౌఘః
సోపానత్వం కురు మణితటారోహణాయాగ్రయాయీ."

— పూ. మే. 64.

ప్రియసమాగమాకాంక్షలై చిమ్మచీఁకటిలో రాజమార్గమునఁబోవు తమోభిసారిక లభీష్టసిద్ధి వడయుటకు మేఘుని మెఱయు మనినాఁడే కాని యుఱుముపల దనినాఁడు యక్షుఁడు. సిద్ధపతు లయాచితప్రియాపరిరంభసౌఖ్యము నొందవలె నని యాశించి యతఁడు మేఘుని యుఱుము మనినాఁడు కాని వర్షింపవల దనినాఁడు. ప్రణయాధిదేవత లగు పార్వతీపరమేశ్వరులపట్ల అతఁడు మేఘుని నాదేశించినవిధము వేఱు. ఆదంపతుల యవిచ్ఛిన్నానురాగమున కావంతయైన యవరోధము కలుగకుండవలె నని యక్షుని యభిమతము. నటరాజస్వామి తాండవ మాడునెడ నతని యర్ధాంగియైన పార్వతి లాస్య మాచరించును. స్వామి ధరించిన రక్తార్ద్రగజచర్మవస్త్ర మాదేవి చిత్తమునఁ గొంత యేవగింపు గలిగించి యతనినుండి యామెను గొంత దూరముగా నేఁగునట్లు చేయు నని యతని భయము. మేఘుఁ డాగజాజినస్థానమున నిలిచినచో నాయుమాదేవి ప్రీతితోఁ బతిఁ గూడి సుఖింపఁగల దఁట! కైలాసమునఁ బతికర పల్లవము గ్రహించి శివునివెంట విహరించుపార్వతి పర్వతసానువుల నధిగమించుటలోఁ గొంతక్లేశ మొంది యతని యత్యంతసాన్నిహిత్యము ననుక్షణము పొందఁ జాలదేమో యని యక్షునివిచారము. అందువలన నాదేవికి సుకరగమనసౌఖ్యము నాపాదింప మణివేదికగా నిలువు మని మేఘుని నాదేశించినాఁడు. ఆదిదంపతుల యవిచ్ఛిన్నప్రణయసిద్ధిని గోరు యక్షుఁడు సర్వజీవప్రవృత్తులలో నట్టి సంవిధానము నాశించుటలో నాశ్చర్య మేమి? అది సార్థక మనుటలో ననుమాన మేమి?

విరహతప్తుఁడైన యక్షుఁడు చేతనప్రకృతియందేగాక అచేతనప్రకృతి యందును ప్రణయసిద్ధిని గాంక్షించి సర్వభూతహితార్థబుద్ధి యైనాఁడు. అతఁడు నదీమేఘములమధ్య నాయికానాయకసంబంధమును భావించి తత్పునస్సంయోగసిద్ధిని బెక్కుచోట్ల వర్ణించినాఁడు. మచ్చున కొండురెండు వర్ణన లీక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి.

దశార్ణదేశములందలి వేత్రవతీనది :

"తేషాం దిక్షు ప్రథితవిదిశాలక్షణాం రాజధానీం
గత్వా సద్యః ఫల మవికలం కాముకత్వస్య లబ్ధా,
తీరోపాన్తస్తనితసుభగం పాస్యసి స్వాదు యత్త
త్సభ్రూభఙ్గం ముఖ మివ పయో వేత్రవత్యా శ్చలోర్మి."

— పూ. మే. 25.

నిర్వింధ్యానదీ వర్ణనము :

"వీచిక్షోభ స్తనితవిహగశ్రేణికాఞ్చీగుణాయాః
సంసర్పన్త్యాః స్ఖలితసుభగం దర్శితావర్తనాభేః,
నిర్విన్ధ్యాయాః పథి భవ రసాభ్యన్తరః సన్నిపత్య
స్త్రీణా మాద్యం ప్రణయవచనం విభ్రమో హి ప్రియేషు."

— పూ. మే. 29.

"వేణీభూత ప్రతను సలిలా సా త్వతీతస్య సిన్ధుః
పాణ్డుచ్ఛాయా తటరుహతరుభ్రంశిభి ర్జీర్ణపర్ణైః
సౌభాగ్యం తే సుభగ విరహావస్థయా వ్యఞ్జయన్తీ
కార్శ్యం యేన త్యజతి విధినా స త్వయై వోపపాద్యః."

— పూ. మే. 30.

గంభీరానదీ వర్ణనము :

"గమ్భీరాయాః పయసి సరిత శ్చేతసీవ ప్రసన్నే
ఛాయాత్మాపి ప్రకృతిసుభగో లప్స్యతే తే ప్రవేశం
తస్మా దస్యాః కుముదవిశదా న్యర్హసి త్వం న ధైర్యా
న్మోఘీకర్తుం చటులశఫరోద్వర్తనప్రేక్షితాని." — పూ. మే. 44.

"తస్యాః కిఞ్చి త్కరధృత మివ ప్రాప్తవా నీరశాఖం
హృత్వా నీలం సలిలవసనం ముక్తరోధో నితమ్బం,
ప్రస్థానం తే కథ మపి సఖే లమ్బమానస్య భావి
జ్ఞాతాస్వాదో వివృతజఘనాం కో విహాతుం సమర్థః."

— పూ. మే. 45.

నదీమేఘము లచేతనము లయ్యు పై శ్లోకములందలి యర్థాలంకారశక్తిచే సాకారములై శృంగారనాయికానాయకులవలె రాణించి పఠితల మనోనేత్రముల నలరించుచున్నవి. కవిసృష్టిలో కాని దేమున్నది ? వార్షుకప్రకృతియందు సహజ విభావము లైన నదీమేఘములను గ్రహించి, వానియందు చేతనత్వ మారోపించి, స్త్రీపుంసయోగరూపజీవచైతన్యమును వ్యంజించి, రసపోషణము గావించిన కాళిదాసు ప్రతిభ నిసర్గరమణీయమై రాణించుచున్నది.

కాళిదాసు నదీమేఘములనే కాక ప్రకృతిగతములైన బహువిధాచేతనద్రవ్యములను వర్ణించు నవసరములందును ప్రణయసంసిద్ధిభావమునకు ప్రాధాన్య మొసఁగి రచనము గావించెను. ఉదాహరణమున క్రిందిశ్లోకములను గమనింపనగును.

సూర్యోదయకాలవర్ణనము :

"తస్మిన్కాలే నయనసలిలం యోషితాం ఖణ్డితానాం
శాన్తిం నేయం ప్రణయిభిరతో వర్త్మభానో స్త్యజాశు,
ప్రాలేయాస్రం కమలవదనాత్సోఽపి హర్తుం నలిన్యాః
ప్రత్యావృత్తస్త్వయి కరరుధి స్యాదనల్పాభ్యసూయః."

—పూ. మే. 43.

ఇందు పద్మిని ఖండితానాయిక. సూర్యుఁడు నాయకుఁడు. అన్యకాంతారతుఁడై రాత్రి చరించి యుదయమున నింటికిఁ జేరు ధృష్టునివలె సూర్యుఁడు ఉదయించినాఁడు. పద్మిని ఖండితానాయికవలె నవ్యరతుఁడైన నాథుని గాంచి మంచు కన్నీటిని పద్మముఖమున దాల్చినది. సూర్యుఁ డామెకన్నీటిని దుడిచి యూరడింప కరములుసాచు తరుణ మది. వియోగదుఃఖిత యైన నాయిక పతిప్రణయసిద్ధిని బడయు నాశుభవేళ మేఘుఁ డాదంపతులనడుమ నిలువక తొలఁగిపోవలయు నని యక్షుని యాదేశము ! కవిసమయము నాశ్రయించి కావింపఁబడిన యీవర్ణనమున కవిహృదయము నూహించుట కష్టతరము కాదు !

శిప్రావాయువు ప్రార్థనాచాటుకారుఁ డగు ప్రియునివలె సురతపరిశ్రాంత లైన సుదతుల చిత్తములందలి గ్లానిని బోఁగొట్టి పునస్సంభోగాభిలాషను రేకెత్తించు నఁట !

"దీర్ఘీకుర్వన్ పటుమదకలం కూజితం సారసానాం
ప్రత్యూషేషు స్ఫుటితకమలామోదమైత్రీకషాయః

యత్ర స్త్రీణాం హరతి సురతగ్లాని మఙ్గానుకూలః
శిప్రావాతః ప్రియతమ ఇవ ప్రార్థనాచాటుకారః," — పూ. మే. 32.

ఇట్లు సార్వకాలికప్రకృతిద్రవ్యములైన సూర్యపవనాదులయందును మేఘోదయకాలోచితజీవప్రవృత్తిని వ్యంజింపఁజేసి కాళిదాసు సార్థకమైన కావ్యశిల్పమును సాధించెను.

కాళిదాసుని ప్రకృత్యంగవర్ణనలలో మొదటఁ బేర్కొనఁదగినది మేఘునివర్ణనము. ఉపమారూపకార్థాంతరన్యాసాద్యలంకారమండితములైన వాక్యములలో నామ చారిత్యమైన యతనిరూపు సమయోచితభంగీవైచిత్రిని వెలార్చునట్లు వర్ణించుటలోఁ గాళిదాసు ప్రతిభ మెఱుపువలె ప్రకాశించినది! చిత్రకూటాద్రిపై వప్రక్రీడాపరిణత దంతిదర్శనీయుఁడని రూపింపఁబడిన మేఘుని గజస్వరూపస్ఫూర్తి కావ్యమునం దెడ నెడ భావింపఁబడునట్లు చేయఁబడినది. దిఙ్నాగస్థూలహస్తావలేపములను వారించుట యందును, గజశృంగారమువలె నున్న నర్మదను జూచి మోహించుటయందును, మద జలతిక్తములైన యాయేటినీటిని గ్రోలుటయందును, మదజలధారలు వర్షించు నుజ్జయినీనగరస్తంబేరముల యాకృతులందును, గంగానదియందు నీట గ్రాగెడి సురగజమునందును, హిమగిరియందలి శరభములు మేఘుని గజమను భ్రాంతి పొందుటయందును, మహాకాళుని కార్ద్రనాగాజినేచ్ఛను మాన్పుటయందును, కైలాస విహారములయందును మనకు మేఘుఁడు దంతిరూపస్ఫూర్తితో భాసింపఁగలఁడు. వర్ణసాదృశ్యముచే నతనికి గోపాలకృష్ణునితోడిసామ్యము మున్ముందు భావింపఁబడి నది. అంతియ కాదు. ఆయాసందర్భములందు మేఘుఁడు మసృణకేశబంధము తోడను, భూసతిస్తనచూచుకముతోడను, శివగళకళంకములోడను, హరధవళవృష భోత్ఖాతపంకముతోడను, హరినీలమణితోడను, నీలమణిమయసోపానపంక్తితోడను, త్రివిక్రముని శ్యామలపాదముతోడను, బలభద్రుని నల్లనియుత్తరీయముతోడను, స్త్రీలముంగురుల (అలకల) తోడను, క్రీడాద్రితోఁడను, పోల్పఁబడినాఁడు. రసపాన మునం దాతఁడు వేత్రవతీనిర్వింధ్యాదులుపట్ల విటునివలె భాసించినాఁడు. శ్రవణ సుభగమైన యాతనిగర్జ మురజపటహశబ్దాదులతోడనే గాక ప్రణయకూజితము తోడను బోల్పఁబడినది. అవస్థాభేదమునుబట్టి యచేతనుఁడైన యామేఘుఁడు కాళిదాసుని యలంకారశిల్పమునందు సజీవమూర్తియునై రసానందసంధాయి యైనాఁడు.

మేఘవర్ణనము తరువాతఁ బేర్కొనదగినవి గిరివననదీనదవర్ణనలు. కాళిదాసు వానిని వర్ణించుపట్ల వానిసహజలక్షణములను గొన్నింటిని జెప్పుచు వానిశోభ నాలంకారికముగాఁ జిత్రించెను. ఉదాహరణమునకుఁ జిత్రకూటాద్రివర్ణనము గైకొందము. దట్టమైన సురపొన్నలవనములు, సీతాస్నానపవిత్రోదకములు, శ్రీరామపాదచిహ్నాత్రములైన కూటములు దాని సహజలక్షణములు. ప్రతివర్షకాలమునందు నాశైలము మేఘునితో సమాగమము పొంది చిరవిరహజము నుష్ణము నైన బాష్పమును విడచుచు స్నేహమును వ్యక్తీకరించు ననుట నలంకారోక్తి. వర్షమున కాకొండ వెచ్చనియావిరి గ్రక్కుచున్న దని తాత్పర్యము. వాస్తవము నుక్తిచమత్కృతితో నలంకరించినచోఁ గావ్యమునకు శోభకలుగును. ప్రతిప్రకృత్యంగ వర్ణనమునందును గాళిదాసుస్వరూపస్వభావముల నౌచిత్య మెఱిఁగి యలంకారములచే ధ్వనింపఁ జేసెను.

ప్రకృతికి స్థిరములైనలక్షణములు కొన్ని చెప్పియు, కాలానుగుణ మైన పరిణామము వర్ణించుపద్ధతి మఱియొకటి. కైలాసగిరివాసుల నిత్యజీవిత మటుండ సురయువతు లాసన్నమేఘుని గృత్రిమధారాగృహముగా భావించుటయు, అలకాపురి మేఘబృందము లనెడి ముంగురులతో నొప్పారి సార్థకాఖ్య యగుటయు నిట్టివి.

మేఘునకు వియత్తలము విహారరంగము. అతనిని గొండ లాకర్షించును గావున నతఁడచ్చటచ్చటఁ గొండలపై విశ్రమించుచు, నదులలో నీరు త్రాగుచు, నెల్లెడల వర్షించుచుఁ బయనించుచుండును. కావున మేఘునకు గిరివరములు విడిదిపట్టులు. నదీజలములు స్వాదుపానీయములు. రామగిరినుండి కైలాసమున కేఁగులోపలఁ బ్రధానపర్వతములు తొమ్మిది మేఘమునకుఁ దగులును. అందొక్కొక్కకొండ యొక్కొక్కవిధ మైన సభ్యతకు కేంద్రస్థానము. ఆకొండనాశ్రయించి యున్న చేతనాచేతనములం దావిధమైన ప్రవృత్తి ప్రకటిత మగుచుండును. మేఘుఁ డీకావ్యమున పర్వతములకు మిత్రుఁడుగా సర్వత్ర వర్ణింపఁబడినాఁడు. కావున మేఘాద్రుల సమావేశము మిత్రసమాగమము వలె భాసించును.

పూర్వమేఘమున వర్ణింపఁబడిన పర్వతముల స్వరూపస్వభావములను బట్టి వానిని చతుర్విధముగా విభజింపవచ్చును అవి :

1. దేవతావాసములు - పూజ్యములు : ఇవి రామగిరి (చిత్రకూటము), దేవగిరి, హిమాచలము, క్రౌంచపర్వతము, కైలాసము.

2. నదీనదప్రధానములు - భోగ్యములు : వింధ్యగిరిప్రాంతము, కనఖల పర్వతము.

3. వనప్రధానములు - దర్శనీయములు : ఆమ్రకూటాద్రి.

4. క్రీడాప్రధానములు - ప్రీతిదాయకములు : నీచైర్గిరి.

ఇందు దేవతావాసములైన పర్వతము లుత్తమములు ; నదీవనప్రధానములు మధ్యములు; క్రీడాప్రధానము లధమములు. సత్త్వరజస్తమోగుణముల ప్రాబల్య మీవిభాగము నందుఁగ్రమముగాఁ గనుపట్టును. కాళిదాసు సత్వసంపన్నములై దేవతాత్మలైన పర్వతముల నధికముగా వర్ణించి తనకావ్యమున కౌదాత్త్యము నాపాదించుకొనెను. తదితరములను విడువక సహజత్వము సాధించెను.

పైపర్వతము లాకృతులలో, నధికారములలో, భిన్నము లయ్యు స్నేహశీలమున సదృశములు. శిలామయము లయ్యు స్నిగ్ధహృదయములు గల చైతన్యమూర్తులు. శ్రీరామపాదచిహ్నములను, సీతాస్నానపవిత్రోదకములను, సాంద్రనమేరుతరువనములను గలిగియున్న చిత్రకూటము మిత్రుఁడగు నాషాఢమేఘుని జూచినంతనే చిరవిరహజమును, నుష్ణము నైన బాష్పమును విడుచునఁట ! మేఘుఁడతని నాప్యాయముగా నాలింగన మొనర్చి, సగౌరవముగాఁ బోయివచ్చెద నని వీడుకొని పోవునఁట ! గిరివనోప్లవములు శాంతించునట్లుగా వర్షించుచు మార్గాయాసఖిన్నుఁడైన మేఘుని సార్థకనామధేయ యగు నామ్రకూటము శిరమునఁ దాల్చి పూజించునఁట ! "నక్షుద్రోఽపి ప్రథమసుకృతాపేక్షయా సంశ్రయాయ ప్రాప్తే మిత్రే భవతి విముఖః కిం పునర్యస్తథోచ్చైః ? వేశ్యారతిసౌరభములు వెదజల్లుచు, విదిశానగరపౌరుల యుత్కటయౌవనప్రవృత్తిని బ్రకటించుగుహల కాలవాలమైన నీచైర్గిరి మిత్రుఁ డగు మేఘునిసంపర్కముచే మేనంతయుఁ బులకితమైనట్లు కడిమి పూలతోఁ బొంగిపోవునఁట! గిరిమేఘములమధ్య వర్తిల్లెడిది యిట్టి స్నేహము. కాళిదాసాభావమును బోషించుటలో సార్థక్యము కలదు. మేఘునకుసందేశహరణ మొక మిత్రకార్యము. స్నేహము స్వచ్ఛము, నిర్వ్యాజము, త్యాగసంభరితము. దాని నాధారముగాఁ గొనియే యక్షుఁడు మేఘున కెడనెడ నిట్లు ప్రబోధించినట్లు కాళిదాసు రచించినాఁడు. "మన్దాయన్తే న ఖలు సుహృదా మభ్యుపేతార్థకృత్యాః": "భర్తుర్మిత్రం ప్రియ్యే, మవిధవే విద్ధి మామమ్బువాహం, తత్సన్దేశైర్హృదయనిహితై రాగతం త్వత్సమీపం" ;

"కచ్చి త్సౌమ్య వ్యవసిత మిదం బన్ధుకృత్యం త్వయా మే
ప్రత్యాదేశా న్నఖలు భవతో ధీరతాం కల్పయామి
నిశ్శబ్దోఽపి ప్రదిశసి జలం యాచిత శ్చాతకేభ్యః
ప్రత్యుక్తం హి ప్రణయిషు సతా మీప్సితార్థక్రియైవ."

"ఏతత్కృత్వా ప్రియ మనుచితం ప్రార్థనా దాత్మనో మే
సౌహార్దాద్వా విధుర ఇతి వా మయ్యనుక్రోశబుద్ధ్యా."

ఇత్యాది వాక్యము లందుల కుదాహరణములు. మేఘసందేశమునందు వర్ణింపఁబడిన ప్రకృత్యంగములలో మేఘ పర్వతములు – రెండును బురుషప్రకృతులే. కావున కాళిదాసు వానిమధ్య కావ్యార్థఫలసిద్ధికి మూలహేతు వగు స్నేహవృత్తిని బోషించి రసభావసమృద్ధిని సంతరించినాఁడు.

నదీపర్వతములకు నాయికానాయకభావము కల్పించుట కవిసమయము. కాళిదాసు మేఘసందేశమున దానిని బాటింపకుండుట యొకవిశేషము. కావ్యవస్తువు మేఘదూతకు సంబంధించియుండుటచే నదులకును, మేఘునకును వర్షారంభమున భాసించు నాయికానాయకపునస్సమాగమభావమును విరహార్తుఁ డగు యక్షునిముఖమున వర్ణింపఁజేసెను. కవి తనవ్యుత్పత్తిని గావ్యార్థపోషకముగా ననుసంధించి వర్ణించుటయే కావ్యశిల్పము.

రసపిపాసి యైన మేఘుఁడు నదీలలామలయందు విటునివలె వ్యవహరించు ననియు, నానదీయోషలు శృంగారనాయికలవలె మేఘునిం దమవిలాసచేష్టలచే నాకర్షించు ననియు నిందు భావింపఁబడినది. ఏకవేణు లైన నదులు కృశాంగ లైన నాయికలు. వానికిఁ బునస్సమాగమసౌఖ్యము గలిగించి, గర్జ లను బ్రణయకూజితములతో వానిచిత్తము లలరించి, జీవనప్రదాన మొనర్చువాఁడు మేఘుఁడు.

వింధ్యప్రత్యంతపర్వతప్రాంతమునఁ దన్నడ్డగించు నేరేడుపొదలను ద్రోసికొనుచు బ్రవహించు నర్మద యేనుఁగుమేనిపై భక్తిభంగులచే రచింపఁబడు శృంగారమువలె మేఘునకుఁ జూడ కనువిందగును. దానిని గాంచి మేఘుఁడు రసార్ద్రుఁడై వర్షించును. గజమదబంధురములును, తిక్తములు నైన యానదీజలములను మేఘుఁడు కడుపారఁ ద్రాగి యంతస్సారుఁ డగును. నర్మదను గూడిన మేఘుఁడు వాసకసజ్జిక నలరించు వరునివలెఁ గాళిదాసు చిత్రించినాఁడు.

వేత్రవతి మధురజలతరంగము లను భ్రుకుటివిలాసములతో శోభిల్లు నదీలలామ. మేఘుఁడు రతికూజితమువలె మందమందముగా నుఱుముచు, నామె యధరమును గ్రోలునట్లు జలమును పానము చేసి కాముకత్వఫలమును సంపూర్ణముగాఁ బొందును. వేత్రవతి స్వాధీనపతికయు, రతాంతవివశురాలైన మధ్యానాయికయునయి మేఘుని కుపభోగ్య యైనది.

నిర్వింధ్య ప్రోషితభర్తృకవలె సాక్షాత్కరించును. ఆమె విలాసము పనెడి తొలిపలుకులతోడనే మేఘునకుఁ దనవలపును దెలుపును. సుందరాకారుఁ డగు మేఘుని యెడఁబాటుకు చిక్కి సన్ననిజాలుగాఁ బ్రవహించుచు, పండినచెట్లయాకుల రంగుచే వెల్లబాఱి, విరహావస్థను వ్యక్తముచేయు నిర్వింధ్యను తత్కార్శ్యము పాయునట్లుగా మేఘుఁ డుపభోగించును.

గంభీర సార్థకాఖ్య. దాని నిర్మలగంభీరోదకమునందు వలచనుకొన్నను మేఘుని యందమైన నీడ పడకమానదు. తెల్లనికలువలవలె నెగురుచున్న చేప లను చూపులతో నానది మేఘు నాకర్షించును. ఒడ్డునుండి దిగజారి ప్రబ్బలిచెట్ల నానియున్న జలమును గలిగిన యానది కోకపోకముడి యూడి దిగజారుచుండఁగాఁ జేతఁబట్టుకొనిన వనితవలె శోభిల్లునఁట! జ్ఞాతాస్వాదుఁ డైన మేఘుఁ డామెను దమిదీర భోగించునఁట! గంభీర గంభీర యయ్యును మదనభావోన్మత్త యైన ప్రౌఢ. అందువలన నామె నిండుదనము ప్రియునిదర్శన మగునంతనే బయటపడినది.

చర్మణ్వతి రంతిదేవునికీర్తిస్రవంతి వలె స్వచ్ఛమైనది. దానిపై నొరిగి మేఘుఁడు జలపానము చేయునెడ ఖేచరులైన సిద్ధుల కాసది స్థూలమధ్యేంద్రనీలమణియైన భూదేవి యొంటిపేటముత్యాలపేరువలెఁ జూడనింపు గలిగించునఁట! భర్తృవాల్లభ్యము నందిన పుణ్యాంగనవలె నానదీలలామ వర్ణింపఁబడినది.

నదులను స్త్రీమూర్తులుగా భావించుట కవిసమయ మైనను, విప్రలంభమున నదీలలామలను శృంగారనాయికలుగా వర్ణించుట రసపోషక మయ్యును, గంగా సరస్వతులమాహాత్మ్యమును గుర్తించి వానిని బుణ్యనదులుగాఁ గీర్తించి శృంగారమూర్తులుగాఁ బ్రదర్శింపకుండుట కాళిదాసుని యౌచిత్యదృష్టికి పరమావధి. రసపిపాసియైన మేఘుఁడు నర్మదాదినదీలలామల నుపభోగించియు, సరస్వతీజలపానముచే నంతశ్శుద్ధుఁడై గంగాజలమున గజరాజువలె మునింగి పవిత్రుఁ డయ్యె నని వర్ణించుట గమనార్హము. పరమేశ్వరపత్ని యైన గంగానది యొడిలో నద్దముగాఁ

బవ్వళించి పయఃపాన మొనర్చు మేఘుఁ డాపుణ్యాంగనకుఁ బుత్రతుల్యుఁ డయ్యె నని వ్యంగ్యము. కామచారి యైన మేఘునిచిత్తమునందలి కామనైల్యము సరస్వతీ తోయముతో నశింప నతఁడు పరిశుద్ధాంతరంగుఁడై పర్వతరాజతనయను సేవించె ననుట సార్థక్యము. కైలాసగిరి కేఁగు దూత కనువైన యంతశ్శీలమును గల్పించుట కాళిదాసునియంతరార్థము. అలకానగరమును జేరినతరువాత మేఘున కెట్టినదీలలా మలతోడి సంబంధము భావింపఁబడలేదు. అందువలన యక్షుఁడు మేఘునకు విద్యుత్కళత్రసంతతసాన్నిహిత్యము నాశించినాఁడు !

"ఇష్టాన్దేశా జ్జలద విచర ప్రావృషాసంభృతశ్రీ
ర్మాభూ దేవం క్షణమపి చ తే విద్యుతా విప్రయోగః,"—ఉ. మే. 55.

స్వీయకాంతాసమాశ్రితమైన ప్రణయము మేఘునకు లభింపవలె నని గోరుటయందే యక్షుఁడు తత్సిద్ధికి వలసిన చిత్తసంస్కారమును దనలోఁ బండించుకొనినాఁడు. అందువలననే కుబేరునిశాప ముపసంహృత మైనది ! కావ్యార్థసిద్ధి కెంతటిసార్థకమైన హేతువిది !

పూర్వమేఘమున కాళిదాసు వర్ణించిన ప్రసిద్ధనగరములు రెండు. అవి : విదిశానగరము, ఉజ్జయినీనగరము. దశార్ణజనపదములకు రాజధాని దిశాప్రసిద్ధ మైన విదిశానగరము. ఆనగరప్రాంతములు మొగలిపూరేకుల తెల్లఁదనమునకును, పక్షిసంకులము లైన వృక్షరాజములకును, పక్వఫలశ్యామలము లైన జంబూవనములకును, మానసరాజహంసల తాత్కాలికావాసములకును, వేత్రవతీనదీజలవిలాసములకును బ్రసిద్ధి కెక్కినవి. సుందరపరిసరప్రాంతములచేఁ జూడ నింపయిన నాపట్టణశోభను కాళిదా సేలనో వివరింప లేదు. కాని, ఉజ్జయినీనగరము మేఘమార్గమునకుఁ గొంత చుట్టైనను దానిని దర్శింపని జన్మము నిష్ఫల మని చెప్పి తన్నగరవిశేషముల నెన్నింటినో వివరించి వర్ణించెను. కాళిదాసు చూపించిన యాయభినివేశమును బట్టి యతనిజన్మస్థానము ఉజ్జయినీనగరమై యుండవచ్చు నని విమర్శకులు భావించుచున్నారు.

రక్తిముక్తుల కాలవాల మైన యుజ్జయినీనగరశోభ పూర్వమేఘమందలి నగరవర్ణనలో నాయకమణి వంటిది. చారిత్రకప్రసిద్ధియు, ధనధాన్యజలసమృద్ధియు, నరనారీవిలాసవైభవసిద్ధియు, పరమేశ్వరకృపాకటాక్షలబ్ధియు నానగరజీవితమున కైహికాముష్మిక ఫలాభివృద్ధి నెల్లప్పుడు కూర్చుచుండుటచే నది యాదర్శనగరమై

యొప్పినది. ప్రియావియోగదుఃఖితుఁ డగు యక్షుఁడు ఆనగరజీవితమునందలి ప్రణయోదంతములనే భావించెను. వాసవదత్తావత్సరాజుల పూర్వవృత్తాంతస్మరణములు, గిరిజాశంకరుల ప్రణయనృత్యభంగిమలవర్ణనములు, అభిసారికలు సంకేతస్థలముల కొనర్చురహస్యగమనములు, కమలినీకమలాప్తుల పునస్సమాగమనమును దెల్పు సుప్రభాతములు మొదలగునవి తన్నగరమధురఘట్టములు.

కాళిదాసు గిరులలో హిమగిరిని, నదులలో జాహ్నవిని, నగరములలో నుజ్జయినిని విశేషించి వర్ణించెను. ఆమూఁడును దేవతాత్మ లగుటయు, నభిమానపాత్రము లగుటయు దానికిఁ గారణము. అతఁడుపర్వతరాజును మేఘునకు హితునిగా, పూజ్యునిగా, శివక్షేత్రముగా, గంగాజన్మస్థానముగా నభినివేశముతో వర్ణించెను; గంగానదిని పుణ్యస్రవంతిగా, ముక్తిప్రదాతగా, మేఘునకు జీవనదాతగా నిరూపించెను. ఉజ్జయిని నైహికాముష్మికజీవితప్రవృత్తులకు సంగమస్థానమైన సంస్కృతి కాలవాలముగాఁ జిత్రించెను. మహాదేవునివిభూతిపై నామహాకవి కున్న యభిమాన మంతయుఁ బై వర్ణనలందు శరచ్చంద్రికవలె వెల్లివిరిసినది.

ఉజ్జయిని కుజ్జీగా నిలచినది అలకాపురి. అది యుత్తరమేఘమున వర్ణింపఁబడినది. సకలదివ్యభోగముల కాలవాలమై, నిత్యానందకరములగు వస్తుసముదాయముచేఁ బరిపూర్ణమై, ప్రవృత్తిభోగములకుఁ బ్రాణప్రదమైన యలకాపురి కుబేరసంపదకు మణికిరీటమై ప్రకాశించుచుండె నని కాళిదాసు వర్ణించెను. రసికుఁడైన మానవుఁ డాశించు భోగముల కవధి అలకాపురి! ఉజ్జయిని భుక్తావశిష్టసుకృతులైన స్వర్గవాసుల కేర్పడిన భూతలస్వర్గఖండము కాగా, అలక భోగైకమూర్తులగు యక్షులభాగ్యనగరము. రసికులైన యుజ్జయినీనగరవాసులు పరిపూర్ణమానుషానందకాములు కాగా దేవయోను లైన యక్షులు కల్పతరులబ్ధవాంఛితార్థసిద్ధులు. కావున నాయుభయనగరములందలి నాగరికభోగప్రవృత్తులయందు దట్టితారతమ్యము కనుపట్టుచుండును.

మేఘసందేశమున రసము శృంగారము. నాయికానాయకులు కారణాంతరమున విడివడి పునస్సమాగమాకాంక్షతోఁ బరితపించుట విప్రలంభశృంగారము. కారణము ప్రవాసమైనచో నది ప్రవాసవిప్రలంభ మగును. విప్రలంభము శృంగారమునకుఁ బుష్టి కలిగించును. "స్నేహానాహుః కిమపి విరహే ధ్వంసినస్తే త్వభోగా, ద్దిష్టే వస్తు న్యుపచితరసాః ప్రేమరాశీ భవన్తి" అను యక్షోక్తిచేఁ గాళిదాసా యంశమును సమర్థించి

నాఁడు. ఆలోకనాభిలాషలను, రాగస్నేహకాంక్షలను గలిగియుండుట ప్రేమ. (ప్రియుని లేక ప్రియురాలిని) చూడవలయుననెడి యిచ్ఛ యాలోకనము, తచ్చింత యభిలాష; సంగబుద్ధి రాగము, ప్రణయక్రియ స్నేహము; వీనిని గలిగియుండుట ప్రేమ. వియోగమునందు నాయికానాయకులకు అభిలషిత మైన సంభోగము సిద్ధింప మిచేఁ బ్రేమ బలీయ మగు నని కాళిదాసోక్తి. ఇట్టి విప్రలంభమును బోషించుట కుత్తరమేఘమున గాళిదాసు యక్షగృహమును, యక్షసతీవిరహమును, యక్షసందేశ మును రసోదంచితముగ వర్ణించెను. పరమభోగాస్పదమై, ప్రియాసంభోగసుఖ జ్ఞాపకమైన గృహమునుగూర్చి తలంచుటచే యక్షునివిప్రలంభము పుష్టిమంత మగునుగదా !

యక్షునిముఖమునఁ గాళిదాసు సందర్భోచితముగా విరహిణియైన నాయిక యనుభవించు మదనదశావస్థలను నిపుణముగా వర్ణించెను. వియోగమున జక్షుఃప్రీతి యుండదు. అందుచేఁ బునర్దర్శనాభిలాష వర్ణింపఁబడినది. చిత్రలేఖనమున నది కొంత సూచింపఁబడినది. మనస్సంగమును విరహసంతప్తయైన యామెస్థితి చెప్పక చెప్పుచున్నది. యక్షనామాంకితగేయరచనమున నది స్ఫుట మగుచున్నది. పరిశేష మాసగణనాదులయందు సంకల్పము వ్యక్త మగుచున్నది. రాత్రులు నిద్ర లేకుండుట యందు జాగరమును, ఏకకళయైన చంద్రరేఖవలెఁ గృశించుటయందు కార్శ్యావస్థ యును, చల్లనిచంద్రకిరణములపట్ల గలిగిన విరక్తియం దరతియు, స్వప్నసంభోగ మునకై యత్నించి కన్నీరు గార్చుటయందు లజ్జాత్యాగమును, సిగను గోళ్లతో త్రోసికొనుటయందు చిత్తవిభ్రమమును, లేవలేక పడకపై నొరుగుటయందు మూర్ఛావస్థయుఁ గ్రమముగా వ్యక్తము లగు చున్నవి. దశమావస్థ మరణము. అది కలుగులోపలఁ బ్రియునిక్షేమవార్త తెలిసి నాయిక యూరడిల్లును గాన దానిని కవి వర్ణింపలేదు. దానికి తగినహేతువును గావ్యారంభముననే నిబంధించినాఁడు.

"ఆశాబన్ధః కుసుమసదృశం ప్రాయశో హ్యఙ్గనానాం
సద్యఃపాతి ప్రణయి హృదయం విప్రయోగే రుణద్ధి."—పూ. మే. 10.

యక్షునివిరహ మాతని సతీవిరహముకంటె నెందును దీసిపోలేదు. అతనిస్థితిని మేఘుఁ డిట్లు వర్ణించి చెప్పెను.

"అఙ్గేనాఙ్గం ప్రతను తనునా గాఢతప్తేన తప్తం
సాస్రేణాశ్రుద్రుత మవిరతోత్కణ్ఠ ముత్కణ్ఠితేన,
ఉష్ణోచ్ఛ్వాసం సమధికతరోచ్ఛ్వాసినా దూరవర్తీ
సఙ్కల్పైస్తై ర్విశతి విధినా వైరిణా రుద్ధమార్గః" — ఉ. మే. 41.

ప్రియాసదృశవిరహార్తుఁ డగు యక్షుఁడు ప్రాణసఖిచిత్తవృత్తి నాత్మప్రతిబింబ సదృశముగా నూహింపఁ గలిగె ననుట కథనములోని సార్థక్యము. యక్షుఁ డంపిన తనసందేశమున ప్రేమ, రతి, సహవర్తనము, శృంగారము, నమక్రీడ, సంభోగము మొదలగు సప్తవిధావస్థలను వ్యంజింపఁజేయుచు కాళిదాసు లక్షణసమ్మత మైన వర్ణనము గావించినాఁడు. విప్రలంభపోషణమున కింతకంటె విభావాదిసామగ్రి యేమి కావలెను? నాయికానాయకుల కుత్కటభావస్థితి రసస్థితి నందుట కది వారి ప్రథమ విరహ మని పేర్కొని యుపపత్తిసాధించుట రసజ్ఞుఁడైన కాళిదాసుని విజ్ఞతకుఁ దార్కాణము.

"జానే సఖ్యా స్తవ మయి మనఃసంభృతస్నేహ మస్మా
దిత్థం భూతాం ప్రథమవిరహే తామహం తర్కయామి,
వాచాలం మాం న ఖలు సుభగమ్మన్యభావః కరోతి
ప్రత్యక్షం తే నిఖల మచిరాద్భ్రాత రుక్తం మయా యత్".

— ఉ. మే. 33.

విభావాదులు సాధారణీకరణము చెంది సామాజికుఁడు రసానుభూతి నొందుట కిట్టి వాక్యార్థము లెంతయో తోడుపడును. కాళిదాసునిరచనలో రసపోషకము గాని భావము గాని, భావన గాని, శబ్దము గాని, అర్థము గాని కానరాదు. ఆలోచనామృతము వర్షించు దివ్యమేఘ మాతని యీఖండకావ్యము.

మధురమందగతియైన మందాక్రాంతవృత్తము యక్షుని విరహాక్రాంతచిత్తవృత్తిని రసోదంచితముగా వ్యంజింపఁజేసినది. కాళిదాసుని యిట్టి సార్థకఛందః ప్రయోగమునకు ముగ్ధుఁడు గాని సహృదయుఁడు లేఁడు. క్షేమేంద్రుఁడు "ప్రావృట్ ప్రవాసవ్యసనే మందాక్రాంతా విరాజతే" యను లక్షణ మేర్పఱచుట కీకావ్యలక్ష్యమే హేతు వనుటలో నెట్టిసంశయమును లేదు.

ప్రకృతిసౌందర్యదిదృక్షు వైన కవి యుపమను నేర్పుగా వాడును. కాళిదాసుపమాలంకారప్రయోగమున గణుతికెక్కినవాఁడు. అతని యుపమానము లసంఖ్యాకములు, అర్థవంతములు, ప్రతిభాపూర్ణములు. మేఘసందేశకావ్యము చదువుచున్నప్పుడు – ఆమ్రకూటమును భూదేవిస్తనముతోడను, నిర్వింధ్యను ప్రోషితభర్తృకతోడను, శిప్రావాయువును ప్రార్థనాచాటుకారుఁడైన ప్రియునితోడను, గంభీరను వివృతజఘన యగు వనితతోడను, కైలాసగిరికందరమునందలి యలకాపురిని బ్రియునుత్సంగమునందలి స్రస్తగంగాదుకూల యగు సువిదతోడను, గృహపతి

లేని గృహమును కమలాప్తుఁడు లేని కమలము తోడను, విరహార్తుఁడైన ప్రియుని ప్రాణమును శిథిలప్రాతఃకుందప్రసవము తోడను కాళిదాసు పోల్చి వర్ణించుపట్టుల-సహృదయుఁడు తన్మయుఁడు కాకమానఁడు. అతని యర్థాంతరము లాతని యఖండ లోకప్రజ్ఞకు మణిముకురములు. "కామార్తా హి ప్రకృతికృపణా శ్చేతనాచేతనేషు", "రిక్తస్సర్వో భవతి హి లఘుః పూర్ణతా గౌరవాయ", "స్త్రీణామాద్యం ప్రణయవచనం విభ్రమో హి ప్రియేషు", "అపన్నార్తి ప్రశమనఫలాః సంపదో హ్యుత్తమానామ్" "కేవా న స్యుః పరిభవపదం నిష్ఫలారంభయత్నాః" "ప్రత్యుక్తం హి ప్రణయిషు సతా మీప్సితార్థక్రియైవ"-ఇట్టి మణు లెన్నియో కల వాకావ్యరసనముద్రమున. కావ్యమునకు గౌరవము కవి వాడిన యలంకారముల సంఖ్యనుబట్టి రాదు; కవి వానిని వాడుటలోని సార్థక్యమును బట్టి వచ్చును. కాళిదా సర్థాలంకారములను సార్థకముగా వాడినాఁడు. అనౌచిత్య మతని వాక్కునకు విషయము కాదు. ఆడంబరము లేని యలంకార రచన మతని కావ్యశోభలోని యాంతర్యము.

కాళిదా సద్వైతి. శివకేశవు లతనికి సమానులే. మేఘసందేశము – శ్రీరామ పాదచిహ్నాంతకూటమును విష్ణుస్థానీయము నగు చిత్రకూటమునఁ జెప్పఁబడినది. శివ క్షేత్రమైన కైలాసగిరిపై నున్న అలకానగరమున కది చేర్పఁబడినది. కాళిదాసుని యభేదదృష్టి కిదియే చక్కని యుదాహరణము.

మేఘమార్గమున నున్న మహాకాళక్షేత్రము, హిమవంతము, కైలాసము ప్రసిద్ధి గన్న శైవక్షేత్రములు. అందు మొదటిది కాళిదాసున కభిమానపాత్రమైనది. మిగిలినవి భారతీయుల కందఱికిని ప్రీతిపాత్రము లైనవి. వాని నభినివేశముతో వర్ణించి కాళిదా సౌచిత్యము పాటించెను. దేవగిరి కుమారస్వామినివాసమైన క్షేత్రము. గంగ శివజటాజూటవర్తి. శైవములైన వీనిని గాళిదాసు రసోదంచితముగఁ గీర్తించెను. వైష్ణవమైన చిత్రకూటమును, బలరామసంబంధియైన సరస్వతీ నదీతీర్థమును, పరశురామసంబంధి యైన క్రౌంచపర్వతమును, కాళిదాసు యథోచితముగ వర్ణించెను. వర్ణసామ్యముచే మేఘుని గృష్ణునిగను, హరనీలగళచ్ఛాయగను కాళిదాసు పోల్చి చూడఁగలిగినాఁడు. కాళిదా సీకావ్యమున శైవక్షేత్రములను గూర్చి కొంత విపులముగా వర్ణించుట కావ్యార్థపోషణార్థమై కావచ్చును. మఱియు, వర్షారంభమునఁ గలుగు స్త్రీపుంసపునస్సమాగమాకాంక్ష సర్వజీవులతోపాటు జగత్పితరులైన యుమాశంకరులందును భాసింపఁజేసి తన కావ్యమునందలి ప్రకృతివర్ణనాశిల్పమునకుఁ బరిపూర్ణత్వము సాధించుట కాళిదాసుని యభిమతమై యుండవచ్చును !

మహాభారతము - కర్ణుఁడు

భారతీయసంస్కృతిపై నఖండప్రభావము వైచిన సాహిత్యగ్రంథములు మూఁడు. అవి : వాల్మీకిరామాయణము, వ్యాసమహాభారతభాగవతములు. సాహిత్య గౌరవముతోపాటు మానవజీవితాదర్శము లైన పురుషార్థసాధనోపాయము లాకా వ్యములందు రసవత్తరముగా నిరూపింపఁబడుటచే ప్రతిభారతీయుని హృదయదేవా లయమునందును వానికి నిత్యార్చనలు జరుగుచున్నవి. కాలక్రమేణ వానిని గీర్వాణము నుండి తమతమమాతృభాషలలోని కనువదించుకొని తత్కావ్యార్థప్రసాదమును సర్వ జనభోగ్యముగా భారతీయులు తీర్చిదిద్దుకొనిరి. అట్టివారిలో తెలుఁగువారు శ్రేష్ఠులు. తెలుఁగున ముందు భారత మవతరించినది. తరువాత రామాయణభాగవతములు అనువదింపఁబడినవి. మూలగౌరవ మేమాత్రము తఱుగకుండ తెలుఁగున నాకావ్యము లను రసదృష్టితో సంతరించినకవులు వందనీయులు. మనసాహిత్యమున నన్ని గ్రంథము లొకయెత్తు; ఈమూఁడుగ్రంథములు మఱియొకయెత్తు.

తెలుఁగుబిడ్డల నోములపంటలై త్రిమూర్తులఁ బోలి భువి నవతరించి మహా భారతకావ్యప్రపంచమును సృజించి పురుషార్థసాధనోపాయమును సూచించి తరిం చిన కవిత్రయము ప్రాతఃస్మరణీయము. వాగనుశాసనుఁ డగు నన్నయభట్టారకుని యొక్కయు, కవిబ్రహ్మ యగు తిక్కనసోమయాజియొక్కయు, ప్రబంధపరమే శ్వరుఁడగు నెఱ్ఱాప్రెగ్గడయొక్కయు కవితాస్రవంతు లిందు కూడుటచే నియ్యది పవిత్రత్రివేణిసంగమక్షేత్రమై రసపూర్ణమును, పుణ్యావంతము నయి యైహికాముష్మిక సుఖద మగుచున్నది.

మహాభారతము భరతవంశజు లగు చక్రవర్తులచరిత్ర యైనను, పాండవుల సంపూర్ణజీవితమే ప్రధానవృత్తముగా గల యితిహాసము. ఆంధ్రమహాభారతావ తారికలో నీవిషయము నొకవిధముగా రాజరాజనరేంద్రుఁడే సూచించియున్నాఁడు.

చ. ''హిమకరు దొట్టి పూరుభరతేశకురుప్రభుపాండుభూపతుల్
క్రమమున వంశకర్త లనఁగా మహి నొప్పిన యస్మదీయవం

శమునఁ బ్రసిద్ధులై విమలసద్గుణశోభితులైన పాండవో
త్తములచరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెమ్మెయిన్'' — ఆది. 1-4

అనుటలో నీకావ్యేతివృత్తము పాండవచరిత్రప్రధాన మని స్పష్టము. అనఁగా నీ కావ్యమున నాయకులు పంచపాండవు లనవచ్చును గదా! కాని, అట్లయిదుగు రనుటకు వలనుపడదు. కావ్యారంభమునుండి తుదివఱకు నెవ్వనిజీవితము సమగ్రముగా వర్ణిత మగునో అతనినే నాయకునిగా నెన్నుట సంప్రదాయము; సమంజసము. అట్లగుటచే భీమాదులు దివంగతులైన తరువాత కూడ ధర్మము వీడక సశరీరియై స్వర్గమున కేఁగి, యమేంద్రాదుల దయావిశేషముచే దేవత్వముఁ బొందినవాఁడు ధర్మజుఁ డగుటచే నాతఁడే ఫలభోక్తృఁగు, నాయకుఁ డనఁదగియున్నాఁడు. భీమాదులు జీవికాజీవులవలె పరస్పరము భ్రాతృస్నేహముతో వర్తించి భక్తిశ్రద్ధలతో నాజన్మాంతము ధర్మజుని సేవించి తరించియుండుటచే వా రనునాయకు లనఁ దగియున్నారు. వీరికిఁ బ్రత్యర్థి దుర్యోధనుఁడు. అతనికి భీమాదులవలె నూఱుగురు తమ్ములు గలరు. కర్ణాదు లతని కండ నిలిచినారు. ఈయిరుపక్షములవారికి నేర్పడు సంఘర్షణమే భారతప్రధానకావ్యేతివృత్తము.

ధర్మము మూర్తికట్టిన మహితాత్ముఁడు ధర్మరాజు. ఆవిరాడ్రూపమున కాలయప్రాయులు నకులసహదేవులు; అంగరక్షకులు భీమార్జునులు. భీముఁ డరిభయంకరుఁడు, సింహబలుఁడు, ధర్మజధర్మదీక్షారక్షకై పురుషాకారము సిద్ధము సేయగల సమర్థుఁడు. అర్జునుఁడు నరనారాయణులలో నరాంశసంభూతుఁడు; నారాయణుని మనసు కెక్కిన రాజభక్తుఁడు. అతిలౌకికశక్తిసంపన్నుఁడును దేవసంభావితుఁడు నగుటచే నతఁడన్నకు దైవయత్నముఁ జేకూర్చిపెట్టఁగల దిట్ట. ఒకఁడు బాహుశక్తియుక్తుఁడు; మఱియొకఁడు దైవవిద్యాశక్తిసమన్వితుఁడు. వీరిరువురిసుస్థిరసంరక్షణమున ఘటనిక్షిప్త మగు దీపకళికవోలె నెట్టియపాంతరములు లేక యుధిష్ఠిరుఁడు తనజన్మవ్రతమును నిశ్చింతగా నిర్వహించెను. భీమాదులు స్వయంసమర్థులైనను అన్నమాటను జవదాటరు! ఇట్టి యవాజ్యస్నేహసూత్రము పాండవుల నేకీకృతుల నొనర్చి కృష్ణాశ్రయులుగాఁ దీర్చిదిద్దుటచే వేదధర్మమున కుపనిషత్పురుషుని సాంగత్య మబ్బినట్లైనది.

శ్రీకృష్ణునిదృష్టిలో నాయకుఁ డగు ధర్మజుఁడు ధర్మతరువు; ప్రతినాయకుఁ డగు సుయోధనుఁడు రోషమయతరువు, తన్నిరూపణము చేయుచు సంజయునితో శ్రీకృష్ణుఁ డనినిమాట లివి :

"రోషమయమహాతరువు సుయోధనుఁ; డురు
స్కంధ మందులోనఁ గర్ణుఁ; డలరుఁ
గొమ్మ సౌబలుండు; గుసుమఫలములు దు
శ్శాసనుండు; మూలశక్తి తండ్రి."

"ధర్మజుండు ధర్మతరు; వర్జునుఁడు ఘన
స్కంధ; మనిలసుతుఁడు శాఖ; కవలు
పుష్పఫలము; లేను భూసురులును వేద
ములుఁ దదీయ మైన మూలచయము." — ఉద్యో. 1. 355, 356.

వీనిలో దైవమూలమై ధర్మరూప మగు ధర్మజమహావృక్షమే శ్రేష్ఠ మనుటలో నెట్టి సంశయమును లేదు. దుర్యోధనుఁడు అర్థకామనిష్ఠుఁడు. అతనికి ధర్మనిష్ఠ లేదు. అర్థసాధనయందు పురుషకారమును మాత్రమే నమ్మి, దైవసహాయమును నిర్లక్ష్యము చేసిన దురభిమాని యతఁడు. అతని ననుసరించినవా రాతనితమ్ములు. అందువలననే వ్యాసభట్టారకుఁడు—

కం. "క్రూరులు విలుప్తధర్మా
చారులు ధృతరాష్ట్రసుతు లసద్వృత్తులు ని
ష్కారణవైరులు వీరల
కారణమున నెగులు బుట్టు కౌరవ్యులకున్." — ఆది. 5. 159.

అని నిరూపించి చెప్పినాఁడు. ధర్మజప్రవృత్తియందు ధర్మమున కరకామము లూడిగమొనర్చినవి; సుయోధనునియందు అర్థకామములు బలీయములై ధర్మమును బహిష్కరించినవి.

రోషమయతరు వగు సుయోధనునకు స్కంధమువంటివాఁడు కర్ణుఁడని కృష్ణుని నిర్దేశము. వృక్షము మూలశక్తిచే బ్రతుకును; స్కంధము వలన నిలచును; శాఖలవలన విస్తృత మగును; పుష్పఫలములవలన శోభిల్లును. మూలశక్తి యున్నను బోదె డుల్లవోయినచో వృక్షమునకు పతనమే కదా ఫలము! కావున దుర్యోధనునిస్థిరత్వము కర్ణునిపై నాధారపడియున్న దన్నమాట! దుర్యోధనుఁడు పచ్చగామూడుపూవు లాఱుకాయలు కాయవలెనన్న, కర్ణునియాదరు వవసర మని భావము.

కర్ణదుర్యోధనప్రథమసమావేశ మొకవిచిత్రసన్నివేశము. కుమారాస్త్రవిద్యాప్రదర్శనసందర్భమున అర్జునుని వివిధాద్భుతాస్త్రవిద్యాకౌశల్యమునకు దుర్యోధనుఁ డవమానపడి తెల్లఁబోయినాఁడు; ఘటబద్ధ మైన యుగ్రోరగమురీతి తనలోఁ దాను బుసలుకొట్టుకొనినాఁడు; సహాయముకొఱకు ప్రతీక్షించినాఁడు. ఎదుట....

"సాలప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్వత్కుండలోద్భాసితున్
బాలార్కప్రతిమున్ శరాసనధరున్ బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణవర్ణు ఘనుఁ గర్ణాఖ్యున్ జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి,"

తేరుకొనినాఁడు. అతనిపరాక్రమము వీక్షించి "కౌఁగిలించుకొని నాతో బద్ధసఖ్యుండవయి నాకును బాంధవులకును హితంబు సేసి నన్నుం గురురాజ్యం బేలించి నా యైశ్వర్యం బుపయోగింపు" మనినాఁడు. కర్ణుఁడును "అట్ల చేయుదు" నని యొడంబడినాఁడు. అతనిస్నేహమునకు చిహ్నముగా దుర్యోధనుఁ డతని కంగరాజ్య మిచ్చి గౌరవించెను. నాఁటినుండి కర్ణుఁడు దుర్యోధనునిఁ గురురాజ్య మేలించుటకై సమర్థించినాఁడు; ప్రాణమిత్రుఁడై వరలినాఁడు. నాఁటినుండి కర్ణుఁడు అన్నమాటకు కట్టుబడి, ఎన్నియో ఘట్టములందు దుర్యోధనునకు కుడిబుజమై నిలిచి కార్యసాధనము చేసిపెట్టినాఁడు.

శుంభాంగీస్వయంవరమహోత్సవమున బలిమిని నామెను దుర్యోధనుఁడు తెచ్చునపుడు, అతనిపైఁ దిరుగఁబడిన యరివర్గములను జయించి, జరాసంధుని నోడించి మాలినీనగరము నాక్రమించి కర్ణుఁడు మిత్రునిమానము కాపాడి, మగువను దక్కించినాఁడు. దుర్యోధనుఁడు చేయునది న్యాయమా అన్యాయమా యనుప్రశ్న యతనికి లేదు. చేసినవాగ్దానము నెరవేర్చితీరుటయే యాతని యాదర్శము! అందువలన దుర్యోధనున కతనియం దచంచలవిశ్వాసము కుదిరినది.

"మనకుఁ బాండురాజతనయవర్గమునకు
నెట్లు పొందు గలుగు నేను రాజ్యభాగ మీను"

అని దుర్యోధనుని మతము. దానిననుసరించి పాండవులపై నాతఁడు పన్నిన కుతంత్రములకు లెక్కలేదు. వాని కన్నిటికిని కర్ణునిసమర్థనయే మూలకారణము. అయినను వాని నాచరించువిధములందు దుర్యోధనుఁడు సూచించు మార్గముకన్న కర్ణుఁడు ప్రతిపాదించుపద్ధతి సాధారణముగా వీరోచితము, గౌరవప్రదము, పూర్వా

పరసంబద్ధమునై యుండును. పాండవవివాహానంతరము ద్రౌపదీపాండవులమధ్య కలఁతలు కల్పించి యుపాంశుప్రయోగమున భీముని వధించి యర్జునిపైఁ గర్ణుని ప్రయోగింప దుర్యోధనుఁడు తలంపఁగా – కర్ణుఁడు భీమునిపట్ల విఫలములైన ప్రయత్నములను బేర్కొని "....విక్రమము భూరియశఃప్రియులైన రాజనందనులకు సర్వసాధనము, ధర్మమువు శత్రునిబర్హణంబులన్" అని సూచించినాఁడు. దానిని నిరాదరించిన కురువృద్ధులను లెక్కచేయలేదు.

"ముదుసళులు దమ కిమ్మగాఁ జదివికొండ్రు
గాక పతులకు హితమగు కర్జ మేల
యొలసి చెప్పుదు రహితులఁ గలిపికొనుట
ధర్మ మని రిది నయవిరుద్ధంబు గాదె" అనినాఁడు.

దుర్యోధనుని సమర్థించు కర్ణునిఁ గురుసభలో నడుపునఁ బెట్టువా రెవ్వరును లేరు. రారా జతని కంతస్వాతంత్ర్య మిచ్చి యతనిప్రతినిధిగాఁ గురుసభలో చెలామణి చేయించినాఁడు !

దుర్యోధనదావాగ్నికిఁ గర్ణుఁ డను ఝుంఝూమారుతము తోడైనది. కౌరవాటవి సంపూర్ణముగా దహింపఁబడినది. ఇందు కర్ణునిపని అగ్నిని ప్రజ్వలింపఁ జేయుట. కర్ణుఁడు సమయము గమనించి దుర్యోధనునిమనోనిశ్చయమున కనుగుణముగా సందర్భములను బోషించును. దాని నండగాఁ గొని సుయోధనుఁడు పెచ్చు పెరుగును.

సభాపర్వమునఁ గురుసభలో ద్రౌపదికి జరుగుచున్న యన్యాయమును జూచి వికర్ణుఁడు ఆమె యధర్మవిజిత యనియు, నక్కొమలిఁ దోడ్కొనివచ్చుట యన్యాయ మనియు నుపన్యసించెను అంతవఱకు సభ్యు లన్యాయశ్రవణవికర్ణులై యుండుటం జేసి, దుర్యోధనునిచర్య లవిమర్శకములుగా, నిరాఘాటముగా సాగినవి. వికర్ణునిప్రశ్న దుర్యోధనునిప్రయత్నమునకు 'మొదలంట నఱకు గొడ్డలిపెట్టు' వంటిది. దానిని సుయోధనుఁడు స్వయముగా సమర్థించుకొనునా ? ఆతనిచర్యలు న్యాయాన్యాయవిచక్షణతో సాగినవి కావు. ఆనాఁడు మయసభలో 'సహస్రవిలాసినీ పరివృత యయియున్న ద్రౌపది నగి'నదవ్వు హృదయశల్యమై' యుండ దానికిఁ బ్రతిచర్యఁ గావించి ద్రౌపదిని, పాండవులను అవమానింపవలె ననెడు పట్టుదలతో మాత్రము చేసినవి. ఈపగ సాధించుటయందు ధర్మాధర్మములు లేవు. దానికి

సమాధానము దుర్యోధనుఁ డేమని చెప్పఁగలఁడు? ఆసమయమున కర్ణుఁడు – అంతవఱకును మూకీభావము వహించియున్నను – దుర్యోధనుని సమర్థించుచు నుపన్యసించినాఁడు.

రజస్వలయు, నేకవస్త్రయు నైన ద్రౌపదిని సభకుఁ దెచ్చుట యన్యాయ మను వికర్ణునిమాటలను ఖండించుచు 'భార్యకు దైవహితం డయిన భర్త యొక్కరుండ. ఇది యనేకభర్తృక గావున బంధకి యనంబడు. నిట్టిదాని విగతవస్త్రం జేసి తెచ్చిన ధర్మవిరోధంబు లేదు' – అని దుర్యోధనుని చర్యను సమర్థించినాఁడు కర్ణుఁడు. అసలే ప్రతీకారచర్యయందుఁ గన్నుమిన్ను గానక వర్తించుచున్న దుర్యోధనున కతనిమాట లాలంబనము లైనవి. 'ఇట్టిదానిని విగతవస్త్రం జేసినను పాపము లే' దని కర్ణుఁడు నుడివెనుగదా! నారీజనమున కవమానమునఁ బరాకాష్ఠ యనఁదగు నిట్టి చర్య ద్రౌపదికి నావహిల్లినచో నిఁకఁ గావలసిన దేమి? ఎదుట నున్న భర్తల కంతకంటె తలవంపు లేమి కావలెను? కర్ణునిసూచనకు దుర్యోధనుఁ డుబ్బిపోయి నాఁడు. ఆవేశము కన్నుగప్పినది. దుర్యోధనుఁడు దుశ్శాసనుని బిలిచి "యిప్పాండవు లయు, ద్రౌపదియు వస్త్రంబు లపహరింపు" మని యాజ్ఞాపించెను. దీనికి కర్ణుఁడు కారణము.

మఱియు – ద్రౌపది నుద్దేశించి :

"తరుణి యేపురకంటె నొక్కరుఁడ భర్త
యగుట లగ్గు, జూదంబున నాలి నోటు
వడని వానిఁగాఁ దగుభర్తఁ బడయు మింక
ననుచు రాధేయుఁ డుల్లసమాడె నంత."

ఇయ్యదియుఁ బాండవహృదయపుటభేదకమును, ద్రౌపది కవమానహేతువు నగుటంజేసి దుర్యోధనుఁడు సంతసించెను. 'తగుభర్తఁ బడయు మింక' అన్న మాటలు మాయాద్యూతమందు విజయుఁడై యున్న దుర్యోధనునిపరముగా సూచింపఁబడినవి. అంత దుర్యోధనుఁడు పట్టపగ్గములు లేక విహరించినాఁడు.

"అమ్మదితన్ విభీతహరిణాక్షిఁ గలాపవిభాసి కేశభా
రమ్మన నొప్పుదానిఁ దనరమ్యపృథూరుతలంబు నెక్కఁగా
రమ్మని సన్నసేసె ధృతరాష్ట్రసుతాగ్రజుఁడు."

దానితో భీమునిచేత సుయోధనుఁడును, అర్జుననిచేతఁ గర్ణుఁడును జచ్చుటకుఁ దమగోతులు తాము త్రవ్వుకొనినారు. దీనికి మూలము కర్ణుఁడు దుర్యోధనుని సమర్థించుటకై పల్కినపల్కులే. అవి పాండవుల కాజన్మాంతము మరపురానివి. భారతమునం దచ్చటచ్చట పాండవుల నీతనిపలుకు లెదయందు విరిగినబల్లెపు ముక్కలవలె కలఁచి బాధపెట్టుచుండుటఁ గాంచెదము.

ఇంతటితో నాగక – ఘోషయాత్రకు దుర్యోధనునిఁ బ్రేరేపించినవాఁడు కర్ణుఁడు. 'అనవరతశీతవాతాతపకర్శితాంగు లై బహుదుఃఖసాగరమున మునింగి యున్న' పాండవులముందు నీవు 'సకలసామ్రాజ్యవిభవంబు మెఱసి చని, యందు నీతేజంబు ఘర్మసమయంబునాటి తపనుతేజంబై పగతుర కన్నులు గమర నతి దుస్సహం బగునట్లుగాఁ జేయు' మనియు 'మిత్రజనమోదంబును శత్రుజనఖేదం బునుఁ గదా సంపదలకుం దగియెడు ఫలంబు' అనియుఁ బ్రబోధించి యతనిచిత్తమునం దణగారియున్న మాత్సర్యాగ్నిని మఱియొకసారి కుజ్జ్వలింపఁజేసినాఁడు.

''అతులసౌభాగ్యపుణ్యసమగ్రగరిమ
నొప్పుచున్న నీదేవులయొప్పు సూచి
ధృతి దఱిఁగి తన్నుఁ దాన నిందించుకొనుచు
హృదయమునఁ బాండవాంగన యెరియవలదె ?''

అని రాజవెట్టినాఁడు. దానితో దుర్యోధనుని హృదయమున వెనుకటి పరాభవాగ్ని ప్రకోపించినది; తనయున్నతికి మిట్టిపడినది; తనసప్తజిహ్వలు చాచి ప్రజ్వరిల్లఁ దలఁచినది; శత్రువులఁ దపింపఁజేయ వెడలినది. దానికిఁ గర్ణుఁ డను ఝంఝామారుతము తోడైనది.

పైకథాంశములనుబట్టి కర్ణుఁడు ప్రతినాయకుఁడైన దుర్యోధనునకు సహాయులైనవారిలోఁ బ్రథమగణ్యుఁ డనుటలో నెట్టివిప్రతిపత్తియును లేదు. దుర్యోధనుఁడు సచివాయత్తసిద్ధుఁడు. కావున నతనిచరిత్రలోఁ గర్ణాదిసచివుల లేక సహాయకుల ప్రాధాన్య మధికముగా నుండుట సహజము.

లాక్షణికులు పురుషార్థసాధనయందు నాయకునికి ముఖ్యముగా నుపచరించువారు ఉపనాయకానునాయకు లని పేర్కొనియుండిరి. నాయకునకువలెనే ప్రతినాయకునకును ఉపనాయకానునాయకులు సహాయకులుగా నుందురు. మహాభారత

మునఁ బ్రతినాయకుఁ డైన దుర్యోధనున కుపనాయకుఁడుగాఁ గర్ణుఁడు తీర్చిదిద్దఁ బడినాఁడు. ఈవిషయమును స్పష్టముగాఁ దెలిసికొనవలయు ననిన లాక్షణికులు నిర్దేశించిన ఉపనాయకస్వరూపస్వభావములను గూర్చి కొంత విచారింపవలెను.

భరతమహర్షి నాయకులస్వరూపస్వభావాదులనుగూర్చి నిర్దేశ మొసఁగెనే గాని కడమవారినిగూర్చి తలపెట్టనే లేదు. కథానాయకునితోపాటు తరువాత రాఁదగినవాఁడు– రామాయణమున రామునితో సుగ్రీవునివలె మఱొక ప్రత్యేకవృత్తాంతము గలవాఁడు – అనఁగా ఉపవృత్తనాయకుఁడు–ఉండవలసియుండు నని మొదట గుర్తించినవాఁడు ఆనందవర్ధనాచార్యులు. ఆయన "కథానాయకః ధీరోదాత్తాది భేద భిన్నః పూర్వః తదనంతరో వా" అని చెప్పి, కథానాయకుఁ లిరువు రనియు, వారు 'పూర్వ' (ప్రధాన) కథానాయకుఁ డనియు, 'తదనంతర' కథానాయకుఁ డనియు నిర్దేశించెను. కాని ఆ'తదనంతర' కథానాయకుఁ డెట్లుండవలయునో 'ధీరోదాత్తాదిభేదభిన్నః' అనుపదముచే సూచించియు, నిదమిత్థ మని నిర్ణయింపఁ డయ్యెను. తదనంతరము ధనంజయుఁడు అట్టి 'తదనంతర'నాయకుని నామ స్వరూపనిరూపణము చేయఁదలఁచి కామశాస్త్రమునుండి – యందలి నాయకసహాయులలోఁ బ్రధానుఁ డగు 'పీఠమర్దుని' గ్రహించి, యతని నాపేరుతో వ్యవహరించుటయే గాక 'విచక్షణుఁడు'ను, నాయకుని కనుచరుఁడును, భక్తుఁడును, అతనికంటె కించి న్న్యూనగుణుఁడు నగు ననియు, అతని కొకలక్షణము నేర్పఱచెను. కాని రామచంద్రుఁడు అట్టి ఉపకథాబంధమునకు నాయకుఁ డగువానిని ధనంజయునివలె పీఠమర్దుఁ డనుటకు (అతఁడుకామశాస్త్రమాత్రప్రయోజ్యుఁ డనదగినవాఁ డని కాబోలు!) సంకోచించి, తక్కినలక్షణభాగమును దడవక అగ్ర్యనాయకునికంటె కించిదూనవృత్తము గలవాఁ డనియు, 'అముఖ్యనాయకుఁ' డనియుఁ దెల్పినాఁడు. భోజరాజుకూడ నట్లే భావించి 'తతః కైశ్చి ద్గుణైర్హీనః పూజ్య శ్చైవోపనాయకః' అని చెప్పి, అభినవగుప్తునిచేఁ బ్రవేశపెట్టఁబడిన 'ఉపనాయక'పదముతో నతనిని వ్యవహరించెను. శారదాతనయుఁడు "పతాకానాయక స్తేషా ముపనాయక ఉచ్యతే తస్యైవానుచరో భక్తః కించిదూన శ్చ తద్గుణైః" అని స్పష్టముగా నుపనాయక లక్షణమును బేర్కొనెను. అతఁడు ధనంజయునిలక్షణమునందలి పీఠమర్దునకు బదులుగా నుపనాయకు నాదేశించి, యతని పతాకానాయకత్వముతోపాటు కడమ లక్షణములను గూడ నతనివలెనే నిర్దేశించెను. అందుచే ఉపనాయకు డెప్పటికిని తల్లక్షణవిశిష్టుఁడై ఉపవృత్త(పతాకా)నాయకుఁడగు డని యేర్పడుచున్నది.

పైనిర్వచనమునం దభివర్ణింపఁబడిన ఉపనాయకగుణములలో 'తద్గుణైః' అనునది ప్రధాననాయకసామాన్యగుణపదము కాగా, 'కించిదూనశ్చ తద్గుణైః' అనునదియే యతనిస్వభావమును దెల్పుచు, నాయకుని స్వభావముతోఁ గల భిన్నతను, తదియత్తను గూడ విశదీకరించుచున్నది. 'తస్యైవానుచరో భక్తః' అనుపదములు ఉపనాయకునికి నాయకునితోఁ గల సంబంధమును నిరూపించుటయే గాక, యతని యనుచరత్వముచే ప్రధానేతివృత్తమునందు స్వోపవృత్తము లీనము కాఁగా నతఁడు ప్రధాననాయకు ననుసరించు ననియు స్పష్టమగుచున్నది. భోజరాజు 'పూజ్యశ్చైవోపనాయకః' అనినదానినిబట్టి ఉపనాయకుఁడు స్వయముగా 'పూజ్యుఁడే' యైనను 'పూజ్యే ష్వనురాగో భక్తిః' అనెడి నిరుక్తి ననుసరించి నాయకునితోఁ దన కేర్పడిన 'తాద్గుణ్య' సంబంధ మతనియందుఁ దనకు విశేషమైన యనురాగము పెంచఁగా - నాయకునియందు పూజ్యభావము గల్గియుండు నని యన్వయించుకొనవచ్చును. అందువలన నితివృత్తనిర్వహణమున నాయకునికి సహాయుఁడగుచుండియు, నుపనాయకుఁడు తనవృత్తముతో సామాజికులలోఁ బూజ్యభావము గడించు ననియు నేర్పడుచున్నది.

'కథానాయక శ్చ ధీరోదాత్తాదిభేదభిన్నః పూర్వ స్తదనంతరో వా' అను ఆనందవర్ధనాచార్యుల యాదేశమునుబట్టి ప్రధాననాయకుఁ డెట్లు ధీరోదాత్తాది భేదభిన్నుఁడో, 'తదనంతర'నాయకుఁడును లేక ఉపనాయకుఁడును అట్లే ధీరోదాత్తాది భేదభిన్నుఁడు గావలసివచ్చు నని యేర్పడుచున్నది. దీనివలన నాయకుల వలెనే ఉపనాయకులును చతుర్విధు లగుదురు. ఉదాత్తుఁడు ధర్మపురుషార్థసాధనమున సహాయుఁ డగును. అట్లే ఉద్ధతుఁడు అర్థసాధనసహాయుఁ డగును; లలితుఁడు కామపురుషార్థ సహాయుఁ డగును; శాంతుఁడు మోక్షసాధనసహాయుఁ డగును. ఇట్లు ఉపనాయకు లెప్పుడును పురుషార్థసాధనసహాయభూతు లగుచు, విధిగా ప్రాసంగికేతివృత్తమున వ్యాపిత్వము పొందెడివారై యుందురు. కథావ్యాపిత్వము లేక, ఉపవృత్తాధికారులు గాక యున్నచో నెవ్వరును ఉపనాయకులు కాఁజాలరు; వారు సాధారణనాయకసహాయులు మాత్రమే కాఁగలరు. రామాయణమున విభీషణాదులు సాధారణనాయకసహాయులు. సుగ్రీవుఁ డుపనాయకుఁడు. అట్లే భారతమున విరాటద్రుపదాదులు సాధారణనాయకసహాయులు; శ్రీకృష్ణుఁ డుపనాయకుఁడు. అట్లే యితరత్ర యూహించుకొనవచ్చును.

ఇఁక అనునాయకోపనాయకుల భేదమునుగూడ స్పష్టముగా నెఱుఁగవలెను. నాయకునితోఁ బెనవైచికొన్నవృత్తము గలవాఁడై నాయకాభ్యుదయమునం దభ్యు

దయము పొందుచు, నతనికి సహాయుఁడుగా నుండువాఁడు అనునాయకుఁడు ; అతఁడు నాయకునితో పాటు ఆధికారికేతివృత్తమున సమవ్యాపిత్వమును వహించియు, సమప్రాధాన్యము వహింపని- అస్వతంత్రమైన చరిత్రము గలవాఁడు. రామాయణమున లక్ష్మణాదులు, భారతమున భీమాదు లిట్టివారు. ఉపనాయకుఁడన్ననో ప్రాసంగికేతివృత్తమునకు నాయకుఁడై అనునాయకునియంత విలీనత పొందఁజాలని వృత్తము గలవాఁడై యుండును.

మహాకావ్యములందు నాయకానునాయకోపనాయకుల కెంత ప్రాధాన్యముండునో ప్రతినాయకునకును, అతనికి సహాయభూతులగు ననునాయకోపనాయకులకును అంతప్రాముఖ్య ముండును. సామాన్యముగాఁ గావ్యములందు నాయకుఁడు ధీరోదాత్తుఁ డైనచోఁ బ్రతినాయకుఁడు ధీరోద్ధతుఁడై యుండును. ప్రతినాయక విజృంభణమున నతనికి సహాయకులుగా నిలుచువారును తత్తద్గుణవిశిష్టులై కానఁబడుదురు. కావున కావ్యనాయకోపనాయకవిభాగము ప్రతినాయకోపనాయకులకును వర్తింపఁజేయవచ్చును. అట్టియెడ మహాభారతమునఁ బ్రతినాయకుఁడైన దుర్యోధనకు సహాయభూతుఁడై, ప్రాసంగికేతివృత్తమును గథావ్యాపిత్వమును బొంది, యుపవృత్తాధికారమును గలిగియున్న కర్ణుఁడు ప్రతినాయకపక్షమున నుపనాయకుఁడనఁ దగియున్నాఁడు. ఇట్టివారిని ఉపప్రతినాయకు లని వ్యవహరింపవచ్చునేమో విజ్ఞులు భావింపఁ గలరు !

మహాభారతమున శ్రీకృష్ణునివృత్తమువలెనే, కర్ణునివృత్తాంతమునకును బ్రత్యేకప్రతిపత్తి కలదు. కర్ణుఁడు కన్య యగు కుంతియందు సూర్యునివలన జన్మించి, సూతపుత్రుఁడుగాఁ బ్రసిద్ధి వడసినవాఁడు. సహజకవచకుండలధారియు, నసహాయపరాక్రమశాలియు నైన యతనియందు సహజక్షత్రతేజము సహస్రకిరణములతో వెలుగొందుచుండెను. దానికి గుర్తింపు, గౌరవము కావలసివచ్చెను. అదియే యతని జీవితలక్ష్యము. తల్లక్ష్యసిద్ధికి సహాయమొనర్చి, యతని నాదరించిన వాఁడు దుర్యోధనుఁడు. అందువలన నతనిబ్రతు కాసుయోధనునితో ముడివడినది. ఉప(పతాకా) నాయకుఁ డెప్పుడును స్వకార్యసిద్ధికై నాయకుని నాశ్రయించును. నాయకుఁ డతనికార్యము సాధించిపెట్టును. అపైన నుపనాయకుఁడు నాయక కార్యసిద్ధికిఁ దోడ్పడును. తత్ప్రయత్నవిశేషములచే నతనికిఁ గథావ్యాపిత్వ మబ్బును. శ్రీకృష్ణుఁడు జరాసంధవధకై పాండవులసాయము గైకొనెను, ఆపైన పాండవుల కతఁ డండదండయై నిలిచెను. రామాయణమున సుగ్రీవుఁడును వాలిసంహరణా

నంతరము రామునకు సహాయము చేసెను. ఇట్లు ఉపనాయకవృత్తములు స్వతంత్ర ప్రతిపత్తి కలిగియుండియు నాయకేతివృత్తమున కుపపోషకము లగుచుండును. అట్లే ప్రతినాయకునిపక్షముననుఁ. కావున కర్ణుని వృత్తాంతము ప్రతినాయకపక్షమున నుపవృత్తమై రాణించినది.

ప్రతినాయకుఁ డగు దుర్యోధనుఁడు ధీరోద్ధతుఁ డగుటచే దురహంకారిగను, కపటిగను, ధర్మవిరహితుఁడుగను చిత్రింపఁబడెను. అతనిని సమర్థించి ప్రేరేచిన కర్ణునిచరిత్రమునఁ దచ్ఛాయలు పడకమానవు. కావున సుయోధనకార్యసాధకుఁడుగా నతఁడు నిందితుఁడైనాఁడు. ధర్మరాజువలె దుర్యోధనుఁ డుభయాయత్తసిద్ధుఁడు కాఁడు. అందువలన సుయోధనునిచరిత్రలోఁ గర్ణున కధికప్రాధాన్య మేర్పడినది. కర్ణుఁ డాడించిన ట్లాడినాఁడు దుర్యోధనుఁడు. దుర్యోధనునిచిత్త మెఱిఁగి యతనిని సమర్థించినాఁడు కర్ణుఁడు. ప్రతినాయకునికొఱకు చివరివఱకు ప్రతిపక్షులతోఁ బోరి యసువుల నర్పించినాఁడు. కాని, దుర్యోధనున కపకీర్తి మిగిలినది; కర్ణున కఖండ కీర్తితోపాటు మహాభారతపఠితల యపారసానుభూతి మిగిలినది.

ప్రతినాయకునిపై లేని సానుభూతి యతనియుపనాయకునిపై నేల కలుగు చున్నది? ఈప్రశ్న భారతపఠితలలోఁ బ్రతివానికిని జనించును. సూక్ష్మముగా నాలోచించినచో నతనిపైఁ గలుగు సానుభూతి కతని వ్యక్తిగతచరిత్రము, అంతర వర్తనము కారణము లని తోపకమానవు. విధి కెదురీత యీదినవిషాదవీరుఁడు కర్ణుఁడు. అతనిబ్రతుకులో నతనివలన లాభము పొందినవారే కాని యతని యభ్యు దయమును గోరినవాఁ డొక్కఁడు లేఁడు. అతఁడు స్వయముగాఁ బ్రజ్వలించిన మహాగ్నిజ్వాల! దానిచుట్టును చేరిన మిత్రులు గాని, శత్రువులు గాని తలకొక యింధనము నీవలికిఁ దీసి యార్పినవారే కాని సాదరమున నొక్కసమిధను సవ రించినవారు లేరు. అతఁడు తనతాపమును తనలోనే దాచికొని కుమిలిపోయెను గాని పరుల కాతాపమును బంచియిచ్చి తాను సుఖింపలేదు. అతఁడు మహావీరుఁడు, మహాదాత, ఉజ్జ్వలుఁడు. అతఁడు స్వతంత్రుఁడై నాయకుఁడై రాణింపఁగలిగినవాఁడు. కాని, విధి యాతని కాయవకాశ మీయలేదు. అతని యుజ్జ్వలగుణములను గుర్తించి గౌరవించినవాఁడు దుర్యోధనుఁడు. కాని, యతఁ డతనిస్వతంత్రవ్యక్తిత్వమును మన్నింప లేదు; సహింప లేదు. అతఁ డతనిని స్వప్రయోజనముకొఱకు వాడుకొని నాఁడు. అందువలన దుర్యోధనునికై కర్ణుఁ డొనర్చిన కార్యకలాప మంతయు నర్థ సాధనై కలుషితమై శుద్ధధర్మమును విరోధించినది.

కర్ణుఁడు ధర్మముయొక్క స్వరూపము తెలియని యజ్ఞాని కాఁడు. అతఁ డెంతటి వీరుఁడో అంతటి ధర్మజ్ఞుఁడు. వీరుఁడుగా నతఁ డర్జునవిజేత కావలయు నని యభిలషించెను; తత్సాధనకు అతనిసూతకుల మడ్డము వచ్చినది. అతనికి రాచరికము గల్పించినవాఁడు సుయోధనుఁడు. దానితో నతని కర్జునప్రత్యర్థిగా నిలువఁ గలిగిన యర్హత లభించినది. తాను నిలిచిన గదా తనలక్ష్యసాధనము! తాను నిలువవలె నన్నచో తనప్రభువైన సుయోధనుఁడు నిలువవలెను. కావున దుర్యోధనుని కురురాజ్య మేలించుట యతని సేవాధర్మ మైనది. దుర్యోధనుఁడు ధర్మబద్ధముగా రాజ్యార్హత లేనివాఁడు. పాండవు లతనిప్రత్యర్థులు. వారు ధర్మ నిరతులు. ఆసంగతి యతఁ డెఱుఁగును. ఐనను పాండవులకుఁ గీడు తలపెట్టిన గాని తనసేవాధర్మము, తన వీరధర్మము నిలువదు. భీష్మపర్వమున భీష్ముఁడు కర్ణునితో నతని జన్మవృత్తాంతమును జెప్పి పాండవులఁ గలయు మనినప్పుడు కర్ణుఁ డనినమాటలు!

"మాటలు పెక్కులాడి యనుమానము లేక సభం గడంగి ప
ల్మాటుఁ బరాభవించితిఁ జలంబునఁ బాండవకోటి కెప్పుడుం
జేటు దలంచి యే బలువు సేసితి వైరము నాకు నింక నీ
వీటికి వారివీటికిని వెక్కస మయ్యెడు కయ్య మొప్పగున్."

"దైవాధీనము సర్వముం మనమతిం దప్పింపఁగా వచ్చునే
నీ వింకన్ నను నొండు వల్కక పరానీకంబుపైఁ బంపు మ
త్సేవాధర్మము నిర్వహించెద బలోత్సేకంబు లోకంబునం
భావింపన్ విహరించెదన్ మురరిపుం బార్థుం దలంకించెదన్."

ఇందు "మత్సేవాధర్మము నిర్వహించెద" ననినాఁడు కర్ణుఁడు. కావున పాండవుల యందు ద్వేషబుద్ధితోఁ గాక యతఁడు సుయోధనుఁడు తనను నమ్మిపోషించినందు లకుఁ బ్రతిఫలముగాఁ, దనకర్తవ్యముగాఁ బాండవద్వేషము వహించినా డన్నమాట! సేవాధర్మమునకు తన జీవితకుసుమము నంకిత మొనరించినాఁడన్నమాట!

ధర్మనిష్ఠుడైన ధర్మరాజు కురుక్షేత్రయుద్ధమున విజయము సాధించు ననియు, అతఁడు రాజ్యార్హుఁ డనియు కర్ణుఁడు భావించుచున్నట్లు అతఁడు శ్రీకృష్ణునితో నన్నమాటలవలనఁ దెలియనగును.

"అనుజులు ఋత్విజులుగ నీ
పని యిటు సేయు మని నీ వుపద్రష్టవుగా

వినుము కురుకుమారపశువిశ
సనమున రణయజ్ఞ మతఁడు (ధర్మజుఁడు) సమ్మతి చేయున్.''

అని యుద్యోగపర్వమున కర్ణుఁడు తనహృదయమును బైటపెట్టినాఁడు.

ఇచ్చట మన మొకవిషయమును గమనింపవలెను. కౌరవపక్షవర్తులైన భీష్మాదులు పాండవుల ధర్మవర్తనమును బాహాటముగా సమర్థించియు, సేవాధర్మము నాశ్రయించి సుయోధనుపక్షమున యుద్ధ మొనర్చిరి. వారిపాత్రలయందు గూఢత యెచ్చటను గానరాదు. మఱి కర్ణునిపాత్ర యట్లు కాదు. దానియందు కొంత రహస్యము కలదు. కొంత ప్రకాశము కలదు. కర్ణుని హృదయము గూఢము. దానిలో నున్న సత్యమును కృష్ణభీష్మాదు లొకకొన్నిసార్లు తత్కవాటములు తెరచి చూపించిరి. కాని యాచూపించుటయు నొకరహస్యమే. కర్ణుని హృదయము కృష్ణుఁ డెఱుఁగవచ్చును; భీష్ముఁ డెఱుఁగవచ్చును. కాని, వారు బైటపెట్టు నుద్దేశముతో దాని నెఱిఁగిరా ? కాదు. కర్ణునిహృదయమును బైటపెట్టుటకే వా రెఱింగిరి. దాని వలన పాండవకార్యసాధనము సులభ మగునని వారెఱింగిరి. ఆసత్య మాకర్ణునకుఁ దెలియును. వారందఱు కర్ణుని హృదయమునందలి యర్జునవిజయార్థి యైన యుత్సాహతేజమును జల్లపఱచుటకై యత్నించుచుండి రని యతఁడు తెలియని వాఁడు కాడు. అట్లు కానిచో నతని జన్మరహస్య మెఱిఁగిన మహామహు లందఱును దానిని గుండెలలో దాచి యతనికే ప్రత్యేకముగ, రహస్యముగ, స్వీయకార్య సాధనోపాయముగా నెందులకుఁ జెప్పవలసివచ్చినది ? భీష్ముఁడు గాని, కృష్ణుఁడు గాని కౌరవసభలో నెందుల కీవిషయము చెప్పలేదు ? ధర్మజున కెందులకు విన్నవింప లేదు ? కన్నతల్లి కుంతి మూగనో మెందులకు పట్టినది ? పాండవసంరక్షణార్థమై కన్నతల్లి కర్ణజన్మరహస్యమును జెప్పి యతనిని నీటిపాలు చేసినది చాలక మృత్యువుపాలఁ బడవేయఁ దలచినదే ! అతనిజన్మకథ దేవరహస్యము కావచ్చును; మానవరహస్యము కావచ్చును; నీతిరహస్యము కావచ్చును: ఆరహస్య మతని కిచ్చెడితిలోదకములు గాని లోకమునఁ జాటలేవు. ఆసత్య మతనికిఁ దెలియును. అది గోప్యముగా నుండుటయే విధి నిర్ణయము. ''దైవాధీనము సర్వమున్'' అని నిట్టూర్చిన కర్ణుఁడు విధిజ్ఞుఁడు కాదందుమా ? ధర్మ మాతనికిఁ దెలియ దందుమా ?

కర్ణునిహృదయము దుర్యోధనునకుఁ దెలియదు ; పాండవులకును దెలియదు. విధి యతని జన్మరహస్యములు లోకమునకుఁ జెప్పలేదు. కర్ణుఁడు తనహృదయ

మును లోకమునఁ జూటలేదు. కాని పఠిత కన్నీరహస్యములను దెలియును. కథ లోని యీకీలకమే కర్ణుని కపారసానుభూతిని సంపాదించినది.

కావ్యములందు ప్రతినాయకుఁడు విజితుఁ డగుటయో, హతుఁ డగుటయో జరిగితీరు నని పఠిత కొక పరిజ్ఞానము మనదేశమున సామాన్యముగా నుండును. అట్టియెడ ప్రతినాయకపక్షవర్తి యగు నుపనాయకుని వధ సంభావ్యమే యని తలంపఁబడును. అప్పుడు పఠితలు ఆతఁ డెట్లు జీవించి యెట్టి పరిస్థితులలోఁ జని పోయినట్లు చిత్రింపఁబడునో గమనింప నుత్సుకులై యుందురు. ప్రతినాయకపక్షము వారు నాయకున కడుగడుగున నగ్నిపరీక్షలు పెట్టఁగల విగ్రహశక్తియు, ధైర్య సాహసములును, గలిగి జీవింపఁగలుగుటయే జీవించుటయగును. పురుషకారము శక్తి వంచనలేకుండ చేయుచు నాయకునితోఁ బోటీపడి యోడి శరణువేడుటయో లేక ప్రాణము లర్పించి పరువు గాపాడుకొనుటయో కావలెను. కర్ణుఁడు శత్రువులకు సింహస్వప్నమై బ్రతికినాఁడు; చివరకు రణనిహతుఁ డైనాఁడు. ఆ రణమరణము పరమదయనీయము. కావున నంతటివాఁ డట్లు మరణించెఁ గదా! యని పఠిత కన్నీరు కార్చును.

ధర్మజునకు దుర్యోధనుఁ డనిన భయము లేదు కాని, కర్ణుఁ డనిన కలవర పాటు. ధర్మజుఁడు అరణ్యాజ్ఞాతవాసకాలమున—

సీ. "పదమూఁడువర్షముల్ పగలును రేలును
గర్ణుదర్పం బెట్లు గడతు నొక్కొ
యనుచింతఁ జేసి యాహారనిద్రలు లేక
పరితాప మందితిఁ బశువుఁ జేయ
విప్రులు పట్టరా వెఱసొచ్చి యొదిగెడు
గవయంబుచాడ్పునఁ గర్ణభీతి
నుల్లల మడుకుచు నుండుదు"

నని చెప్పుకొనినాఁడు. కర్ణునిశరపాండిత్యమే పార్థునిచేత తపస్సు చేయించినది. పాండవవీరు లెల్లరు, అంతయో ఇంతయో కర్ణునిచే నోడింపఁబడినవారే. అర్జునుఁడు సైతముఁ (కర్ణపర్వమున) కర్ణునిరణకౌశలముఁ గూర్చి :

"పట్టపగలింటిసూర్యుని పగిదిఁ గర్ణుఁ
డుగ్రమూర్తి యై వెలుఁగుచు నున్నవాఁడు

మసరథం బిప్డు మాధవ మరలనిమ్ము
బ్రతికియుండిన శుభములు వడయవచ్చు."

అని భయపడి వణఁకినాఁడు. కర్ణునితో యుద్ధ మనినతోడనే నఖశిఖాపర్యంతము ముచ్చెమటలు పట్టినవి. కర్ణునికి దీటైనవీరుఁడు శ్రీకృష్ణుఁ డొక్కఁడే యని "నీ (ధర్మరాజుయొక్క) నేర్పు, భీములావు, నరునివిలుబల్మి యతనికి (కర్ణునికి) హరికిఁ గల్గు" నని నారదుఁడు లెక్కవైచి చెప్పినాఁడు.

ఇట్టి మేటివీరుఁడు పురుషకారము వెలార్చి కురుక్షేత్రమున నర్జునునిఁ దలపడి ఘోరయుద్ధ మొనర్చినాఁడు. విక్రమ మున్నను విధిచాలక యతఁడు విఱిగి పోయినాఁడు. దేవర్షియైన నారదుఁడు కర్ణుని విషాదాంతమునకుఁ గారణమైన విశిష్ట శక్తులను వివరించి యిట్లు చెప్పెను:

"వినుము నరేంద్ర ! విప్రు డలివేఁ జమదగ్నిసుతుండు శాప మి
చ్చె నమరభర్త వంచనము సేసె వరం బని కోరి కుంతి మా
న్చె నలుక భీష్ముఁ దర్ధరథుఁ జేసి యడంచెఁ గలంచె మద్రరా
జనుచిత మాడి, శౌరి విధి యయ్యె నరుం డనిఁ జంపెఁ గర్ణునిన్."

కర్ణమహాగ్ని చల్లారుట కెన్నికాలమేఘములు గర్జించి శరవృష్టి కురిసినవి ! ఇందఱి తీవ్రప్రయత్నమున కేకైకహేతు వగుటకంటె వీరునకుఁ గావలసిన దేమి ? అట్టివాఁడు ప్రతినాయకోపనాయకుఁ డైనచో బ్రతుకవలసినదానికంటె ఘనముగా బ్రతికె నన్నమాట ! అట్టి కర్ణునకు - పరశురామునియొద్ద భార్గవాస్త్రాంతము బాణ విద్య నభ్యసించిన జోదునకు - కృష్ణుని మాయోపాయమున నింద్రదత్తమైనశక్తి సర్పముఖబాణము, రౌద్రమంత్రపూరితమైనబాణము వమ్మైపోవుటతో కన్నీరు నిండినది; రథము ధరఁ గ్రుంగుటతో మనమున ధైర్యము కుంటువడినది; భార్గవాస్త్రము స్ఫురింపకుండుటచే సర్వము ముగిసినది ! కఠినమైనవిధి కసి తీర్చుకొను నప్పుడే కరుణమాలినశత్రువు కుత్తుక త్రెంచుటతోఁ గర్ణుని కన్నుమూత కరుణారస భరితమైనది.

మహాభారతకథలోఁ గర్ణుఁడు చివరకు మరణించుట కంటె మఱొక ప్రత్యామ్నాయము లేదు. కర్ణుఁ డుండగా దుర్యోధనునకు మృతి లేదు. ధర్మజునకు విజయము లేదు. కథకుఁ బ్రగతి లేదు. ఒకవేళ దుర్యోధనుఁడు కర్ణునికంటె ముందు చనిపోయెనా కర్ణుఁడు బ్రతికి ఫలము లేదు. పైపెచ్చు ధర్మజునకు రాజ్య

సిద్ధి లేదు. అనగా నాయకునకు ఫలభుక్తి లేదు. ఇన్ని లేములకుఁ గలిమిఁ గూర్చినది యతనివిషాదాంతము ! ఉపనాయకుఁడుగాఁ గావ్యమున నుపజీవించి, ప్రతినాయక ప్రతిష్ఠ నధిగమించి, శత్రుపక్షము వారినుండియు పూజ్యతను గణించి, ప్రతినాయక సహాయకునిగా మాత్రమే గాక స్వతంత్రప్రతిపత్తిగల వీరుఁడుగా రాణించిన కర్ణుఁడు భారతపాత్రలలో విశిష్టుఁడు.

ప్రతిపక్షమున నుపనాయకుఁడై యింతప్రతిష్ఠ నార్జించిన కావ్యపాత్ర నభూతో న భవిష్యతి !

కర్ణపర్వాంతమున తిక్కనసోమయాజి యావీరుని సమరయజ్ఞప్రబంధమున కిట్లు మంగళాశాసన మొనరించి యున్నాఁడు :

"అనలుఁడు భాస్కరుండును సుధాంశుఁడు నధ్వరసంప్రవర్తకుల్
వినుము నరేంద్ర యీక్రతువు విష్ణుమయం బిది నిర్వహించి ర
ర్జునుఁడును గర్ణుఁడున్ సమరరూపము నందఁగ నీప్రబంధ మిం
పొనరఁ బఠించినన్ వినిన నొందు నరుం జిరసౌఖ్యసంపదల్."

——X——

బసవపురాణ నిర్మాణము - జైనపురాణ ప్రభావము

బసవపురాణము పాల్కురికి సోమనాథుని ప్రసిద్ధరచన. దానికిఁ దెలుఁగు సాహిత్యమున నొక ప్రత్యేకస్థానము కలదు. అది ప్రథమాంధ్ర దేశిపురాణము; అది తెలుఁగులో తొలిసారి వెలసిన స్వతంత్రపురాణము; అది ద్విపదకు కావ్య గౌరవము కల్పించి సాహిత్యక్షేత్రమున బట్టాభిషేకము గావించిన గ్రంథరాజము!

బసవపురాణము ప్రథమాంధ్రదేశిపురాణ మంటిమి. ఇట్టి వ్యవహార మింతకు పూర్వము కనఁబడదు. నన్నెచోడాదికవులు తెలుఁగుకవిత్వమును మార్గకవిత్వ మనియు, దేశికవిత్వ మనియు విభజించి వానిలక్షణముల నేర్పఱచుటకు యత్నించిరి కాని మార్గపురాణము లనిగాని, దేశిపురాణము లనిగాని వారు భావింపలేదు. దేశికవిత్వమార్గమున బసవపురాణము రచించిన పాల్కురికి సోమనాథుఁడును దన కావ్యమును దేశిపురాణ మని ప్రత్యేకించి పేర్కొనలేదు. అట్లయినప్పుడు బసవపురాణము దేశిపురాణ మని పరిగణించుటలోఁ గల సార్థక్య మేమియో ముందు విచారింప వలెను.

సంస్కృతమున పురాణము లని పిలువఁబడు ప్రత్యేకసాహిత్యశాఖ కలదు. అష్టాదశమహాపురాణములు, ఉపపురాణములు ఆశాఖను సుసంపన్న మొనర్చి యున్నవి. దేశీయభాషలలో నవి పరివర్తితములై పురాణాఖ్యలతోఁ బ్రసిద్ధి చెంది యున్నవి. పురాణ మనినతోడనే పంచలక్షణవిశిష్టమైన సంస్కృతపురాణమే యను నభిప్రాయము సాహిత్యవిమర్శకులయందు సామాన్యముగా వ్యాపించి యున్నది. సంస్కృతపురాణముల కనువాదము లైన పురాణముల కాలక్షణము వర్తించును. కాని బసవపురాణము పురాణాఖ్యతో వెలసినను అందు సంస్కృతపురాణలక్షణములు కానరావు. అది గీర్వాణమహాపురాణసంప్రదాయము ననుసరించి వ్రాయఁబడలేదు. అయినను దానిని సోమనాథుఁడు పురాణ మనినాఁడు. ఆంధ్రవిమర్శకు లతఁ డాగ్రంథమును పురాణ మని యెందుకు పిలిచినాఁ డను నంశముపై నంతగాఁ బట్టించుకొనినట్లు కానరాదు. పైపెచ్చు బసవపురాణము పురాణ మని పిలువఁబడుచున్నను దానిని సోమనాథుఁ డొకకావ్యముగాఁ దీర్చిదిద్దె నని భావించి తృప్తిపడిరి.

అందుల కొక కారణము లేకపోలేదు. మన ప్రాచీనకవులు పురాణము రచించినను, ఇతిహాసము ననువదించినను అందు కావ్యచ్ఛాయలు వెలయించి యుండిరి. అందుల కాదికవి యగు నన్నయరచనయే సాక్ష్యము. నన్నయ తెలుగుసాహిత్యమునకు శ్రీకారము చుట్టునాటికే సంస్కృతమున కావ్యరచనము పరిపక్వదశ నందుకొని యుండెను. తత్కావ్యసంస్కారముతో సాహిత్యము నిర్మించిన తెలుఁగుకవు లందఱు తమరచనలయందు రసవత్కావ్యసంపద నందగించియుండిరి. కావున నది యాంధ్ర కవుల సర్వసామాన్యలక్షణము. దానిని పురస్కరించుకొని యాంధ్రవిమర్శకులు బసవపురాణ మొకరసవత్కావ్య మని పరామర్శించుట యైనది. కాని తత్పురాణత్వ స్వరూపస్వభావములును, తన్నిర్మాణవైశిష్ట్యమును వారిదృష్టి నాకర్షింపలేదు.

బసవపురాణము మహాపురాణసంప్రదాయము ననుసరింపలే దనుటకు పిడుపర్తి సోమనాధుని బసవపురాణమునందలి యీక్రింది యైతిహ్యము కొంత తోడు పడఁ గలదు.

సీ. ''ఒకనాఁడు శివభక్తు లోరుఁగంటను స్వయం
భూదేవుమంటపమున వసించి
బసవపురాణంబు పాటించి వినువేళ
హరుని గొల్వఁ బ్రతాపుఁ డచటి కేఁగి
యాసంభ్రమం బేమి యనుడు భక్తులు బస
వనిపురాణం బర్థి వినెద రనిన
విన నాపురాణంబువిధ మెట్లొకో యన్న
ధూర్తవిప్రుం డొకకర్త చేరి

ఆ. పాలకురికి సోమపతితుఁ డీ నడుమను
బెనచె మధ్య (ప్రాస) వళ్లు పెట్టి ద్విపద
యప్రమాణ మిది యనాద్యంబు పద మన్న
నరిగె రాజు''.... ....

(పీఠిక 28 వ పద్యము.)

ఇందలి విప్రుఁడు వీరశైవులకు ధూర్తుఁడు కావచ్చును. కాని, యతఁడు పురాణ సంప్రదాయజ్ఞుఁడు. అతనికి పాలకురికి సోమనాథుఁడు పతితుఁడు కావచ్చును. కాని, అతఁడు దేశిసంప్రదాయము ననుసరించి పురాణము నిర్మించిన పరమ మాహేశ్వరుఁడు.

పైకథలో రాజు "ఆపురాణమువిధ మెట్టి ?" దని ప్రశ్నించెను. "ఆపురాణమును సోమనాథుఁ డీనడుమ ప్రాసవళ్లు పెట్టి ద్విపదలో రచించె" నని విప్రుఁడు పేర్కొనెను; అది యప్రమాణ మనియు, ననాద్య మనియు విమర్శించెను. ఈవిమర్శ ద్విపదకు మాత్రము పరిమిత మైనది కాదు. ఛందము కావ్యరచనాంగములలో నొక్కటి మాత్రమే. పురాణవిధ మనఁగా తత్పురాణలక్షణవిధమును, తన్నిర్మాణనిర్వహణవిధమును గూర్చియు ప్రశ్నించె నని భావించుటకు వీలున్నది. కావున నావిప్రుఁడు బసవపురాణము సంస్కృతపురాణములవలెఁ గాక వేదప్రామాణ్యము లేని దనియు, అనార్ష మనియు, వానివలెఁ బ్రాచీనము కాదనియు, నవీన మనియు విమర్శించె నని గ్రహింపవచ్చును. బసవపురాణము ప్రాచీనార్షపురాణ సంప్రదాయానుసారి కానిచో నది పాటించిన నవీనపురాణసంప్రదాయ మెట్టిది ?

పురాణములలో నత్యంతప్రాచీనము లైనవానియందు సర్గప్రతిసర్గముల కధికప్రాముఖ్య ముండెడిది. క్రమముగా వంశమన్వంతరములకును, రాజవంశ చరిత్రలకును ప్రాధాన్యము హెచ్చినది. ఆపైన శైవవైష్ణవశాక్తాదిమతప్రబోధైక దృష్టితో నిర్మింపఁబడిన పురాణోపపురాణములయందు దేవతామహిమాభివర్ణనాత్మకములైన కథలును, అవతారగాథలును, మతధర్మబోధలును, భక్తచరిత్రములును విశేషముగాఁ జోటు చేసికొనినవి. అయినను అవి మహాపురాణసంప్రదాయమునకుఁ జెందిన పంచలక్షణములను యథావకాశముగాఁ దమయందుఁ బ్రతిబింబించుకొని పురాణత్వమును సార్థకపఱచుకొనినవి. పురాణములు మహాకావ్యములవలెఁ గాక జనసామాన్యము నుద్దేశించి రచింపఁబడినవి. శైవవైష్ణవాదిమతములు జనాదరణ పొందుటకు తత్తన్మతదేవతాకములైన పురాణములు రచింపఁబడినవి. అవి ప్రజల హృదయములను జూఱగొనినవి. ఇట్లు మనదేశమున మతప్రవక్తల ప్రత్యక్ష ప్రవచనములకంటె పురాణకర్తల పరోక్షహితోపదేశములు మతవ్యాప్తికి మధుర మార్గముల నావిష్కరించినవి.

ఆర్షసంప్రదాయవిరుద్ధము లైన జైనబౌద్ధములు ప్రజాదరణపాత్రము లగుట కనువైన సాహిత్యప్రక్రియల నన్వేషించినవి. మతవ్యాప్తికి పురాణములు శక్తిమంతము లైన సాధనములుగా నామతస్థులకుఁ గానవచ్చినవి. కాని వేదోపనిషత్తాత్పర్యములకును, షడ్దర్శనసిద్ధాంతములకును బ్రతీకలైన సర్గప్రతిసర్గాదిలక్షణముల కాకరములైన పురాణములవిధము వారి కంగీకారము కాలేదు. బౌద్ధు లవతారగాథలకు ప్రతిగా జాతకకథలు సృష్టించి బుద్ధదేవునిమహిమలు వర్ణించిరి. అవి ప్రజలహృద

యముల నాకర్షించినవి. జైనులు బౌద్ధులకంటె విలక్షణమైనమార్గము ననుసరించిరి. వారు 'పురాణాఖ్య'ను గ్రహించి జైనపురాణములను వెలయించిరి. సంస్కృత పురాణములవలె వానిని పంచలక్షణవిశిష్టములుగా రూపొందించిరి. కాని వారి పంచ లక్షణములు సంప్రదాయబద్ధములైన పంచలక్షణములు కావు. జైనమతసంప్ర దాయానుకూలము లైన పంచలక్షణము లవి. వా రంతటితో నాగలేదు. ప్రసిద్ధ సంస్కృతేతిహాసకావ్యపురాణగాథలను జైనమతానుగుణముగా మార్చి తిరుగ వ్రాసిరి. వానిలోఁ గొన్నింటిని తమపురాణములందు వస్తువులుగా గ్రహించిరి. బౌద్ధులు బుద్ధుని జన్మగాథలు జాతకకథలలో వర్ణింపఁగా జైనులు తీరంకరుల జన్మమహిమాదికములను దెల్పుకథలను పురాణవస్తువులుగా గ్రహించిరి. ఇట్లు జైనులు మహాపురాణసంప్రదాయముకంటె భిన్నమైన యొకపురాణరచనాసంప్ర దాయమును రూపకల్పన చేసికొని దానియందు పురాణరచనావ్యాసంగములను నిర్వ హించి పురాణసాహిత్యమునం దాసక్తమై యున్న ప్రజాహృదయమును ప్రచ్ఛన్న ముగఁ గొల్లగొట్టి మతప్రచారము సాగించిరి.

ప్రాచీనపురాణసంప్రదాయమున పరతత్త్వ మునకును, వేదతాత్పర్యమున కును, భగవల్లీలలకును, అవతారగాథలకును ప్రాధాన్యము లభింపఁగా నవీన మగు జైనపురాణసంప్రదాయమున మతప్రబోధమునకును, మతాచార్యమహిమాభివర్ణన మునకును, ఆచార్యపూర్వజన్మగాథలకును, ప్రాచీనసమకాలీనభక్తచరిత్రలకును పట్టాభిషేకము చేయఁబడినది. కేవలజ్ఞానసిద్ధిచే ముక్తులైన తీర్థంకరుల జన్మమహి మాదివిశేషములఁ బ్రతిపాదించుచు తన్మతసూత్రానుగుణముగా నిర్మింపఁబడినవి జైనపురాణములు. ఇట్టివి సంస్కృతప్రాకృతములందు కొన్ని వెలసియున్నను సామాన్యజనుల కందుబాటులోనికి వచ్చునట్లు జైనకవులు దేశీయభాషలలో నను వాదము గావించిరి. అవి మతప్రవక్తలను భగవన్మూర్తులుగా భావించి భజించుట కును, తన్మతానుయాయులగు మహాత్ములవైశిష్ట్యమును, మహిమలను గ్రహించుట కును, పరమతఖండన స్వీయమతపోషణానుసరణాదులకైన పరిజ్ఞానము నందిం చుటకును నేర్పడిన కథాకావ్యములుగా రూపొందినవి. ఇందు చరిత్ర కందని సనా తనుల చరిత్ర లుండకపోవచ్చును. ప్రతీకాత్మకసృష్టి కనుపట్టకపోవచ్చును. సమ కాలికులే పురాణపురుషులుగాఁ గీర్తింపఁబడవచ్చును. పురాణగౌరవము నభిలషిం చెడి నవీనమతముల యాకాంక్షలు నామశ్రవణమాత్రముననే పురాణత్వము స్ఫురింపఁజేయు నిట్టి నవీనకావ్యలతికలకు దోహదక్రియ లొనర్చినవి.

దక్షిణదేశభాషాసాహిత్యములలో నిట్టిపురాణములు మతవాఙ్మయముల కెత్తిన కీర్తిపతాకలై విరాజిల్లుచున్నవి. కన్నడమున ప్రసిద్ధజైనకవులు తీర్థంకరుల చరిత్రలను పురాణములుగా వెలయించిరి. 'ఆదికవి' యని ప్రసిద్ధిగాంచిన పంపకవి (క్రీ. శ. 941) జైనప్రథమతీర్థంకరుఁడైన పురుదేవునిచరిత్రమును 'ఆదిపురాణ' మనుపేర చంపువుగా రచించెను. అది జినసేనుని సంస్కృతకృతి కనుకృతి. ఇట్లే 'ఉభయకవిచక్రవర్తి' యైన పొన్నకవి పదునాఱవజైనతీర్థంకరుని జీవితచరిత్రమును చంపువుగా శాంతిపురాణ మనుపేర రచించెను. 'కవిచక్రవర్తి' రన్నఁడు ద్వితీయతీర్థంకరునిచరిత్రను అజితపురాణ మను చంపువుగా నిర్మించెను. ఇవికాక నాగచంద్రకవి మల్లినాథపురాణము, నయసేనుని ధర్మనాథపురాణము, జన్నకవి యనంతనాథపురాణము మొదలగునవి ప్రసిద్ధకన్నడజైనపురాణములు. ద్రావిడవాఙ్మయమునందు అఱువత్తుమూవురురునయనారు లను శివభక్తుల చరిత్రలను గూర్చి 'శేక్కిళ్లార్' అనుకవి రచించిన 'పెరియపురాణము' కడుప్రసిద్ధి కెక్కియున్నది. ఇట్లు మతాచార్యులయొక్కయు, భక్తులయొక్కయు కథలను గుదిగ్రుచ్చి కూర్చి యొకకథాహారముగా సంతరించి పురాణ మనుపేరఁ బ్రవర్తిల్లఁ జేయుట కర్ణాటద్రవిడకావ్యవస్తునిర్మాణపద్ధతులలో నొకటిగా క్రీ. శ. 10వ శతాబ్దమునుండియే గుర్తింపఁబడి యున్నదని తెలియుచున్నది. ఇది ఆర్షము, ఆద్యమునైన సంప్రదాయము కాక దేశీయము, నవీనమునైన పురాణనిర్మాణప్రక్రియ. బసవపురాణ మీసంప్రదాయము ననుసరించి 'పురాణాఖ్య'ను ధరించి ప్రప్రథమవీరశైవపురాణమై వాసికెక్కినది. ఇట్టి రచనల కిదియే తెలుఁగున శ్రీకారము చుట్టినది.

సంస్కృతపురాణపంచలక్షణములకుఁ బ్రతిగా జైనులు తమపురాణములందలి తీర్థంకరచరిత్రలలో నుత్సవపంచకమును లేక పంచజినమహాకల్యాణములను వర్ణించిరి. రన్నకవి జైనపురాణములం దీ ఉత్సవ - లేక - కల్యాణపంచకము సవిస్తరముగ వర్ణింపఁబడవలె నని పేర్కొనియుండెను.[1] అవి: 1. సురలోకావతరోత్సవము లేక గర్భావతరణకల్యాణము, 2. జన్మాభిషేకోత్సవము లేక జన్మాభి

1. "సురలోకావతరోత్సవం, పరికృతం జన్మాభిషేకోత్సవం, పరినిష్క్రాంతి మహోత్సవం, ప్రవిమలం కైవల్యబోధోత్సవం, పరినిర్వాణమహోత్సవం జిన మహాకల్యాణ మైదుం సవిస్తర దిందుప్పవు"—రన్నకవి.

[చూడు : ఆదిపురాణ సంగ్రహపీఠిక. పుట 56. సంపాదకుఁడు : ఎల్. గుండప్ప. ఎం. ఏ.,]

షేకకల్యాణము, 3. పరినిష్క్రాంతిమహోత్సవము లేక పరినిష్క్రమణకల్యాణము 4. కైవల్యబోధోత్సవము లేక కేవలజ్ఞానకల్యాణము, 5. పరినిర్వాణమహోత్సవము లేక పరినిర్వాణకల్యాణము. జైనసాహిత్యమున నీ ఉత్సవకల్యాణపదములు పర్యాయపదములుగా వాడఁబడినవి. తీర్థంకరునిదివ్యజన్మకు హేతుభూతమైన కథాభాగము ప్రథమకల్యాణము. తీర్థంకరజన్మసమయమున నింద్రాదిదేవతలు భువి కవతరించి క్షీరాభిషేకాదులతో నామహామహుని పూజించి యాతని మహిమాన్విత గాథకు నాంది నాలపించు ఘట్టము ద్వితీయకల్యాణము. తీర్థంకరుఁడు సంసారమును రోసి జ్ఞానసిద్ధికై తపోవనమున కరుదెంచుఘట్టము తృతీయకల్యాణము. జ్ఞానసిద్ధియు, తత్త్వబోధనిర్వాణములు చతుర్థపంచమకల్యాణములు. ఈవిభాగములను గమనించినచో జినబుద్ధదేవులజీవితచరిత్రల కవి సమముగా వర్తించునని యూహింపవచ్చును. అవియొక మహాజ్ఞానిజీవితప్రథమోషస్సునుండి చరమోషస్సువఱకు సహజముగా నేర్పడు నైదుసోపానములు; కావున తీర్థంకరచరిత్రల కవి యవశ్యలక్షణములై ప్రవర్తిల్లినవి. జైనపురాణములును పంచకల్యాణలక్షణలక్షితము లై పురాణగౌరవము నందుకొనినవి.

జైనపురాణములయందు మతసంబంధములైన శాస్త్రాచారాంశములను వదలినచో ప్రధానముగా నెన్నఁదగిన లక్షణములు మఱిరెండు కలవు. అవి, 1. భవావళి, 2. త్రిషష్టిశలాకాపురుషచరిత్రములవర్ణనము. భవావళి యనఁగా తీర్థంకరుల పూర్వజన్మలవరుస యని యర్థము. జైనసిద్ధాంతమున కర్మవాసనాబద్ధుఁడైన జీవుఁడు జ్ఞానోన్ముఖుఁడై పయనించుచు నీచజన్మలనుండి క్రమముగా నుత్తమజన్మలను బొందుచు చివరకు కేవలజ్ఞానసిద్ధిని బడసి ముక్తుఁడగుటకు తీర్థంకరజన్మము నెత్తునని విశ్వసింపఁబడును. తదనుగుణముగా జైనపురాణములందు ప్రథమకల్యాణకథావసరమున నాతీర్థంకరజీవసంస్కారపరిణామనిరూపకములైన పెక్కు పూర్వజన్మగాథలు చెప్పఁబడును. అవియన్నియు తీర్థంకరజీవితకథారూపకమునకు ప్రస్తావనాంగతుల్యములై రక్తికట్టుచుండును. ఆకథాభాగము భవావళి. మహాపురాణసంప్రదాయమున సర్గప్రతిసర్గాదులలో బ్రహ్మాండజీవోత్పత్తిక్రమవికాసము పురాణారంభమున వర్ణింపఁబడుచుండ జైనపురాణములు తీర్థంకరజీవపరిపక్వదశాభివర్ణనమారంభమున నిబంధించుకొనినవి.

జినధర్మమును నమ్మి సద్గతిఁ బడసిన మహాపురుష లఱువదిమువ్వురు కలరని జైనసంప్రదాయము. వారిని త్రిషష్టిశలాకామహాపురుష లందురు. వారు చతు

ర్వింశతి తీర్థంకరులకంటె భిన్నులు. వారిగణన మిట్లు కలదు: 12 మంది చక్ర వర్తులు, 24 మంది కామదేవులు, 9మంది బలదేవులు, 9మంది వాసుదేవులు, 9మంది ప్రతివాసుదేవులు. వారిలో నధములు ప్రతివాసుదేవులు; వారు భవబంధ మగ్నులు. పైవారిలో నుత్తములు చక్రవర్తులు; వారు సత్త్వగుణసంపన్నులు. వీరందఱికంటె సర్వోత్తములు తీర్థంకరులు. అట్టి తీర్థంకరులచరిత్రలలోఁ బై త్రిషష్టిశలకామహాపుషులచరిత్రలు యథావకాశముగాఁ జెప్పఁబడుట జైనపురాణవస్తు లక్షణములలోఁ బ్రధానమైన దని విమర్శకులు పేర్కొనియున్నారు.[1] పరిపూర్ణ జీవితులైన మతప్రవక్తలచరిత్రలలో తరతమభేదాధికారసమన్వితులైన మహా పురుషులచరిత్రలు వర్ణింపఁబడినచో సామాన్యప్రజలకు నిర్వాణమార్గసోపానక్రమము నేర్పఱచుకొనుటకు వీలుకలుగు ననుట నిర్వివాదాంశము.

పైపర్యాలోచనమువలన జైనపురాణనిర్మాణవిధానము, తల్లక్షణవిధము స్థూలముగాఁ దెలియవచ్చును. అవి పంచలకల్యాణలక్షణములయ్యు సర్గాదిపంచ లక్షణములు కావు. అవి మహాపురాణములవలె భగవల్లీలలను జెప్పక, ఆచార్య మహత్త్వమును జెప్పినవి; పౌరాణికైతిహాసికవ్యక్తులనే గాక సమకాలీనభక్తులను వారికథలను తమయందుఁ జిత్రించినవి. అధునాతనము లైన పురాణములు సమ కాలీన సాంఘికవృత్తములను దమయందు గ్రహించి ప్రజాదరణము పొంద యత్నించును. వానియందు పౌరాణికకల్పన యెంత యుండునో దేశీయతాముద్ర యంత యుండును. ఏతద్విధకారణముల నన్నింటిని గ్రోడీకరించి మహాపురాణ సంప్రదాయము మార్గపురాణసంప్రదాయ మనియు, తద్భిన్నమైనజైనపురాణసంప్ర దాయము దేశిపురాణసంప్రదాయ మనియు నిందు భావింపఁబడినది.

సోమనాథుఁడు జైనపురాణసంప్రదాయముల నెఱుంగుట కతనినివాసస్థల మైన ఓరుగల్లుప్రాంత మెంతయో తోడ్పడియుండును. ఓరుగల్లు బహుమతస్థుల కావాసమైన మహాంధ్రనగర మని విఖ్యాతి నందినది. నన్నయనాఁటికి తూర్పు చాళుక్యరాజుల వైదికమతాభినివేశముచే వేంగిదేశమున జైనబౌద్ధముల ప్రాబల్యము సడలినది. కాని తెంగాణమున నంతగా తగ్గలేదు. అందుల కప్పు డాప్రాంతము నేలు రాజులు తూర్పుచాళుక్యులవలె వైదికమతపోషకులు కాకపోవుటయే ప్రధాన కారణము. అనుమకొండలోఁ గాకతీయసామ్రాజ్యము సుమారు పదునొకండవ

1. ఆదిపురాణసంగ్రహపీఠిక. పుట. 154। సంపాదకుఁడు। ఎల్. గుండప్ప ఎం. ఏ., మైసూరు విశ్వవిద్యాలయ కన్నడగ్రంథమాల. 29. (1959).

శతాబ్ద్యారంభముననే మొదటిబేతరాజు స్థాపించియుండెను. అతఁడు జైనమతావలంబుఁడుగాఁ గానవచ్చుచునాఁడు. అతని తరువాతివాఁ డగు మొదటిప్రోలరాజును జైనుఁడే. కాకతీయప్రభువులలో మొట్టమొదట శైవము నవలంబించినవాఁడు రెండవ బేతరాజు. అతఁడు పరమమాహేశ్వరుఁ డని కీర్తింపఁబడినాఁడు. అతఁడు 11వ శతాబ్ది చరమపాదమునఁ బాలనకు వచ్చినవాఁడు, అప్పటినుండియు నోరుగల్లున శైవమునకుఁ బ్రాబల్య మేర్పడినది. అది శైవజైనమతములసంఘర్షణకు దారితీసినది. గణపతిదేవచక్రవర్తి వీరశైవాచారదీక్షావ్రతుఁ డగుటచే జైనులను, వారి మతమును ఘోరముగా హింసించినట్లు తెలియుచున్నది. తిక్కన యోరుగల్లు దర్శించినప్పుడు అరాజు జైనబౌద్ధులతో నాతనిని వాదుచేయించెనఁట! తిక్కన వారి నోడించి వైదికమతమును స్థాపించె నఁట! అప్పుడు గణపతిదేవుఁడు "జిన సమయార్థుల శిరములఁ దునిమె" ననియు, 'విద్వేషబౌద్ధుల విలుమాడె" ననియు సిద్ధేశ్వరచరిత్రవలనఁ దెలియుచున్నది. ఓరుగల్లు పతనమునకు జైనమతస్థుల పగయు నొకకారణమని చారిత్రకులు భావించుచున్నారు. ఇట్లు కాకతీయులపాలనమున నోరుగల్లులో రాజమతముగా దాదాపొకశతాబ్ది వెలసినజైనము తనపూర్వగౌరవము నిలుపుకొనుటకొఱకు మరియొకటిన్నర శతాబ్దికాలము శైవమతముతో నెదురొడ్డి పోరుచు నంతరించినది. జైనము నెదిరించి విజయము సాధించుచున్న శైవము సోమనాథునకు నూతనశక్తిని పుట్టుకతోనే ప్రసాదించియుండును. జైనమతము జనబాహుళ్యమునందు వ్యాపించుట కుపయోగపడిన వారిపురాణముల విధము సోమనాథుని చిత్తముపైఁ గొంత ప్రభావము వైచియుండును. తత్సంస్కారముతో నతఁడు వీరశైవసముద్ధరణ మొనర్చి యాంధ్రకర్ణాటజనహృదయసీమలయందు స్వర్ణపీఠము నధిరోహించు బసవపురాణనిర్మాణము చేపట్టినాఁడు.

బసవచరిత్రమే బసవపురాణప్రధానేతివృత్తము. సోమనాథుఁడు తనపురాణ కథావస్తువును సేకరించుకొనిన విధము నిట్లు చెప్పుకొనినాఁడు:

''ఆతతబసవపురాతనభక్త
గీతార్థసమితియే మాతృకగాఁగఁ
బూరితంబై యొప్పు పూసలలోన
దారంబుక్రియఁ బురాతనభక్తవితతి
చరితలలోపల సంధిల్ల బసవ
చరిత మే వర్ణింతు సత్కృతి యనఁగ!''

"ప్రస్తుతింపంగ సద్భక్తి విస్ఫురణఁ
బ్రస్తుతి కెక్కిన బసవనిచరితఁ
జెప్పితి భక్తులచే విన్నమాడ్కి
దప్పకుండఁగను యథాశక్తిఁ జేసి,"

ఈవాక్యములనుబట్టి బసవపురాణ మేపురాణమునకును అనువాదము కాదనియు, శివభక్తులవాక్కులయందును, పురాతనభక్తిగీతార్థములయందును వ్యాపించియున్న బసవకథార్థములను బ్రోగుచేసి, స్వీయప్రతిభతో వానిని రసవత్తరము లొనరించి, సంవిధానము చెడకుండ వానిని గుదికూర్చి సోమనాథుఁడు పురాణనిర్మాణ మొనర్చె ననియు స్పష్టమగుచున్నది. సోమనాథుఁ డీపురాణమును భక్తజనకథామంజరిగా నలంకరించినను అంద్వైక్య మనుసూత్రమును బసవనిచరిత్రతో సాధించుటవలన నాతని కావ్యవస్తువునకు ప్రబంధసౌందర్య మబ్బినది. సోమనాథుఁడే పండితారాధ్య చరిత్రమున భక్తులు తనబసవపురాణనూతనత్వమును, అం దితిహాసఘటనవలన కథాకథనమున కేర్పడిన ప్రాబంధ్యమును గీర్తించినట్లు ప్రత్యేకముగఁ జెప్పు కొనెను.[1]

సోమనాథుఁడు బసవపురాణము నేడాశ్వాసములకృతిగా భావించి సప్తపర్ణివలె రూపొందించెను. అందు ప్రథమాశ్వాసమున నందికేశ్వరుఁడు బసవేశ్వరుఁడుగా భువి నవతరించుటయు, నుపనయనసంస్కారమును ద్యజించి వీరమాహేశ్వర వ్రతనిష్ఠుఁ డగుటయు, వివాహితుఁడై సంగమేశ్వరుని శరణువేఁడుటయు వర్ణింపఁ బడినవి. ద్వితీయాశ్వాసమున బిజ్జలుఁడు బసవేశ్వరునకు దండనాయకపద మిచ్చు టయు, కళ్యాణకటకమున బసవేశ్వరుఁడు శివాచారనిరతుఁ డగుటయు, చెన్న బసవఁడు బసవు నారాధించుటయు, అల్లమప్రభువు బసవనివిం దారగించి వరము లిచ్చుటయు, బసవేశ్వరుఁడు తనమహిమలు బ్రదర్శించుటయుఁ జెప్పఁబడియున్నవి. తృతీయాశ్వాసము జంగమునకు బసవేశ్వరుఁడు తనభార్యచీర నిప్పించి తన జంగమసేవానిరతిని బ్రకటించినకథతో నారంభమై, సంగయ్య యను ముగ్ధభక్తుని

1. "ఖ్యాతిగా సద్భక్తగణలాలనముగ - నూతనంబుగ జగన్నుతముగా మున్న 'బసవపురాణ' మొప్పఁగ రచించితివి; బసవపురాణప్రబంధంబునందు-ప్రథిత పురాతనభక్తగుణాను-కథనంబు లితిహాసఘటనఁ గూర్చితివి."

—పండితారాధ్యచరిత్ర. దీక్షాప్రకరణము- పుట. 11.

(ఆ. గ్రం. మా. 30. పరిష్కర్త : డా. చి. నారాయణరావు గారు- 1939).

చరిత్రమునకు ముగ్ధుఁడైన చెన్నబసవనికి బసవేశ్వరుఁడు ముగ్ధభక్తులకథల నెఱిఁగించుటతో విస్తరించినది. చతుర్థాశ్వాసము మడివాలుమాచయ్యకథతో నారంభమగును. వీరశైవులు తమబాసలను భక్తిమహిమతోఁ బాటించి జంగమలింగరూపులై అనన్యసాధ్యులై వెలుగొందెద రనుట కాభక్తునికథ తార్కాణము. బసవేశ్వరుఁడాతనిని సాక్షాచ్ఛివునిగా భావించి సేవించెను. అతఁడే యొకసారి బసవనిగీతములో వినవచ్చిన యహంకారమును గర్హించి భక్తివలన భక్తున కత్యంతవినయసంపద యేర్పడవలయు నని ప్రాచీనభక్తులచరిత్రములను బెక్కింటిని దృష్టాంతములుగాఁ బేర్కొనినట్లు వర్ణించుటచే నీయాశ్వాసము కడుదీర్ఘ మైనది. బసవని సమకాలికులగు కిన్నర బ్రహ్మయాది భక్తుల మహామహిమలను బ్రతిపాదించుటతో పంచమాశ్వాస మైనది. షష్ఠాశ్వాసము జైనులతో వాదుపడి శిర మిచ్చి మహిమాతిశయములను బ్రదర్శించిన ఏకాంతరామాదులవంటి శివభక్తులకథలతో నిండియున్నది. సప్తమాశ్వాసము కులమున కంత్యజుఁ డయ్యు మహిమచే నున్నతుఁడైన శివనాగుమయ్యవంటి భక్తులచరిత్రలతో సాగి, బిజ్జలుఁ డకారణముగా నల్లయ్యమధుపయ్యలను భక్తులకన్నులు తీయించుటచే బసవేశ్వరున కాగ్రహము గలిగి కల్యాణకటకమును శపించి, భక్తమండలితోఁ గూడి సంగమేశ్వరమున కేఁగి లింగైక్యమందుటయు, జగదేవాదులు బిజ్జలుని వధించుటయు, ననతికాలములో నారాజసంతతియు, రాజ్యమును నాశన మగుటయు ననుకథాంశములతో ముగియుచున్నది.

వీరశైవమతాచార్యుఁ డగు బసవేశ్వరు నవతారపురుషునిగా నిరూపించుటయే గాక తత్పూర్వజన్మ విశేషముల నభివర్ణించి, యాదిమూలమైన యతనిస్వరూపము నెఱిఁగించి, ప్రస్తుతావతారహేతువును నిర్దేశించిన కథాభాగ మీపురాణేతివృత్తమున ప్రస్తావనగా నలరారుచున్నది. బసవేశ్వరుఁడు తొలుత సృష్ట్యాదియం దున్న ధర్మస్వరూపుఁడగు నాదివృషభేంద్రుఁడు. ఆపైన శిలాదుని తపఃఫలముగా నాతఁడు నందీశ్వరుఁడై జన్మమెత్తి ద్వితీయశంభుఁ డని కీర్తిఁగాంచెను. నందీశ్వరుఁడే శైవమతోద్ధరణార్థము బసవేశ్వరాఖ్యతో మఱల భువియం దవతరించెను. దీనికి సూత్రధారుఁడు పరమేశ్వరుఁడు. ఇంతకంటె పురాణమున కుదాత్తారంభ మేమి కావలయును ? సృష్ట్యారంభాఖ్యసర్గాదికథన మార్షపురాణారంభమై యుండఁగా నాచార్యపూర్వావతారకథాకథన మీపురాణప్రస్తావన మై పరిఢవిల్లినది.

బసవేశ్వరపూర్వజన్మాదికథనముపై జైనపురాణములందలి 'భవావళి' ప్రభావము ప్రస్ఫుటముగాఁ గనవచ్చుచున్నది. కాని భవావళిలోఁ జెప్పఁబడిన జన్మక్రమము

వేఱు; బసవపురాణకర్త చెప్పిన విధము వేఱు. అది మతసిద్ధాంతభేదమువలన నేర్పడినమార్పు. తీర్థంకరులు పశుమానవస్థితులనుండి దేవస్థితి కారోహణక్రమమున గమించి సిద్ధులైనట్లు జైనపురాణములు వర్ణించెను. బసవేశ్వరుఁడు ఆదివృషభ రూపదేవస్థితినుండి కారణజన్ముఁడైన మానవుఁడుగా నవతరించినట్లు బసవపురాణమున నిరూపింపఁబడెను. ఇచ్చట నొకవిషయము స్పష్టముగా నెఱుఁగవలెను. అవతారకథావర్ణనము మహాపురాణసంప్రదాయమునకుఁ జెందిన శైవవైష్ణవ పురాణములందుఁ గానఁబడినను అవి సర్గారంభములు. కావున బసవపురాణారంభమందలి యవతారకథాకథన మాసంప్రదాయమునకుఁ జెందినది కాదు. కావున జైనుల భవావళిని స్వీయమతానుసారము మార్చికొని వీరశైవపురాణారంభమున సోమనాథుఁడు నిలుపుకొనినాఁడు.

వీరశైవులకుఁ బ్రత్యక్షప్రత్యర్థులు జైనులు. జనాదరణ పాత్రములైన జైనపురాణనిర్మాణశిల్పలక్షణముల నెఱింగి సోమనాథుఁడు ప్రథమవీరశైవపురాణమును నిర్మించి ప్రజాహృదయమును జూఱగొన యత్నించినాఁడనుటలో నాశ్చర్యము లేదు. అతఁడు భవావళితోనే ఆగి పోలేదు. తదితరలక్షణములను గూడ తన పురాణమునఁ బరోక్షముగఁ బాటించినాఁడు. వానిని గొంత పరిశీలింతము.

జైనపురాణప్రధానవస్తువులైన తీర్థంకరచరిత్రలలోఁ బంచకల్యాణములు (లేకపంచమహోత్సవములు) విపులముగా వర్ణింపఁబడినవని గమనించితిమి. బసవపురాణమునందును బసవేశ్వరుని చరిత్రమున వాని ప్రతిబింబములు స్పష్టముగాఁ గానవచ్చుచున్నవి. మాదాంబాగర్భసంజాతునిగా బసవేశ్వరునిజన్మవృత్తాంతము వర్ణించునెడ గర్భావతరణకల్యాణకథాసాదృశ్యము స్పష్టమగుచున్నది. జైనుల జన్మాభిషేకకల్యాణమున నింద్రాదులు శిశువునకు క్షీరాభిషేకాదులు చేయుట వర్ణింపఁబడఁగా బసవనిజన్మాభిషేకోత్సవము మఱియొక విధముగా సాగినది. ఇచ్చట బసవేశ్వరజననశుభవేళ సంగమేశ్వరుఁడు ప్రత్యక్షమై "ఈభవమున కేన చూ గురుఁడ" నని చెప్పి, లోకహితార్థమైన యాతని యవతారవిశేషము నుగ్గడించుట, నాపై తల్లిదండ్రులు జంగమపాదతీర్థముచే నాబాలుని మేను గడిగి, విబూదిపూఁతలు పూయుట మొదలగునవి జన్మాభిషేకోత్సవములు. జైనులకు క్షీరాభిషేక మెంతపవిత్రమో వీరశైవులకు జంగమపాదతీర్థసేచన మంతపవిత్రము. ఇఁక జైనపురాణములందలి పరినిష్క్రాంతికి బదులు బసవేశ్వరుఁ డుపనయనము మాని వీరమాహేశ్వరవ్రతదీక్ష వహించుట వర్ణింపఁబడినది. కైవల్యబోధోత్సవమునకుబదులు సంగమేశ్వరుఁడు

బసవేశ్వరున కొనర్చిన ప్రబోధకథాఘట్టము నిర్వహింపఁబడినది. పరినిర్వాణ మహోత్సవ స్థానమున బసవనిజ్ఞానబోధలు, లింగైక్యము వర్ణింపఁబడినవి. ఇవి యిట్లుండగా శైవమతసంబంధములైన పంచాచారములును, అష్టావరణాదులును బసవేశ్వరజీవితవృత్తాంతమునఁ బ్రతిబింబించునట్లు సోమనాథుఁడు కథాకల్పనలు గావించెను. ఇట్లు తీర్థంకరజీవితకథాకథనమునందలి జైనపురాణలక్షణములను స్థూలముగా గ్రహించి, ప్రజాదరణసంపాదనార్థము వీరశైవప్రథమపురాణమునందుఁ బ్రవేశపెట్టినను, బసవేశ్వరచరిత్రమును పాల్కురికి సోమనాథుఁడు స్వతంత్ర ప్రతిభతోఁ దీర్చిదిద్ది తన వ్యక్తిత్వమును ప్రదర్శించెను.

బసవపురాణమున శివభక్తులకథలు పెక్కువర్ణింపఁబడినవి. ఆభక్తులలో బసవేశ్వరునకు సమకాలీనులైనవా రున్నారు. వారిలో అల్లమప్రభువు, ముగ్ధ సంగయ్య, మడివాలు మాచయ్య, సిద్ధరామయ్య, సకలేశ్వర మాదిరాజయ్య, కిన్నర బ్రహ్మయ్య, కన్నద బ్రహ్మయ్య, కలకేత బ్రహ్మయ్య, మోళిగ మారయ్య, ముసిడి చౌడయ్య. సురియ చౌడయ్య, తెలుగు జొమ్మయ్య, ఏకాంత రామయ్య, షోడ్డలదేవు బాచయ్య, సివనాగుమయ్య మొదలగువారు ముఖ్యులు. వీరు కాక పురాతనభక్తులు పెక్కు రీపురాణమున కెక్కి యున్నారు. వారిలో చాలమంది ద్రవిడదేశమున నయనార్లుగాఁ, బ్రసిద్ధి చెందియున్న 'అఱువత్తుమూవురి'లోనివారే. వారిచరిత్రలు తమిళమున పెరియపురాణమునందే కాక కన్నడమున హరీశ్వరుని శివగణదరగళె యను గ్రంథమునందును గాననగుచున్నవి. వానిని సోమనాథుఁడు యథావకాశముగాఁ దన పురాణమునఁ బొందుపఱచెను. అయినను సోమనాథుఁడు చిత్రించిన భక్తకథ లొకమూలమునకుఁ గట్టుబడినవి కావు; స్వతంత్రకల్పనామహనీయములు.[1]

జైనపురాణములందు ప్రధానకథలో త్రిషష్టిశలాకామహాపురుషులచరిత్రములు యథావకాశముగాఁ, బొందుపఱచుట యొకప్రధానలక్షణము. జైనులకువలె శైవుల కఱువదిమూవురు నయనార్లు కలరు. ఇచ్చట వీరిరువురికి సంఖ్యాసామ్య ముండుట గమనింపఁదగిన యంశము. ఈసామ్యమును గమనించియే కాఁబోలు సోమనాథుఁడు జైనపురాణసంప్రదాయమునకుఁ బ్రతిగా నఱువత్తుమూవురు నయనార్లకథలను (వారందఱు వీరశైవులు కాకపోయినను) గ్రహించి దేశీయ మైన సంప్రదాయముతో పాటు శివభక్తాభీష్టమును గూడ పాటించె నని తలంప వీలగుచున్నది.

1. బసవపురాణ పీఠిక – కర్త: కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. (ఆంధ్ర గ్రంథమాల) పుట 29.

సమకాలీనభక్తుల చరిత్రములు బసవనితో ముడివడియున్నను, పురాతన భక్తచరిత్రములు తత్కథాసందర్భములందు దృష్టాంతరూపములుగాఁ జెప్పఁబడినట్లు కూర్చుట సోమనాథుని కథాసంవిధాననైపుణ్యము. పురాతనభక్తులలో ముగ్ధభక్తులు కొందరు కలరు. "నిక్క మీశ్వరుఁ గాని నిజ మెఱుంగమిని, ముక్కంటిభక్తులు ముగ్ధలుగారె?" అని బసవేశ్వరుఁడు ముగ్ధభక్తుల స్వభావమును బేర్కొనినాఁడు. వీరన్యభక్తులవలె వీరమాహేశ్వరవ్రతపారీణులై యున్నను అధికముగా నమాయకులు, నిరాడంబరులు, స్నిగ్ధ ప్రవృత్తి కలవారు. స్వచ్ఛమైన వాత్సల్యము, పారవశ్యముతోఁ గూడిన భక్తిభావము, వెన్నవంటి హృదయము, శివుని గాంచినంతనే ఆప్తుని వలె, మిత్రునివలె, పుత్రునివలె భావించి ముగ్ధభావముతోఁ గీర్తించి, సేవించి లాలించెడి స్నేహభావము వారికి వెన్నతోఁ బెట్టిన సుగుణజాలము. వీరు శివుని కొఱకై ప్రాణములనైనను త్యజింప సిద్ధమై త్యాగోత్సాహముతో భక్తివీరులై యొప్పువారు. రుద్రపశుపతి, నక్కనైనారు, బెజ్జమహాదేవి, గొడగూచి, దీపద కళియారు, నాట్యనమిత్తండి, ఉడుమూరు కన్నప్ప, కళియంబనయనారు, సకలేశ్వర మాది రాజయ్య, ముగ్ధ సంగయ్య మొదలగు ముగ్ధభక్తుల చరిత్రము లీపురాణ తృతీయాశ్వాసమున వర్ణింపఁబడియున్నవి.

వీరశైవము భక్తి ప్రధాన మైన మతము. ఆభక్తి ఆవేశప్రధానమై సాహసోపేతము లైన యద్భుతకార్యములచేఁ బ్రపంచిత మగుచుండును. వీరశైవులందు స్వీయమతాభినివేశ మెంత యుండునో పరమతద్వేష మంత కానవచ్చుచుండును. వీరమాహేశ్వరవ్రతుఁ డైన జంగముఁ డేకులమునకు, ఏవృత్తికిఁ జెందినవాఁ డైనను శివునివలెఁ బూజనీయుఁడే; సహపంక్తిభోజనాదుల కర్హుఁడే. ఇట్టి భక్తిసంప్రదాయము వీరశైవమత ప్రత్యేకతను వ్యక్తీకరించుచున్నది. సోమనాథుఁడు వీరశైవమత స్వభావములను స్పష్టపఱచునట్టి విధముగా భక్తకథాసంవిధానమును బసవపురాణమున నిర్వహించెను. బసవపురాణపాత్ర లందఱిలో సాత్త్వికుఁడుగా, అత్యుత్తముఁడుగా మహామహిమాన్వితుఁడుగా బసవేశ్వరుఁడు కానవచ్చుచున్నాఁడు. బసవేశ్వరుఁడు జంగమారాధన మొనర్చు వీరమాహేశ్వరవ్రతాచార్యుఁ డయ్యును అవతారపురుషుఁ డనియు, శివునకును బసవనికిని భేదము లే దనియు నిరూపించుట యీపురాణ తాత్పర్యము. శివభక్తి యన్నను, బసవభక్తి యన్నను భేదము లేదు. పరమ శివుఁడే "త ప్ప దే నతఁ డని తర్కించి చూడ!" అని పలికియున్నాఁడు. శివుఁ డవ్యక్తలింగము, బసవఁడు సాకారలింగము. ఇట్లు బసవని శివునితో నభేద మొనర్చుట కై యీపురాణము పుట్టినది. సాకారలింగరూపుఁడైన బసవేశ్వరుఁడు

వీరశైవులకు పరమప్రామాణికుఁడు. వారి పురాణమున కతఁడే నాయకుఁడు. అతని యందు భక్త్యావేశము పరాకాష్ఠ నొందినట్లు సోమనాథుఁడు చిత్రించెను.

"వడిఁ బొరుజలమున కొఁడలెల్ల కాళ్ళు
వడిఁ గాలు చిచ్చున కొడలెల్ల నోళ్ళు
వడి వీచు గాడ్పున కొడ లెల్లఁ దలలు
వడి చేయు బసవన కొడ లెల్ల భక్తి."

ఇట్టి నాయకుని వీరశైవభక్తి చరిత్రము వర్ణింపఁబడిన పురాణము 'భక్తివీర' రస ప్రధాన మనఁదగి యున్నది.[1] తద్రసపుష్టి సర్వాంగసుందరముగా నిర్వహింపఁ బడునట్లు సోమనాథుఁడు కథలను తీర్చిదిద్దెను.

మతమునకు విశ్వాస మాధారము; శక్తి భక్తి. విశ్వాసము వీరశైవభక్తుల యద్భుతమహిమలవలనను వారు సాధించిన మతవాదవిజయములవలనను పఠిత చిత్తమునం దేర్పడును. శివభక్తుల శివారాధనవిధానవిశేషములవలనఁ బఠితకు భక్తి స్ఫురించును. అందును ముగ్ధభక్తులచరిత్రములు హృదయవాదులను, వీర భక్తులచరిత్రలు బుద్ధివాదులను అధికముగా నాకర్షింపఁకలుగును. సోమనాథుఁడు బసవపురాణమున బసవనియుదాత్తచరిత్రము ముందుగాఁ గొంత వర్ణించి యతని యందు ప్రామాణ్యబుద్ధిని బఠితకుఁ గల్పించి, ముగ్ధభక్తులచరిత్రలచేఁ బఠిత హృదయము నార్ద్రపఱచి భక్తిబీజములు నాటి, మడివాలు మాచయ్యవంటి వీర భక్తులకథలు చెప్పి శివభక్తిసిద్ధివలన గలిగెడు మహిమలను గీర్తించి, యహంకార విరహిత మైన భక్తిప్రపత్తిని పోషింపఁగలుగు దృష్టాంతరూపభక్తకథలను జెప్పియు, కిన్నర బ్రహ్మయ్యవంటి భక్తులకు శివునిబలికించు మహిమలు గలవనియు, ముసిడి చౌడయ్య వంటి భక్తులు ప్రాణప్రదానసమర్థు లనియు, ఏకాంత రామయ్య వంటి భక్తులు జైనాదులగు పరమతస్థులను స్వీయమహిమలచే నిగ్రహింపఁ గలుగుదు రనియుఁదెల్పెను; షోడ్డలదేవు బాచయ్య కథవలన పరమత ఖండన శైవమతసంస్థాపనలకవసరమైనపరిజ్ఞానమును, శివనాగుమయ్యకథవలన శివ భక్తిసిద్ధి కంత్యజులైన నర్హు లగుదు రనియు నిరూపించెను. భక్తియుక్తము లైన చిత్తములందే విశ్వాసము నిశ్చలమై నిలుచును. నిశ్చల మైన విశ్వాసము భక్తిని ప్రదీప్త మొనర్చును. కావున పరస్పరపోషకములైన భక్తివిశ్వాసములను సోమ నాథుఁడు క్రమవికాసరమణీయముగా పురాణమునఁ బొందుపఱచెను.

1. వీరరసము — జి. వి. సుబ్రహ్మణ్యం. పుట 253.

బసవపురాణమున నాయకుఁడు బసవేశ్వరుఁ డైనచోఁ బ్రతినాయకుఁడు బిజ్జలుఁ డగును. బిజ్జలుఁ డొక వింతప్రకృతి కలవాఁడు. బసవనివెలుఁగుక్రింది క్రీనీడవంటివాఁ డాతఁడు. వీరమాహేశ్వరాచారులమహిమలు చెవులార వినుచు, కన్నులారఁగాంచుచు, బసవనిఁ బూజించుచు, తన్మతమును గౌరవించుచు నాతఁడు మాత్రము వీరశైవుఁడు కాలేదు. అగుటకుఁ దగిన మౌలికమైన గుణము – విశ్వాస-మతనికి లేదు. దానివలన భక్తి జనింపలేదు. లేనిచో విస మారగించి యపరగరళ కంఠునివలె నొప్పారిన బసవనియొక్క చరితము ప్రత్యక్షముగఁ జూచినతరువాతఁగూడ వీరశైవులకు నిష్కారణహాని తలపెట్టఁ గలఁడా ? మహారాజైనను, మహాభక్తునిఁ దనకొలువున బండారిగా నిలుపుకొనిన పుణ్యాత్ముఁ డయ్యును, అతఁడు భక్తిబీజ ములు మొలకెత్తఁజాలని శుష్కకఠినహృదయక్షేత్రము కలవాఁడు. అతనికిఁ గలిగిన కావ్యాంతమరణము సార్థకమే. శివాపరాధమునకు వీరశైవమున మరణమే దండ నము కదా ! మతపురాణమున మతమూలప్రకృతు లైన భక్తివిశ్వాసములు లేని కఠినునిఁ బ్రతినాయకునిగాఁ జిత్రించుట సోమనాథుని కథానిర్మాణరహస్యము.

బసవపురాణమున బిజ్జలసంహారఘట్టము చిత్రముగాఁ దీర్పఁబడినది. శివ భక్తుల కపచారము గావించిన బిజ్జలుని శపించి కల్యాణకటకమును వీడి బసవేశ్వ రుఁడు సంగమక్షేత్రము చేరుకొనెను. జగదేవదండనాయకు నదివఱకే బిజ్జలసంహా రార్థము బసవేశ్వరుఁడు నిర్దేశించియుండెను. అతఁ డావని చేసి బాసను గాపాడు కొనెను. శాపానుగ్రహశక్తియుక్తుఁడును, ప్రాణప్రదానోపసంహరణసమర్థుఁడు నైన బసవఁడే బిజ్జలునిఁ జంపి, వీరశైవధర్మమును గాపాడుకొని యుండవచ్చును కదా ! సోమనాథు డట్లేల కల్పింపలేదు ? దీనికి సమాధానము: చరిత్ర అడ్డము వచ్చె నని యైనను చెప్పవలెను; లేక కవి బసవనియుదాత్తచరిత్రము నౌచిత్యసంభరితము చేయ నెంచె నని తలంపవలెను. లేనిచో కథ నిట్లు చిత్రించుటలో జైనపురాణప్రభావ మున్నదని యూహింపవలెను. మునిసువ్రతుఁడను నిరువదియవతీర్థంకరుని చరిత్ర మున బలదేవుఁ డగు రామచంద్రుఁడును, వాసుదేవుఁ డగు లక్ష్మణుఁడు నన్నదమ్ము లైనట్లును, ప్రతివాసుదేవుఁడు రావణుఁడైనట్లును జెప్పఁబడి యున్నను, రామచంద్రుఁ డాసన్నభవ్యుఁ డగుటచే రావణసంహారము చేయ నొల్లక దూరభవ్యుఁడైన లక్ష్మణు నిచే తత్సంహారము నిర్వహింపఁ జేసె ననియుఁ గల్పింపఁబడినది. జైనులలో దూరభవ్యులకంటె నాసన్నభవ్యులు కర్మబంధవిముక్తి నధికముగా సాధించి కేవల జ్ఞానసిద్ధి కతిసన్నిహితులై యున్నవారుగాఁ బరిగణింపఁ బడుదురు. కావున నట్టి

పాత్రముల కెట్టి హింసాకాండయు నంటఁగట్టరు. ఇట్టి జైనపురాణకథాపాత్రసంవిధాన సంస్కారమును సోమనాథుఁడు గ్రహించి లింగైక్య మందఁబోవుచున్న బసవనిచే బిజ్జలునిసంహారము గావింపఁజేయక, వైదికకర్మాసక్తి కలిగియు బసవనిఁ బూజించిన జగదేవదండనాయకుని ద్వారమున దానిని నిర్వహింపఁ జేసి బసవని విశుద్ధ సాత్త్వికశీలసంపదను బరిపోషించెను.

కర్ణాటాంధ్రములయందు జైనపురాణములు వైదికపురాణముల కెదురునిలిచి ప్రజాదరణఁ బొందుటకు యత్నించినవి. కొంతకాల మాపురాణములు ప్రజల హృదయసీమలపై రాజ్యము చేసినవి. వానిపైఁ బోటీపడి జనాదరణము నొందుటకై వీరశైవులు ప్రథమపురాణనిర్మాణయత్నము గావించిరి. సోమనాథునిపై నా భార ముంచిరి. అతఁడు జైనపురాణనిర్మాణములోని లోగుట్టులు తెలిసి వానిని బ్రచ్ఛన్నముగఁ గొల్లగొట్టి వీరశైవపురాణము ప్రజల నాకట్టుకొనఁ గలుగునట్లు నిర్మించెను. ఇట్లనుటచే జైనపురాణలక్షణము లన్నింటిని సోమనాథుఁ డనుకరించెనని తాత్పర్యము కాదు. తనగ్రంథప్రణాళిక కొదగినంతవఱకు వానిని నిపుణముగా గ్రహించి స్వీయప్రతిభతో స్వతంత్రపురాణరచనావిధానము నాతఁ డేర్పఱచుకొనెను. బసవపురాణము పుట్టుటతో నాంధ్రమున నార్షపురాణరచనాసంప్రదాయ మంతరించుచున్న దనియే కాఁబోలు తిక్కనసోమయాజిశిష్యుఁడైన మారన యోరుగల్లులోనే మఱల మహాపురాణరచనోద్యమము నారంభించెను. ఆపైన పోతన భాగవతమహాపురాణము ననువాదము చేసెను. ఇట్లు తెలుఁగున మహాపురాణసంప్రదాయమునకుఁ జెందిన మార్కండేయాదిపురాములయనువాదమునకు దేశిపురాణమైన బసవపురాణము ప్రబలహేతు వైనది. సోమనాథుని పుణ్యమా యని దేశిమార్గసంప్రదాయములలోఁ బుట్టిన యాంధ్రపురాణతరంగిణుల కోరుగల్లు సంగమతీర్థమై తారసిల్లినది.

మారన హరిశ్చంద్రోపాఖ్యానము

హరిశ్చంద్రచరిత్రము వేదపురాణలౌకికవాఙ్మయములందు బహువిధములుగాఁ గీర్తింపఁబడియున్నది. కాని మార్కండేయపురాణమునందు వలె ద్రౌపదేయజన్మకథాహేతువుగా నెచ్చటను గీర్తింపఁబడియుండలేదు.

విశ్వాఖ్యదేవతలు విశ్వామిత్రమహర్షిశాపముచే నుపపాండవులుగా జన్మించిరను ఉదంతమును పురాణకర్త హరిశ్చంద్రోపాఖ్యమున జక్కఁగాఁ బొందుపఱచెను. విశ్వామిత్రుఁడు కపటోపాయమున హరిశ్చంద్రుని సామ్రాజ్యసంపద హరించి యతనిని రాజ్యమునుండి బహిష్కరించెను. ధర్మబుద్ధి యైన యాచక్రవర్తి నారచీరలు ధరించి భార్యాపుత్రసమేతముగ నగరు వెడలి పోవునెడ రాజసూయాధ్వరదక్షిణలకై ప్రతిశ్రుతము చేసిన యర్థము నామహర్షి కోరెను. విత్తహీనుఁడైన యానరవరుఁ డామునివర్తనమున కెంతయో సంకటపడియు సత్యవ్రతనిష్ఠుఁ డగుటచే నాయర్థ మిచ్చుట కొకమాసము గడువు కోరుకొనెను. ముని యందుల కంగీకరించి రాజును దీవించి పంపెను. హరిశ్చంద్రుఁడు వల్కలాజినధారియై, పాదచారియై యిలు వెడలి, నగరు వీడి, సగరము వీడిపోవుచుండ పౌరు లాతని దీనదశను గాంచి యపారదుఃఖవారాశిలో మునిఁగిరి. హరిశ్చంద్రునితోడిదే తమబ్రతుకని యూర్చుచు వా రతనియడుగులపైఁ బడి యతనియడుగులు ముందుకు సాగనట్లు చేసిరి. అందుచే రా జించుక నిలువఁబడెను. అది యమ్మహర్షి కొకమహాపరాధమైనది. భగ్గుమని మండిపడినాఁడు విశ్వామిత్రుఁడు; హరిశ్చంద్రుఁడు జనసమూహము నండగాఁ గొని తన కిచ్చినరాజ్యమును మఱల కబళింప యత్నించుచుండెనని యతనిపై నభాండము వైచి నిందించినాఁడు. అంతటితో నాఁగక కోమలి యైన శైబ్యను దనప్రచండహస్తదండముతోఁ దాడింప నారంభించినాఁడు. క్షమామూర్తి యైన హరిశ్చంద్రుఁడు మాఱుపలుకలేదు. భయవిహ్వలు లైన ప్రజలు కిమ్మనలేదు. విశ్వాఖ్యదేవతల కాదృశ్యము హృదయవిదారకమై పొడగట్టినది. అప్పుణ్యసాధ్వి నవ్విధముగా బాధించుచు నన్నరేశ్వరు నవ్విధముగఁ గాఱియవెట్టు నమ్మహర్షికిఁ బుణ్యలోకము లుండ వని యావేశముతో నాదేవతలు బిగ్గరగాఁ బలికిరి. విశ్వా

మిత్రునకు వారిమాట లగ్గిలో నాజ్యము పోసి నట్లయ్యెను. మనుష్యపక్షపాతముచేతఁ దనను గర్హించినందుల కావిశ్వాఖ్యదేవతలు మానవులై జన్మించునట్లు ముని శపించెను. కాని వెంటనే యతఁడు వారియందు ప్రసన్నుఁడై వారు మానవులై పుట్టినను బ్రహ్మచారులై కామక్రోధలోభమదమోహమాత్సర్యములకు లోనుగాక యల్పకాలమున శరీరములు విడిచి దేవభావము పొందునట్లు శాపావసానమును ప్రసాదించెను. ఆపై నావిశ్వాఖ్యదేవతలు ద్రౌపదీగర్భమున నుపపాండవులై జన్మించి కృతదారపరిగ్రహులు గాక యనాథులవలె మృతినొందిరి. ఇట్లు ద్రౌపదేయ కథామూల మగు వస్తుగౌరవము మార్కండేయపురాణమునందలి హరిశ్చంద్రోపాఖ్యానమునకు దక్కుచున్నది.

ఈయుదంతము సత్యమే కావచ్చును. లేక పౌరాణికప్రతిభాజన్యమైన కల్పనావిశేషము కావచ్చును. ఎట్లైనను ఇచ్చట హరిశ్చంద్రకథారహస్యవ్యంజకమును, తత్కథాసంవిధానవివేకప్రదమును నగు నీకథార్థము సార్థక మనుటలో విప్రతిపత్తి లేదు.

హరిశ్చంద్రునివృత్తాంతము చదువువారికిఁ జివరివఱకు నొకశంక మనమున నిలిచియుండును. అది విశ్వామిత్రవిచిత్రప్రవృత్తికి సంబంధించినది. సత్యధర్మ నిరతుఁడైన హరిశ్చంద్రుని నామహర్షి నిష్కారణముగా నిడుమలఁ బాలుచేయు చుండెను. అతని కచ్చెకు బలీయమైన లౌకికకారణము లేదు. పైకిఁ జూచినచో హరిశ్చంద్రుని సత్యధర్మనియతిని బరీక్షింప నాఋషి యత్నించె నని మాత్రము స్ఫురించును. కాని లో నారసి చూచినచో హరిశ్చంద్రుని యవశ్యభోక్తవ్య మైన దుఃఖము నుపభోగింపఁజేయుటకై విధిప్రేరితుఁడై విశ్వామిత్రుఁడు వ్యవహరించె నని స్పష్టమగును. ఈయర్థమును గథాంతమున యమధర్మరాజు హరిశ్చంద్రునకుఁ దెలియఁజెప్పినాఁడు. 'రాజ్యాంతే నరకం ధ్రువ' మ్మని యార్యోక్తి. రాజగు ప్రతి వాఁడును నారకబాధల ననుభవింపక తప్ప దని వేదప్రామాణ్యముతో భారతమున ధర్ముఁడు తెలిపియున్నాఁడు.[1] అందువలననే ధర్మజుఁడు, లవణుఁడు మొదలగు

---

1. "విను మొక్కటి సెప్పెద రా
జను వానికి నెల్లఁ దప్ప దవనీశ్వర యె
ట్లును నారకస్థలంబుం
గనుఁగొనవలయు టిది వేదకథితము సుమ్మీ!
—ఆం. మ. భా. స్వర్గా. ప. 38.

చక్రవర్తులు సశరీరనరకబాధ లనుభవించియుండుట. ధర్మజుఁడు సశరీరుఁడై నరక దర్శనము చేయఁగా హరిశ్చంద్రుఁడు చండాలస్వరూపధారి యైన యమధర్మరాజు సేవలు సేయుచు శ్మశానమున నరకబాధలకుఁ దుల్యము లైన దుఃఖములను బండ్రెండునెల లనుభవించెను. లవణరా జైంద్రజాలికమాయాకల్పిత మైన స్వప్నమున జండాలాంగనాసంపర్కజన్యము లైన దుఃముల నెన్నింటినో భరించెను. హరిశ్చంద్రుఁడును స్వప్నగత మైన ద్వాదశవర్షనారకబాధలను సత్యము లైనట్లనుభవించినాఁడు. వీని కన్నింటికిని "అవశ్యభావి యైన దుఃఖము భోక్తవ్యం బగుట" (మా. పు. 1. 276) కారణమని ధర్మనివ్యాఖ్యానము. అనఁగా బునర్జన్మరహిత శాశ్వతదివ్యలోకావాసము సేయఁబోవు హరిశ్చంద్రునకు సార్వభౌమ సహజ మైన నారకబాధలు తజ్జీవితకాలమునందే యనుభవింపఁ జేసి పాపక్షయ మొనర్పఁజేయ విధి కల్పించిన విధానమే యిక్కథారహస్య మని భావము. హరిశ్చంద్రునివాక్కున నావేశించిన విఘ్ననాయకుఁడును, ఉద్యద్వైశ్వానరమూర్తి యై విజృంభించిన విశ్వామిత్రుఁడును చండాలవేషధారియై వారణాసీశ్మశానవాటికాధ్యక్షుఁడైన ధర్మదేవుఁడును విధిప్రేరిత మైన యీమహానాటకమును నిర్వహింప భూమికలు దాల్చిన దివ్యనటులు. హరిశ్చంద్రున కేర్పడిన యిక్కట్టులు తాత్కాలికముగా నతనికి దుఃఖహేతువులైనను పర్యంతమున శాశ్వతదివ్యభోగప్రదము లై రాణించుచుండుట యీకథలోని దివ్యరహస్యము. దివ్యచక్షువు లైన విశ్వాఖ్యదేవత లాదివ్యరహస్యమును గమనింపక తనను గర్హించుటచే విశ్వామిత్రుఁ డుగ్రుఁ డైనాఁడు. వారు "మనుష్యపక్షపాతు లై" రని శపించినాఁడు. అతఁడు ప్రయోగించిన 'మనుష్యపక్షపాత' మను శబ్దము పఠితయొక్క దృష్టి నీకథయం దంతర్లీన మై భాసించు మానవాతీత మైన దైవశక్తివైపు మరలించును. అప్పుడు కథ ప్రసన్నమగును. ఇదియే ద్రౌపదేయకథాప్రసక్తివలన హరిశ్చంద్రోపాఖ్యానమునకుఁ గలుగు పరమప్రయోజనము !

హరిశ్చంద్రోపాఖ్యానము కాలక్రమపద్ధతి ననుసరించి చెప్పఁబడినది. కాని యేతత్కథాజీవితపరమరహస్యము నిర్వహణమునందుగాని బోధపడుటలేదు. దాని నీకథాబీజమునందు నిబంధింపక ఫలాగమమునందు ప్రతిష్ఠించి కథకుఁ డీకథయందు కళాకౌశల్యము ప్రదర్శించెను. అట్లు చేయుటవలన రెండుప్రయోజనములు కలుగుచున్నవి. ఒకటి : పఠితహృదయమున నుత్కంఠ పరిపోషింపఁబడి కథాక్రమముపై నతని కెడతెఱపి లేని ప్రీతి జనించును. రెండు : తత్తత్సన్నివేశములందు హరి

శ్చంద్రాదిపాత్రములచే నభివ్యక్తము చేయఁబడిన శోకాదిభావములు సహజములై భాసించి రసప్రతీతి కానుకూల్య మేర్పడును. ఈప్రయోజనములు ఫలవంతము లగుటకై పురాణకర్త సర్వకథార్థములను ఫలాభిగమ్యముగా ననుసంధించు రచనా శిల్పము నీకథయందుఁ బ్రపంచించినాఁడు.

కథాంతమున నింద్రుఁడు హరిశ్చంద్రునిసత్యధర్మనిరతికి మెచ్చి యాతనికి సశరీరస్వర్గసౌఖ్యములు ప్రసాదించెను. హరిశ్చంద్రుఁ డొంటిగా నాసుఖముల ననుభవించుట కిచ్చగింపలేదు: తనప్రజాకుటుంబమునకు లేని తనసుఖముకంటె నారక దుఃఖమే మేలని భావించినాఁడు !

క. "నాతోడఁగూడ సురపురి
కేతెంతురు పౌరు లొండె నేఁగుదుఁ బౌర
వ్రాతముతో నేనొండె సు
ఖేతర మగు నరకమున కహీనచరిత్రా !" —మా. పు. 1–280

ఈమాటలలో నామహాత్ముఁ డతనిసామ్రాజ్యప్రజల నెంతగాఢముగాఁ బ్రేమించుచుండెనో స్పష్టమగుచున్నది. రాజు ప్రజలను బ్రేమించుటయు, ప్రజలు రాజును సమాదరించుటయుఁ బరస్పరాశ్రితములైన విషయములు. ఇరువురు నుదాత్తులై యున్నపుడే యట్టివిశిష్టసమన్వయము సమకూరుట కవకాశ మేర్పడును. హరిశ్చంద్రుఁడు ప్రకటించిన ప్రజానురాగమునకు హేతువులైన కథార్థములును, ప్రజాహృదయరంజకుఁడైన హరిశ్చంద్రునిమహత్త్వమును బ్రతిపాదించు కథార్థములును ఈకథానిర్వహణమున కనుకూలములైన ప్రాతిపదికలై యీయుపాఖ్యానమున రాణింపవలసియుండును. ఈవిషయమును గమనించిన మారన యట్టికథార్థములను జాగరూకతతోఁ బూర్వకథాభాగమున నంతరించి యుత్తరకథార్థసమన్వయమున కెంతయో కృషి చేసినాఁడు. మూలమునందు రేఖామాత్రముగను, సంగ్రహముగను నున్న కథాంశముల నాదృష్టితో మారన పెంపుచేసియుఁ, గల్పనలుజోడించియు, వివరములు తేటపఱచియు, రసభావములఁ బోషించియు, విభావసంపద నుద్దీప్తమొనర్చియు సరసప్రబంధకథాంగబంధురముగా నీయుపాఖ్యానమును దీర్చిదిద్దెను. అట్టి మారనకథాశిల్పవైభవ మిచ్చట కొంత పరామర్శింపఁబడును.

ఉపాఖ్యానారంభమున నాయకవర్ణన ముదాత్తముగా నొనరించి మారన కథాశిల్పలక్ష్మికి నుజ్జ్వలశిరోరత్నము నలంకరించినాఁడు.

మూలము :

"హరిశ్చం ద్రేతి రాజర్షి రాసీ త్త్రేతాయుగే పురా
ధర్మాత్మా పృథివీపాలః ప్రోల్లసత్కీర్తి రుత్తమః॥
న దుర్భిక్షం న చ వ్యాధి ర్నాకాలే మరణం నృణామ్
నాధర్మరుచయః పౌరా స్తస్మి ఞ్ఛాసతి పార్థివే॥
బభూవు ర్న తథోన్మత్తా ధనవీర్యతపో మదైః
నాజాయ న్త స్త్రియ శ్చైవ కాశ్చి దప్రాప్తయౌవనాః॥"

—సం. మా. 7. 1-3.

మారన యనువాదము :

వ. తొల్లి త్రేతాయుగంబునందు.

సీ. ఎవ్వని మాహాత్మ్య మెప్పుడు వేదము
లెచ్చఁగి సుస్తోత్రము లేసేయుచుండు;
ఎవ్వనిశాసనం బేడుదీవులరాజు
లకు శిరోభూషణలక్ష్మి నొందు;
ఎవ్వనిరక్ష మహేంద్రాదిసురలకుఁ
బెట్టనికోటయై పెంపుఁ దాల్చు;
నెవ్వనిసత్కీర్తి యీయజాండం బెంత
యంతయుఁ దానయై యతిశయిల్లు;

తే. నట్టి మహితగుణాభరణాభిరామ
మూర్తి; ప్రత్యర్థినృపసమవర్తి; పరమ
పూజ్యసామ్రాజ్యవైభవస్ఫూర్తి నిత్య
సత్యవర్తి హరిశ్చంద్రచక్రవర్తి.

మ. ధరణీచక్ర మవక్రవిక్రమకళాదర్పం బెలర్పంగ నే
ర్పరియై నిర్మలసత్యధర్మనియతిం బాలించె దుర్భిక్షడం
బరదుఃఖంబులు జారచోరభయ మున్మాదజ్వరవ్యాధిదు
ర్మరణాదు ల్ప్రభవింబకుండఁ బ్రజ ధర్మప్రీతి వర్తింపఁగన్.

క. ధనరూపబలంబుల న
త్యనుపమవిద్యాతపోమహత్త్వంబుల భూ

జనులకు నొదవదు మద మ
జ్జననాయకు సత్యధర్మశాసనమహిమన్.

వ. ఇట్లు సత్యవ్రతగరిష్ఠుండును, ధర్మకర్మవరిష్ఠుండును నైన యారాజర్షి ప్రజాపాలనంబు సేయుచు. —1. 142-145.

మూలమునందలి మూఁడుశ్లోకములను మూఁడుపద్యములుగా మారన యనువదించినాఁడు. మూలమందలి సర్వాంశములను దెలుఁగునకుఁ దెచ్చుటయే కాక వస్తుతత్త్వ మెఱిఁగి కొంతవిశేషముగాఁ బెంచినాఁడు. మారన ప్రయోగించిన 'సత్యధర్మనియతి' యను సమాస మందులకుఁ జక్కనియుదాహరణము. మూలమునందు ధర్మాత్ముఁ డని చెప్పబడియున్నది కాని సత్యధర్మనిష్ఠుఁడని స్పష్టపరుపఁబడలేదు. ఈయుపాఖ్యానమున హరిశ్చంద్రుని సత్యనిష్ఠమైన ధర్మవీరము పోషింపఁబడినది. దానివలన నతనికి 'సత్యహరిశ్చంద్రాఖ్య' సార్థకమైనది. ఈకథలోని ప్రతిపాత్రయు సత్యవ్రతప్రాధాన్యము నుగ్గడించుచు నాయకసత్యధర్మమును బోషించెను. హరిశ్చంద్రునిధర్మపత్ని యగు శైబ్య పతిని సత్యవాక్యపాలనమునకుఁ బురికొల్పుచు- 'మేటిధర్మంబు సత్యంబ యండ్రు' (1. 195), 'బొంకుకంటెను జావైన బొంకమనఘ' (1. 198) యని ప్రబోధించి సహధర్మచారిణి యనిపించుకొనినది. విశ్వామిత్రుఁడు సైతము మారాజును 'సత్యనిష్ఠఁ బొందు' (1. 206) మని యాశీర్వదించినాఁడు.

క. "సత్యమున నున్న దీధర;
సత్యమున వెలుంగుఁ దరణి: సత్యముననె తా
నిత్య మయి స్వర్గ మమరును;
సత్యము ధర్మములలోఁ బ్రశస్తం బనఘా!

తే. వినుము తుల నిడి యెత్తుచో వేయితురగ
మేధములకంటె సత్యంబు మిగులఁ దూఁగెఁ
గాన సత్యయుక్తుండవు గమ్ము!" (1, 207-208)

అని హెచ్చరించినాఁడు. మచ్చరమునఁ గల్లబొల్లిమాట లెన్ని యన్నను సత్యమును గూర్చి సత్యము పలికినాఁ డామహర్షి. విశ్వామిత్రుఁడు సాధ్వియైన శైబ్యను చేతికోలతోఁ దాడించుచున్నందులకే గాక 'సత్యనిష్ఠం బెంపెక్కిన' (1. 186) హరిశ్చంద్రుని గాసిపెట్టుచున్నందులకు విశ్వాఖ్యదేవత లామునివరునిపై నక్కటి

కము దాల్చి రని మారన వర్ణించెను. మూలమున యజ్ఞకర్త యైన హరిశ్చంద్రుని బాధించుచున్నందులకు దేవతలకు జాలి కలిగెనని చెప్పఁబడియున్నది. యజ్ఞయాగాదులచేత దేవతలఁ దృప్తిఁ బఱచిన రాజుపై సురలు జాలి ప్రకటించి రని మూలకర్త వర్ణింపఁగా హరిశ్చంద్రుని సత్యనిష్ఠయే యతనికి నిడుమలఁ దెచ్చి పెట్టిన దని దేవతలు జాలిపడినట్లు మారన చిత్రించెను. ఈకథయందు నాయకుని సత్యనిష్ఠకుఁ బ్రాధాన్య మిచ్చుట యుచిత మని మారన నిష్కర్ష !

మారన కాశీనగరప్రవేశము చేయు హరిశ్చంద్రుని వర్ణించుచు 'తొలఁగని సత్యధర్మములు తోడుగఁ దాలిమి యాది' దుఃఖములఁ దరించుచుండె నని పేర్కొనెను. అనఁగా నాతేనికి సత్యధర్మము లంగరక్ష లనియు, ఓరిమియే పూనిక యనియు కవిభావము. కథాంతమున సమరేంద్రుఁడు హరిశ్చంద్రునిగూర్చి చెప్పినమాటలు :

చ. "నరుల కగమ్యమై వెలుఁగు నాకము నీ కభిగమ్య మయ్యె నీ
నిరుపమసత్యధర్మమహనీయత శాశ్వతదివ్యభోగముల్
దొరకొనియె న్నరేశ్వర ! సుతుండును భార్యయు నీవు నూత్నర
త్నరుచిర సద్విమానము ముదమ్మున నెక్కుఁడు రండు." —(1. 274)

శాశ్వతదివ్యభోగములకు సత్యధర్మమహనీయత హేతు వని సురేంద్రుఁడు పల్కినట్లు మారన. పురాకృతసుకృతకర్మఫలముగా నాభోగము లాతేనికి దొరకుచున్న వని మూలము (8. 248). మూలమునందు స్పష్టముగాని సత్యధర్మనిష్టను మారన తనరచనమున విస్పష్ట మొనర్చెను. ఇట్లు కథారంభగర్భనిర్వహణములందు షడ్లింగములచేతఁ బ్రధానప్రతిపాద్యకదార్ఢమును ధ్వనింపఁజేయుట మారన కథాకథన శిల్పము !

కథారంభనాయకగుణకీర్తనమునం దతని యంతర్వ్యక్తిత్వమును వ్యంజింపఁజేసినాఁడు మారన. మొదటిపద్యమున హరిశ్చంద్రుని చక్రవర్తిత్వమును, రెండవపద్యమున నతని ధర్మపాలనదక్షతను, మూఁడవదానియం దాతఁడు సామ్రాజ్యపౌరులఁ దీర్చిదిద్దినవిధమును వర్ణించి తాత్పర్యమున నతని ధీరోదాత్త నాయకత్వమును స్థాపించినాఁడు. కులీనత్వాది నాయకసామాన్యగుణములను కవి మొదట నిరూపించెను. వేదము లతని మాహాత్మ్యమును గీర్తించు ననుటచే నతఁడుత్తమశ్లోకుఁ డనియు, సప్తద్వీపవసుంధరావలయ మాతనిశాసనము శిరమున

దాల్చు ననుటచే నాతఁడు విశ్వంభరాధిపత్యమను మహాభాగ్యముచే నొప్పారెడువాఁడనియు, మహేంద్రాదుల కాతనిరక్ష పెట్టనికోట యని చెప్పుటచే నాతఁడు త్రిలోకరక్షాదక్షుఁడైన ప్రతాపుఁ డనియు, బ్రహ్మాండ మంతయు వ్యాపించిన కీర్తి గలవాఁ డనుటచే దిగంతవిశ్రాంతకీర్తి యనియు, మహితగుణాభిరామమూర్తి యనుటచే నౌజ్జ్వల్యము, ఔదార్యము, తేజస్విత, ధార్మికత్వము, వైదగ్ధ్యము, ఆర్తావనత్వము, కావ్యగీతప్రియత్వము మొదలగు సుగుణముల కాకరమైనవాఁ డనియు; 'ప్రత్యర్థిసమవర్తి యనుటచే శత్రుభయంకరుఁ డనియు; 'బరమపూజ్యసామ్రాజ్య వైభవస్ఫూర్తి' యనుటచే వివిధాధ్వరనిర్మలధర్మకర్మల నెల్లవేళల నాచరించుట చేతఁ బ్రకటీకృతపూజ్యసామ్రాజ్యవైభవము గలవాఁ డనియు స్పష్టమగుచున్నది. అతని సామ్రాజ్యమునం దీతిబాధలు లేక ప్రజలు సుఖించుచుండిరి. ప్రభువు విక్రమకళాకుశలుఁడై దేశమును రక్షించుచుండుటయు, సత్యధర్మనియతాత్ముఁడై పుణ్యవర్తనుఁడై ప్రజలను బాలించుచుండుటయు, 'యథా రాజా తథా ప్రజా' యను న్యాయము ననుసరించి ప్రజలయందు ధర్మప్రీతి వర్తించుటయు నందులకుఁ గారణములు. ఆమహారాజు ధర్మశాసనము ననుసరించి నారాజ్యప్రజలు ధనరూపబలవిద్యాతపోమహత్త్వసంపన్ను లయ్యును మదాంధులు గాక వినయవివేకవంతులై వెలయుచుండిరి. ఇట్లు వర్ణించుటచే రాజు పరమధార్మికుఁడైన మహాత్ముఁ డనియు ప్రజారంజకుఁడైన పాలకుఁ డనియు, రాజర్షి యనియు నేర్పడుచున్నది.

శ్లో. "అధ్యాక్రాన్తా వసతి రమునాఽప్యాశ్రమే సర్వభోగ్యే
రక్షాయోగా దయ మపి తపః ప్రత్యహం సఞ్చినోతి
అద్యాపి ద్యాం స్పృశతి వశిన శ్చారణద్వంద్వగీతః
పుణ్య శ్శబ్దో ముని రితి ముహుః కేవలం రాజపూర్వః."

—అభిజ్ఞానశాకుంతలము. 2అం. 14 శ్లో.

అను కాళిదాసశ్లోకతాత్పర్యమును నాయకవర్ణనమున వ్యంజింపఁ జేయుటయే మారన హరిశ్చంద్రస్వరూపచిత్రణమునందలి రహస్యము! మూలమునం దాదియం దున్న రాజర్షి శబ్దమును ఫలితాంశముగా వర్ణనమున చివర నిలిపి మారన యాభావమును సూచించెను.

ఈయుపాఖ్యానమున సత్యవీర మంగిరసము. దాని కాలంబనము హరిశ్చంద్రుఁడు. వీరమునకు స్థాయి ఉత్సాహము. అది ధర్మప్రధానమై యుండవలెను. 'తతోఽర్థకామయో ర్ధర్మమూలకత్వాత్ ధర్మప్రధానో వీరః' అని యభినగుప్త

పాదులు. వీరము ధర్మైకరూప మయ్యును నిమిత్తభేదముచే భిన్నరూపము లయి భాసించుచుండును. రాగద్వేషరహితు లైన విద్వాంసులహృదయములచే నభ్యనుజ్ఞాత మగునది ధర్మ మని మనుస్మృతి. అది ధృతిక్షమాదయాస్తేయశౌచాది భేదముచే దశవిధము. అహింసాదులు తత్సాధనములు. అది ప్రవృత్తినివృత్తి భేదముచే ద్వివిధము. దశవిధధర్మలక్షణములలో సత్య మొకటి యైనను అది ధర్మశ్రేష్ఠ మని పురాణములు చాటుచున్నవి. (సం. మా. పు. 8. 18). హరిశ్చంద్రుఁడు దశవిధలక్షణాత్మక మగు ధర్మమును నిర్వహించుచునే సత్యనిష్ఠచేఁ బ్రదీప్తమైనయుత్సాహస్ఫూర్తినిఁ బ్రకటించియున్నాఁడు. సత్యవ్రతసిద్ధికై సర్వధర్మసంచయమును దాని కంగసముచ్చయముగా ననుసంధించుకొనినాఁడు కావున సత్యవీర మంగి యైనది. కథలో ధర్మతాత్పర్యము సత్యనిష్ఠగాఁ బరిణమించిన క్రమము గమనించినచో నీతాత్పర్యము స్పష్టపడఁ గలదు.

హరిశ్చంద్రుఁ డొకనాఁడు మృగయావినోదమున దగిలి యొకవనమున గ్రుమ్మరుచుండెను. ఒకచోట నాతనికి 'రక్షింపుడు రక్షింపు' డను నాడుకూయి బిగ్గరగా వినవచ్చినది. ఆరాజశేఖరుఁ డప్పుడు వేట చాలించి, డార్తత్రాణపరాయణత్వము మెఱయ, 'నోడకోడకు' డని యభయమిచ్చి, "ఏనుండ మిమ్ముల నన్యాయవృత్తి నెవ్వఁ దలంపఁగలఁ" డని యిట్లు గర్జించెను:

చ. "వెలుఁగు మహాప్రతాపశిఖివేడిమి దిక్కులు నించుచున్న నా
కొలఁది యెఱుంగ కెవ్వఁడొకొ పోరపుఁ జిచ్చటు చీరఁ గట్టెడి
న్దలరక యిట్టిదుర్మదు నధర్మపరు న్దురితాత్ముఁ జండదోః
కలితధనుర్విముక్తపటుకాండవిఖండితగాత్రుఁ జేసెదన్." —1. 52

ములుకులవంటి యీపలుకులకు విశ్వామిత్రుఁ డలిగి, వైశ్వానరసదృశుఁడయ్యెను. నిజ మప్పటికి గాని తేటపడలే దారాజునకు. పూర్వము వినవచ్చిన స్త్రీరోదనములు మునితపోగ్నితప్తములైన విద్యల యాక్రందనలు. మునితపము చెదరినంతనే విద్యలకు మోక్షము కలిగినది. వాని యావేదన లుడిగినవి. రాజు విద్యాక్రందనలను స్త్రీరోదనలని భ్రమించి క్షత్రియసహజ మైన యార్తజనరక్షణోత్సాహమును బ్రకటించి, దోషియైన ధూర్తునిపై రౌద్రము ప్రకటించినాఁడు. ధూర్తునకు బదులుగా దుర్వారక్రోధమూర్తి యగు కౌశికుఁడు ప్రత్యక్షమైనాఁడు. ఇందు హరిశ్చంద్రునివర్తనము దోషకలితము గాక ధర్మబద్ధమై యున్నది. దాని నాతఁడే మునికి సవినయముగా విన్నవించుకొనినాఁడు.

చ. అలుగకుమయ్య ! యోమునిజనాగ్రణి ! తప్పొక యింత లేదు నా
వలన నరేంద్రధర్మ మగు వాక్యమ పల్కితిఁ జిత్తగింపు మ
స్ఖలితము గాఁగ నిచ్చుటయుఁ గాచుటయు న్విలు చేతఁ బట్టి ని
శ్చలత రణంబు సేయుటయు శాస్త్రమతస్థితి రాజధర్మముల్."
—1. 157

హరిశ్చంద్రుని శాసనమహిమచే నాతని రాజ్యవాసు లెల్లరు ధర్మవ్రతులును, మదవిరహితులు నై యుండి రని వెనుక తెలుపఁబడినది. అట్టి ప్రజలు గల యా దేశమున నట్టి విపరీతవర్తనము విన్నను, కన్నను ఆరాజు మండిపడుటలో నాశ్చర్య మేమి కలదు ? అతఁడు ధర్మనిర్వహణమున విధివిరుద్ధముగా వ్యవహరింపలేదు. కావున విశ్వామిత్రుఁడు నిరుత్తరుఁ డయ్యెను. కాని రౌద్రము కౌశికుని నావహించినది. రౌద్ర మర్థప్రధాన మైనది. అర్థసాధనము ధర్మ మానుషంగికమైనది. కావున నామునివక్రమార్గము ననుసరించినాఁడు. "ఎవ్వరికి నిత్తు ? గాతు నీ వెట్టివారి ? రాజ ! యెవ్వరితో బవరంబు సేయుదు ?" అని ప్రశ్నించినాఁడు. "విప్రుల కిత్తు, భయార్తజనులఁ గాతు, శత్రులతోడ సంగర మొనర్తు' నని రాజు ప్రత్యుత్తర మిచ్చినాఁడు.

మ. "అనినం గాధితనూజుఁ డీవిహితధర్మాచారము ల్పల్కుదే
ని నరోత్తమ ! యేను బ్రాహ్మణుఁడఁ గానే రాజసూయాధ్వరం
బునకుం జాలినయంత సొమ్మొసఁగుమా భూదేవతాకోటికి
న్దనియ న్దక్షిణ లిచ్చి యజ్ఞ మమరేంద్రప్రీతిగాఁ జేసెదన్."—1. 160

అని యడిగినాఁడు. మునీంద్రుఁడు భయార్తుఁడును, శత్రుకోటిలోనివాఁడును, గాకపోవుటచేత రాజువలన రక్షణను గాని, యుద్ధమును గాని కోరలేదు. మిగిలినదానమును గూడ నతఁడు విప్రుఁడైనచో నడుగవచ్చును. అతఁడు తొలుత రాజర్షియై పిదప బ్రహ్మర్షి యైనవాఁడు. ఆతనిని బ్రహ్మర్షిగా నంగీకరింపని వసిష్ఠునిఁ బుత్రశోకవార్నిధియందు ముంచినవాఁడు. అట్టియతఁడు "ఏను బ్రాహ్మణుఁడఁ గానే ?" యని ప్రశ్నించుటయందు మూలమున లేని వాగ్వక్రత తెలుఁగున గానవచ్చుచున్నది. అడుగుటకుఁ గౌశికుఁడు తనను బాపనిగా లెక్కవైచికొనినను అడిగినది క్షత్రియోచితమైన రాజసూయయాగమును జేయుటకువలయుధనము. అదియును భూదేవతాతతికి దక్షిణ లిచ్చుటకు. మారన విశ్వామిత్రుని గడుసరివానిగాఁ జిత్రించినాఁ డాంధ్రమున. మూలమున "యష్టుమిచ్ఛామి విప్రోహం దీయతా మిష్టదక్షిణా" అనుచు నచ్ఛమైన

విప్రునిగా యాచించు విశ్వామిత్రునిలోఁ దెలుగుపలుకులలోని కాకుస్వరవ్యంగ్యము గాని, కమనీయవక్రత గాని, సమయోచితాడంబరము గాని పొడగట్టదు.

హరిశ్చంద్రుఁ డామునిమాటలు వినినతోడనే చచ్చిబ్రతికినట్లు తేరికొనినాఁడు. ఆనందభక్త్యావేశముతోఁ దనయాస్తి సర్వస్వమును మునీంద్రుని కాళ్ళముం దుంచినాఁడు. అందు సిరిసంపదలును, రాజ్యాధికారమును, ధాత్రియును, ధనరాసులును, భార్యయును, బుత్రుఁడును, తానును గలరు. మూలమున లేని 'ధర్మచయము' గూడ తెలుఁగున జేర్పఁబడినది. ధర్మనిష్ఠ మగు నాయకునిచిత్తవృత్తి యామాట ననకుండ నుండఁజాల దని మారన నిష్కర్ష.

విశ్వామిత్రుఁడు కోరినది రాజసూయాధ్వరమునకుఁ గావలసినంతధనమై యుండగా హరిశ్చంద్రుఁడు తనసర్వస్వము నిచ్చియున్నాఁడు. ఇచ్చుచు వినయసూచకముగా "దక్షిణకు విత్తము చాలినయంత మున్న యిచ్చినదిగా నెఱుంగుము" అని పేర్కొనినాఁడు. అందు "మున్న ఇచ్చిన" దన్నమాటకుఁ గౌశికుఁడు వక్రముగా వ్యాఖ్యానించినాఁడు. అది హరిశ్చంద్రునియభిప్రాయమునకు సాక్షాద్విరుద్ధమైనది. రాజు నాగరికసభ్యత ననుసరించి 'నాసంపదయంతయు మీదే; మీదక్షిణను మీ రడుగకపూర్వమే నే నిచ్చినట్లు భావించి నాయందు చనువు చూపి యీవస్తువులలో మీకిష్టమైనది దక్షిణకు బదులుగా నెన్నుకొనుఁ' డను భావము వచ్చునట్లు మాటలాడినాఁడు. కాని, విశ్వామిత్రుఁడు వెన్నలో వెంట్రుకలు వెదకినాఁడు. 'మున్న యిచ్చినది' యనఁగా హరిశ్చంద్రుఁడు తనసర్వసంపదను దనముం దుంచకపూర్వమే యిచ్చిన దని నిశ్చయించినాఁడు. దానిని లెక్కవైచికొనకయే హరిశ్చంద్రుని సర్వసామ్రాజ్యమును దానముగాఁ బుచ్చుకొనినాఁడు. ఇట్లు ద్వంద్వార్థము వచ్చునట్లు రాజు మాటలాడుటయే యిచ్చట జరిగిన పొరపాటు. విశ్వామిత్రుఁడు సర్వరాజ్యమును గైకొని హరిశ్చంద్రుని నగరు వెడల నాజ్ఞాపింప నతఁడు నారచీరలు గట్టి భార్యాపుత్రసమేతుఁడై నిష్క్రమించు సమయమున బూర్వదత్తమైన యజ్ఞదక్షిణను గూర్చి ప్రశ్నించునంతవఱకు నాచక్రవర్తి కాపొరపాటు తెలియలేదు. తెలిసియప్పుడు పశ్చాత్తాపపడి లాభము లేకపోయినది. అన్నమాట నిలువఁబెట్టుకొనుటకు భార్యాపుత్రులనే కాక చివరకు తననే యమ్ముకొనవలసివచ్చెను. మాటతప్పని యామానధనుఁడు అభిమానమును సైత మమ్ముకొని సత్యమును గాపాడుకొనెను. హరిశ్చంద్రునివాక్యరచనలోని 'గండ' మను నొక్కరూపకాంగము నాధారముగాఁ జేసికొని కథపూర్వభాగమునుండి యుత్తరభాగమున కల్లుకొనిపోవుట యచ్చటి

కథానిర్మాణశిల్పము. ఏతత్కథాపరిణామానుసారియై నాయకుని ధర్మోత్సాహము క్రమముగా సత్యపాలన మనెడి నిమిత్తము నూతగాఁ గొని యుత్కటమగుచున్నది. ఇట్టి సత్యవీరము జన్యరస మైన యద్భుతము నంగముగాఁ గొని నిర్వహణమున సఫలతఁ గాంచుచున్నది.

ఈయుపాఖ్యానమున సత్యవీరము క్రోధకరుణాది రసభావములచేఁ బరిపుష్టమైనది. ఇందు బ్రతినాయకుఁడు కౌశికుఁడు. అతనిసహాయకుఁడు ధర్ముఁడు. కౌశికుఁడు రౌద్రరసమూర్తి. అతని 'రౌద్రవృత్తి'ని మారన 1.189 పద్యమున సూచించియున్నాఁడు. విశ్వామిత్రుని క్రోధ మర్ధప్రధానముగా నామూలాగ్రముగ పోషింపఁబడినది. హరిశ్చంద్రుని గడగండ్లపాలు సేయుటలో నాతఁ డనుసరించిన క్రూరమార్గ మాతని యౌద్ధత్యమును జెప్పకజెప్పుచున్నది. అతని రౌద్రమువలన శైబ్యయందును, హరిశ్చంద్రునియందును పుత్రవియోగజనితమైన కరుణము కలుకలుగుట కవకాశము కలిగి జనకజన్యరసనిష్పత్తి కనువైనవిధ మేర్పడినది. హరిశ్చంద్రుఁడు కాటికాపరి యగుటచే నాతనియౌజ్జ్వల్య మొక్కింత మాటుపడినదే గాని యట్టిదీనావస్థయందును నతనిచిత్తమున సడలని సత్యదీక్షయు, కదలనిస్థైర్యమును బొడగాంచినచో నాతనితేజస్వితమఱింత యౌజ్జ్వల్యము దాల్చిన దని స్పష్టపడకపోదు. తనను దా నమ్మికొనియును ఋషిఋణము తీర్చిన హరిశ్చంద్రుని సత్యధర్మతేజముముందు విశ్వామిత్రునిరౌద్రదీప్తి వెలవెలపోయినది. మాయాచండాలుని క్రూరబుద్ధి హరిశ్చంద్రుని కఠోరధర్మదీక్షముందు స్తంభించిపోయినది. ముని శాపభీతియు, చండాలసేవావిధియు హరిశ్చంద్రునిదుఃఖార్ణవమున ముంచినవి. పరితాపాగ్నితోఁ గాల్చినవి. కాని యతని నిష్కళంకసత్యవ్రతదీక్షమాత్రము తాలిమి నూది తరుణముకొఱకు ప్రతీక్షించినది. ప్రాణతుల్యుఁడైన పుత్రునియొక్కమృతి హరిశ్చంద్రున కేర్పడిన చివరిపరీక్ష. విధి పెట్టిన యాపరీక్షను ద్రిప్పి విధిముఖము ననే కొట్టి యానరపతి చితిపై నెక్కి శ్రీకాంతుని స్మరించినాఁడు. దేవదుందుభులు మ్రోసినవి; పూలవానలు కురిసినని; అమృతపుజల్లులు వాలినవి; శాశ్వతదివ్యభోగము లెదుట నిలిచినవి. అవియన్నియు నాతేని 'సత్యధర్మమహనీయత'కు మెచ్చి దేవత లిచ్చిన బహుమానము లని మహేంద్రుఁడు స్పష్టముచేసినాఁడు; ధర్మకౌశికుల కపట నాటకమును విప్పిచెప్పినాఁడు. దానివలన జిజ్ఞాసువుల హృదయమునందు విశ్వామిత్రుని రౌద్ర మాభాసముగా స్ఫురింపవచ్చును గాక! ధర్మునియౌద్ధత్యము మాయామూలక మని మనసు కెక్కకపోవుగాక! సత్యపాలనకై యప్పటికే యమయాతన

ననుభవించియుఁ బ్రజాకుటుంబముకొఱకు నారకదుఃఖములైన ననుభవింపఁ సిద్ధమై స్వర్గసౌఖ్యమును ద్యజింప నుత్సహించి యాశ్రితావనధర్మము నారాధించు హరిశ్చంద్రుని యుత్కటోత్సాహము మాత్రము పతితహృదయమున రససిద్ధి గలిగింపక మానదు.

కథాకథనకుశలుఁడైన మారన హరిశ్చంద్రోపాఖ్యానమున బహువిధములైన చిత్రనిర్మాణశిల్పములను గూర్చి దాని నొకకళామందిరముగాఁ దీర్చిదిద్దెను. ఆ వానిలో ముఖ్యమైనవానివి గొన్నింటిని బరిశీలించుటవలన కవియొక్క కావ్యరచనా సామర్థ్యము కొంత తేటపడఁగలదు.

1. హరిశ్చంద్రుఁడు విశ్వామిత్రునకు సమస్తసామ్రాజ్యసంపదలను దత్తముచేసి, మేనిపై ధరించిన యాభరణాదులఁ బరిత్యజించి వల్కలాజినధారియై నగరవీధి నగరిలో బ్రవేశించుఘట్టమున మారనకవి యమూలకము లగు మూఁడు సీసపద్యములను రచించి ప్రకరణోచితరసభావవర్ణనానైపుణ్యమును బ్రకటించెను. అందు మొదటిపద్యమున రాచనగరులో హరిశ్చంద్రుఁడు వర్జితానేకవిశేషభూషణుఁడగు నప్పుడతఁడు బంధుజనులకుఁ దోచినవిధము వర్ణితము :

సీ. సురుచిరకిరణవిస్ఫురణంబు దింది యెం
తయు మాఁగుపడినమార్తాండు పగిది,
భాసురరత్నప్రభలు వాసిన విన్న
నౌ రోహణశిలోచ్చయంబు మాడ్కి,
విలసితతారకవిభవంబు చెడి కడుఁ
బొదలియున్న నభంబుకరణి,
ప్రవిమలకుసుమసంపద యెల్ల నుడిపోయి
దీపుదక్కిన మహీరుహముభంగి

తే. నొందఁ గోటీరహారకేయూరకంక
ణాది మణిభూషణోత్కర మపనయించి
యొప్పు పొలివోయి దీనత నుండె బంధు
జనులచూడ్కులు కమర నజ్జనవిభుండు. 1. 169.

హరిశ్చంద్రుఁడు కిరీటమును, హారములను, భుజకీర్తులను, కంకణాదిమణిభూషణోత్కరమును అపనయించినప్పుడు పొలివోయి దీనత నొప్పిన యతనిస్వరూపావస్థ

లను యథాసంఖ్యోపమాలంకారశోభితముగా సీసమున మారన వర్ణించినాఁడు. ఈ పద్యమున ప్రతిచరణమును సార్థకమై రసానుకూలభావసమర్పకము లగుట గమనింపఁ దగియున్నది.

ఉజ్జ్వలరత్నకిరణప్రసారసుందర మైన కిరీటము నపనయించినతోడనే కాంతి దక్కి సురుచిరవిస్ఫురణము డిందె యెంతయు మాఁగుపడిన మార్తాండునివలె రాజు దైన్యము నొందినాఁడు. మృతమైన జగత్తును బునరుజ్జీవింపఁ జేయువాఁడు మార్తాండుఁడు. అట్లే సామ్రాజ్యప్రజలను క్షయమునుండి కాపాడువాఁడు హరిశ్చంద్రుఁడు. అట్టి యుత్తమధర్మమునకుఁ బ్రతీక యతఁడు శిరమున ధరించినకిరీటము. అది యూడుటతోడనే యతనినుండి పాలనధర్మమును, కాంతిమత్త్వమును వేరుపడిన వనుభావ మాయుపమానమువలన మారన వ్యంజింపఁజేసెను.

కంఠసీమయందును, ఉరఃప్రదేశమునందును వెలుఁగొందు రత్నహారములఁ దీసివైచిన హరిశ్చంద్రుఁడు భాసురరత్నప్రభలు వాసి విన్ననౌ రోహణశిలోచ్చయము మాడ్కి వైవర్ణ్యము దాల్చినాఁడు. రత్నరాశులు పర్వతమునకు సహజసంపద. అట్లే చక్రవర్తికి రత్నహారములు సహజసంపదలు. శిలోచ్చయశబ్దము హరిశ్చంద్రుని దృఢశరీరమును విపులవక్షోరఃప్రదేశమును వ్యంజింపఁజేయుచున్నది. రత్నహారము లొక్కసారిగా వీడుటచే నాతనియురము వివర్ణమై విన్నబోయిన దని యలంకారతాత్పర్యము.

కేయూరవిరహితుఁ డైన హరిశ్చంద్రుఁడు తారకావైభవము చెడి కడుఁబాడటి యున్న నభమువలె నుండెనట! "మేఘైర్న భా తీతి నభః" అని గురుబాలప్రబోధిక. మేఘాచ్ఛన్న మైన యాకసము వోలె భుజకీర్తులు కోల్పోయిన రాజుపై నైల్యము వ్యాపించి చిన్నబోయిన యనుభావము కానఁబడె నని తాత్పర్యము! ఇందలి తారకావైభవము కేయూరమణివైభవమున కుపమానస్థానము.

కంకణాదివివిధమణిభూషణోత్కరము నపనయించిన మహారాజు ప్రవిమలకుసుమసంపద యెల్ల నుడివోయిన మహీరుహము భంగి రూపుసెడి యుండెనఁట! ఈయుపమానబలముచేతఁ బూలు రాలినచెట్టు ఫలసిద్ధి కెట్లు దూర మగునో యట్లే మణిభూషణోత్కర మంతవఱ కాతని నాశ్రయించి యున్నను నతని కెట్టిఫలసిద్ధిని గల్పింపకయే దూరమైపోయిన వని కవి వ్యంజింపఁ జేసినాఁడు.

అహార్యసంపదఁ గోల్పోయి కాంతిహీనుఁ డైన హరిశ్చంద్రుఁడు గుర్తించుటకే వీలులేనంతగా మారిపోయినాఁ డని మారన నిరూపింపఁ యత్నించినాఁడు. అట్టి దైన్యావస్థలో నున్న హరిశ్చంద్రుని గాంచిన బంధుజనులచూడ్కులు కమరిపోయిన వనుటలో నాశ్చర్యము లేదు. హరిశ్చంద్రుఁడు రాజ్యభోగములఁ దా ననుభవించుటయే కాక తనబంధుకోటిని గూడ అనుభవింపఁ జేసినాఁడు. కావున తమ వైభవస్ఫూర్తి కేమహితాత్ముని దీప్తి కారణమైనదో యది తమకన్నులయెదుట నంతరించుచుండుటఁ గాంచి సురసుర స్రుక్కినా రనుట సార్థకము!

పురవీథులవెంట పాదచారియై యరుగుచున్న హరిశ్చంద్రుని గాంచి పౌరులు మిన్ను విరిగి మీఁదఁ గూలిన విధముగా గుండె లవిసి కళవళించి యిట్లని వాపోయిరి:

సీ. కాంచనాలంకృతిఁ గర మొప్పి నీమ్రోల
  నేతెంచు గజఘట లెందుఁ బోయెఁ ?
గనకకింకిణులచెల్వునఁ గ్రాలు తురగంబు
  లేల నీకెలఁకుల నేఁగుదేవు ?
రత్నోజ్జ్వలము లైన రథములు నీపజ్జ
  వడిఁ జనుదేర కెక్కడ నడంగె ?
వివిధాయుధస్ఫూర్తి వెలుఁగు కాల్వుర మొత్త
  మేల నీతో రాక యేమి యయ్యె ?

తే. రమ్యభూషణదివ్యాంబరములు దొఱఁగి
నారచీరలు గట్టి యనాథవృత్తి
నాలుఁ గొడుకును వెంటరా నరుగునట్టి
యెడరు వాటిల్లెనే మేదినీశ ! నీకు.

సీ. పొలుచు నీసామ్రాజ్యవిభూతి వ్రేఁగయ్యెనే
  దైవంబుకంటికి ధరణినాథ !
చక్రంబు పనిసేయ నడినన్న నీపెంపు
  బూడ్దబొట్టయ్యెనే భూరికీర్తి !
యాదిగర్భేశ్వరి యగు నీమహాదేవి
  యింతకు నోచెనే యిద్ధచరిత !

గోమునఁ బెరిగిన యీముద్దుపట్టి భా
గ్యం బిట్టి దయ్యెనే యధికపుణ్య !

తే. హా ! మహారాజ ! రాజసూయాధ్వరేశ !
హా ! హరిశ్చంద్ర ! నిత్యసత్యాభిరామ !
హా ! దృఢైశ్వర్య ! శౌర్యజితారిలోక !
హా ! సమస్తలోకేశ ! దయారమేశ ! —1. 175- 177.

మొదటిపద్యమునందు రాజచిహ్నములు లేక యనాథవృత్తి సకుటుంబియై వచ్చు మహారాజును జూచి ప్రజలు విలపించిరి. కాంచనాలంకారభూషితము లైన గజసమూహమును, కనకకింకిణీక్వాణమండితము లైన తురంగములును, రత్నోజ్జ్వలము లైన రథసమూహములును, ఆయుధపాణు లైన భటులును – అనఁగా చతురంగబలములు – వెంట రాగా రమ్యభూషణదివ్యాంబరములు ధరించి పురమున నూరేగవెడలు రాజున కానాఁడు కలిగిన యెడరును గూర్చి ప్రస్తావించిరి. రెండవ పద్యమునఁ బురి వెడలిపోవుచున్న హరిశ్చంద్రుని గాంచు ప్రజలయెడఁదలలో శోకానలము కార్చిచ్చువలె నంటుకొని యాక్రందనల కుపక్రమింపఁ జేసినది. వారు పిలిచిన ప్రతి పిలుపులోను, సార్థక్యమును సాదరమును ఉట్టిపడుచున్నవి. దైవము నకే కన్నుకుట్టునంత రాజ్యవిభూతి కలవాఁ డగుటచే నాతఁడు ధరణీనాథుఁ డైనాఁడు. సప్తాంగచక్రమును సమర్థముగాఁ బని చేయించుటచే నాతని కపారకీర్తియు నభ్యుదయమును గలిగినవి గాన భూరికీర్తి యనఁబడినాఁడు. ఆదిగర్భేశ్వరి యగు నా మహాదేవిని జేపట్టుటచే నాతఁ డిద్ధచరిత్రుఁ డైనాఁడు. రాజసూయాధ్వరప్రవర్తకుఁ డగుటచేతనే యాతనికి మహారాజపదము సార్థక మైనది. నిత్యసత్యాభిరాముఁ డను విశేషణమునకును హరిశ్చంద్రుఁ డన్న విశేష్యమునకును విడదీయఁ జాలని యను బంధము కలదు. అతఁడు శౌర్యజితారిలోకుఁ డగుటచే దృఢైశ్వర్యుఁడును, విష్ణ్వంశ గల మహారాజగుటచే దయారమేశుఁడు, సమస్తలోకేశుఁడును అగుచున్నాఁడు. మారనచేతిలో నాపౌరు లుచితప్రయోగశిల్పకుశలులవలె సృజియింపఁబడినారు.

ప్రజ లారాజచంద్రుని యేలుబడిలోఁ జల్లగా జీవించుచుండిరి. కష్టమన్నది కాని, కన్నీ రన్నది కాని వారికిఁ గలుగకుండఁ జూచిన పెన్నిధివంటివాఁ డా ప్రభువు. అతనిపై దుర్విధి కసిపూనినది. దానిని వివేకముతో భావించి ప్రజలు దుఃఖావేశముతో నెలుగెత్తి విలపింతురే కాని ప్రత్యక్షదుర్విధి యైన విశ్వామిత్రుని

బల్లెత్తుమాట యైనను అనరు. ఆమహారాజు వారి కిచ్చినశిక్షణ యటువంటిది. మద విరహిత మైన చిత్తవృత్తి సత్యధర్మశాసనమహిమచే నారాజ్యమునఁ బ్రజాహృదయములందు వసించిన దని యిచ్చట వస్తుధ్వనిచే మారన వ్యంజింపఁ జేసినాఁడు. కథానిర్వహణమున హరిశ్చంద్రునితోపాటు దివ్యవిమానములందు పాదము లుంచుటకుఁ దగినయర్హతను బ్రజలయందు సమాయత్తపఱచి మారన కథార్థములను సారవంత మొనర్చినాఁడు.

2. హరిశ్చంద్రోపాఖ్యానము - మారన ఫలశ్రుతిలోఁ జెప్పినట్లు - "హరిశ్చంద్రు నుత్తమచారిత్రము" చెప్పుటకే పుట్టినట్లున్నది. ఆమహారాజునకు సంబంధించిన వివరములను మాత్రము పురాణకర్త సవిస్తరముగాఁ జెప్పుచుండును గాని యేమాత్ర మైనను అడుగు ప్రక్కకు వైచి యితరవిషయములను బట్టించుకొనఁడు. కనీస మామహారాజుగారి పట్టమహిషినామము గూడ పేర్కొనక పోవుటయే యందులకు సాక్షి. ఇఁక చండాలుని పేరును గూర్చియు, శైబ్యను విలిచిన బ్రాహ్మణునినామముగూర్చియు వేఱుగాఁ జెప్పవలయునా? కథార్థములలో బ్రాహ్మణసేవలో శైబ్యపడిన యగచాట్లు గాని, యామె భర్తనుగూర్చి పడిన పరితాపము గాని, పుత్రునికిఁ బాము కఱచుటకుఁ గల హేతువును గాని యిసుమంత బైట పెట్టడు కథకుఁడు. కాని, నాయకుఁడైన హరిశ్చంద్రుని చరిత్రచిత్రణమున మాత్రము సర్వసూక్ష్మాంశములను శ్రద్ధతోఁ బరిశీలించి సంతరించినట్లు స్పష్టముగాఁ గనవచ్చుచున్నది.

3. మారన హరిశ్చంద్రుని చిత్తవృత్తిని దీర్చిదిద్దుటలోఁ గొంతసామర్థ్యమును బ్రకటించినాఁడు. ఆనేర్పంతయు ధీరోదాత్తుఁడును, ధర్మవీరుఁడు నైన నాయకునియందు కరుణరసదీప్తి కనువైన మనోవృత్తిని స్థాపించి, యది యతని ధీరత్వమునకును, ఔదార్యమునకును, ఉత్సాహశీలమునకును భంగము వాటిల్లకుండ తీర్చిదిద్దుటయందే కేంద్రీకరింపఁబడినది.

సామాన్యముగా వీరులగు నాయకులు సాధకు లనియు, సిద్ధు లనియు రెండు తెఱఁగులు. అపూర్వకార్యసాధనోత్సాహులై యడ్డంకుల నధిరోహించి పురోగమించి యారబ్ధకార్యసిద్ధిని గాంచు కార్యశీలురు సాధకులైనవీరులు. క్రియాబహుళము లైన యుద్ధాదులయందట్టినాయకులు కానఁబడెదరు. దానసత్యాదివీరములయందు సాధారణముగా సిద్ధు లైన వీరులు నాయకులుగా వర్ణింపఁబడుచుందురు. అందు

వారు తమసిద్ధులఁ బరీక్షింపఁ నేర్పడిన క్లిష్టపరిస్థితులమధ్య నలిగియు, కలఁగియు తాలిమిచే ధృతి వహించి తమసిద్ధిబలముచే కార్యసిద్ధిని బడసెదరు. సాధకునిచిత్త వృత్తి వార్షుకతరంగిణివంటిది. అది గట్లొరసి పారుచు కొండలను గుట్టలను సైతము తనప్రవాహవేగముచేఁ గోసియైనను తనగమ్యస్థలము చేరెడివిధమునఁ బ్రగతిశీలమై యుండును. సిద్ధునిచిత్తవృత్తి వర్షాకాలనదీప్రవాహగర్భమున నున్న స్థిరమైన గిరిరాజువలె క్షమాప్రధానమై యుండునని భావింపవచ్చును. హరిశ్చంద్రుఁడు సత్యధర్మాచరణమున సాధకకక్ష్యను దాటినసిద్ధుఁడు. తద్ధర్మమునందు గిరి వలె స్థిరుఁడు. కౌశికరోషసంజనితక్రోధముచే నుప్పొంగినశోకతరంగిణి యతనిఁ గలఁచివైచినను, వేదనాదవాగ్నిశిఖ లాపాదశిఖరము దహించినను అతఁడు క్షమా మూర్తియై నిలిచియుండెను. చితిపై నెక్కినప్పుడు కూడ "నగియును నేనెన్నండు బొంకుపలుక, నాకిదియనిశ్చయం" బని నిశ్శంకగాఁ బలికిన నిష్ఠశాలి. పుటము పెట్టిన బంగారమువలె నతనియందలి వీరము దీప్తమై రాజించెను. ఈపద్ధతి ననుసరించి మారన హరిశ్చంద్రునిచిత్తవృత్తిని వీరరసానుగుణముగాఁ బోషించెను.

వీరమునకుఁ గరుణము విరోధ మని లాక్షణికులు చెప్పలేదు కాని పోషక రస మని మాత్రము గణింపలేదు. కరుణమునకు స్థాయిభావ మగు శోకమును లాక్షణికు లిట్లు నిర్వచించిరి.

''ఇష్టజనవినాశాత్ శాపాత్ క్లేశా చ్చ బంధనా ద్వ్యసనాత్ ఏతై రరవిశేషైః కరుణాఖ్య రస స్సముద్భవతి''-నాట్యశాస్త్రము.

''పుత్త్రాదివియోగమరణాదిజన్మా వైక్లబ్యాఖ్య శ్చిత్తవృత్తివిశేషః శోకః''-రసగంగాధరము. అట్టిశోకము ఉత్సాహభంజక మగును కావున వీరమున కది పోషకము కాదని వారి మతము. ఇది స్థూలదృష్టితో ననిన మాట. సూక్ష్మముగా నాలోచించినచో వీరరసప్రతీతిలోఁ గరుణమున నొకకొంతయవకాశము కలదు. లోకమున ననేకకార్యములందు ధీరోదాత్తాదినాయకు లపూర్వకార్యసాధకు లయ్యు నెడనెడ బంధుజనవియోగదుఃఖాదుల ననుభవించుట కాంచుచున్నాము. అర్జునుఁ డభిమన్యునిమరణవార్త విని శోకించును; శివాజీ తానాజీ వియోగమున దుఃఖించును. కాని వారిరువురును వీరవర్యు లగుటచే వారియందు తత్కాలశోకము తరువాత నపూర్వకార్యసాధనోత్సాహమునకు హేతు వయినది కాని వీరరసభంజకము కాలేదు; పైపెచ్చు కరుణము వీరరసజ్యోతికి స్నేహతుల్యమై భాసించినది. అట్టివిధము

కథార్థములపైనను, కవిసామర్థ్యముమీఁదను ఆధారపడియుండును. కావున నిష్ట జనవియోగమువలన గలుగు శోకము వీరునిహృదయమున నుత్సాహస్ఫూర్తిని బోషింపఁగలిగినచోట వీరమున కంగముగాఁ గరుణము వర్ణితమైనను దోషము కాదు. హరిశ్చంద్రునిచరిత్రమున వీరరసపోషకమైన కరుణము భాసించుట విశేషము. వనవాసాజ్ఞాతవాసములందు స్వీయదైన్యావస్థనుగూర్చి చింతించుచు నోరిమితోడఁ దన ధర్మోత్సాహమును బరిపోషించుకొనినధర్మరాజువలె హరిశ్చంద్రుఁడును విశ్వామిత్రక్రోధసంజనితములైన దుఃఖముల నెన్నింటి నైనను సహించి తనసత్యధర్మనిష్ఠను గాపాడుకొనినాఁడు. అతఁ డనుభవించిన ప్రతిదుఃఖానుభూతియు నతని ధర్మవీరప్రగతి కేర్పడిన యొక్కొక్కదృఢసోపానమువలె నీయుపాఖ్యానమున జిత్రింపఁబడినది.

హరిశ్చంద్రునిచిత్తవృత్తిని రెండుభాగములుగా నెంచవలయును. ఒకటి: అతనియందు సముద్రగాంభీర్యము దాల్చి స్థాయిగా నున్న మనోవృత్తి. రెండు; తత్తత్కాలోచితముగా నుద్విగ్నమై సముద్రతరంగములవలె లేచిపడు చిత్తవృత్తి. అందు మొదటిది జన్మవ్రతరూప మైన ధర్మము నాశ్రయించినది; రెండవది దేహధర్మము నాశ్రయించినది. సత్యధర్మవ్రతదీక్ష హరిశ్చంద్రుని జన్మవ్రతము. పురజన గురుజన. బంధుజనభార్యాపుత్రాదులయెడ నెరపెడి లౌకికధర్మము అతనిదేహధర్మము. జన్మవ్రతాచరణమున వీరుఁడె న్నడును శోకింపఁడు; శోకింపరాదు. ప్రతినాయకాదులచే నాయకునిదేహధర్మము బాధింపఁబడును. అట్టిపట్టులందు నాయకుఁడు శోకరసమగ్నుఁ డగును. కాని, ధీరుఁ డగుటచే దానినుండి తేరుకొని తనజన్మవ్రతమును రక్షించుకొనును. అతనిజన్మవ్రతమే ప్రతినాయకహతమైనట్లు చిత్రింపఁబడినచోఁ గావ్యమున రసభంగ మేర్పడును. అనఁగా నాయకునిచిత్తవృత్తియందలి స్థాయిరూప మైన ధర్మము భజింపఁబడరా దని తాత్పర్యము. మారన యిట్టి రసశిల్పము నెఱింగి హరిశ్చంద్రుని స్థాయిసంచారిచిత్తవృత్తులను వివేకించి మొదటిది రెండవదానిచేఁ బుష్టినొందున ట్లౌచిత్యభరితముగ నిర్మించెను.

హరిశ్చంద్రుని సత్యధర్మప్రవృత్తిని లింగషట్కముచే నిందు మారన స్థాపించి రసానుగుణమైన కథానిర్మాణశిల్పమును బ్రదర్శించెను. కథారంభమున నాయకుని 'నిత్యసత్యవర్తి' యనియుఁ గథాంతమున 'నగియును నే నెన్నండును బొంకుపలుక నాకిదియ నిశ్చయం' బని పలుకువానిగాఁ జెప్పుటయు, కథయందు మాటిమాటికిని నాయకసత్యధర్మనియతిని బ్రస్తావించుచుండుటయు, ఫలమున —

'నీతితిక్షితపస్సత్యనిష్ఠ కేను మెచ్చితి" నని ధర్ముఁ డనినట్లును, "నీనిరుపమసత్య ధర్మమహనీయత శాశ్వతదివ్యభోగముల్ దొరకొనియె న్నరేశ్వర!" యని మహేంద్రుఁ డనినట్లును బేర్కొనుటయు, నపూర్వసన్నివేశచారుత్వముచేత కథను నడిపించి తాత్పర్యమును వ్యంజింపఁజేయుటయు, విశ్వామిత్రహరిశ్చంద్రశైబ్యాది పాత్రముఖములందు సత్యప్రాశస్త్యమును గీర్తింపఁ జేయుటయుఁ, గథార్థము లన్నియు 'సత్యమేవ జయతే' యను నుపపత్తి కుపగమ్యమానము లగునట్లు నిబంధించుటయు నందులకు నిదర్శనములు.

5. కథాగతి కనుకూలములైన సన్నివేశములఁ గల్పించి, వాని కతి సహజము లైన హేతువుల నేర్పఱచిన శిల్ప మీయుపాఖ్యానమున మూలమునందు కంటె మారనయనువాదమునం దధికముగాఁ బ్రకాశితమగుచున్నది. మచ్చున కొకటి యీక్రింద నీయఁబడుచున్నది. విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రునిసామ్రాజ్యసంపదను గోరుఘట్టమున మూలమున నిట్లు కలదు:

"వినా భార్యాం చ పుత్త్రం చ శరీరం చ తథానఘ!
ధర్మం చ సర్వధర్మజ్ఞ యోయాన్త మనుగచ్ఛతి
బహునాత్ర కి ముక్తేన సర్వ మన్య త్ప్రదీయతామ్." —7. 28-29.

మారన యనువాదము :

శా. "నీ వేమిచ్చినఁ గాదన న్గానియెద న్వీరాగ్రణీ! ధర్మము
న్నీవు న్భార్యయుఁ బుత్త్రకుండు వెలిగా నీసర్వసామ్రాజ్యల
క్ష్మీవాల్లభ్యము మాకు నిమ్మనిన నిచ్చె న్నిర్వికారానన
శ్రీవిభ్రాజితమూర్తియై సమధికప్రీతి న్హరిశ్చంద్రుఁడున్." —1. 163.

మూలమున విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రునిభార్యాపుత్త్రులను, శరీరమును, ధర్మమును విడిచి మిగిలిన సర్వమును గోరినట్లు కలదు. తెలుఁగున 'సర్వసామ్రాజ్యలక్ష్మీవాల్లభ్యము నభ్యర్థించినట్లు కలదు.' ఇందు ప్రతిపదము సార్థకమును, పూర్వాపరకావ్యార్థసమన్వయసమర్థమునై యొప్పుచున్నది. సామ్రాజ్యలక్ష్మిని గ్రహించిన తరువాత విశ్వామిత్రుఁడు "స్వామ్యం బలవదునే నీ వున్న మాకుఁ బార్థివముఖ్యా!" అను నభ్యంతరము చెప్పి హరిశ్చంద్రునిఁ బురి వెడలతరిమినాఁడు. ఇందు 'స్వామ్య'శబ్దము మూలమునం దున్నదే. సంపద వశమైనంతనే చాలదు; స్వామ్యమలవడవలయు నను భావము విశ్వామిత్రుఁడు పూర్వమే యూహించి లక్ష్మీవాల్ల

భ్యము నర్థించి దానిని దత్తము చేసికొనినట్లు మారన వ్రాయుటచేత, ఇచ్చట హరిశ్చంద్రునియునికి విశ్వామిత్రస్వామ్యత్వసిద్ధి కంతరాయ మగుటచేతను సత్యధర్మనిరతుఁడైన యాచక్రవర్తి నిష్క్రమించుట తప్పనిసరి యైనది. కథలో నింతటి శక్తి 'లక్ష్మివాల్లభ్యము' నర్థించుటలో నిక్షేపించినాఁడు మారన. దానితో నాగక మూలమునందు లేని రెండుచమత్కారములు చేసినాఁడు : మొదటిది : 'నీ వేమిచ్చిన గాదన న్గానియెదన్' అని యనుట. ఈవాక్యతాత్పర్యమును గాఢముగా భావించినచో హరిశ్చంద్రుఁడు దాన మిచ్చుచున్న సామ్రాజ్యవైభవమంతయు నారాజు వేడుకతో నిచ్చుచున్నట్లుగనే ముని తలంచినట్లు స్ఫురింపఁగలదు. ఈవాక్యము "దక్షిణకుఁ జాలినయంత (ధనంబు) మున్న యిచ్చినదిగా నెఱుంగు' మనెడి హరిశ్చంద్రుని వాక్యమునకుఁ గౌశికుఁడు కావించెడి వక్రవ్యాఖ్యానమున కుపోద్ఘాతముగా నున్నది. రెండవది 'వీరాగ్రణీ' యనెడు సంబోధనము. ఇది యనంతరకథార్థసూచి. చక్రవర్తియైన హరిశ్చంద్రుని సామ్రాజ్యవైభవమును మహర్షి హరించి యతనికి దానవీరుఁ డను కీర్తిని మాత్రమే మిగుల్ప నున్నాఁడను వ్యంగ్యము తత్సంబుద్ధివలన నేర్పడుచున్నది. మూలమున వాడఁబడిన 'అనఘ!' 'సర్వధర్మజ్ఞ' యను సంబుద్ధులు హరిశ్చంద్రునిగుణస్తుతిరూపములై యున్నవి. కాని, వానియందు శిల్పసార్థక్యము లేదు కావున మారన వానిని గ్రహింపలేదు.

6. విశ్వామిత్రునియం దంకురించి ప్రజ్వలించిన క్రోధభావముయొక్క క్రమోన్మీలనదశలను హరిశ్చంద్రుఁడు గుర్తించినట్లు మారన వర్ణించినాఁడు. అరణ్యమున మొదటిసారి 'విశ్వామిత్రుని నుద్యద్వైశ్వానరసదృశవైభవు నాధాత్రీశ్వరుఁడు బిట్టు గని' (1. 155) నాఁడఁట! సామ్రాజ్యలక్ష్మివైభవమంతయుఁ బరిగ్రహించి యాముని 'యుగ్రతేజుఁ' (1. 164) డైనాఁడఁట! కాశీపట్టణమున బ్రథమదర్శన మిచ్చినవేళ 'నవారితతేజస్స్ఫురణోగ్రుఁడై' (1. 191) కనుపట్టెనఁట! విశ్వామిత్రుఁడు ఋషియు, క్రుద్ధుఁడునై యుండుటచే తేజోమయునిగా వర్ణించుట సార్థకము. మొదట వైశ్వానరసదృశుఁ డనుటచే నాతనియందలి క్రోధభావోదయమును, రెండవసమాసమున దాని తైక్ష్ణ్యమును, తృతీయసమాసమున తద్దుర్నివారసమగ్రోగ్రమూర్తిని దశాత్రయమునందుఁ గ్రమవికాసరమణీయముగా మారన వ్యంజింపఁజేసి ప్రతినాయకరౌద్రస్ఫూర్తి నుపలక్షింపఁజేసినాఁడు.

7. కౌశికరోషవిస్ఫూర్తిని నతఁడు హరిశ్చంద్రుని సంబోధించువైఖరిచేత గూడ వ్యంజింపఁ జేసి మారన యొకయపూర్వరచనాశిల్పమును వెలార్చినాఁడు.

హరిశ్చంద్రుఁడు వేటఁ జాలించి విశ్వామిత్రునివైపు వచ్చుచు నచ్చట ఋషి యుండె నని యెఱుంగక యతనిని 'దురితాత్మ!' (1. 152) డని పేర్కొనెను. దానికిఁ బ్రతిగా నారాజు కంటఁబడినంతనే యాముని 'ఓరిదురాత్మక!' (1. 156) యని మాటకుమాట వడ్డించినాఁడు. ఆరాజు వినయముతో మ్రొక్కి 'మునిజనాగ్రణీ!' (1. 157) యని సగౌరవముగాఁ బలుకరించినాఁడు. దానికి దీటుగా నామునియు నాతనిని 'నరేంద్రోత్తమ, (1. 160) యని యాశ్వాసించినాఁడు. దాన మడుగఁ బోవుచు నారాజును మునిరాజు 'వీరాగ్రణీ!' (1. 163) యని పిలిచి యతని సార్వభౌమత్వమును హరింపనెంచె నని సూచించెను; రాజ్యాపహరణానంతరము 'రాజా! పార్థివముఖ్యా!' (1. 165) యను సంబుద్ధులచే నాతని సామాన్యక్షత్రి యత్వమునే గుర్తించినట్లు మాటలాడెను. కాశీనగరమున హరిశ్చంద్రునితో విశ్వామిత్రుఁడు సంభాషించుచు నసలు సంబోధనలే చేయక యాతనియం దత్యనాదర భావమును బ్రకటించెను. ఆపాత్రను, తత్సంభాషణములను అంతజాగరూకతతో రచించిన మారన యేలనో 1 అ. 192, 205, 206, 207, 209 పద్యములలో విశ్వామిత్రునిచేత మహీతలేశ, నృప, ధరణీనాథ, అనఘా, భూవరా! అను సంబోధనలు చేసినట్లు రచించినాఁడు. దీనినిబట్టి యాకవి యాశిల్పమును దనకావ్య రచనమున నుద్దేశపూర్వకముగాఁ జేసినది కాదని యూహింపవలసివచ్చుచున్నది. అయినను కథాకథనక్రమావిష్కారమున దొరలిన కొన్నిశిల్పము లసంపూర్ణము లైనను మహాకవిప్రతిభాశక్తిపై మన కున్న విశ్వాసముచేత వానిని గౌరవించు టలో దోసము లేదు.

8. భావస్పష్టతకొఱకు మారన స్వీయకల్పనావిలసితము లగు నలంకారముల నాయాస్థలములందుఁ జొప్పించి కథార్థముల నాస్వాదమధురములుగా నొనరించెను. ఉదాహరణమునకు :

1. ఉపమాలంకారము :

చ. అనినఁ జలించుచు న్నృపతి యంగన కే లొకచేఁ దెమల్చి వే
చనఁ జన నేమి చెప్ప మునిచందము? చేతిప్రచండదండ మె
త్తి నయ మొకింత లేక సుదతీతిలకంబు కృశాంగవల్లి నే
సె నిభము దొండ మెత్తి మదజృంభిత మై లత వ్రేయు చాడ్పునన్."
— 1. 184.

2. రూపకాలంకారము :

క. "చేతో, వననిధి పిండలి పిండుగ
ఘనచింతామంధరంబు గలఁపఁగ మదిలోన్."— 1. 193.

3. అర్థాంతరన్యాసము :

(అ) తే. గీ. "వెడలిపొమ్మల మాటలు వేయు ? రాజ్య
మేకముఖము గాకున్న మా కెట్లు చెల్లు ?
వినుము రాజ ! *సూదికి రెండుమొనలు గలవె ?*" —1. 166.

(ఆ) ఉ. "మాలఁడు వొంగి యమ్మునికి మానుగ నర్ధన మిచ్చి పట్టి భూ
పాలుని నంటఁగట్టి యకృపామతిఁ గొంకక చేతికోలఁ బై
తో లెగయంగ వ్రేసి వెసఁ దోడ్కొని పల్లెకుఁ బో *నేరికిం*
గాలవశంబునం గలుగు కర్మఫలంబులు దప్పనేర్చునే?" 1.131.

9. మూలములోని సన్నివేశముల నొకించుక మార్చి కథార్థ పుష్టికిమారన పాటుపడినాఁడు. మూలమున హరిశ్చంద్రునిభార్య కాటికాపరిగా నున్న తనభర్తను బుత్రశోకాతిశయముచే నతఁడు మూర్ఛితుఁ డగునంతవఱకును గుర్తింపలేదని చెప్పఁబడి యుండగా మారన దాని నొకింత మార్చి వారిరువురును బ్రథమవీక్షణము నందే పరస్పరము గుర్తించుకొనినట్లు వ్రాసినాఁడు. ఈమార్పువలన శైబ్య హరిశ్చంద్రునిదైన్యస్థితిని వర్ణించుచు శోకించుట కవకాశ మధికముగా లభించినది. దాని వలన రసప్రయోజనమును, నాయకదశాపరిణామవర్ణనమును బ్రక్క నున్న మఱి యొకపాత్రచేఁ జేయించు కావ్యప్రక్రియాప్రయోగమును సాధింపఁబడినవి.

శైబ్యాహరిశ్చంద్రసంభాషణమున స్వప్నవృత్తాంతమును మారన చమత్కారముగాఁ బ్రవేశపెట్టి (1. 263) కథయందలి నిర్వహణోన్ముఖావస్థను వ్యంగ్యముగా సూచించెను.

10. పుత్రశోకాతిశయముచేఁ బ్రాణత్యాగమున కుద్యుక్తుడైన హరిశ్చంద్రునిసంభాషణమును మారన మూలముకంటె సంగ్రహించి యౌచిత్యము పాటించెను.

శ్లో "నరకే నిపతిష్యామి కీటకః క్రిమిభోజనః
వైతరణ్యాం మహాపూయవసాసృక్స్నాయుపిచ్ఛిలే."

శ్లో. అసిపత్రవనం ప్రాప్య భేదం ప్రాప్స్యామి దారుణమ్
తాపం వా ప్రాప్స్యామి వా ప్రాప్య మహారోరవ రౌరవౌ.

శ్లో. మగ్నస్య దుఃఖజలధౌ పారం ప్రాణవియోజనమ్
ఏకోపి బాలకో యోయ మాసీ ద్వంశకర స్సుతః.

శ్లో. మమ దైవానుయోగేన మృత శ్చాపి బలీయసా
కథం ప్రాణా న్విముఞ్చామి పరాయత్తోస్మి దుర్గతిః.

శ్లో. అథవా నాస్తి సఙ్క్లిష్టో నరః పాప మవేక్షతే
తిర్యక్త్వే నాస్తి తద్దుఃఖం నాసిపత్రవనే తథా.

శ్లో. వైతరణ్యాం కుతస్తాదృగ్యాదృశం పుత్రవిప్లవే
సోహం సుతశరీరేణ దీప్యమానే హుతాశనే.

శ్లో. నిపతిష్యామి తన్వంగి క్షంతవ్యం కుకృతం మమ
అనుజ్ఞాతానుగచ్ఛ త్వం విప్రవేశ్మ శుచిస్మితే.

శ్లో. మమవాక్యం చ తన్వంగి నిబోధాదృతమానసా
యది దత్తం యది హుతం గురవో యది తోషితాః.

శ్లో పరలోకే సంగమో మే భూయా త్పుత్రేణ చ త్వయా
ఇహలోకే కుత స్త్వేత ద్భవిష్యతి మమేప్సితమ్.

శ్లో. త్వయా సహ మమశ్రేయోగమనం పుత్రమార్గణే
యన్మయా హసతా కించి ద్రహస్యేన శుచిస్మితే.

శ్లో. అశ్లీల ముక్తం తత్సర్వం క్షన్తవ్య మమయాచతః
రాజపత్నీతి గర్వేణ నావజ్ఞేయ స్సతే ద్విజః. —8. 226-236.

ధీరుఁడును, మితభాషియు నైన హరిశ్చంద్రుఁడు నిబ్బరము లేక సామాన్యునివలె రోదన మొనర్చినట్లు మూలమున గలదు. మారన కందు పాత్రౌచిత్యము కానరాలేదు. అందువలన దానిని సంగ్రహించెను, మారన మొదటియాఱుశ్లోకములలోని వివిధనరకబాధలను బ్రత్యేకించి పేర్కొనక రాజుచేత "నీదుర్మరణంబునం జేసి యనేకఘోరనరకంబు లైన ననుభవించెద" (1. 264) నని యనిపించుటయందే

వానిని వ్యంజింపఁజేసెను. 8. 232. 233, 234 శ్లోకములతాత్పర్యము "దానయజనయాజనగురుపూజ లొనరించినవాఁడ నైతినేని పరలోకంబున నైన మనమెప్పటియట్ల కూడియుండెదము"- అనువాక్యమున గుదించెను. 235, 236 శ్లోకములందలి మొదటిచరణముల ననువదింపక వదలెను. వానికి బదులు "వినుము! నగియును నే నెన్నండును బొంకు పలుక నాకిదియ నిశ్చయంబు" అను ముత్యమువంటి మాట యొకటి నాయకునివాక్కు నలంకరించునట్లు మారన రచించెను. శైబ్యయందు గర్వలేశము నెచ్చటఁ గానరాకుండ నామెను జిత్రించియుండుటచేఁ గాఁబోలు "రాజపత్నీతి గర్వేణ నావజ్ఞేయ స్సతే ద్విజః' అను హెచ్చరిక నామె కీయ నవసరము లేదనియే మారన వదలినాఁడు; "నీ వరిగి యమ్మహీదేవుని దేవునిఁబోలె నారాధింపు" మనుటలో హరిశ్చంద్రుని ధర్మనిష్ఠను వ్యంగ్యముగా స్థాపించినాఁడు.

ఇట్టి ప్రతిపదసార్థకమైన మారన రచనము ఔచిత్యదృష్టికి నికషోపలము !

—X—

రాయలు - వర్ణనములు

సాహితీసమరాంగణసార్వభౌముఁ డనియు, ఆంధ్రభోజుఁ డనియుఁ గీర్తి గాంచిన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'అముక్తమాల్యద' ఆంధ్రమహాప్రబంధము లలో నొకటి. రాజకీయచరిత్రలో రాయల కెంతప్రాముఖ్య మున్నదో సాహిత్య చరిత్రలో నాతనికావ్యమున కంత ప్రచారమున్నది.

అముక్తమాల్యదకు విష్ణుచిత్తీయ మను నామాంతరము కలదు. ఆనామ ద్వయమునుబట్టి గోదాదేవివివాహమును, 'విష్ణుచిత్తునిచరిత్రమును ప్రధానముగా నిందు వర్ణింపఁబడు నని తెలియుచున్నది. కాని, యిందు ప్రసక్తానువశమున మఱి కొన్ని యుపాఖ్యానములు పొందుపరుపఁబడియున్నవి. అవి : యామునాచార్యచరిత్రము, ఖాండిక్యకేశిధ్వజసంవాదము, చండాలబ్రహ్మరక్షస్సంవాదము మొదలగునవి.

కావ్యములందు నిబంధింపఁబడు వస్తువిధమును స్థూలదృష్టితో సమీక్షించినచో ముప్విధముగా విభజింపవచ్చు నని తోచుచున్నది. ఒకటి : నాయికా నాయకులకు సంబంధించినకథనే ఆమూలాగ్రము పంచసంధులు పాటించి రచించుట; రెండు : కావ్యగతములగు పాత్రలు ప్రసక్తానువశమునఁ జెప్పుకొనుకథలను ఉపాఖ్యానములుగా వర్ణించి, కావ్యమునందు పొందుపఱచుట; మూఁడు : సర్వాంగసుందరముగాఁ జిత్రించినకథలను గొన్నిటిని గూర్చి ముత్యములపేరువలె నొకకావ్య హారము గ్రుచ్చుట. ఈమూఁడుమార్గములును సాహిత్యమునం దుచితగౌరవమును బొందియున్నవి. ఆముక్తమాల్యదలోని వస్తువిధము వీనిలో రెండవ తెగకుఁ జెందినది.

రాయలు ప్రబంధయుగమునందలివాఁడు. ప్రాచీనమహాకవులయొక్కయు, లాక్షణికాగ్రేసరులయొక్కయు భావముల నవగాహన మొనరించుకొనినపండితుఁడు; అనరవతసాహిత్యప్రపంచసంచారుఁడు: కవిపండితగాయకాదికళామూర్తుల నుపాసించిన తపస్వి; తత్త్వజ్ఞానసమన్వితుఁడు. అతనికావ్య మొకమహాప్రబంధము, విజ్ఞాన స్యందము, ద్వైతమతావలంబము.

ఆముక్తమాల్యదలో రాయ లెంతరసవేత్తగాఁ గానుపించునో అంతతత్త్వవేత్తగా భాసించును. 'నానృషిః కురుతే కావ్య' మ్మను ప్రాచీనులవాక్కునకును, 'No man was ever yet a great poet without being, at the same time, a profound philosopher (Coleridge) అన్న పాశ్చాత్యులనమ్మికకును సరియైన యుదాహరణము రాయలకావ్యము. తత్త్వవేత్త నియమసహితమైన జీవితమును నడిపి లోకమున కాదర్శప్రాయుఁ డగును. కవి నియమసహితముగా కావ్యము నిర్మించి లోకమున కాదర్శము పట్టును. ఈరెండు లక్షణము లొకనియందే సమన్వయమందినచో నతఁడువిశ్వశ్రేయోరూపముగా కావ్యమును సంతరింపఁగల దక్షుఁ డగును.

'విద్వత్స్వం స్తవనీయభవ్యకవితావేశ'ము[1] కవిని కావ్యరచనకుఁ బురికొల్పును. తదావేశఫలితముగా లోకోత్తరములైన భావములు శబ్దరూపముగా కవిముఖమునఁ బ్రవహించి రాగరంజితముగా, లయాత్మకముగా కావ్యరూపమును దాల్చును. కావ్యమునకుఁ గొన్నినియమములు కలవు. వానిని రసౌచిత్యములు చెడకుండ నితివృత్తాశ్రయముగాఁ దీర్చిదిద్దవలసినబాధ్యత కవికిఁ గలదు.

"నగరముఖ్యాద్యష్టదశవర్ణనములచేతఁ
బరగునదియును భవ్యప్రబంధ మనఁగ."

అని లాక్షణికోక్తి.

"అటు లష్టాదశవర్ణనాకలితమై యేపారు కావ్యంబు నం
తటఁ బాటించి తదర్థసంఘటనముం దర్కించి భావోదయ
స్ఫుటభేదంబు లెఱింగి తద్రసగతుల్ శోధించి యచ్చంపుమె
చ్చుటకుం దావలమై చకుక్యపతి సంశోభిల్లు నెల్లప్పుడున్."

అని విన్నకోటపెద్దన కావ్యాలంకారచూడామణియందు వ్రాసియున్నాఁడు. దీనిని బట్టి ప్రబంధమున వర్ణింపఁబడు వర్ణనలలో నిబంధింపఁబడినయర్థములను, వానిని బొందుపఱచిన క్రమమును దర్కించి, భావోదయస్ఫుటభేదములను రసపోషణమును శోధింపవలయు నని తెలుచున్నది. కావున ఆముక్తమాల్యదయందు 'తదర్థసంఘటన'

1. "Inspiration means a great golden flood of words pouring into poet's mind and marshalling themselves neatly into lines and stanzas." —W. H. Hudson.

మెట్లు సాధింపఁబడెనో యించుక — స్థాలీపులాకన్యాయమున — తడవిచూచుట యీ వ్యాసమునందు నాచేయుప్రయత్నము.

ఈకావ్యమునందు కథారంభమునుండి విష్ణుచిత్తుఁడు మత్స్యధ్వజుని వైష్ణవునిగా నొనర్చి తాను మఱల విల్లిపుత్తూరులోఁ 'దనచిరంతనతులసికాదామకరణదాస్యమును జేసికొనుచుఁ దత్పరత' నుండునంతవఱకు నొకఘట్టము. ఇందలికథ కడుసూక్ష్మము. విల్లిపుత్తూరునందు విష్ణుచిత్తుఁడను భాగవతోత్తముఁడు మన్నారుకృష్ణునకు మాలికాకరణకైంకర్య మొనర్చుచు, నిరతాన్నదాతయై, ద్వైతజ్ఞానియై యొప్పారుచుండెను. మధురయందు మత్స్యధ్వజుఁడను రాజు తనరాజ్యమును ఈతిబాధలు పొందకుండ పాలించుచున్నను విషయలోలుఁడై యుండెను. గ్రీష్మకాలావసరమున నొకనాటిరేయి వేశ్యాగృహమున కరుగు మత్స్యధ్వజుఁడు పరదేశి వైష్ణవునిప్రబోధముచే నివృత్తిమార్గాసక్తుఁడై మోక్షప్రదాత యగు దైవమును గూర్చిన చింతను వహించెను. మన్నారుకృష్ణునిచే ననుజ్ఞాతుఁడైన విష్ణుచిత్తుఁడు పాండ్యసభలోని ప్రతివాదుల నోడించి, విష్ణుమహిమను స్థాపించి, మధురానాథుని వైష్ణవునిగా నొనర్చెను. దైవకృపకుఁ బాత్రుఁడై విష్ణుచిత్తుఁడు సువర్ణగృహమును బొంది, యంతకుఁ బూర్వముకంటె నధికమైనభక్తితో దేవుని భజించుచుండెను. ఇది మూఁడాశ్వాసములపై ముప్పదియేడు గద్యపద్యములలో వ్యాపించియున్న యితివృత్తము.

ఈఘట్ట మింత విపుల మగుటకు - ఇందు వర్ణింపఁబడిన వర్ణనములు, ఉపాఖ్యానములు కారణములు. అవి : ప్రథమాశ్వాసమునందలి విల్లిపుత్తూరువర్ణనము, ద్వితీయాశ్వాసమునందలి మధురానగరవర్ణనము, గ్రీష్మర్తువర్ణనము, తృతీయాశ్వాసమునందలి ఖాండిక్యకేశిధ్వజసంవాద మను నుపాఖ్యానము. ప్రథమాశ్వాసమున కథాత్మకములగు పద్యగద్యములు ముప్పదియైదై యుండగా నం దిఱువదియాఱు పురవర్ణనమునకు వెచ్చింపఁబడినవి. ఐదుపద్యములు విష్ణుచిత్తుని యింటిలోఁ జరుగు విందులను వర్ణించుట కుపయోగింపఁబడినవి. ఇట్లే ద్వితీయాశ్వాసమునందుఁ గల తొంబదియెనిమిదిపద్యములలో దాదాపు ముప్పదియాఱేసి పద్యములలో మధురానగర, గ్రీష్మర్తువర్ణనములు సేయఁబడినవి. తృతీయాశ్వాసమునఁ బదునాల్గవపద్యము మొదలు ఆశ్వాసాంతమువఱకు ఖాండిక్యకేశిధ్వజసంవాదమును, చతుర్థాశ్వాసమునఁ బదునేనుపద్యములవిస్తృతియందు అవతారవర్ణనమును వ్యాపించియున్నవి. అనఁగా మొత్తము 260 గద్యపద్యములలో దాదాపు 195

పద్యములు వర్ణనాదులకు, 65 పద్యములు మాత్రము ప్రస్తుతకథకును వెచ్చింపఁ బడిన వని ఫలితార్థము.

దీనినిబట్టి చూడఁగా రాయలకు వర్ణనలయందును, ఉపాఖ్యానములందును ప్రీతి యధిక మని యూహింప వీలగుచున్నది. కావ్యేతివృత్తమున నుపాఖ్యానమునకుఁ గల స్థానమేమి? దానిని కావ్యకర్త యేవిధముగాఁ బ్రయోగించును? దానివలన కథాశిల్పమున కెట్టిగౌరవ మాపాదింపఁబడు నన్నవిషయమును స్థలాంతరమున వివరించెదను. ప్రస్తుతము రాయలవర్ణనములఁగూర్చిన వస్తువును గొంత పరిశీలించెదను. ఈఘట్టమునందలి వర్ణనలు ప్రధానముగా రెండు. 1. పురవర్ణనలు. 2. ఋతువర్ణనము. వీనివలన గలుగు కథాప్రయోజనములను, వాని అర్థ సంఘటనమును గ్రమముగా నిరూపింపయత్నించెదను.

విన్నకోటపెద్దన నగరవర్ణనమునకు లక్షణ మిట్లు చెప్పెను.

కం. "దుర్గమపరిఖావరణని
సర్గబలానీకచతురచాతుర్వర్ణ్యా
నర్గళసంపద్వనజల
వర్గస్తుతి వలయు నగరవర్ణనమునకున్."

అష్టాదశవర్ణనములలోఁ బ్రథమముగాఁ బేర్కొనఁదగినది నగరవర్ణనము. కావ్యము నగరవర్ణనముతోఁ బ్రారంభించుటలో నొకయౌచిత్య ముండనోపును. సాధారణముగా నొకకార్యము నిర్వహింపఁబడుటకు దేశ(స్థల)కాలపాత్రములప్రభావము బలీయమై యుండును. కావున కావ్యమునందు నాయకుఁడు, అత డుండుస్థలము, అతఁ డుండుకాలము ప్రధానవర్ణ్యాంశములై నిలచును. ఇచ్చట స్థలమునకు సంబంధించినది పురవర్ణనము; కాలమునకు సంబంధించినది ఋతువర్ణనము.

ప్రాచీనులు నగరవర్ణనమునే కావ్యమునందు నిబంధించుటలో వారినాగరికతను వెల్లడించుకొనినను, జనపదముపై వారు ప్రసరించిన సవతిచూపును మాత్రము దాచుకొనలేకపోయిరి. కోటలు, అగడ్తలు, ఆవరణములు పట్టణమున కాభరణములు కాని జనపదమునకు అందనిమ్రానిపండ్లు. కాగా కావ్యమునందు వర్ణింపఁబడవలసిన చతుర్విధనాయకులలో ధీరశాంతుఁడు క్షత్రియుఁడును రాజచంద్రుఁడునై యుండనవసరము లేకపోవుటచేతను, బ్రాహ్మణాదులే యైయుండుటకవకాశ ముండుటచేతను, శృంగారవీరములతోపాటు శాంతాదిరసములుకూడ అంగిరసములుగా కావ్యములం దెడనెడ బ్రయోగింపఁబడుచు వచ్చుచుండుటచేతను,

తద్రసనాయకానుగుణముగా జనపదమును వర్ణింపవలసివచ్చినచో దానికిఁ బ్రత్యేక లక్షణములు లాక్షణికులు నిర్ణయించినట్లు కానరాదు. ఈస్థితిలోఁ బైని పేర్కొనఁబడిన లక్షణములో దుర్గపరిఖావరణాదులను వదలివైచి మిగిలినవే జనపదవర్ణనమునకు లక్షణముగా గ్రహించిరని సమాధానపడవలసియున్నది.

కృష్ణరాయలు మన్నారుకృష్ణుని నివాసమైన విల్లిపుత్తూరును, పాండ్య మత్స్యధ్వజావాసమైన మధురానగరమును గ్రమముగా వర్ణించెను. అందే దక్షిణమధుర సాంద్రద్రుమమధుర ! విల్లిపుత్తూరు 'పాండ్యనగరోర్వీరత్నసీమంతము'. అనఁగా మధుర నగరమై, రాజనివాసమై యున్నను, విల్లుపుత్తూరు పాండ్యధారమణికి రత్నసీమంతము వలె శోభిల్లుచున్న దని యర్థము. రాయలు విల్లుపుత్తూరున కొకానొకవైశిష్ట్యము నాపాదించుచున్నట్లు తేటతెల్ల మగుచున్నది. ఈవిధముగానే ఈనగరద్వయవర్ణనమునందలి యర్థసంఘటనమును బరిశీలించినచో నీసత్యము బయలుపడఁగలదు.

ఈతారతమ్యపరిశీలనమునందు నగరద్వయమున సామ్యములు కొన్ని కానఁబడుచున్నవి. భవన, వన, శకుంత, పవన, వేశ్యాదుల వర్ణనములు రెండింటియందును నిర్వహింపఁబడినవి. అందొక విచిత్రమైన సమన్వయసూత్రము వ్యాపించియున్నది. రాయలు విల్లిపుత్తూరునందు వీచు వాయువుల నిట్లు వర్ణించినాఁడు.

మ. "పొలయుం గాడ్పు లుదఙ్మహాలయవదంభోజాక్షవక్షస్స్థల
స్యలఘుస్రఙ్మకరందబిందువులఁ బణ్యారంపుఁ బుణ్యాంపుఁ గం
పులఁ దాపత్రయి మీఁటి వీట నటనప్రోద్యోగసజ్జీభవ
ల్లలనావర్జితకైశికక్షరితకల్హారాళి నల్లార్చుచున్."

వాయువు సర్వాంతర్యామి; మానవునిప్రాణముయొక్క యునికికి చిహ్నము. దాని నిట్లు వర్ణించి, రాయ లేయితరప్రబంధకవులు ఊహింపలేని మాహాత్మ్యమును వాయువునకుఁ గల్పించినాఁడు. చరాచరవిశ్వసత్యస్వరూపదర్శనానుభూతికల్గిన మహామేధావి యగుట యతని కట్టివర్ణనాశక్తి లభించినది. ఆవాయువు తాపత్రయహారి. ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము అనునవి తాపత్రయ మనఁబడును. వీనిని మీటునంత శక్తిని ఆగాలి 'ఉదఙ్మహాలయవదంభోజాక్షవక్షస్స్థలస్యలఘుస్రఙ్మకరందబిందువుల' నుండియు, 'పణ్యారంపుపుణ్యాంపుకంపుల' నుండియు గ్రహించినది. ఇచట నొక విచిత్ర మున్నది. కోవెల విల్లిపుత్తూరున కుత్తరపార్శ్వ

మున(గలదు. సాధారణముగా ప్రబంధములందు వీచునదిగా(జెప్ప(బడునది దక్షిణానిలము. ఇచ్చటను ఆమలయానిలమే వీచుచున్న దని గ్రహించుచో దక్షిణము నుండి యుత్తరమునకు వీచుచున్న ఈగాలి గొప్పదైన యాదేవాలయగర్భమున సరాసరి ప్రవేశింప(గలదు. అచ్చట అంభోజాక్షు(డమలమూర్తియై నిలచియుం డును. ఆతనియురముపై(దులసికాదామము లలంకరింప(బడియున్నవి. తులసీ దళములనడుమ పూలగుత్తులు కూర్ప(బడియున్నవి. లేనిచో నలఘుప్రసజ్మకరంద బిందువులు తులసీదళములనుండి పుట్టవు. దేవునిముందు పణ్యారములు నివేదనకై యుంప(బడినవి. వానిపై(బ్రసరించినగాలి మకరందశైత్యమును, పణ్యార ములసౌగంధ్యమును వహించినది. మఱల పట్టణమున వీచుటకు బయలుదేరినది. తత్పవిత్రవాయుప్రసారప్రదేశమంతయు తాపత్రయరహిత మైనది.

గర్భాలయమునుండి గ్రామమువైపు వీచుచున్నగాలి దేవతారాధనానంతరము కోవెలను వీడివచ్చు భాగవతోత్తముని(దల(పించుచున్నది. ఇట్లనుటలో నొక యౌచిత్యమున్నది. భాగవతోత్తము(డు ప్రకృతికన్న పరంబైన తనయాత్మను తెలిసికొని, ఆత్మకంటె పరుండైన పరమేశ్వరు నెఱింగి శేషశేషిత్వసంబంధ ముతో నాతని నుపాసించి యాతని కృపకు(బాత్రు(డయి యఖర్వనిర్వృతిని గాంచును. అట్టిది 'బహుజననకృతసుకృతఫలరూపము'. ఆత్మ ప్రకృతికన్న వేఱని తెలిసిన జ్ఞాని మోక్షప్రదాత యగు దైవమున్ముందు మోకరిల్లి త న్నాతని కంకితము చేసికొనును. అప్పుడు

> ''అనన్య శ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే
> తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్.''

అని ప్రతిజ్ఞచేసిన శ్రీకృష్ణభగవాను(డు తనమాటను నిలిపికొనును. ఇట్టి తత్త్వ మిందు ధ్వనింప(బడినది. పణ్యారములు పుణ్యవాసనలు కలవి. గర్భాలయమునం దున్న యితరసుగంధద్రవ్యములను వేనిని బేర్కొనకుండ వీనినే పేర్కొనుటలో రాయలకు(బ్రత్యేక మైన ప్రయోజనము కలదు. పుణ్యవాసనాభరితమైన పణ్యా రము భగవదంకితమైన భాగవతోత్తముని యంతరాత్మవలె శోభించుచున్నది. దేవుని వక్షస్స్థముపై వ్యాపించిన తులసికాదామమునుండి స్రవించుచున్న మకరంద బిందుసందోహము భక్తవత్సలుని కరుణారసమువలె రంజిల్లుచున్నది. అట్టిమక రందమునందలి శైత్యము వహించినవాయువు పణ్యారంపుపుణ్యంపుకంపుల

గ్రహించి జీవన్ముక్తుఁడైన భాగవతోత్తమునివలె భాసించుచుండెను. జీవన్ముక్తుఁడు సంసారమునందు తామరాకుపై నీటిబిందువువలెఁ జరించుచు జీవులకుఁ దరణోపాయమును గల్పించు ధర్మమును బోధించుచుండును. విషయలోలు లయి సంసార బంధమునఁ జిక్కి దుఃఖితులైన వారి తాపత్రయములను దైవదత్తము లైన మహిమలచే మాన్పి దైవపరమైన ప్రవృత్తిని వారిలో రేకెత్తింపఁజేయును. అట్లే వాయువు తాపత్రయములఁ బాపి, 'నటనప్రోద్యోగసజ్జీభవల్లలనావర్జితకైశికక్షరిత కల్హారాళి నల్లార్చు' ననుటలో దేవదాసీజనములు తమనాట్యనీరాజనములతో దేవతారాధనము చేయఁబూనఁగా వారినిఁ బ్రోత్సహించుచున్నట్లు కానఁబడుచున్నది.

మన్నారుకృష్ణుని తులసికాదామమునుండి ప్రసరించిన వాయుమాహాత్మ్యమే యింతటిదై యుండ నాపురాణపురుషునిమహిమ లెన్న నెవ్వరితరము? అతఁ డాయూరి యుత్తరమున మిట్టపైఁ గూర్చుండి తనకమలాయతనేత్రములతో వీటిని చల్లని చూపు చూచుచుండును. ఆవీటియందలి ప్రతిజీవియొక్క ప్రవృత్తియు నాదేవుని ప్రభావముద్రను వహించియుండును. విల్లిపుత్తూరులోని సువర్ణసౌధములపై నవ రంజిప్రాతలతోఁ జిత్రింపఁబడిన లక్ష్మీవిగ్రహములు, తత్పార్శ్వములందు శంఖ చక్రములు ప్రత్యక్షము లగును. ఉద్యానంపులోఁద్రోవలందు నడచు మన్మథసాయక ములవంటి ద్రవిడాంగనలు సైతము దివ్యప్రబంధానుసంధానము గావించుచు, నచ్యుతమజ్జనార్థము జలఘటములను, పూజార్థ మంబుజములను గైకొని చనుచుం దురు. కొందఱియిండ్లలో వనజాక్షుద్వంద్వ మధివసించిన రథములు చిత్రింపఁబడి యున్నవి. కుసుమబాణునిసైతము కువిటునిగాఁ బరిగణించెడి యాయూరివేశ్యలు శ్రీకార్యపరులను గాంచినప్పు డంజలి ఘటించి మ్రొక్కుదురఁట! వారిచెవులు శ్రీలఁట! సాయంకాలములందు కేళివనములందు 'కులాయగమనప్రోత్థితద త్తస్వర స్థాయిశ్వేతగరుత్పటపటాత్కారము'ను క్రేంకారమును మన్నారుకృష్ణునికోవెలలో మ్రోయు దుందుభిధ్వనులకు, కాహళికాస్వనమునకు ప్రతిస్వనములుగా నుండునఁట! రాత్రులందు మలయపవనాహతిచే మ్రోగిన దేవాలయధ్వజస్తంభముయొక్క బంగారపుచిఱుగంటలసవ్వడికి తత్ప్రాంతశకుంతము లదరి రొదసేయ నావీట దంపతులు వేకువ యయ్యె నని భ్రమించి, ప్రణయకలహములు మాని కూడుదురఁట! ఆదేవాలయమునకు సంబంధించిన దురుశాలము నైనను ద్రవిడకన్యలు గౌరవముగాఁ జూచుచుందురు. ఇట్లావిల్లిపుత్తూరునందలి ప్రజాజీవిత మొకానొకవిధముగా నాదేవునిప్రభావముతోఁ బెనవైచికొనిపోయినట్లు వర్ణించుట రాయల ప్రతిభావిశేషము.

అట్లు వర్ణించుటచే నావర్ణనము సార్థకమును, రసపోషకము నగుచున్నది. అం 'దక్రాంతయోగాందూబద్ధమధుద్విషద్ద్వారదుఁ' డగు విష్ణుచిత్తుఁ డను సార్థకనామధేయుఁడు నివసించుచుండుట యబ్బురము కాదు కదా!

మధురానగరవాతావరణము వేఱు. ఆనగరమునందు వీచు మలయమారుత స్వభావము వేఱు. మదేభగంధమును, సురతశ్రమజ మగు కామినీమృదుగండఘర్మము నందలిశైత్యమును, కస్తూరివాసనను వహించి గంధవహుఁ డానగరమునందుఁ దన మిత్రు లగు నెమిళ్ళరెక్కల నిమురుచు మందగమనమున వీథులవెంట నడచునఁట! అందువాయువు ఉత్సాహము, స్త్రీలౌల్యము, భోగపరాయణత్వముకల్గిన ధీరలలితుఁడగు రాజకుమారునివలెఁ గన్పడి, శత్రుభంజనులగు మిత్రులను గౌరవించుచున్న ట్లున్నది. అవ్విధముగా నచ్చట వర్ణించుటలో రాయ లౌక యౌచిత్యమును పాటించియున్నాఁడు.

పాండ్యరాజు మత్స్యధ్వజుఁడు. ఆతని పేరునందే మీనాంకుఁడుమూర్తీభవించినాఁడు. ఇఁక నాతనిఁగూర్చి వేఱుగాఁ జెప్పఁ బనియేమి? ఎంత సమర్థుఁడైన చక్రవర్తియైనను విషయలోలుఁ డాతఁడు. "యథా రాజా తథా ప్రజా" అన్నట్లు అతనిపరిపాలనలో నున్న మధురానగరప్రజ కూడ ఆతనిస్వభావమును ముద్రించుకొనియున్నది.

"ఏవీట సతులపాలిండ్లపై గంబూర
నవహారముల చిప్పకవుచు మాన్చు"

నని వర్ణనము ప్రారంభించుటలోనే మధురానగరశృంగారవిలాసము ద్యోతక మగుచున్నది. లోకసాక్షు లగు సూర్యచంద్రులుసైత మాపట్టణమునఁ జరించుచు 'ఉదుటు గుబ్బలు గల తల్పుటురము సూచి' మోహితు లగుదురఁట! అచేతనములందు సైతము కామినీత్వము సాధించుకొని దేవతలే దైన్య మందినప్పుడు ఇఁక నరుల మాట యేమి? స్వర్గసౌధములఁ దలదన్ను మేడ లానగరమునఁ గలవు. అట్టి భవనములందు వసించు నాగరికుల నిత్యజీవితమునందు లేశమైనను విమలవ్యాపారము కానరాదు. మేఘగర్జనముగూడ వినఁబడనంతటి యెత్తుపై నివసించుచున్నను వారు నక్షత్రమౌక్తికహారములను ధరించుచు క్రీడాసక్తులై యుందురు. అచ్చటి దంపతుల ప్రణయకలహములను నివారించుట సప్తర్షి వృద్ధభార్యల యుద్యోగము. చంద్రరేఖ సైతము పూదండ తగిలించుకొను నొంకెగా మారిపోవు నచ్చట! ఆవీట నడయాడు పుష్పలావికల నర్మవచనములలోఁ బచ్చిశృంగారము కస్తూరివలె గుబా

శించుచుండును. అచ్చటి పణ్యయువతులు సురతవైయాత్యనిధులు. 'కంతుకలహోన్మాదము' వారి కెడ|తెంపు లేదు. ఆయూర నున్న ఏనుఁగులు తమ|ప్రియురాం|డ్ర మరిగి అతికష్టమునఁ బురము సేరునఁట! ఇట్లు వర్ణించుటచే రాయలు మధురను అచ్చంపుమన్మథరాజ్యముగాఁ జి|త్రింప నెంచి కృతకృత్యుఁడైనట్లు కానఁబడును.

సర్వసౌఖ్యవిలాసావాసమైన ఆపట్టణమున |గ్రీష్మర్తువు |ప్రవేశించినది. ఋతురాజమును, ఋత్వ|గగణ్యమునైన వసంతము మొట్టమొదట మోసులెత్తుటకు బదులు |గ్రీష్మము |ప్రథమముగా నీ|ప్రబంధమండలమున దిగుచున్నది. ఊరకరారుకదా మహాత్ములు! కారణము లేని కార్యముం డదు కదా!

"అట్టి వేసవి బెడిదంపువెట్ట కతన
హ_స్తము సెమర్చ్పసారెకు ల_స్తకంబు
దుసికిలఁగఁ గాదె సవరింప వసము గాక
పుష్పబాణుని చెఱకువి ల్పుడమిఁ బడియె."

అనుపద్యమున రాయలు తన|గ్రీష్మర్తువర్ణనారహస్యమును సూచించియున్నాఁడు. పుష్పబాణుని చెఱకువిల్లు చేయిజారి |క్రిందఁబడినది. అతని చేతులు విల్లు పూనినచోఁ జెమర్చి మండుచుండెను. ఇట్లనుటలో– రతి|ప్రేరణకు హేతుభూతమైన సాధన మోటువడినమనోభవుని లోకము వహించియున్నదని భావము. ఇట్లే |గ్రీష్మర్తువర్ణన మంతయు జీవ|ప్రవృత్తియం దాసమయమున వ్యాపించిన నిస్సారమును, రతివైముఖ్యమును |బదర్శించుటకై వినియోగింపఁబడినది. అధికాతపసంతప్తజీవులగు దంపతుల పొందుల నీవిధముగా వర్ణించినాఁడు రాయలు :

"హృదయము లెప్పుడున్ గదియకే తఱచౌ వెడకౌఁగిలింతలన్
గదిరెడు మేలుకార్యములఁ గల్గక మాటలయందె కల్గు పె
న్జదురులు వట్టిశైత్యములఁ జాల ఘనంబయి మండు వేసవిన్
బొదలఁగ నిల్చె దంపతులపొందు లనార్యులపొందు కైవడిన్."

"అనార్యుల పొందుకైవడిన్" అను నుపమానమును వాడుటలో రాయలు రమణీయార్థ|ప్రతిపాదన మొనర్చినాఁడు. హృదయములు కదియకుండుటలో, మేలుకార్యములు కలుగకుండుటలో, చతురవచనములలో, వట్టిశైత్యములలో దంపతుల రతివైముఖ్యమును రసవత్తరముగాఁ దీర్చిదిద్దినాఁడు. నిదాఘతాపమునకు సొమ్మసిల్లిన

యువతీముఖచంద్రుఁడు తనయోషధీనాథత్వమును వినియోగపఱచి కంతునితోఁ బాతాళమునకుఁ బారిపోవుచున్న కమ్మనిపిల్లతెమ్మెఱనుశీరపుతాళవృంతములతో బలిమిని దెప్పించుకొని యనుభవించుచున్నాఁడఁట! మలయపవనము నోచుకొనని మావపునిమనము మరునిబాసలమాటలే మఱచిపోయినది. అట్టియనుభూతియే సకల సత్త్వములందును వ్యాపించుటచే నవి నీరసములై నిజధర్మములందు నిర్లిప్తత గాంచి యున్నవి. మంటగాలిని మేయలేక సప్తాశ్వనిరథపుపగ్గములగు పాములు ముడులువీడి దుల్లిపోయినవి. రసపూరితములగు కూపవితానములు రసశూన్యములై రజశ్చక్రాకృతితో గగనమున కెగురుచున్నవి. నదీలలామలు 'అబ్ధిరాడ్విరహమున' 'అధ్వనీకృత'కూపజలప్రతిబింబిత భానుబింబాకాకృతిరూపముక్తాహార గళసీమలై తమకు జీవనాధారభూతుఁ డగు మేఘమునకు లంచముఁ బెట్టుచున్నవి. బకోటకులమునకు జానుదఘ్నములగు చెఱువులు, ఉలుచలు, చిఱుతగుల్లలు, మీఁటగు మీనములును కరువై పోగా నెఱ్ఱెల బురదలోఁ జనిపోయిన బొమ్మిడాయలచేపలను తిని డొక్కలు పూడ్చుకొనుచున్నవి. జలదేవతలు చలిపందిళ్ళను శరణుజొచ్చిరి. కాళ్ళు పడిపోయినమన్మథుఁ డచ్చోటనే యొకమూల కుక్కిమంచ మెక్కినాఁడు. 'కట్టా విక్రియ నావి రెగయు' నట్టి వేసవిమధ్యాహ్నమందు విరియపూచిన మల్లెమొగ్గలు అగ్గిబొబ్బలవలెఁ గానుపించుచున్నవఁట! వెన్నెలరాత్రి వేడితో వేగి కాలినచాఁపట్టు వలెఁ జూపట్టునఁట! వేకువజామునకుఁ గాని నేల కొంత చల్లారదు. అప్పటికి గాని సొమ్మసిల్లి కునుకుతీయు దంపతుల డెందాలలో కంతుని చందాలు చిందులాడవు; అప్పుడుగాని ఆరామములందు 'అంధుయంత్రనతిక్రుత్ప్రోద్గీతగేయౌఖములకు' తాళము వేయు 'కుంభోంభనోద్భూతాంబుధ్వనులు' వినఁబడవు. కాని, యదియు క్షణికము. ప్రొద్దుపొడుపుతోఁ బ్రాణులు తల్లడిల్లి దీర్ఘికలందు కుత్తుకబంటినీటిలో మునింగి పవలెల్లఁ దపనఁ దీర్చికొందురు; ఎడనీళ్ళు, చెఱకురసములు, వడపప్పు పానకములు విధివిరామములు లేక సేవించుచుందురు.

ఇట్టి గ్రీష్మమున మత్స్యధ్వజుఁ డొకనాటిరాత్రి భోగినీసంగతికి బయలుదేరెను. ఆతఁ డెండకన్నెరుగనిభోగి. పైపెచ్చు పన్నీట మునిఁగితేలినాఁడు. మకరందపుసోన లుట్టిపడు పాటలపుష్పములను ధరించినాఁడు. శరీరము శైత్యము వహించినది. కాని గ్రీష్మకాలప్రభావమున హృదయోత్సాహము దస్సియే యున్నది. అతఁ డాభోగినిదరికిఁ జేరినను హృదయములు కదియుననన్న ధైర్యము లేదు. వట్టి శైత్యములు ఘనము కాక మానవు; చివరకు ఎట్టిమేలుకార్యములు జరుగకపో

వచ్చును. అట్లున్నది కాలమహిమ! అట్టివిచిత్రావస్థయందు రాజునకు పురోహిత ధర్మబోధకంబగు పరదేశివిప్రుని ప్రబోధ మాత్మ గిల్కొనినది: అనఁగా హృదయమున గాటముగా నాటుకొనిన దన్నమాట! భావిహితార్థసూచకముగా హృదయకుహరమున మారుమ్రోగినదన్నమాట! బహుశః అది యేవసంతఋతువో యైనచో నట్టి ప్రబోధము మనసునకు హత్తుకుండునేమో! అందువలననే గ్రీష్మ మిచ్చట ప్రవేశపెట్టఁబడుట. ఆత్మ కామప్రవృత్తియందు శోషించి యున్నది. కావుననే 'అందని ద్రాక్షపండ్లు పుల్లన' యని తనకోర్కెను త్రోసివైచి సత్యాన్వేషణ కుపక్రమించినది. ఐహికభోగము లనెడి మత్తునిద్రలో నున్న జీవుఁడు గ్రీష్మ మనెడిజఠరాగ్నితనయందు ప్రకోపింపఁగా జ్ఞాన మనెడి మాతృమూర్తి భిక్షకు కేకవేయ, చివాలున లేచి పరుగెత్తినాఁడు. ఆకలిమంట తీవ్రమగుటచే తల్లిని త్వరగావడ్డించు మని వేమారు వేడినాఁడు. ఆకొన్నబిడ్డకు అన్నముపెట్టుట తల్లియొక్క విధి. అట్లే తత్త్వభిక్ష వేడిన భక్తునిఁ బ్రసాదించుట దేవునివిధి. అట్లు కానిచో 'అక్కఱకు రాని చుట్టమువలె. మ్రొక్కిన వర మీనివేల్పును గ్రక్కున విడువం' బడును. అందువలననే విల్లిపుత్తూరునుండి లోకమును వేయికన్నులతోఁ గాంచుచున్న మన్నారుకృష్ణుఁడు విష్ణుచిత్తుని మధురకంపుట కంత వేగీరపడుట. గజేంద్రవరదుని కారుణ్యభావము కరిగిజాలువారినది; భక్తునిజీవిత ముద్ధరింపఁబడినది.

ఇచ్చట కథలో నొక చమత్కారము కలదు. భక్తవత్సలుఁడగు భగవంతుఁడే స్వయముగా రాజునకు దర్శన మిచ్చి వైష్ణవునిగా నొనరింపక విష్ణుచిత్తునకా పని నంటగట్టుచున్నాఁడు. పాండ్యసభయందు దేవునిమహత్త్వము పండితవాదములపై నాధారపడియున్నది. వాదమునందుఁ దనమోక్షప్రదానసామర్థ్యము నిరూపితము గాకపూర్వమే మత్స్యధ్వజునకుఁ గృష్ణుఁడు దర్శనమిచ్చినను అతని హృదయము సమాధానపడదు. కావున ఇతఃపురాపఠితశాస్త్రగ్రంథజాత్యంధుఁడైన విష్ణుచిత్తునే శాస్త్రవాదమునకుఁ బంపఁనుంకించుట. "వాదితనిచేత గెలిపింతు; నాదుమహిమ మువిద కనుము!" అని చెంత చిఱునగవుచేఁ జెన్నారు లక్ష్మిముందు ప్రాభవముగాఁ బల్కుట! అట్లే తనపంతము, తనపందెము నెగ్గించుకొనినాఁడు. భక్తవాత్సల్య మొకవైపున్నను అది ప్రధానముగా నాత్మగౌరవమునకు సంబంధించినవిషయము. ధీరులకు మానము ప్రాణముకన్న మిన్నకదా!

భక్తుఁ డనన్యచింతతోఁ గైవల్యముకొఱకు పరితపించునపుడు దైవము తానే ఆచార్యరూపమున నాతనికిఁ దరణోపాయము చూపి, అతఁడు పరిపూర్ణాధి

కారము గాంచిన తరుణమునఁ దనదివ్యదర్శన మొసఁగి మోక్షపద మందించును. ఆమార్గముననే మన్నారుదేవుఁడు విష్ణుచిత్తుఁ డను ఆచార్యునిరూపమున రాజునకు మూలమంత్రపూర్వకముగా 'ద్వయము'ను బ్రసాదించి కైవల్యమార్గమును సూచించెను.

"లోకోత్తరవర్ణనానిపుణః కవిః" అని మమ్మటుఁడు. కవి వర్ణించుట కొక వస్తు వుండవలెను. ఆవస్తువు ద్వివిధము. తాను, తనకన్ననితరమైనది. తాననఁగా నిచ్చట తనశరీరము, తనభావన, తనప్రవృత్తి అని భావము. తనకన్ననితరము సర్వస్వము. దానిని ప్రకృతి యనియు, అందలిసత్యస్వరూప మగు పరమాత్మ యనియు వింగడింపవచ్చును. కవికి వీనిని లోకోత్తరముగా వర్ణించుటకుఁ దత్సంబంధమైన యనుభూతి యవసరము. వ్యక్తిగతానుభవమే సాహిత్యమున కాధారము.[1] ఆయనుభవ మైంద్రికమే గాక భాగవతమునై యుండవచ్చును. అధికానుభవజ్ఞుఁడు వ్యుత్పన్నుఁ డగును. వ్యుత్పత్తి అపూర్వవస్తునిర్మాణశక్తి యగు ప్రతిభను ప్రకాశింపఁజేయును. అట్టిప్రతిభతో అభ్యాసవశమున కవి యపూర్వవర్ణనాత్మకమైన కావ్యమును సృజించును.

కావ్యమున భావము శబ్దార్థముల నాశ్రయించి యుండును. శబ్దవృత్తులు అభిద, లక్షణ, వ్యంజన మను నామములతో నొప్పారుచున్నవి. అందు వ్యంజన ప్రధానమైనకావ్య ముత్తమము. దానినే ధ్వన్యాత్మక మనియు నందురు. అనఁగా కావ్యమున వాచ్యమైన యర్థముకంటె దానిచే స్ఫురింపఁ జేయఁబడు వ్యంగ్యార్థమునకు ప్రాధాన్య మొసఁగిన గ్రంథమన్నమాట! ఈయభిప్రాయమున ప్రాచ్యపాశ్చాత్య పండితులయభిప్రాయములు సమన్వయించుచున్నవి. ధ్వనిసిద్ధాంతప్రవర్తకుఁడైన ఆనందవర్ధనుఁడును, లోచనవ్యాఖ్యానకర్త అభినవగుప్తుఁడును భావించినట్లే కావ్య విషయమున "By Poetry we mean the art of employing words in such a manner as to produce an illusion on the immagination, the art of doing by means of words what the painter does by means of colours" అని Macaulay యు "For Poetry, idea, is everything; the rest is a world of illusion, of divine illusion. Poetry attaches its emotion to the idea,

1. Personal experience is the basis of all real literature -W. H. Hudson.

the idea is the fact" అని Mattew Arnold ను భావించియుండుట గమనింపఁదగినది. వీరందరియభిప్రాయములఁ బట్టి తర్కించినచో నుత్తమకావ్యత్వ మును నిరూపించుకొనుచున్నది రాయలరచన. వర్ణనములందే పద్యమున కా పద్యము ప్రత్యేకమైనవ్యక్తిత్వము వహించియున్నను వీనినన్నింటను కవివ్యంగ్య ప్రధానముగా సమైక్యసూత్రమును సంఘటించియుండుటను మనము కాంచియుంటిమి.

కవి కావ్యరచనమున కుపస్థారకము లగు నిశితానుభూతుల నందించినప్రకృతిని వర్ణించును. అందు సామాన్యముగాఁ జేతనాచేతనాత్మకమైన ప్రకృత్యంగములను వర్ణించుట ద్వారమున మానవునియావేశమునుగాని, భావమునుగాని, కార్యమును గాని, తత్త్వమును గాని మాహాత్మ్యమునుగాని ధ్వనింపఁ జేయుటకు యత్నిం చును. నన్నయభట్టారకుఁ డాదిపర్వమున కణ్వమహర్షిశక్తిని ఈక్రిందిపద్యమున ధ్వనింపఁజేసెను.

సీ. "శ్రవణసుఖంబుగా సామగానంబులు
చదివెడుశుకముల చదువు దగిలి
కదలక వినుచుండు కరులును గరికర
శీతలచ్ఛాయఁ దచ్ఛికరాంబు
కణముల చల్లనిగా డ్పాసపడి వానిఁ
జెంది సుఖంబుండు సింహములును
భూసురప్రవరులు భూతబలుల్ దెచ్చి
పెట్టు నీవారన్నపిండతతులు

తే. గడఁగి భక్షింప నొక్కటఁ గలసి యాడు
చున్న యెలుకలఁ బిల్లులు నొందుసహజ
వైరివర్గంబులయు సహవాస మపుడు
సూచి మునిశక్తి కెంతయుఁ జోద్యమంది."

ఈపద్ధతి - ఉదాహరణ మందించి సూత్రమును స్ఫురింపఁజేయునట్లును, లక్ష్యము చెప్పి లక్షణము నందించు విధమునను సాగినది. ఈపద్యమున మునిశక్తి యిందు ప్రయుక్తములైన శబ్దరూఢ్యర్థముకన్న మిన్నయైన వ్యంగ్యార్థముననే యూహింపఁ బడవలసివచ్చుచున్నది. పరిసరములపై పాత్ర ముద్రించు ప్రభావ మిచ్చుట ధ్వని. దానిని వాచ్యము చేయకుండుటయే రసజ్ఞుఁడైన కవి చేయుపని. ప్రసన్నకథాకథనప్రధాన మైన నన్నయరచనలో సూక్ష్మమున మోక్ష మందించిన

ట్లిట్టివర్ణనములు సాగుట మనము గమనింతుము. విపులవరనాన్వితమైన ప్రబంధ నిర్మాణమునం దిట్టివర్ణనలపాత్ర మధికముగా నుండుటకు వీలున్నది. అందును రాయలు దీర్ఘ వర్ణనములకు పెట్టినది పేరు. కథాకథనమునందు అధికమైన పొదుపరితనము ప్రకటించు ఈకవి వర్ణనములం దింతటివిచ్చలవిడిగా వెచ్చించుతెంపు నెందులకు వహించినాఁడు? పుట్టినింటగుట్టుగా నుండనేర్చిన యాఁడుబిడ్డ మెట్టినింట రట్టడి పాలౌనా? దీనిని గమనింపక వర్ణనల దైర్ఘ్యమును గాంచియే చేబారలు సాచి నిర్విణ్ణులైన విమర్శకులు కొందఱు జీతని ప్రబంధనిర్మాణము రంగురంగుల గుడ్డలఁజేర్చి కుట్టిన బొంత యని పేర్కొనియుండిరి. వారికి వస్త్వైక్యమునందు వలెనే, వర్ణనములందు సైతము సమన్వయసూత్రము గోచరించినదికాదు; అది యొకేరంగుగుడ్డతో దట్టముగా నేర్చికూర్చిన చిత్రవస్త్ర మని తెలిసివచ్చినది కాదు.

రాయలవర్ణనములు సర్వలక్షణసారభూతము లైనవి. కాని, లక్షణములకు లక్ష్యములుగా నున్నట్లు మనకు గోచరింపవు. అవి కొలబద్దలలోఁ జెక్కిన కొయ్యబొమ్మలు కావు. లక్షణములమధ్య నిలిచి యాలోచించుబుద్ధికన్న లక్షణాత్మకమైన సంస్కారముతో మిన్నులపై నెగసి భావపుంజములఁ బ్రసరించునైపుణ్యము రాయలయం దధికము. ఎంతభావమునైన, నింతపద్యములోఁ బ్రస్ఫుటముగా గోచరింపఁజేయు దుర్భిణీయంత్ర మాతనికవనము. అనంతప్రకృతిసౌందర్యవీక్షణమున కేర్పాటు చేసిన రసకవాట మాతనిభావుకత. పదునాల్గు(విద్యా)లోకములవ్యాపించిన అతనివిరాడ్రూపమున కీకావ్యమొక యుత్సవవిగ్రహము. తత్సమీపగతుఁడైన ప్రతిపఠితయును 'అంభోజాక్షవక్షస్స్థలస్యలఘుస్రజ్మకరందబిందువుల' నాస్వాదింపఁగలఁడు.

వరూథిని

మనుచరిత్రమున ప్రవరుఁడు మేఘుఁడు; వరూథిని సస్యక్షేత్రము; గంధర్వుఁడు కర్షకుఁడు; స్వరోచి ఫలము. మేఘుఁడు వర్షించినజలము భూమియం దింకి కర్షకుఁడు చల్లిన బీజములలోని జీవాణువులను బోషించి సస్యాంకురములను మొలకెత్తింపఁ జేయును. స్వరోచిజన్మమునకు ప్రవరుఁడు హేతుభూతుఁడు: వరూథిని మూలాధారము; గంధర్వుఁడు నిమిత్తమాత్రుఁడు. కావున వరూథినీపాత్రమునకు మనుచరిత్రమున కీలకమైన స్థానము గలదు.

సంస్కృతమార్కండేయపురాణకర్త వరూథినిని "వరాప్సరా మహాభాగా మౌలేయా రూపశాలినీ" అని వర్ణించెను. విప్రుని[1] బ్రాహ్మణకులప్రవరునిగాఁ బేర్కొనెను. వరూథిని యచ్చరకులమున శ్రేష్ఠురాలు. అతఁడు నిర్మలవర్తనుఁడు; ఆమె నిర్మలహృదయ. అతఁ డశ్వినులకంటె నందగాఁడు; ఆమెయు రూపశాలినియే. ఇరువురును అభిజాత్యము గలవారే. పురాణకర్త వరూథినిపాత్రపోషణమున 'మహాభాగా' యనులక్షణమున కధికప్రాధాన్య మిచ్చెను. ఆమె యపూర్వసుందర విగ్రహుఁడైన ప్రవరునిఁ గాంచినప్పు డచ్చముగా నాతనిఁ బ్రేమించినది. ఆమె యనన్యకాంతగా నిలిచిపోయినది. అమె ప్రవరు ననన్యచింతతోఁ బ్రేమించుట యందే యామె హృదయనైర్మల్యమును మూలకర్త ప్రస్ఫుటీకరించెను. మారనకును, పెద్దనకును అతనిపాత్రచిత్రణ మొజ్జబంతి యైనది.

మారన వరూథిని మహాభాగ యని వాచ్యము చేయలేదు. కాని కథానిర్వహణమున దానిని వ్యంగ్యముచేసి పాత్రపైఁ బఠిత కధికసానుభూతి కలుగునట్లు చేసెను. పైపెచ్చు మారన వరూథినియొక్క రూపశాలినీత్వమును వివరించెను. తెలుఁగుపురాణమున నామె యప్సరోంగన, లలితాంగకాంతిజితకాంచన విభ్రమచంచదబ్జలోచన, కలహంసయాన. సుకుమారమూర్తియు, తేజస్వియునైన ప్రవరుని మూర్తి కనుగుణముగా నామెను లలితాంగిగను, జితకాంచన' వర్ణగను మారన

1. సంస్కృతమార్కండేయపురాణమున విప్రునకు ప్రవరాఖ్య లేదు. మారన తన యనువాదమున నావిప్రునకు ప్రవరాఖ్య నుంచెను. పెద్దన దానిని గ్రహించెను.

సృష్టించెను. ప్రవరునితేజోమూర్తి కన్నులారఁ గని మనమున ముద్రించుకొనుట కుపకరించిన యామెవిశాలనేత్రములను, వానియందు పొంగిపొరలెడి భావతరంగ పంక్తినిఁ దెలియఁజెప్పు తరళచాంచల్యమును, హిమగిరిసానువులపై విరహిణియై విహరించు నామెనడకలోని యొయ్యారమును మారన కీర్తింపక యూరకుండఁ జాలకపోయెను. మారన కల్పించిన రూపగుణవిశేషముల నన్నింటిని పెద్దన గ్రహించి సార్థకముగాఁ దనకావ్యమునఁ బ్రయోగించుకొనెను.

పెద్దన వరూథినీనిర్మలచిత్తమును అమూలకములైన సంభాషణలయందు చిత్రముగా వ్యంజింపఁజేసెను. తనపనితనము తేటపడ సూర్యాస్తమయవర్ణనావసర మున 'తరుణి ననన్యకాంత' అని సూచించి యాసత్యము నాలంకారికముగా వ్యంగ్యము చేసెను. పెద్దన వర్ణించిన శతపత్రేక్షణములు మారన చూపించినవే. మారన చూపించిన బంగారుమేనిచాయను మెఱుఁగుపెట్టి మెఱుపుతీగఁగా మలచి నాఁడు పెద్దన. మారన వాడిన "ఇందువదన !" యనుసంబోధనము పెద్దనకృతిలోఁ 'జంద్రాస్యయు, చంచరీకచికురయు' నైనది. మూలములోని 'వరాప్సరా' యను విశేషణము పెద్దనలో 'మరున్నారీశిరోరత్న' మైనది. పెద్దన స్వయముగా నామెను 'చక్రస్తని' యనియు, 'నతనాభి' యనియు వర్ణించినాఁడు. అతని కథాకథనమున నట్టి యంగాంగవర్ణన మవసర మైనది. అతఁడు వరూథినీపరిష్వంగఘట్టమున నామె 'పాలిండ్లు పొంగారి పైయంచుల్ మోవగఁ గౌఁగిలించె ననియు', 'నీవీబంధ మూడి నతనాభి పొడగట్టె' ననియు వర్ణించునెడ నీవిశేషణప్రయోగసార్థక్యమును సాధించు కొనినాఁడు. ఇట్లు వరూథినీవర్ణనము చేయునెడ సంస్కృతాంధ్రమార్కండేయపురాణ ములు పెద్దనగారి కల్పన కెంతయో తోడ్పడిన వని తాత్పర్యము.

పెద్దనగారిప్రబంధమున వరూథిని మనకు మూఁడుసన్నివేశములలోఁ గానఁ బడును. 1. ప్రవరునిఁ గనుఁగొని వలచి, యతనితో సంభాషించి, తమకముతోఁ గౌఁగిలించి యతనిచే నిరాకృత యైన సన్నివేశ మొకటి. 2. ప్రవరునిపై మనసు తగిలి విరహవేదనావశమున దుఃఖించుచు హిమవన్నగసానుప్రదేశమున విహరించు నది రెండవది. 3. మాయాప్రవరునిఁ గదిసి యతనియనురాగమునకుఁ బాత్రు రాలై యిష్టభోగము లనుభవించి గర్భవతియై స్వరోచికి జన్మ నిచ్చుకథాఘట్టము మూఁడవది. ఈమూఁడుఘట్టములు పైమూఁడుకృతులందును సమానములే. కాని వానియందు కవులు వరూథినిఁ దీర్చిదిద్దినవిధమునందు భేదము గానవచ్చుచున్నది.

వరూథిని యప్సరోంగన యగుటచేఁ దజ్జాతిలక్షణమైన భోగలాలసత్వ మామెజీవలక్షణమై భాసించినది. కాని, మరున్నారీశిరోరత్న మగు వరూథినియందు భోగము బహుపురుషగతము గాక యేకపురుషగతమై ప్రసరించినది. అందుచే నామె మనోవృత్తికి మూలస్థానమై రాణించినది. ఆమె సమగ్రపురుషసౌందర్యమును భావింపఁగలిగిన రసహృదయ. దేవయక్షగంధర్వనరలోకములం దున్న సుందరాకారుల నెల్లరఁ జూచినది. కాని యామె భావించినసౌందర్యము వారియందు కానరాలేదు. చివరకు ప్రవరునియం దామె యాసౌందర్యమును దర్శించినది. పురుషుఁ డానందస్వరూపుఁడు; తేజోమయుఁడు; సుందరుఁడు. నరుఁ డింద్రియనియతిచే నస్వరూపసంధాన మొనర్చుకొని యాత్మసౌందర్యమును దర్శించి యానందానుభూతి నొందును. సౌందర్యము మానవునకు నియమముచే నేర్పడును. ప్రవరునకు భౌతికమైన సౌందర్యము కలదు. దానినిఁ దేజోమయము చేయు నింద్రియనియతి కలదు. దానివలన నతఁడు తేజస్సుందరుఁ డైనాఁడు. అది సంపూర్ణపురుషసౌందర్యస్వరూపము. దానిని వరూథినీహృదయమునఁ బ్రతిష్ఠింపఁ జేయుటయే ప్రవరునిపాత్రలవలన వరూథినిపాత్రకుఁ గలుగు పరమప్రయోజనము. అట్టి యుదాత్తసౌందర్యజిజ్ఞాసువు కనుకనే వరూథిని తనను గోరి వచ్చిన గంధర్వకుమారునిఁ గాదని త్రోసివైచినది. భోగైకజీవియై నియతిలేని గంధర్వునియందు పురుషసౌందర్యము పరిపూర్ణత నందలేదు. జాతిలక్షణమైన భోగవృత్తిని మాని నియతయై జీవితముగడుపుచున్న వరూథిని ప్రవరుని తేజస్సౌందర్యసందర్శనయోగ్యతను సాధించినది. వరూథినియందలి యట్టినియతిని దెల్పుటకై పెద్దన పురాణకథలందు లేని గారుడోత్కీర్ణభవనమును సృష్టించి యామెను హిమనగముపై స్థిరనివాసముంచినాఁడు.

వరూథిని భావించినసౌందర్యము రూపుకట్టినయట్లు ప్రవరుఁ డామె కన్నులకుఁ దోచినంతనే సంవత్సరములతరబడి లోనబిగింపఁబడియున్నయిచ్ఛ కట్టలు త్రెంచుకొని పైకుబికినది. ఆమె కాసౌందర్యమును భావించి దానికొఱకు బ్రతుకు నెండించుకొనుటయం దున్న నియతి తద్భోగవాంఛయందు లేదు. సౌందర్యపరిపూర్ణతను సాధించి దర్శించుట కళాతపస్విలక్షణము. దర్శించిన పరిపూర్ణతను భోగింప నెంచుట భోగిలక్షణము. పరిపూర్ణత తనకంటె భిన్నమైనది కాదని తెలియుట యోగిలక్షణము. జాతిసహజమైన భోగలక్షణము కళాతపఃఫలమును భోగింప యత్నించినది. యోగిలక్షణవిశిష్టుఁడైన ప్రవరుఁ డందులకు వశము కాలేదు. వరూథినీప్రవరులశీలసంఘర్షణమునందలి పరమతాత్పర్య మిది.

భోగమున కహంకారము ప్రధానలక్షణము. కర్తృభావము లేనిదే భోగించుట కుదరదు. మదమోహాదులు దానివలన నేర్పడును. యోగికి వైరాగ్యము ముఖ్యము. అది నిరహంకారైకసాధ్యము. నిర్మోహాదు లతనికిఁ గరతలామలకములు. వరూథినీప్రవరులపాత్రచిత్రణమున నిట్టివ్యత్యాసము పెద్దన ప్రబంధమున గాననగును. భోగలక్షణసంయుత యగు వరూధినియందు జాత్యహంకారము ప్రస్ఫుటముగాఁ గానవచ్చును. నియమవ్రతనిష్ఠుఁడైన బ్రాహ్మణునియందు నిరహంకారము సర్వత్ర భాసించును. అహంకారము ప్రతాపప్రధానమై యుద్యోగరూపమునఁ బరిణమించును. నిరహంకారము శాంతప్రధానమై స్థిరధైర్యవృత్తిగాఁ బరిణమించును. అందువలననే వరూథిని ప్రవరునివైరాగ్యదీక్షను బహుముఖములఁ బ్రత్యాఖ్యానించి, యతనిపొందును సాధింప బహువిధముల యత్నించినది. ప్రవరుఁ డడుగడుగునకుఁ గరుడుకట్టి స్థిరదృఢచిత్తుఁడై భాసించెను. పెద్దన యీపాత్రల నిట్లు చిత్రించుటకు బాటలు వైచినవాఁడు మారన. మూలమునందు మహాభాగగా నున్న వరూధిని నభిమానవతిగాఁ దీర్చిదిద్దినాఁడు మారన. ఆమెను జాత్యహంకారయైన మానినిగా మలచి రూపొందించినాఁడు పెద్దన. సంస్కృతమున వరూథిని వాక్కులు నిసర్గమధురములు; మారన పురాణమున చతురరమణీయములు; పెద్దన ప్రబంధమున ప్రౌఢాలంకారబంధురములు.

మొదటిసన్నివేశమున వరూథిని ప్రవరునిపై మరు లొలుకపోసెను. అతనిచే నవమానముల పాల్పడెను. ఇట్టి విరుద్ధావస్థలమధ్య వరూథినియభిమానమును తెలుఁగుపురాణము పోషింప, జాత్యహంకారమును బ్రబంధము ప్రకటించెను. దానిని నిరూపించు కొన్నివాక్యము లిందుదాహరింపఁబడుచున్నవి.

1. మూలమున విప్రుఁడు వరూధినిని బ్రశ్నించినమాట లిట్లున్నవి:

శ్లో. "కా త్వం కమలగర్భాభే ? కస్య [1]కిం వానుతిష్ఠసి ?
బ్రాహ్మణోఽహ మిహాయాతో నగరా దరుణాస్పదాత్" —58. 44.

మారన యీవాక్యముల ననువదించుచు 'నీ వెవ్వతెవు ? ఇచ్చట నేకతంబ యేల యున్నదానవు ?' అని ప్రవరునిచే నడిగించినాఁడు. ఏకతముగా నుంటి వేల యనిపించుట మారనచతురవాక్యము. ఇందు గూఢమైనమర్మము అమాయకవాక్యములందుఁ బొదుగఁ బడినది. పెద్దన మారన చూపించిన చతురవాక్యరచనమును

1. కింవాత్రతిష్ఠసి ? (పాఠాంతరము)

విస్తృత మొనర్చి పద్యమునిండ గుప్పించివిడిచినాఁడు. ప్రబంధప్రవరుఁడు "ఎవ్వతె వీవు" అని యూరుకొనక "భీతహరిణేక్షణ!" యను సంబుద్ధి విసరినాఁడు. ఒంటరిగా భయము లేక యివ్వనభూమియం దేల సంచరించుచుంటి వని లోగుట్టును గ్రుచ్చి యడిగినట్లుగను అమాయకత్వముట్టిపడునట్లుగను బ్రశ్నించినాఁడు. 'త్రోవ తప్పి'తి ననియు. 'క్రొవ్వున' నిన్నగాగ్రమునకువచ్చితి ననియుఁజెప్పి, తనరాకకుఁ గారణము నెఱిఁగించినాఁడు. ఊరుఁ జేర నిం కెవ్విధి గాంతు? ననియు పలికి స్థిర నివాససూచనము గూఢముగా స్ఫురింపఁజేసినాఁడు. తెరు వెద్ది సూచింపు మనియు, శుభంబు నీ కగు ననియు పలికి యొకవైపు భావిలోఁ దన బ్రతుకుబాటను దీర్చి విద్దుభార మామెపై నుంచినట్లును, అది యామె కభీష్టదాయకము కాఁగలదనినట్లును, మఱియొకవైపు గృహోన్ముఖతఁ బ్రకటించినట్లును వ్యంజింపఁజేసినాఁడు. ఇట్లు చమత్కారగర్భితము లగు ప్రౌఢోక్తులు విటశేఖరునివలె ప్రవరునిచేఁ బల్కించుట పెద్దన కల్పనావిశేషము. ప్రవరుని నాగరకసంస్కారము వ్యంగ్యస్ఫూర్తియందును భాషాపరశేషభోగిత్వము శక్తిమచ్ఛబ్దసమాహారమునందును పెద్దన నిబంధించుట యిందలి రచనాశిల్పము!

ఇచ్చట గమనింపవలసిన విషయ మొక్కటి కలదు. ప్రవరుఁడు కావలయు నని నర్మగర్భముగా మాట్లాడె నన్నచో నాపాత్రశీలము దెబ్బతినును. అతఁడు అమాయకుఁడే. పురాణమునందు తనయూరుపేరులు చెప్పుకొనిన యాయమాయకుఁడు ప్రబంధమున నూరుపేరు చెప్పకయే దానికి త్రోవ చెప్పు మని వరూథిని నడిగెను. అతని యూరుపేరు మనకు తెలియును కావున మన కేమియు ననిపించదు. కాని వరూథిని కాతఁడు క్రొత్త. క్రొత్తవాఁ డట్లు ప్రశ్నించినచో నామె యే మనుకొనును? అమాయకుఁ డనుకొనును, లేక, చతురుఁ డనుకొనును. అతని యాకారవిశేషములలో నలేఖ్యవిలాసములు గలవు. అతని మొదటి పలుకరింపులోనే సరసార్థము కలదు. ఇఁక మాటలలో రమణీయార్థ ముండ దని యామె తలంచునా? నిజముగా నట్లు తలంచినచో నామె నర్మగర్భముగాఁ బ్రత్యుత్తర మిచ్చుట కెందులకు యోచించును? ఏమైనను పురాణప్రవరుని వలె ప్రబంధప్రవరుఁడు గూడ నమాయకుఁడే. కాని పెద్దన చతురవచోనిధి. అతఁడే ప్రవరునివలె మాట్లాడినాఁడు. ఆరహస్యము వరూథినిమాత్రము గ్రహింపవలె నని యతని యభిప్రాయము. మనమును అట్లే చెప్పుకొనినచో కవికిని, ప్రవరునికిని గౌరవము.

ఎదుటివాఁడు చమత్కారముగా మాటలాడినచోఁ దానును అట్లే మాటలాడవలె నని యభిమాని భావించును. అతనికంటె మించి మాటాడవలె నని గూఢాహం

కారి యత్నించును. మారన పురాణమున మొదటిమార్గము ననుసరించియు, పెద్దన ప్రబంధమున రెండవమార్గము ననుసరించియు వరూథిని సమాధానము చెప్పెను. పురాణమునందు "అనుపమబహురత్ననితాంతకాంతిసంపద నొనరిన యిగ్గిరి నెవ్వ డును సంచరించుచుందు నని సమాధానము చెప్పి, నాఁ డొంటరిగాఁ దిరుగుచుండుట క్రొత్త గా దనియు, నది సుందరనగరరత్నకాంతిదర్శనార్థమే యనియు సాభి మానముగా సూచించెను. మనుచరిత్రమున వరూధిని- సూటిగా సమాధానము చెప్పక నర్మగర్భము లైన వాక్కులతో దీర్ఘోపన్యాసము ప్రారంభించినది. 'ఇంతలు కన్ను లుండ తెరు వెవ్వరి వేఁడెదు ?' అని యెదురుప్రశ్నతో నారంభించి, ప్రవరునిప్రశ్నల కీయవలసిన ప్రత్యుత్తరక్రమమును మార్చినది. ప్రవరుని ప్రశ్నలోని చివరిపదము నకు వరూధిని మొదట ప్రత్యుత్తర మీయ మొదలిడినది. "తెరువు" శబ్దము నెందుల కాతఁడు వాడియుండె నని యామె యూహించినదో దానిని నర్మగర్భముగా వ్యాఖ్యానించినది. వ్యంగ్యగౌరవమున నతనివాక్కుల తలఁదన్నినది.

దానితో నామె జాత్యహంకార మూపిరి పీల్చుకొనినది. విపులతర మైన జాతి వృత్తము నెత్తి నిజవృత్తముఁ జెప్ప మొదలిడినది.

సీ. చిన్నివెన్నెలకందు వెన్నుఁదన్ని సుధాబ్ధిఁ
బొడమినచెలువ తోఁబుట్టు మాకు;
రహి పుట్ట జంత్రగాత్రముల రాల్ గరగించు
విమలగాంధర్వంబు విద్య మాకు:
ననవిల్తుశాస్త్రంపు మినుకు లావర్తించు
పని వెన్నతోడఁ బెట్టినది మాకు;
హయమేధరాజసూయము లనఁ బేర్వడ్డ
సవనతంత్రంబు లుంకువలు మాకుఁ;

తే. గనకనగసీమఁ గల్పవృక్షముల నీడఁ
బచ్చరాచట్టుగమి రచ్చపట్టు మాకు
బద్మసంభవవైకుంఠభర్గసభలు
సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర ! —2-43.

అని తమతోఁబుట్టువును, గానవిద్యాప్రావీణ్యమును, శాస్త్రవిద్యాపాండిత్యమును, అన్యదుర్లభత్వము, త్రిమూర్తులసభలయం దున్న చొరవయు, పేరుపేరునఁ బేర్కొని చెప్పినది వరూధిని. ఆచెప్పునప్పుడు తానెవరో ముందు తెలుపక 'మాకు,

మాకు' అని మాటిమాటికిఁ బలుకుటచే జాత్యర్థమే కాక, దానికన్న మిన్నయైన స్వీయగౌరవాతిశయము కూడ వ్యంజింపఁబడుచున్నది. అది యహంకార చిహ్నము. ఆమె ప్రాణసఖులను జెప్పుటలో నది మఱికొంత స్పష్టమైనది. 'ఇవి మత్కాంతార సంతానముల్' అని హిమనగవనసంపదను తనదిగా నధికారముద్ర వైచిన ప్రాగల్భ్యముచే నది మఱింత దృఢమైనది.

2. వరూధిని ప్రవరుని కతిథిమర్యాదలు సేయ తనయింటికిఁ బిలిచినట్లు చిత్రించుట పెద్దనగారి మఱియొక చమత్కారము. అభ్యాగతసేవాపరతంత్ర హృదయుఁ డగు ప్రవరునిస్వభావమున కది ప్రతి. పురాణములం దామె కిల్లువాకిలి లేదు కావున నట్లు పిలువలేదు. ప్రబంధమునం దాపిలుచుటలో సేదతేఱు మని పల్కుచు, 'సముదంచితన్మణిభవనాసీనత సేదదేరు మని' తనగృహసంపదను పొగడుకొనుటను మాత్రము మరచిపోలేదు. 'అస్మద్గృహంబు పావనము సేసి' యను వినయోక్తికి దిగుసరికి నాల్గుపద్యపాదములు గడచిపోవలసి వచ్చినది.

ఆమెవైఖరిని గమనించిన ప్రవరుఁడు లోలోన నవ్వుకొనియుండును. కాని బయట పడలే దాగంభీరుఁడు. ఏమాత్రము తొణకక తనకు సహజమైన చతురవచో విలాసము నొకయింత చిలుకరించి గడుసుఁదనము ప్రకటించి ప్రకృతమున కుపక్రమించినాఁడు. 'అండజయాన!' యని సంబోధించి, 'నీభక్తిచేతనే నీసపర్యలు మాకు ముట్టినవి. నే నింటికి వచ్చియు రాకయు నొకటియే. అదియును గాక నే నిచ్చట నుండుటకు వీలుపడదు. సత్క్రియాకాండము నిర్వహించుటకు వేగముగా నూరి కేఁగవలయును'- అని పేర్కొనుచు, చివరకు 'నాపయి దయయుంచు' మని వేడు కొనినాఁడు. 'ఓయంచనడకదానా! లేక మందగమనా! నీవింటికి నడిచి నాకాతిథ్య మిచ్చునరికి ప్రొద్దు కొండలో పడును కావున నీభక్తియే పదివేలు. నన్ను బలవంతము సేయక వదలి దయచూడు మని యందలి చమత్కారము. ప్రవరుఁ డిచ్చట చూపిన గడుసుఁదనము ఔషధసిద్ధుని వాక్యములు విని యీషదంకురిహసన గ్రసిష్ణుగండయుగళుం డయి యతనినిఁ జతురోక్తుల పాల్చేయు నేర్పును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది.

ప్రవరుఁ డౌషధసిద్ధునివలన నొకగుణపాఠము నేర్చుకొనినాఁడు. అందుచే- 'డాంబికముగా మాటలాడు నహంకారులను జూచిన సాధువులకు నవ్వువచ్చును గాని వారిమహిమలు సర్వత్ర ప్రగల్భములు కావు కావున నేపుట్టలో నేపా ముండునో

8

గమనించి వర్తించుట మే' లని ప్రవరుఁడు భావించినాఁడు. తీర్థయాత్రలు చేయించు మని సిద్ధుని వేడినట్లుగనే వరూథిని నిల్లు చేర్పు మని ప్రార్థించినాఁడు.

ఉ. "ఏ నిఁకనిల్లు సేరుటకు నెద్ది యుపాయము ? మీమహత్త్వము
లామ్నని ! దివ్యముల్; మదిఁ దలంచిన నెందును మీ కసాధ్యము
ల్గానము; గాన తల్లి ! ప్రజలన్ ననుఁ గూర్పు !"

మని బ్రతిమిలాడుకొనినాఁడు. అతనివైఖరి యామెకు నవ్వు తెప్పించినది. ఏలనన- అంతలో నతఁడు చతురోక్తు లాడును: అంతలో నతఁడు బేలయై పలవరించును. అతనివైఖరిలో నవ్వు తెప్పించెడి విధ మది.

వరూథిని ప్రవరునివాక్యములలోని ప్రాణమును బట్టెను. 'ప్రజలన్ నను గూర్పు' మన్నది యతనివాక్కులలోని యాయువుపట్టు. అతఁడు తనవారికి దూరమై విలపించుచుండెను. వారిసంగతి నభిలషించుచుండెను. కావున వానియాత్మీయులను మరపించి తా నాస్థానము నాక్రమింపవలెను. అందులకై వరూథిని మొదట నాతని నివాసపరిసరములపై నలసభావము కల్పింపఁ జొచ్చినది; ఆపైఁ దనహృదయము నెఱుకపఱచినది. ఆమె ప్రాణము లతని యరచేతఁ బెట్టినట్లు మాట్లాడినది. వ్యంగ్యముగ నీవే ప్రాణనాథుఁడ వన్నంతవఱకు వెళ్ళినది. ఇంతకంటె మఱి యెవ్వ రతనిహృదయమును సమీపింపఁ గల రని యామె తలంచినది. (అగ్ని, దర్భలు, నిత్యకర్మనిరతి- అంతకుమించి యతని నాకర్షించి యున్న వని యప్పటి కామె యెఱుఁగదు).

మారన యిప్పట్టున వేఱువిధమైన గడుసుపోకడ పోయెను. ప్రవరుఁడు పాదలేపము కరఁగి కొండనెత్తములపై దిగఁబడిపోయె నని చెప్పకొనఁగా వరూథిని యతనివిలసనములు గాంచి హృదయము కరఁగి భావజుపుష్పబాణసముద్రమున మునిఁగిపోయె నని ప్రతికల్పనము చేసి రక్షింప నాతని ప్రార్థించినది. ప్రవరుని యిక్కట్టునకు విధి కారణము. వరూథినిబాధకు ప్రవరుఁడు కారకుఁడు. కావున నామెను రక్షించుభార మాతనిపై నున్న దని హెచ్చరించినది. ఆబాధ్యత నెక్కడ గుర్తించిన ట్లగునో యని ప్రవరుఁ డాయూసున కెట్టిప్రత్యుత్తర మీయక గృహగమనావశ్యకతను, నిత్యక్రియాహానిభీతిని బ్రకటించి యుపాయ మర్థించెను. పెద్దన మారన ప్రణాళికలోని ప్రవరవాక్యముల ననుసరించినంతగా వరూథినిసంభాషణ ననుసరింపలేదు. దానికిఁ గారణ మూహించుట సులభము. వరూథినివలెఁ బెద్దనయు గూఢాహంకారి యగుటయే!

3. వరూథినియెత్తుగడ ప్రవరుఁడు పసికట్టినాఁడు. 'ప్రజ' లనుమాట వాడుట యందు తా నెంచినభావము నామెకు విశదీకరింప నెంచినాఁడు. 'తల్లీ' యని తాను బిలువ నామె తనతో గలుపు 'వరుస' నెత్తిపొడిచినట్లు 'వనజేక్షణ! యిట్లు పలుక వరుసయె ?' అని వాక్రుచ్చినాఁడు. 'మది విచారమువలదే ?' యని యామె చేసినవిచారము నంతయుఁ గాదని త్రోసిపుచ్చినాఁడు. 'వ్రతులైన విప్రులను గామింపఁ బాడి కా' దని నీతి గరపినాఁడు. ఆనాఁ డిలుసేరనిచో 'వేలిమియున్, సురార్చనయు, విప్రసపర్యయుఁ దప్పు' ననియు, 'వృద్ధు లగు జననీజనకు లాకట సోలుదు' రనియుఁ, బేర్కొనినాఁడు. 'నే నాహితాగ్ని' నని స్వాభిమానముగా వరూథిని కెఱుకపఱచినాఁడు. ఇన్నిచెప్పియు నతఁడు తన భార్యసంగతి యెత్తఁడు. 'అనుకూలవతి నాదుమనసులో వర్తించు కులకాంత మది నెంత కుందు నొక్కొ !' అని యంతగా వాపోయినవాఁ డాయూసునే యెత్తకుండె ననఁగా నది నిజముగాఁ గావలయు నని పన్నినపన్నాగమే యని యెదుటివారి కనిపించును. అట్లని యతఁడసలు చెప్పలే దని త్రోసివేయుటకును వీలులేదు. 'తూలు సమస్త ధర్మములు త్రొయ్యలి! నే డిలు సేరకుండినన్' అనుచివరివాక్యములోని యాసమస్తధర్మములలో భార్యాభర్తలధర్మముకూడ తప్పక యిమిడియుండును. దానిని వాచ్యము చేయకుండుటయే యతని గడుసుఁదనము. వరూథిని కావాక్యములతాత్పర్యము విన్నఁబాటు కలిగించినది. ఎందువలన ? ప్రవరుఁడు తనధర్మములే తనయాత్మీయులని పేర్కొనెను కావున. ఆమె యతనికి దివ్యభోగముల నీయఁగలదు కాని ధర్మఫలము నీయఁజాలదు. కావున నామె కోటమి తప్పదయ్యెను. ఆమె యహంకారము దెబ్బతినెను. అందుల కామె చిన్నబోయెను. మారన రచనలో వరూథిని విన్నబాటు కానరాదు. ఆమె ప్రబంధనాయికవలెఁ బెద్దగా మో మెత్తి విఱ్ఱవీగలేదు. అందువలన దింపుట కవసరము రాలేదు.

4. ప్రవరుఁడు ప్రత్యుత్తర మిచ్చుటలోనికౌశల్యము వరూథిని గుర్తించినది. దానిని గేలిచేసిన కాని యామెకుఁ దృప్తి కలుగదు. అనఁగా నతని యజ్ఞయాగాదికర్మలను, ధర్మపరత్వమును, వైరాగ్యమును తేలికపఱచి మాటలాడవలయును. కాని, అట్లు మాట్లాడుటవలన నెదుటివానిమనస్సు పుటుక్కున విరుగరాదు. దానికిఁ గొంత మార్దవ మవసరము. ఇట్టి సున్నితమైన యవస్థయందు మఱల వరూథినికి తనజాత్యహంకారమే శరణ్యమైనది. అప్సరస యైన యామెకును భూసురుఁడైన ప్రవరునకుఁ గల యంతరము తెలియవచ్చునట్లు మృదువుగనే మాట లారంభించినది. 'ఓభావజరూప! యిట్టి యెలప్రాయము వైదికకర్మనిష్ఠలం

బోవగ నింక భోగములఁ బొందుట యెన్న?’ డని పలికి యతని సమయోచితము కాని యవివేకవిచారము నెత్తి చూపినది. ‘యజ్ఞకోటులం బావను లౌటకున్ ఫలము మాకవుఁగిళ్ళ సుఖించుటే కదా!’ యని యతనికర్మపరత్వమును గేలిచేసినది. అసంఖ్యాకము లైన యజ్ఞకర్మలకు ఫలముగా మాత్రమే తనకౌఁగిలి లభ్యమగు నని స్వీయప్రశంసయును, పరలాఘవమును బ్రకటించినది. ప్రవరునికర్మపరత్వము వశీకరించుటతో నాగక వరూథిని తనభోగపరత్వమును గొప్పచేసి చిత్తము చిగురింప సీసపద్యమునఁ జెప్పినది. పచ్చికస్తూరి, చొక్కపుజవాజి, పచ్చకప్పురపుసిరము, స్వచ్ఛతుహినజలము, వివిధకుసుమకదంబము, దివ్యతరుజమ్ముదులవసనఫలాసవామేయరత్నభూషణములు గల తనభోగ్యవస్తుసంభారమును జూపించి, ‘భోగపరుఁడవయి రమింపుము ననుగూడి యనుదినంబు’ నని కోరినది. తనకౌఁగిలిసుకమును విలువఁగట్టి చెప్పినది. తన కున్న కలిమిజాలముల నెన్ని చూపించినది. అతఁడు వానిఁ గన్నెత్తి యైనఁ జూడలేదు. ఆమెకౌఁగిలిని మనసార వాఛింపలేదు. సశరీర స్వర్గ మెదుట నున్నను దాని నాశింపక నిగ్రహము చూపినాఁడు ప్రవరుఁడు. ఈ మూఁడును వరూథినికిఁ జిరాకెత్తించినవి. ఆమెమాటలలోఁ గొంతకరుకుఁదనము కనుపించినది.

క. “అంధునకుఁ గొఱయె వెన్నెల?
గంధర్వాంగనపొందు గా దని సంసా
రాంధువునఁ గూలె దకట! ది
వాంధము వెలుఁగుఁ గని గొంది నడఁగినభంగిన్.” —మ. చ. 2. 56

అనునది యామెమొదటివిసురు. ధర్మమును తృణాచ్ఛన్న మైన బావితో రూపించుట లోకప్రసిద్ధము. కాని, దాని నవహేళనార్థమున వరూథిని వాడినది. ప్రతివస్తూపమయందు నంధునితోడను, ఉపమయందు దివాంధముతోడను బ్రవరునిఁ బోల్చి యతనిభోగాంధ్యమును గర్హించినది.

“ఇన్నిభవంబులం గలుగు....” (2. 57) అను పద్యమునందలి ‘యలవేఱు’ లెవ్వరో కారు; ఎందరో కారు. ‘విన్నదనంబు’ను. ‘వెన్నవలెం గఱంగు’ స్వభావమును గల వరూథినియే. తత్కాలమందలిస్వీయావస్థను జాతిసామాన్యము చేసి మాటలాడెడి నేర్పుమాటలలోఁ గలదు. ‘ఎన్నిభవంబులం గలుగు....గౌఁగిటఁ జేర్పుభాగ్యముల్’ అని యవహేళనము చేయునప్పుడు స్వీయాహంకారము వరూథినిపలుకులందు తాండవ మాడినది.

క. "కుశలత యే వ్రతముల నగు
నశనాయాసమున నింద్రియవిరోధమునం
గృశుఁడ వయి యాత్మ నలఁచుట
నశరీరస్వర్గసుఖము నమకొనియుండెన్." —మ. చ. 2. 58.

ఉపవాసవ్రతములచేఁ గృశాంగుఁ డయి చేయు సర్వకర్మనిష్ఠలకును ఫలము స్వర్గ సుఖము. అందు కలుగునది దేవకాంతాదివ్యభోగము. అది నశరీరముగా లభించు చున్న దనియు, దానినిఁ ద్రోసిరా జనుట కౌశలము కా దనియు వరూథిని వాదము. 'నశరీరస్వర్గసుఖము నమకొనియుండె' నను వాక్యమునందలి వ్యంగ్యార్థమున వరూథినీజాత్యహంకారము దీపించుచున్నది.

పెద్దన వర్ణించిన దివ్యభోగములప్రసక్తి మారనరచనలోఁ గలదు. అచ్చటఁ గూడ సీసపద్యమే రచింపఁబడియుండుట గమనింపఁదగిన ఛందస్సామ్యము. అందలి మారనరచనాచమత్కారము 'మనోహరకేళీగతి యెలమి గ్రీడింపు' మని యడుగుటలోఁ గానవచ్చుచున్నది. దానిని పెద్దన వ్యంగ్యముగాఁ బెక్కువాక్య ములపైఁ బఱచి రచించెను.

5. పైమాటలలో వరూథిని ప్రవరాఖ్యుని బ్రాహ్మణధర్మమునే గేలిచేసినది. యజ్ఞాదికర్మలవలన నరుఁడు సాధించెడు స్వర్గసుఖములను బేర్కొని యవి తమ యధీనమున నున్న వని గర్వించినది. బ్రాహ్మణుఁ డామెగర్వోక్తులకుఁ బ్రత్యుక్తి చెప్పినాఁడు. ఫలకాంక్షతోఁ జేయు సవనకర్మలకు ఫలము స్వర్గసుఖము. ఫలాభి సంధిరహితమైన కర్మాచరణమునకు ఫలము మోక్షసుఖము. స్వర్గభోగములవలన మానవుఁడు క్షీణపుణ్యుఁడై మఱల మర్త్యలోకమునఁ బుట్టును. నిష్కామకర్మ యొనర్చువాఁడు పునర్జన్మరహితమైన శాశ్వతమోక్షమును బొందును. బ్రాహ్మణుఁ డింద్రియనియతిచే సాధించునది స్వర్గము కాదు- మోక్ష మని ప్రవరుఁడు నిరూ పించినాఁడు. అతఁడు తన కున్న బ్రహ్మానందాధిరాజ్యపదవీవ్యామోహమును వ్యక్తము చేసినాఁడు. కామైకప్రధానులగు భోగజీవులు దేవయోనులు. వారికి నిష్కామయోగము తల కెక్కదు. కావున ప్రవరుఁడు ధృతిదీప్తులతో బ్రాహ్మణ తత్త్వమునుగూర్చి చెప్పెడిసరికి వరూథిని బెదరిపోయినది. కాని, భయముతో నోదిగి మిన్నకుండలేదు. మదనబాణబాధ ఆమెకు భరింపఁజాలని దయ్యెను. అందు వలన భయపడినను రతిప్రయత్నము మానుటకు వీలులేదు. ఇట్టి సంధిసమయమున

నామెకుఁ బ్రవరున కెదురు మాటాడుధైర్యము కలిగించినది యామె 'మదము'. మనుచరిత్ర ద్వితీయాశ్వాసమందలి 61వ వచనమునఁ బెద్దన యామెయొక్క మదభంగిమల నిట్లు విభజించి చెప్పెను :

1. పరిణతవివిధవిబుధతరుజనితమధురమధురసం బాను మదము.

2. అదటునన్ జిదిమిన నెఱుంగక మదనహరు నైనఁ జదురునం గదియ గమకించు తిమురునం గొమిరెప్రాయంపు మదము.

3. అనన్యకన్యాసామాన్యలావణ్యరేఖామదము.

4. ఒంటిపాటునఁ గంటికిఁ బ్రియుఁడై తంగేటిజుంటిచందమున గొంటుతన మెఱుఁగక కుఱంగట నున్న యమ్మహీసురవరకుమారు తారుణ్యమౌగ్ధ్యములం జేసి తనవైదగ్ధ్యము మెఱయఁ గలిగె నని పల్లవించు నుల్లమున నుల్లాసంబునం గదురు మదము. మధుయౌవనలావణ్యవైదగ్ధ్యహేతుజ మైన మద మామెయందు విజృంభించినది. భయముచేఁ గదురుడెందము నామదముతో నోసడించినది. చెలి కత్తెలను గనుసన్నలతో వారించి వరూథిని ప్రవరుని మఱియు సమీపించి, అతనితో నిట్లనెను.

శా. "ఎందే డెందము గందళింప రహిచే నేకాంతన్ నిర్వృతిం
జెందుం గుంభగతప్రదీపకళికాశ్రీ దోఁప నెందెందుఁ బో
కెందే నింద్రియముల్ సుఖించఁ గను నాయింపే పరబ్రహ్మ! 'మా
నందో బ్రహ్మ!' యటన్న ప్రాఁజదువు నాంతంబర్థ మూహింపుమా!"
—2. 62.

ఇందు మహాయోగిజనగమ్యమాన మగు బ్రహ్మానందస్థితినిఁ గామశాస్త్రపరముగా నన్వయించి వరూథిని ప్రవరుని బ్రాహ్మణతత్త్వప్రతిపాదనము నవహేళనముచేసినది. మదనాతురయు, మదవతియు, జాత్యహంకారయు నైన వరూథిని యిట్లు ప్రవరు నొడఁబఱచుటకు తత్తరము చూపుచుండ నతనికి సిగ్గును, వెగటును గలిగినవి.

పెద్దన వరూథినియందుఁ గల్పించిన తత్తరము మారన చిత్రించినదే. కాని యతఁడు మాటలయందు కంటెఁ జేతలయం దధికముగా వర్ణించెను. పెద్దన మాటకును, చేతకును, వానిమధ్య నుండు కాలవ్యవధానాది వివిధాంశములకును, వీని నన్నింటిని మించిన యాంతరమైన యొకక్రమపరిణామమునకును, హేతువాద కల్పనమునకును చక్కని సంయోజనమును గల్పించి రూపొందించి యుండుటచే

పురాణకల్పనముకంటె ప్రబంధకల్పనము సంశ్లిష్టమును, సారవంతము నై రాణింపఁగలిగినది.

6. ప్రవరుఁడు తన కరణులు, దర్భలు, నగ్నులు ప్రియము లగును గాని యన్యములు కా వని తేల్చి చెప్పి, 'చెప్పకు మిట్టితుచ్ఛసుఖముల్ మీసాలపైఁ దేనియల్' అని భోగవాంఛను దృణీకరించెను.

ఆమాటలతో వరూథినియభిమానము మూఁడవసారి దెబ్బతినినది. క్షణక్షణము గడచినకొలఁది ప్రవరుఁడు గట్టితేలుచుండెను. అతనివాక్కులలోఁ జాతుర్యము సడలి తైక్ష్ణ్యము హెచ్చినది. 'చెప్పకు' మనుటచే వ్యంగ్యముగా నామెను మరు మాటాడవల దనియు, నీవు మాటాడినను నేనువినను, మాటాడ ననియు ఖండిత ముగా సూచించినాఁడు. ఆమాటతో నామె నోరు పడిపోయినది. గుండె చల్లఁబడినది. మోము వెల్లఁబారినది. కనులనీరు గ్రమ్మినది; గొంతుక జీరవోయినది. అతనిని బుల్కుపుల్కునం జూచినది. తలయూచినది. 'వనిత తనంతఁ దా వలచివచ్చినఁ జుల్కన గాదె యేరికిన్' అని తన దైన్యావస్థను మొదటిసారి వాక్రుచ్చినది. కాని యట్టిమానిని దైన్యావస్థలో నెక్కువకాల ముండ లేదు. పడగ చితికిన పాము తోకతో కొట్టునట్లు మార్గాంతర మాలోచించినది. ఆమె వలచినట్లు బైట పడినది కాని యతఁడు బైటపడలేదు. మాటలతో లొంగని బాపడు చేతలతో లొంగు నని వరూథిని యూహించినది. అనునయాలాపదీనాస్య యై రతిసంరంభము మీర నాతనిఁ బైపాటునఁ గౌఁగిలించినది. అణఁగారినగర్వస్థానము నతిశయించినకామ మాక్రమించినది. కామ మింద్రియతృప్తిని గోరును గాని యాత్మగౌరవము నభిల షింపదు. కామ మవమానింపఁ బడుచోఁ గలిగెడు లజ్జాశోకములు అమర్షాహంకా రములను రేకెత్తించి విజృంభింపఁ జేయును. ప్రవరుఁ డామెను త్రోసివేయుటతో వరూథిని కట్టస్థితి యేర్పడెను. 'పాటున కింతు లోర్తురె కృపారహితాత్మక !' యని యతని నిర్దయాత్వము నెత్తిచూపుచున్నదో యనునట్లు నఖక్షతములను జూపించి వేదన నెపంబిడి కలస్వనముతో నేడ్చినది. అతఁ డులుక లేదు; పలుక లేదు. అతనినిర్దయ కామె యొడలు మండినది. భూతదయావిరహిత మైన యతనిచదు వులు, జన్మములు, పున్నెములు నిరర్థకము లని వేడిగా మాటలాడినది. పరాశరా దులబండారము బైటపెట్టినది.

తే. "వారికంటెను నీమహత్త్వంబు ఘనమె ?
పవనపర్ణాంబుభక్షు లై నవసి యనుప

కచ్చడాల్ గట్టుకొను మునిముచ్చు లెల్లఁ
దామరసనేత్ర లిండ్ల బందాలు గారె?" —2. 73.

ఏకదేశముగాఁ బ్రారంభ మైన వరూథినీవాక్శరపరంపర మునిలోకమునంతయు ముంచెత్తినది. అభిమానగర్వము కార్యసాధనసమర్థము కానప్పుడు కారుకూత లరచుచుండుట లోకస్వభావము. 'మునిముచ్చు' అను నిష్ఠురదూషణము పరాశరాదుల నుపలక్షించి పల్కినప్పటికిని అది తనపరిష్వంగమును భగ్నపఱిచిన ప్రవరునిమీఁద పరోక్షముగ పరవళ్ళు తొక్కుచున్న వరూథిని యమర్షాహంకారముల వాగ్విలాస మని స్పష్టమగుచునే యున్నది. ఇంతయార్భాటము సృష్టించిన పెద్దన హాలాహలముమధ్య అమృతస్ఫూర్తి వలె 'వారికంటెను నీమహత్వంబు ఘనమె' యను సత్యస్ఫూర్తిని కాకువునందు నిలిపి తనచమత్కారవాక్కును సార్థకపఱచుకొనినాఁడు. వాక్శిల్ప మనఁగా నట్టిది!

మారన రచనమున వరూథిని ప్రవరపరిత్యక్త యైనచోఁ బ్రాణత్యాగము చేసెద నని తననిశ్చయము తెలిపి యతనిని లొంగదీయ యత్నించినది. దానికిఁ బ్రతిగా ప్రవరుఁడు పరవనితారతి కీఁడని గురువులు చెప్పెద రని బోధించి తనయందామెను నిరతము విరతిని భజింపు మని నీతి గరపి సౌమ్యముగా నగ్నిని భజింపనేగెను. పురాణమునందు వరూథిని యడిగిన చివరిప్రశ్నకుఁ గూడ ప్రవరునినుండి సమాధానము లభించినది. ప్రబంధమునందు పరిష్వంగభంగ మయిన తరువాత వరూథినిరోదన మరణ్యరోదన మైనది. ఈఘట్టమున మారనకంటె పెద్దన కడు గడుసుపోకడ పోయినాఁడు.

రెండవఘట్టమున వరూథిని విరహార్తమూర్తి; అంగభవకోదండోగ్రమౌర్వీరవక్షోభాకంపితధైర్య. ఆమె ప్రవరుని మొదట కామించినది; ఆకామము విరహవేదనచేఁ దప్తమై హార్దికమైన యనురాగముగఁ బరిణమించినది. అందువలన వరూథిని ప్రవరునిఁ బొందని బ్రతుకు నిష్ఫల మని భావించినది. విషమసాయకుని తూపులవేడికి విసిగి వేసారి చివర కవ్వనజాక్షి తనువు దొఱఁగంగఁ దలపెట్టినది. ఇట్టి దయనీయావస్థలో నున్న వరూథినికి జాత్యహంకారము స్మృతికిఁ దెచ్చుటకుఁ బెద్దన నెచ్చెలులను సృష్టించెను. వా రామెకు నూరిపోయు నీతివాక్యము లిట్టివి:

ఉ. "పూతపసిండివంటి వలపుం బచరించుకులంబు నీతికిన్
లేఁత గదమ్మ యుత్తెఱఁగు; లేమ! సురాంగన లెల్ల నిట్టి నీ

చేతకు మెత్తురమ్మ ? దయసేయక తిన్ననిమేను వెన్నెలన్
వేతురటమ్మ ? యింత కనువేదుఱు సెల్లునటమ్మ యింతికిన్ ?" -3.33

ఉ. "ఇందునిభాస్య ! వాఁ డసఁగ నింద్రుఁడొ చంద్రుఁడొ యాయుపేంద్రుఁడో
యిందులకై వగం బొగుల నేటికి ? నేటికి నందుఁ బోద; మా
నందనభూమి భూమిసురనందనుఁ డుండకపోడు; రమ్ము; నీ
చందము నందముం గనిన, జవ్వని ! యెవ్వని వెఱ్ఱిఁ జేయదే ?"
—3. 63.

ఇందు మొదటిపద్యమునందలి భావము వరూథినివిశిష్టచిత్తవృత్తికి విరుద్ధము గావున నది యామెపైఁ బనిచేయలేదు. రెండవపద్యభావము తత్సౌందర్యాహంకారపోషకము కావున నది యామెచిత్తమున సత్ఫలితముల నిచ్చినది. ఇట్లు సఖీవాక్యజ్ఞాపిత మైన స్వాభిమానము మాయాప్రవరసందర్శనసమయమున సుసంపన్నమై యామెవాక్యములందు ప్రతిబింబించి యాపాత్రయందుఁ బోషింపఁబడవలసిన ప్రధానగుణసాతత్యముః నిర్వహింపఁజేసినది.

కపటభూసురకుమారుని దరిఁజేరి పలుకరింపఁబోవు వరూథినిని 'మానిని' యని పెద్దన సూచించుటలో నీరహస్యము కొంత కలదు; ఆమెమాటలో నఖండాభిమాన ముట్టిపడ రచించుటలో నది వ్యక్తమైనది.

శా. "రా వైరాగ్యముఁ బూని నీవు కడునిర్దాక్షిణ్యచిత్తంబునన్
రావైతేఁ జవిగాని యిందులకు హోరాహోరిగాఁ బోరి యే
లా వాలాయము సేయఁగా ? బ్రతుకు నీ వాచారవంతుండ వై;
చావో యెక్కడొ నీయెడం బొడమువాంఛన్ భూసురగ్రామణీ !"

క. "కట్టడితనమున నిట్లాడి
గట్టి మనసు ఱాయి సేసి కరఁగవు; మఱి నీ
పట్టినది విడువ; విఁక ని
ట్టట్టన నేల ? మాయదృష్టం బుండన్." —3. 94, 95.

కఠినుఁడైనప్రియుని గరగింపఁదలఁచిన యువతి యతనికాళ్ళవ్రేళ్ళఁ బడి దైన్యము ప్రకటించుట లోకసహజము. కాని యిచ్చట వరూథిని లోకసామాన్యమైన వాక్యము లాడుటలేదు. ఆక్షేపవ్యాజనిందాలంకారగర్భితము లైన వాక్యముల నెన్నుకొనినది. మొదటిఘట్టమునఁ ద్రోపుడువడి యవమానముపా లయిన యామానిని మఱల కాళ్ళ బేరమునకు దిగలేదు. అతని నిర్దాక్షిణ్యచిత్తమును చత్రాతితోఁబోల్చి యుపాలం

ఖించినది. అతఁడు మొండిపట్టు విడువనందులకు విసుగుకొనినది; బలవంతముగ నతని నొప్పించు యత్నము చేయలేదు: కాని పూర్వకృతనిరాకరణమును జ్ఞప్తికిఁ దెచ్చి మఱల తా నాతని వేడఁబో నని సూచించినది. "బ్రతుకు నీ వాచారవంతుం డవై" యని యతనినిష్ఠామయజీవితము నిరర్థక మని హెచ్చరించినది. 'ఇఁక నిన్నిట్టట్టన నేల' యని తననిష్ఠురోక్తు లతనియందు నిష్ఫలము లయ్యెనని నిరాశ ప్రకటించినది. 'మాయదృష్ట మిట్లున్న' దని నట్లు వరూథినిసంభాషణము ముగించుట పెద్దనగారి సంభాషణచాతుర్యమునకుఁ జక్కనినిదర్శనము. 'మా' యనుటలో నామె జాత్యహంకారము కలదు. 'అదృష్ట' శబ్దమునం దామె కాతనివలనజరిగిన యన్యాయమంతయు నిమిడియున్నది. ఇది యిట్లుండ 'నిన్నిట్టట్టన నేల మా యదృష్టం బుండన్' అనువాక్యమునందలితాత్పర్య ముచ్చారణవైలక్షణ్యముచే "మా యదృష్టమే మాకు చాలును. అదియే మాయందు నీ కానుకూల్యము గలిగించును. ఇఁక వేఱుగా నేనేమియు నిన్నడుగవలసిన పనిలే" దను నర్థాంతరస్ఫూర్తియుఁ గలుగుటకు వీలున్నది. దానిని భావికథార్థసూచనగాఁ బెద్దన నిబంధించి యుండవచ్చును.

పెద్దన వరూథినిని జాత్యహంకారగర్విత యైన మానినిగా రూపొందించె నని పైనిచ్చిన యుదాహరణములవలన స్పష్ట మగుచున్నది. ద్రౌపదీసత్యభామాదుల నిట్టివైలక్షణ్యముతోఁ దెలుఁగుకవులు దీర్చిదిద్దుటవలననే వారు లోకాదరపాత్ర లగుట. ఆంధ్రప్రబంధరంగములందు ముగ్ధ లైన శృంగారనాయికలకన్న మానిను లైన మగువలపాత్రలకే మన్ననయు, మనుగడయు నధికము !

కలభాషిణీ కథామూలము

> "విద్యానగర రాజవీధులన్ కవితకు
> పెండ్లిపందిళ్ళు కప్పించునాడు"—

అని శ్రీరాయప్రోలు సుబ్బారావుగారు రాయలవారి యుగమును గీర్తించియున్నారు. ప్రబంధకవితాకన్యను బెండ్లికూతుగా నూహించినారు వారు. నన్నయ్యగారిచే నుగ్గు వెట్టించుకొని, తిక్కన్న యొద్ద తెలుఁగుపలుకుబడుల తియ్యఁదనము నలవరించుకొని, ప్రబంధపరమేశ్వరుని యొద్ద వినయసంపదను గడించి, శ్రీనాథుని యొద్ద ప్రౌఢ వచోవిలాసమును, పోతన్న యొద్ద భక్తిప్రపత్తులను నేర్చుకొని, సాహితీసమరాంగణ సార్వభౌముని సౌజన్యముచే వర్ధిల్లిన యాంధ్రసాహిత్యభారతి పెండ్లియాడుకు వచ్చిన నవోఢ యని భావించుట యెంతయు సమంజసము. ప్రబంధ కవులా పెండ్లి పడుచునకు పెంజెడ నవరించి యలంకరించినారు. అల్లసాని పెద్దన యల్లిక నేర్పు చూపించినాఁడు; నంది తిమ్మయ్య పారిజాతపుష్పగుచ్ఛము నిలిపినాఁడు; పింగళి సూరన్న ముప్పేట జడకుచ్చులను ముచ్చటగా ముడివైచినాఁడు; రామరాజ భూషణుఁడు వసురత్ననిర్మితమగు చేమంచిబిళ్ళ నలంకారముగా ననుసంధించినాఁడు; ధూర్జటి రామకృష్ణాదులు తత్శృంగారమాహాత్మ్యములను గీర్తించినారు. భారతీ వేణిసౌభాగ్యమునకు ప్రబంధకవుల శృంగారము లన్నియునొక యెత్తు! పింగళి సూరన ముడివైచిన ముప్పేటజడకుచ్చుల సౌందర్యము మఱియొక యెత్తు!!

పింగళిసూరన రచించిన కళాపూర్ణోదయము తెలుఁగున 'నపూర్వకథాసంవి ధాన మహనీయ' మగు ప్రబంధము. నాయికయొక్క మూఁడుజన్మల కథను కార్యకారణక్రమమున నపూర్వకల్పనాసామర్థ్యముతో సంవిధానము చేయుట యా ప్రబంధకథానిర్మాణమునందలి ప్రత్యేకత! సరస్వతీ చతుర్ముఖుల పెంపుడుచిలుక కలభాషిణిగా, మధురలాలసగా జన్మము లెత్తి నిర్వహించిన జీవితవిశేషము లీకావ్య వస్తువునందు విపులముగా వర్ణింపఁబడినవి. చిలుక పుడమిపై పురంధ్రి యై పుట్టుటకు సరస్వతీచతుర్ముఖులప్రణయకేళి బీజము; వాణీశాపమును, వాణీశుని వరప్రదానమును అంకురార్పణము!

పింగళిసూరన కావ్యకల్పనాకళాపరిపాకమునకు సరసోదాహరణము సరస్వతీ చతుర్ముఖుల ప్రణయఘట్టము. అందుండి రెండుకథలు పుట్టినవి. అవి : ఒకటి : కళాపూర్ణునికథ లేక మధురలాలసావృత్తాంతము; రెండు : కలభాషిణీవృత్తాంతము. సామాన్యముగా నొక రమణీయకథాసన్నివేశమును గల్పించిన కవిప్రతిభ లోకమున ప్రశంసాపాత్ర మగుచుండును. అట్లుండ కథాద్వయ కల్పనా సూత్రగర్భిత మైన కల్పితకథాఘట్టము సృష్టించినసూరనప్రతిభ నేమని కీర్తింపఁగలము !

కళాపూర్ణవృత్తాంతమునకు సరస్వతీచతుర్ముఖుల కేళీఘట్టము మూలమైన విధమును పింగళిసూరన బ్రహ్మముఖమున వివరించి యున్నాఁడు. రహస్య కేళీ సమయమున తానువచించిన కళాపూర్ణునిగాథ భూమిపై వెలయునట్లు కరుణించి విరించి వాణితో నిట్లనెను —

సీ. "కాంత ! మున్నిన్న యాకథ యాకథయ నాఁగ
నందు వాచ్యత తోఁచినట్టి నామ
జాతిక్రియాదిక సకల పదార్థ వా
క్యార్థాంతరము లెవ్వి యవియ యిందు
గలయవి; యిందుఁ దత్కథ కంటె భేదంబు
పరికింప నొనరించెఁ బడసె నిలిపె
ననునివి మొదలైనయట్టి భూతార్థంబు
క్రియలపట్టున నొనరించుఁ బడయు

తే. నిలుపు ననునివి యాదిగాఁ గల భవిష్య
దర్థవచనంబు లైన క్రియాపదంబు
లునుచుకొనుటయె వాసి యెందును దలంప
నోసుధాంశువిలాసప్రహాసివదన !

వ. మఱియు శ్రోతృజనాపేక్షానుసారంబునఁ దత్తన్నిమిత్తోపాఖ్యానంబుల చేత నిదియ కొంత విస్తారంబు నొందఁ గల; దది చెప్పఁబని యేమి ? ప్రధానకథాభాగం బింతియె."

—5 ఆ. 60-61.

దీనినిబట్టి సరస్వతీచతుర్ముఖుల రహస్యకేళిలోఁ జెప్పఁబడిన కళాపూర్ణ వృత్తాంతమునందలి నామజాతిక్రియాది సకలపదార్థవాక్యార్థాంతరము లన్నియు తరువాత భువిపై ప్రవర్తిల్లిన కళాపూర్ణుని చరిత్రమునందు పాటింపఁబడిన వని

స్పష్టమగు చున్నది. మఱియుఁ దత్కథ శ్రోతృజనాపేక్షానుసారంబు తన్నిమిత్తోపాఖ్యానములచేత విస్తృతిగాంచిన దని తెలియుచున్నది. మణిస్తంభసుముఖాసత్తుల వృత్తాంతము, స్వభావసిద్ధుని యుపాఖ్యానము, అలఘువ్రతునకు మధురలాలస తెల్పిన మణికంధరవృత్తాంతము, శల్యాసురచరిత్రము, అభినవకౌముదీవృత్తాంతము, ప్రథమాగమాది పురోహితవృత్తాంతము, సత్వదాత్మ రూపానుభూతుల వృత్తాంతములు మొదలగునవి కళాపూర్ణవృత్తాంతమునఁ గానవచ్చు నుపాఖ్యానములు. ఉపాఖ్యానముల నటుంచినచోఁ గళాపూర్ణకథాకల్పనకు వలసిన మూలకథాసూత్రమంతయు వాణీచతుర్ముఖుల ప్రణయకేళియందు వాచ్యముగాఁ దోచుచుండుట నిస్సంశయము.

ఇఁక మిగిలినది కలభాషిణీవృత్తాంతము. అష్టాశ్వాస పరివ్యాప్తమైన కళాపూర్ణోదయప్రబంధమున కలభాషిణీవృత్తాంతము నాలుగాశ్వాసముల వఱకు వ్యాపించియున్నది. అనఁగా కలభాషిణి కథకు కావ్యమున సగపాలును, శుకమధురలాలసా వృత్తాంతములకు మిగిలిన సగపాలును కవి పంచిపెట్టినాఁ డన్నమాట! దీనినిబట్టి సూరనకు కలభాషిణీ చరిత్రముపై నున్న మక్కువ చెప్పక తెలియుచున్నది!

పింగళిసూరన కలభాషిణీ జన్మహేతువును గడు చమత్కారముగాఁ గల్పించినాఁడు. సరస్వతీచతుర్ముఖుల రహస్యకేళీవృత్తాంతమును రంభ వినఁగోరి చిలుకను మఱిమఱి యడుగ నాపలుకులపక్కి కులుకుపలుకులతో నామె కావృత్తాంతమును, సరస్వతీమణితస్వరవిశేషమును, వినిపించుటఁ గాంచి, వాణి శోణితాక్షియై—

"తలఁకక యోసి యేమిటి కతల్ తలపెట్టిన దాన విచ్చటన్?
తెలియము గాని నీవు పెనుద్రిమ్మరికూఁతలదానవే కదే!
బళిబళి యీవికారములు ప్రాఁతె? యవిఘ్నతఁ జాగి లంజవై
యిలపయిఁ బుట్టుమంచు శపియించె మనంబున నల్కహెచ్చఁగన్."
—5. 56.

ఇచ్చట "అవిఘ్నతఁ జాగి లంజవై యిలపయిఁ బుట్టు" మనుటలోఁ గల పదక్రమమును బరిశీలించినచోఁ జిలుక మొదట స్వర్గభ్రష్ట కావలె ననియు, తదుపరి వేశ్యారూపమున భువిపైఁ బుట్టవలె ననియు సరస్వతి నిర్దేశించినట్లు స్పష్టమగు చున్నది. వాణి తన శాపమున కవిఘ్నత శాసించుటచే బ్రహ్మదేవుఁడు కూడ యామెమాట కెదురాడకుండఁ జేసినది!

ఈశాపమును విన్న నలువ "యిది యేమి యెఱుఁగు? ని ట్లదయవృత్తిఁ దిట్టుదురె?" యని చిలుకపై నెంతయో దయ నొలుకఁబోసి, "మీయమ్మశాపంబు నకు నొఁగా దన నెవ్వరికి నెట్లువచ్చు" నని యాశ్వాసించి, అసలే భువిపై నొక జన్మ నెత్తవలసి వచ్చెనే యని విలపించు నాచిలుకకు మఱియొకజన్మ నంట గట్టి, ఆజన్మలో దానికి అనన్యసాధారణం బైన యైశ్వర్యభోగములను, సహజమైన పరమపాతివ్రత్యమును బ్రసాదించి కృతార్థవౌదు వని దీవించినాఁడు. పాప మాచిలు కకు బ్రహ్మదేవుని కరుణయు నొకశాపమై తారసిల్లినది. అమ్మగారు అంపశయ్యపై విసరివేయఁగా, అయ్యగారు ఒడలుదులిపి హంసతూలికాతల్పమునఁ బడవైచినట్లైనది!

పలుకులచిలుక వికారమునకు లోనై తల్లిగుట్టును బట్టబయలు చేసినందు లకు కలభాషిణియైన వేశ్యగా జన్మింపు మని సరస్వతి శపించుటలో సార్థక్యము స్పష్టమగుచున్నను, కలభాషిణీకథాకల్పనకు మూలమైన రహస్యము మాత్ర మీ ఘట్టమునఁ దెలియవచ్చుటలేదు! కవి దానిని దేవరహస్యముగా దాచియుంచినాఁడు! లేనిచో సరస్వతి చిలుకను బుడమిపైఁ బుట్టు మని శపించినట్లు చేసి, బ్రహ్మ యా పుట్టుకలోనే మధురలాలస యగునట్లు కరుణించినట్లు కల్పించినచో నొక్కజన్మము తోడనే చిలుకకు పునర్బ్రహ్మలోకసిద్ధి కలిగి యుండెడిది! కాని కవిబ్రహ్మ కల భాషిణీవృత్తాంతమున కిచ్చట నవకాశము కల్పించుకొని నాలుఁగాశ్వాసముల కథ నడపఁదలచుకొనినాఁడు!

ఇచ్చట నొకవిషయము గమనింపవలసియున్నది. కళాపూర్ణోదయ కావ్య విమర్శనము గావించిన విమర్శకులు కలభాషిణీవృత్తాంతము సూరనయపూర్వకథా కల్పనకుఁ దార్కాణగాఁ గీర్తించియుండిరి. కాని తత్కల్పనకు బీజభూతములైన సూత్రములు వాణీచతుర్ముఖులరహస్యకేళీవృత్తాంతమునఁ గలవని గుర్తించినట్లు కానరాదు! అందులకుఁ గారణ మొండు గలదు! వాణీశాపవృత్తాంతము బ్రహ్మ నిబం ధించిన ప్రధానకథాభాగమున కావల నడచిన గాథ యగుటచేఁ గలభాషిణి కథ ప్రధానకథకు సమానాంతరముగా వెలసి, మధురలాలసావృత్తాంతమునకుఁ బూర్వ రంగ మైనట్లు వారు భావించిరి. అంతియ. కావున నీవ్యాసమునందుఁ గలభాషిణీ వృత్తాంతకల్పనకు మూలములైన బీజములు వాణీముఖప్రతిబింబ వర్ణన కథార్థము లందుఁగలవని నిరూపించుయత్నము కొంత చేయఁబడు చున్నది.

కళాపూర్ణోదయ కావ్యవృక్షమునకు సరస్వతీచతుర్ముఖుల విలాసకేళి స్కంధము. వాఙ్ముఖప్రతిబింబ వర్ణమునందు 'వాచ్యత దోచినట్టి నామజాతి క్రియాది

సకలపదార్థ వాక్యార్థాంతరములలోఁ దోచిన కళాపూర్ణునివృత్తాంత మాతరువున కొకశాఖ. ఈశాఖాద్వయమునకు స్కంధమే యాధారము. కాని కళాపూర్ణుని కథా కల్పనము వాచ్యముగా సూచింపఁబడినట్లు, రహస్యకేళీఘట్టమునఁ గలభాషిణీ వృత్తాంతము సూచింపఁబడలేదు. అదియొక కథాకల్పనశిల్పమర్మము! పింగళి సూరన మణిస్తంభబింబిత వాణీముఖబింబప్రతిబింబాదుల సంచలనమునందును, వాణీచతురాననుల ముఖబింబవీక్షణాదిచేష్టా విశేషములయందును గలభాషిణీకథా కల్పనరహస్యములను బొదిగిపెట్టినాఁడు. వాని నీక్రిందఁ బరామర్శించుట జరుగు చున్నది.

కలభాషిణీ కథాకల్పన మంతయు నొకవిధముగా బింబప్రతిబింబ రూపకల్ప నముపై నాధారపడియున్నది. కలభాషిణి తొలుత మణికంధరుని వలచినది. కాని, మునిశాపభీతిచే నిజహృదయమును బయలుపఱచక దాచికొనినది. అపైన మణికం ధర రూపసామ్యము కొంత నలకూబరునియందుఁ గనవచ్చుటచే నాతని పొందుఁ గోరినది. మణిస్తంభుని సాయమున నామె నలకూబరునిఁ జేర యత్నించినది. కాని నలకూబరాకృతియం దున్న మణికంధరుని నామె పొందఁగలిగినది. మణికంధరుఁడు రంభాహృదయముఁ జూరఁగొనఁ గోరి నలకూబరాకృతిఁ గాంచి రంభాకారమున నున్న కలభాషిణిఁ బొందుటయే కాక, నిజరంభాసాంగత్యమును గూడ పొందఁ గలిగెను. నిజరంభానలకూబరులు నిజరూపములను నిర్ధారణము చేసికొనిన తరువాత మాయా రంభానలకూబరులవృత్తాంతము బయటపడినది. ఇట్టి తబ్బిబ్బులప్రహసనమునకు సాక్షి మణిస్తంభుఁడు. మణిస్తంభుఁడు లేనిచో నీయాట సాగదు.

సరస్వతీచతుర్ముఖుల విలాసకేళిలో సరోవరగర్భమందలి మణిస్తంభమే మణిస్తంభునిగాఁ జెప్పఁబడినది. అట్టి మణిస్తంభుఁడే కీలకమైన వ్యక్తిగా సూరన కలభాషిణీకథాకల్పనము గావించినాఁడు. ఇఁక వాణీచతుర్ముఖబింబ ప్రతిబింబముల తీరును సూరన కలభాషిణీ కథాపాత్రలకు ప్రతీకలుగా భావించిన విధమును గమ నింపవలసియున్నది.

వాణీచతురాననులు సరోవరతటమునఁ దలిరుపాన్పుపైఁ బవళించి యుండిరి. వాణీసుందరముఖారవిందమును గాంచి మదనపరవశుఁడై బ్రహ్మ తననలుమోముల నాసతియధరమును జుంబింప నుద్యుక్తుఁ డయ్యెను; ఆలీలకు సరస్వతిన వ్వి 'మేలు మే లెంతయు నీవింత లన్యాయ మింత గలదె ? మీమొగంబులు నాల్గు నీమాడ్కి

నువ్విళులూరిన నేకాస్య నొక్కతె నేను జాలుదునె? యివి చాలించెదరా? మఱి యేమైన గలదా?' యనుచు నామృగాక్షి మెడబిగించుచు నించుకెడగ వక్త్రము నిల్పి, యధరంబునకుఁ బాణి నడ్డ మిడుచు—

తే. "మొలక నగవును, గోపంబుఁ జెలువుఁ జిలుకు
తళుకుఁ జూపులఁ జూపులోఁ దర్జనముల
వక్రిత భ్రూలతా తాండవంబు సిరుల
మిగులఁ గెరలించెఁ బ్రియుమది మెఱయుమరుని."

అప్పు డా యజుఁడు బల్మిని వాణీముఖమును వంచి, మోవిపై నున్నచేయినిఁ దొలఁగించి, ఒక్కించుక నాటునట్లుగా పలుసేర్చెను. అయ్యమ కట్టియెడ కళాభిదుర మై యింపొనరింపఁగా మోహనమధురాంచిత శబ్దమొండు కంఠసీమయం దుదయించెను.

ఇందు యౌవనశోభావిలసిత మగు వాణీముఖము కొంగ్రొత్తవయసున నున్న కలభాషిణీముఖమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది. బ్రహ్మయొక్క నాలుగుమొగములు కలభాషిణీముఖచుంబనాకాంక్షులగు బలువురు విటులను బురుడించుచున్నవి. ప్రథమాశ్వాసమునందలి—

"తనదు మెఱుంగుఁజెక్కులు దాఁకఁగ నీక మొగంబు నాఁపుచుం
జనుబొగడల్ నఖాకలనఁ జక్కిలిగింతలు వోవ లోఁగుచున్
మనసిజు మించు భీతియును నానయుఁ బూనుచు నీమృగాక్షి యిం
పొనరుచు టెన్నడొక్కొ? యని యువ్విళులూరుదు రత్తఱిన్ విటుల్."
—1. 28.

అను పద్యముతోఁ బోల్చి చూచిన భావసామ్యము తేటపడఁగలదు. అట్లు క్రీడాసక్తులైన విటులను కలభాషిణి కాదని త్రోసిపుచ్చి, శ్రీకృష్ణమందిరమున దండకస్తోత్రమును బఠించిన మణికంధరుని విద్వత్సౌందర్యములకు మెచ్చి యాతని వరించినది. ఆ మక్కువలోఁ దద్రచితస్తోత్రము నేకసంధాగ్రాహియై మఱల పఠించినది. ఆమెయం దప్పుడు మణికంధరునకు మరులు జనించినవి. ఇట్లు మొదటిసారిగా నాముద్దరాలి చిత్తమును దోచుకొనిన వలపుఁకాఁడు మణికంధరుఁడు. ఆతని విద్యాప్రదర్శనావసరమున నవ్యక్తముగాఁ గలభాషిణినోట సరస్వతి లాస్యమాడినది. ఈకథాకల్పనకు బ్రహ్మ యేకముఖమున వాణియధరమునఁ బలు నాటించుటయు, సరస్వతికి కళాభిదురమై ప్రీతి జనించుటయు, తత్కారణముగా నామె కంఠమున

మణిత మను కలస్వన ముదయించుటయు నను చేష్టావిశేషములు బీజభూతము లగుచున్నవి. అవ్యక్తమధురాంచితశబ్దమును బల్కిన సరస్వతిముఖబింబము 'కలభాషిణీ' కల్పనకు ప్రేరక మనుటలో సందేహముండదు.

"అంత నావాగ్దేవి యావిధమున నొదవిన కళామర్మభేదన సామ్రాజ్యసంపదనుభవావస్థ మానలాఘవ శంక(" గప్పిపుచ్చుటకై 'తద్విరోధకారిణి యైన విభుని యభిమతకేళికి విఘాతంబుగ నధరపీడనాసహత్వ నాటితకంబున నలుక(గల్పించుకొని యవ్వలిమొగంబుగా(బొరలె'ను. ఈఘట్టములోని 'లాఘవశంకయే' కలభాషికి(దోచిన మునిశాప శంకను గల్పించుటకు దోహదకారి యైయుండును.

కలభాషిణి మునిశాపశంక నిట్లు వివరించి చెప్పినది :

"ఆవిధినుండు నంతట నొకప్పుడు నిన్నును(జూచుచో మణి
గ్రీవునిపేరు దో(చె మదికిన్ మణికంధర! యేకదేశసా
మ్యావగుణంబుచే నతని నాతసియన్నను మద్దిచెట్లుగా
దైవతమౌని తిట్టిన విధంబు తలంపున(బాటె నంతటన్." 4. 19.

"దానన గుండె గుబ్బురన(దా నెరియన్ విడిచెం ద్వదంగ సంగానుభవేచ్ఛ" అని యొట్టు పెట్టుకొని చెప్పిన దా లలన. కలభాషిణి మునిశాపశంక కారణముగా మణికంధరుని చరిత్రము మణిగ్రీవుని గాథ వలె విషాదభరిత మగునేమో యని భయపడి హృదయము నాతనినుండి దూరము(జేసికొనినది. అచ్చట సరస్వతి తనకు(గల్గిన లాఘవశంకను గప్పి పుచ్చుకొనుటకై విభుని యభిమతకేళికి విఘాతుక మైన చర్యకు నొకానొక కారణమును వెదకుకొని నలుక(గల్పించుకొని విముఖత భజించినది. అ(ట మణికంథరు(డును "దద్విరహదశావికలిత ధైర్యుండయ్యు, నుల్లంబునం గల్లగుట్టు నెట్టుకొలిపి, యిట్టట్టు తెల్పుటకుం జొరకుండె" యుండెను. ఇట్లు కలభాషిణీ మణికంధరుల చిత్తవృత్తులకల్పనకు వాణీచతుర్ముఖుల తాత్కాలచిత్తావస్థల విధము ప్రేరకమయ్యె ననుట కవకాశ మేర్పడు చున్నది.

అవ్వలిమొగంబైన సరస్వతి ముఖము కాసారగర్భమున నున్న మణిస్తంభగర్భమున(బ్రతిబింబించె నని సూరన కల్పనము. తద్వాణీముఖబింబమును గాంచి చతుర్ముఖు(డు వర్ణన మారంభించె నని కవి చెప్పియున్నా(డు. ఇచ్చట నొకవిషయము మనము స్పష్టముగా(దెలియవలసి యున్నది. దర్పణమునందు గాని, మణిముకురమునందుగాని యొకసతి ముఖబింబము ప్రతిబింబింప(గా దాని నామెప్రక్కనే యున్న

యామెపతి కాంచుచుండె నని భావించినచో సతీముఖప్రతిబింబమును దర్శించుచున్న పతిముఖప్రతిబింబమునుసైతము సతి కాంచఁగలిగియుండును. ఇది లోకమున సర్వజనవిదిత మైన భౌతికసత్యము. పింగళి సూరనకు కళాపూర్ణోదయ కథాకల్పనావసరమున చతుర్ముఖముఖప్రతిబింబప్రసక్తి యవసరము లేకపోయినది. అందువలన తత్ప్రతిబింబస్థితి నతఁడు వాచ్యము చేయలేదు. అతఁడు చెప్పకపోయినను, మణిస్తంభమున వాణీముఖప్రతిబింబ స్థాపనము చేసిన క్షణమునందే, చతుర్ముఖప్రతిబింబస్థితి భౌతికశాస్త్రధర్మము ననుసరించి స్థాపించినాఁ డనుట నిర్వివాదాంశము. కలభాషిణీకథాకల్పన కాదంపతుల ముఖబింబప్రతిబింబహేలయే మూలాధార మైనది!

పింగళి సూరనకు వాణీచతుర్ముఖముఖబింబప్రతిబింబములు కలభాషిణీకథలోని యేయేపాత్రల కల్పనకు కారకములైనవో పాఠకసౌకర్యార్థ మిచ్చట నీయఁబడుచున్నవి :

1. వాణీముఖము – లేక వాణీముఖబింబము = కలభాషిణి.

2. బ్రహ్మముఖము – లేక బ్రహ్మముఖబింబము = మణికంధరుఁడు.

3. మణిస్తంభ బింబితమైన వాణీముఖప్రతిబింబము = రంభ.

4. మణిస్తంభబింబితమైన బ్రహ్మముఖప్రతిబింబము = నలకూబరుఁడు;

వీని నీవ్యాసమునందు మున్ముందు వివరించుట జరుగును.

సరస్వతి క్రమముగా నా లాఘవశంకనుండి తేఱుకొనినది. ముఖము కళాప్రాభవ మయ్యెను. కళాపూర్ణ మైన యాతన్వి ముఖప్రతిబింబమును నీటియందుఁగల మణిస్తంభమునఁ బొడగాంచి బ్రహ్మకళాపూర్ణుని కథ ప్రారంభించెను. వాణిముఖవిలాసమును నలువ తత్ప్రతిబింబమున మనసుగొని చూచుచు, ధైర్యము వహించియుండఁగా సరస్వతి నిజభ్రూవిలాసమున నాతని ధైర్యమును భగ్నము చేసెను. భగ్నధైర్యుఁడయ్యు బ్రహ్మ యామె ముఖప్రతిబింబమునందు హృదయ వీక్షణములఁ దనివి తీరక నిల్పియుండెను.

ఈచేష్టావిశేషములందు గమనింపఁదగిన యంశములు రెండు కలవు. చతురాననుఁడు సరస్వతీముఖప్రతిబింబమును గాంచుచుండెను. సరస్వతి బ్రహ్మముఖప్రతిబింబమును గాంచుచుండెను. వెనుక నిశ్చయించినట్లు సరస్వతీముఖబింబము కలభాషిణికిని, బ్రహ్మముఖము మణికంధరునకును ప్రాతినిధ్యము వహించున న్నచో బ్రహ్మ కళాపూర్ణ మయిన సరస్వతిముఖప్రతిబింబమును గాంచి, హృదయ

వీక్షణము లాకృష్టము లైనను ధైర్యమున మసలు చుండగా నాతనిధైర్యము నిజ భ్రూవిలాసమున వాణి వికల మొనర్చిన దనుటలో రంభ యింద్రుని వరప్రసాదమున నభినవరూపలావణ్యములఁ బొంది, కళాపూర్ణయై తపమున నున్న మణికంధరునిఁ జేరి విలాసములఁ బ్రదర్శింప నాతఁడు తొలుత కొంత ధృతి వహించినను మనసు చలించుటచే తపోనిష్ఠను గోల్పోయెనను కథాఘట్టమును దలపింపఁ జేయుచున్నది. మణికంధరుఁడు రంభను గవయుట కాయింతి యాసమయమునఁ దాల్చిన యభినవరూపవిశేషమే కారణ మని సూరన స్పష్టముచేసినాఁడు. మణికంధరుఁడు గంధర్వకుమారుఁడు. నారదునితోఁ గలసి స్వర్గగమనాదుల కలవాటుపడినవాఁడు. రంభాదుల నాతఁడు చిన్ననాఁటినుండియు నెఱుఁగును. కాని యతనికి భూలోక వనితయైన కలభాషిణి చిత్తమున కెక్కినంత నాకవనిత లెక్కలేదు. కలభాషిణి సౌందర్యము నాకవనితల తలదన్నునది. నారదుఁడే యొకసారి—

"..........ఓయంబుజాక్షి!
రంభ మొదలైన యేయచ్చరలకు నైనఁ
దక్కువే? నీదు రూపసౌందర్య మహిమ
లెక్కడే కాక! మిగుల నూహించిచూడ"

అని యోగ్యతాపత్ర మొసంగియుండెను. రంభయు దేవేంద్రునితో "అతని (మణికంధరుని) నిఁట మున్ను పరికించుచుండుదు మస్మదాదుల విలాసంబు లెవ్వియు నెన్నండును సరకుఁగొని చూచినవాఁడు గాడు" అనితెల్పి యున్నది. దేవేంద్రదత్తమైన యధికరూపలావణ్యవిలాసముల వహించి రంభ మణికంధరుని గాంచియుండుటచే నాతఁడు - కలభాషిణియం దిదివరలోఁ గాంచిన విలాసాదుల నామెయందుఁ గాంచి - యామెకు వశుఁ డయ్యెనని తెల్ల మగుచున్నది.

సరస్వతి భర్తయందు మక్కువగల్గియుండియు, స్వయంకల్పితకోపకారణముగా బ్రహ్మకు విముఖయై యుండి పతిముఖప్రతిబింబమును గాంచుచుండుటను బట్టిచూడ - కలభాషిణి ప్రథమప్రియుఁడైన మణికంధరునియందు మునిశాపభయముచే నైన వైముఖ్యమును గల్పించుకొని తద్రూపసామ్యము - ప్రతిబింబభావము - గల్గిన నలకూబరునియందు మరులుగొనిన కథాకల్పనమునకు మూలమగుననుట కాస్కార మేర్పడుచున్నది. కలభాషిణి పలికిన యీక్రిందిమాట లామె నలకూబరుని వలచుటకుఁ గల కారణమును స్పష్టమొనర్చుచున్నవి.

"...............నాదుచిత్తమో
మానితశీల ! యంతట సమంచిత తావకరూపరేఖ చొ
ప్పెనొక కొంత గల్గఁ గని యిచ్చఁ గుబేరతనూజుఁ గోరితిన్."

"శాపభయంబున నెఱయఁగఁ
నీపై కోరిక మరల్చి నిధిపతిసుతు నే
పాపపు వేళను జూచితి
నో ! పరుసౌబ గేను మఱి కనుంగొన గుఱిగాన్."

"శ్రీయుత మైన దివ్యమణి చేతికి నబ్బఁగఁ బారవైచి, త
చ్ఛాయ యొకింత యున్కిఁ గని చాలఁ గ్రహించితి గాజుపూసకై
నాయవివేక మే మనుకొనం ? దుదఁ దన్మణి యబ్బె నన్న న
త్యాయత తత్సమాగమ సుఖాప్తికి నోఁచమి నెంచి కుందెదన్."

పైసమన్వయము ననుసరించి సరస్వతీముఖప్రతిబింబము రంభాపాత్రకల్పనమునకును, చతుర్ముఖప్రతిబింబము నలకూబరపాత్రకల్పనమునకు కారణములైనట్లు స్పష్ట మగుచున్నది !

కళాపూర్ణుఁడు ధీరభావునిఁ గడుదూరముగాఁ దరిమి, తనను శరణు జొచ్చిన మదాశయుని సకుటుంబముగా దాసు నొనరించి యూడిగములు సేయించుకొనుచుండె నని నలువ కథ చెప్పెను. అప్పలుకుల నాలకించి శారద చిలుకవైపు మోముఁ ద్రిప్పి, "ఆకళాపూర్ణుఁడు మఱి యేమి యయ్యెఁ ? నతనికిఁ దల్లిదండ్రు లెవ్వ ?' రని బ్రహ్మ నడుగు మని గఱపెను. ఆ చిలుకయు బ్రహ్మదేవుని నట్లు ప్రశ్నించెను. ఆజగద్గురుఁడు మఱల కథ ప్రారంభించి "అవ్వరవిలాసుఁడు అభినవకౌముది యను కాంతచే వరింపబడె ననియు, అతనికి సుముఖాసత్తి యనునది తండ్రి యనియు, మణిస్తంభుఁ డనువాఁడు తల్లి యనియు నుడివెను. కళాపూర్ణుని తల్లిదండ్రులను బేర్కొనుటలో నైన లింగవ్యత్యయమును విని వాణి నవ్వి గ్రక్కునఁ గ్రమ్మఱ పతిని గౌఁగిలించి "బార ! యింతలో నెన్నితబ్బిబ్బులు ! దద్దరిల్లకుఁ" డని వీపు తట్టి మీదికథనుగూర్చి ప్రశ్నించెను. ఈఘట్టములో బ్రహ్మ కళాపూర్ణుని తల్లిదండ్రులను గల్పించి చెప్పునపుడు శోభనముఖ సామీప్యంబు కారణముగా తత్కాసారమధ్య మణిస్తంభగర్భమున నుదయించియున్న సరస్వతీముఖప్రతిబింబమును గాంచుచు శోభనముఖసామీప్యమును సుముఖాసత్తిగను, మణిస్తంభమును మణిస్తంభునిగను భావించి చెప్పెను.

పింగళిసూరన కీకథాఘట్టము మాయారంభాకథాకల్పన కనువైన కొన్ని సూత్రముల నందించెను. పైఘట్టమునందలి సరస్వతీచతుర్ముఖుల ముఖబింబప్రతిబింబముల కదలికలను గమనించినచో నది స్పష్టము కాఁగలదు. ఆకదలికలను ప్రధానముగా నీక్రిందివిధమునఁ జేర్కొనవచ్చును.

1. సరస్వతీముఖ ప్రతిబింబము చతుర్ముఖుని ముఖబింబమును గాంచుట–ఇది రంభ మణికంధరుని గూడుటను వ్యంజింపఁజేయుచున్నది.

2. సరస్వతీముఖబింబము చతుర్ముఖునిముఖప్రతిబింబమును గాంచుట – ఇది కలభాషిణి మణిఁస్తంభునిసాయమున నలకూబరునిఁ గవయ యత్నించుటను వ్యంజింపఁజేయును.

3. సరస్వతి చిలుకవైపు మరలుట – అప్పుడు సరస్వతీముఖబింబప్రతిబింబములు వైముఖ్యమును భజించుచుండును గావున – రంభ నలకూబరాసక్తమైన చిత్తముతో నతని నామోచ్చారణ మొనర్చి మణికంధరుని కప్రీతి కల్గించు కథార్థమును సూచించును.

4. సరస్వతి చిలుకతో మాటలాడి మణిస్తంభమువైపు మరలియుండుట – బ్రహ్మ శోభనముఖసామీప్యమును గమనించుట – శోభనముఖ సామీప్యము మణికంధరునకైన కలభాషిణీసాన్నిహిత్యమును వ్యజించుచున్నది. ముఖసామీప్యమును గమనించియు బ్రహ్మ సరస్వతీముఖప్రతిబింబమునందే రతి గల్గియుండుటచేఁ గలభాషిణిని రంభాకృతిలో మణికంధరుఁడు పొందఁగలిగిన కథార్థము వ్యంగ్యము.

5. చిలుకమాట లాలించునెడ బ్రహ్మయొక్క ముఖబింబ ప్రతిబింబములు సరస్వతీ వీక్షణములకు వైముఖ్యమును భజించినవి — దానివలన కలభాషిణి విముఖుఁడైన నలకూబరుని (లేక నలకూబరవేషుని), రంభ విముఖుఁడైన మణికంధరుని (నలకూబర సదృశుని) బొందెడి కథాకల్పనలు ధ్వనింపఁబడుచున్నవి.

6. చతుర్ముఖుఁడు మఱల వాణీముఖప్రతిబింబమును గాంచుచు కథను కొనసాగించుట – దీనివలన రంభకు మణికంధరునియానుకూల్యము సిద్ధించు కల్పనము సూచింపఁబడుచున్నది.

7. సరస్వతి చతుర్ముఖునివైపు మఱలుట – దీనివలన మణిస్తంభబింబిత వాణీప్రతిబింబము చతుర్ముఖుని ముఖమును గాంచుట తొలఁగినది. అది రంభ

మణికంధరునిఁ ద్యజించి నిజనలకూబరునిఁ గూడెడు కథాకల్పనకు సూచకమగు చున్నది. వాణీముఖము చతుర్ముఖుని కున్ముఖ మగుట – కలభాషిణీ మణికంధరులు నిజాకృతులతో మృగేంద్రవాహన దేవాలయమునఁ గలసిన సన్నివేశమునకు వ్యంజక మగుచున్నది. ఇట్లు స్థూలముగా మాయారంభావృత్తాంత కథాకల్పనలకు బీజములు వాణీచతుర్ముఖుల బింబప్రతిబింబముల తత్కాలసంచలనములయందు పింగళిసూరన నిక్షేపించియుండుట స్పష్టమగుచున్నది.

తనకు మొగమైన భారతికంఠమును శతానందుఁ డధికసంభృతానందుఁడై కౌఁగిలించెను. ఏతత్పరిష్వంగము మృగేంద్రవాహనాలయమున గలసిన కలభాషిణీ మణికంధరులు పూర్వస్మృతిచర్వణమొనర్చుటకు సంజ్ఞ.

నలువ భార్యాధరపానమహోత్సవమునఁ దేలుచు నొక్కమొగమున నామె నొక్కించుక పీడనము గావించెను. అందుల కాసతి పతి నదలించి "మదిం గొలఁది యెఱుంగ రెందు" నని కోపము సూపుచుఁ గౌఁగిలి విడిపించుకొని నాథుని మోముల నిరుకేలఁ బాయఁగఁబట్టెను. ఈపరిష్వంగవిశ్లేషము మణికంధర కలభాషిణుల కాజన్మ కింక సంయోగము లేదనుటను సూచించుచున్నది.

ఆపై నలువ దృక్కులు వాణీకుచకుంభములనుండి మధ్యప్రదేశమున కురికి నవి. ఇయ్యది మణికంధరుని భృగునిపాతమును సూచించుచున్నది. అటుతరువాత దృష్టిసహితముగా నాదేవుని యాత్మ తిరిగి సఖీముఖమునకు వచ్చుటయుఁ, దాన జుంబనేచ్ఛ మగుడఁ బరితుష్టినొందుటయు నది ముఖపానముచేత సఫల మగు టయుఁ బరికింప నుత్తరజన్మమున కళాపూర్ణుఁడుగా జన్మించిన మణికంధరుఁడు మధురలాలసగా జన్మించిన కలభాషిణియందు బద్ధానురాగుఁడయి, వివాహమాడి సుఖంబుండెనను కథాకల్పనకు మూలమగుచున్నది.

ఇట్లు కలభాషిణీ వృత్తాంతమునందలి ప్రధానపాత్రలగు కలభాషిణీమణి కంధరులు, రంభానలకూబరులు, మణిస్తంభుఁడు మొదలగు వారిని గల్పించి కథా సన్నివేశములను గూర్చుటకు – మూలకథయైన వాణీచతుర్ముఖుల కేళీవిలాసఘట్టమే యాధార మగుట యాశ్చర్యకరమైన విశేషము.

సరస్వతి స్వయముగాఁ గల్పించుకొనిన పతివైముఖ్యమునకుఁ బ్రాతినిధ్య మిచ్చెడి తలంపుతో సూరన కలభాషిణి కథలో నారదపాత్ర కల్పనముఁ జేసినట్లు

న్నాఁడు! ప్రధానకథలో సరస్వతి కోపోద్రిక్తయై 'రంభ యనునది యిప్పు డెందు బోయె? దానికిఁ దగిన బుద్ధి చెప్పవలయు' (5 ఆ. 70 వ) నన్నవాక్కు దబ్బర గాకుండ నారదునిమూలమున కలభాషిణీజన్మకాలమున రంభకుఁ దగిన బుద్ధిచెప్పుట జరిగినది. అందువలననే రంభ కలభాషిణికథకుమాత్రమే పరిమితమైనపాత్ర. నలకూబరుఁడు రంభననుసరించువాఁడు కావున నతఁడును అంతియే.

ఇఁక కలభాషిణీ జన్మవృత్తాంతమున శ్రోతజనాపేక్షానుసారముగాఁ బెరిగిన యుపాఖ్యానములు గలవు. అవి : నారదతుంబుర కలహోదంతము; నాకవాసి యగు శుకమునుగూర్చిన కథ; సుగాత్రీశాలీనుల యుపాఖ్యానము; మణికంధర తీర్థ యాత్రాదివర్ణనము; మొదలైనవి.

కళాపూర్ణోదయకావ్యము కమనీయ కథాకల్పనకు కల్పలతిక. మూఁడు జన్మలగాథను ముడివైచి పూర్వాపర వైరుద్ధ్యము లేకుండ కథనల్లిన సూరన ప్రతిభ యనన్యసామాన్యము. అందలి సరస్వతీచతుర్ముఖుల కేళీకథాకల్పనమే యొక యపూర్వశిల్పము. అందు వాచ్యముగాఁ దోచెడి కథ కళాపూర్ణుని వృత్తము కాఁగా, వ్యంగ్యముగా స్ఫురించెడిది కలభాషిణీవృత్తాంత మగుచున్నది. వాణీచతుర్ముఖ బింబప్రతిబింబ సంచలన వీక్షణ చేష్టావిశేషములనుసైతము వృధా కాకుండ కథాకల్పనలో నంగము లగునట్లు సార్థక్యమును సాధించుట సూరనప్రతిభకే చెల్లినది.

తెలుఁగున నపూర్వకథాకల్పనాశిల్పమునందు కళాపూర్ణుఁడు పింగళి సూరన!

జంటకవులు

మ. "కవనార్థం బుదయించితిన్ సుకవితాకార్యంబె నావృత్తి యీ
భవ మద్దానఁ దరింతుఁ దద్భవమె మద్భాగ్యంబు సర్వంబు మృ
త్యువు నే దాన జయించితిన్ రుజ జయింతున్ దానిచేపట్టి, నా
కవనమ్మె భవదీయతేజ మని వక్కాణింతు విశ్వాత్మకా!''

చె. వేం. శా.

తెలుఁగున జంటకవు లెవరన్నచో కనిష్ఠికాధిష్ఠిత లయ్యెడు వారు తిరుపతి వేంకటకవులు. వీరి కీయగ్రతాంబూల మిచ్చుట పూర్వాపరములందు జంటకవులు లేకకాదు; వా రుత్తమ సాహిత్యసృష్టి చేసియుండకకాదు. తిరుపతివేంకటకవులు నిద్రాణమై యున్న తెలుఁగుజాతిని మేల్కొల్పి నవ్యదీధితులతో నలరారు బహుముఖ కావ్యజగత్తును దర్శింపఁగల నవ్యాలోకము నందించి వందనీయులైనారు. అందు లకే వీరి కీకవికులగురుస్థానము.

ఆంధ్రసాహిత్యచరిత్రలో జంటకవుల మాట మొదటిసారి పదునేనవశతాబ్ది ఉత్తరార్థమున వినఁబడినది. నందిమల్లయ్య, ఘంటసింగయ అనువారలు ప్రబోధ చంద్రోదయమును, వరాహపురాణమును ఆంధ్రీకరించి శ్రీనాథకావ్య యుగమున కలంకార ప్రాయులైనారు. ఆజంటకవులు సరసశ్రవ్యకావ్య నిర్మాణచతురులు, శాంత రసమూర్తులు. కృష్ణమిశ్రుని దృశ్యకావ్యము వారిచేతులలో శ్రవ్యకావ్యమై అవత రించినది. విష్ణుపారమ్యబోధక మగు వరాహపురాణ మా శివారాధకుల యం దద్వైత రసామృత సిద్ధి నొందినది. ముముక్షుజనసేవ్య మగు శాంతరసము వారి కావ్యములం దందగించి యుండుటచే నవి సరళసహృదయ లోకమున కందని మ్రానిపండ్లైనవి. అందువలననే వారివి గుఱించి చెప్పుకొను నప్పుడు తిరుపతివేంకటవవులవలె వారు జంటకవు లని యిప్పటి తెలుగువారు పరిచయము చేసికొందురు. వారి కన్న వీరి కున్న వ్యాప్తి కీర్తులు అటువంటివి.

జంటకవులకు యోగ్యమైన సర్వలక్షణములు సమముగా సమకూరిన వీ తిరుపతివేంకటకవులయందు. నందిమల్లయ ఘంటసింగయల తరువాత తెలుఁ

గునఁ బ్రాచుర్యముగా వినఁబడునవి వీరి పేర్లే. క్రీ. శ. 1892 లో కాకినాడలో విశాఖానక్షత్రద్వయమువలె దివాకర్ల తిరుపతిశాస్త్రిగారును, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారును జంటకవులై ప్రకాశించి శతఘంటకవన సరస్వతిని సాక్షాత్కరింపఁ జేయుటతో జాతి కొక కనువిప్పైనది. నాఁడు మొదలీ కవిద్వయము శ్రీకాకుళము మొదలు చెన్నపట్టణము వఱకుఁ గల తెలుఁగుదేశమున నవధానకవితాయాత్రలు చేసి ఆంధ్ర భారతికి బంగారుపల్లకిసేవను జరిపించుటతో తెలుఁగుబిడ్డల రసహృదయములు సారస్వత భక్తి భావముతో పులకరించి, పొంగులువారినవి. వీరిపేర్లుచర్చించినంత మాత్రముననే తెలుఁగువారి నాలుకలపై ఛందస్సు లాస్యమాడినది; వీరిని దర్శించినంత మాత్రముననే తెలుఁగుకవులకు జంటకవిత్వము నాశువుగా నల్లవలెననెడి కోరిక లీరికలెత్తినది. వీరి తర్వాత తలలెత్తిన జంటకవులకు తిరుపతివేంకటకవులే ఆదర్శప్రాయులు. ఒక అర్ధశతాబ్దము వఱకు జంటకవు లనెడి భావము సారస్వత లోకమును ముచ్చట మురిపెములతో ముంచెత్తినది.

తిరుపతి వేంకటకవు లన్న పేరునకున్న కుదిరిక తెలుఁగున మఱి యేజంటకవుల పేర్లకును లేదు. దివాకర్ల తిరుపతిశాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి అనుపేర్లలోని ప్రధాననామములకైన విశిష్టమైన కలయిక రమణీయార్థదాయకముగా నీరక్షీరన్యాయమున ఏకరూపముగా భాసించినది. ఇది సాక్షాద్బ్రహ్మ (చెర్ల బ్రహ్మయశాస్త్రిగారు) కలిపినజంట! ఇఁక మిగిలిన జంటకవులపేర్లు తిలతండుల న్యాయమునే వహించినవి కాని నీరక్షీరన్యాయమును పొందఁజాలక పోయినవి. కొందఱి జంటకవుల పేర్లు రెండు రెండుగనే ఉండిన అందముగా నుండును గాని కలిపెద మన్నను అతుకవు. కొందఱివి ప్రధాననామము లతుకక మొదళ్ళు చిగుళ్లు కలిపి ముడి వేసినట్లుండును. కొందఱివి "సోదరుల"న్న పదముతో కాని పొత్తుకుదిరెడివి కావు. అట్లైనను ఇరువురి పేర్లకు అందులో అవకాశము ముండెడిదికాదు. ఎట్లైనను అతుకులు పెట్టుకొని జంటకవులైన వారేకాని 'త్వమేవాహ' మ్మనుసమైక్య మేలాఁటి జంటకవుల నామముల కేర్పడినది కాదు. తెలుఁగువారి కభిమాన దైవమైన తిరుపతి వేంకటేశ్వరస్వామి నామము వ్యంగ్యమగునట్లు పేరు కుదురుట ఈకవుల యదృష్టము! వేంకటశాస్త్రి గారు జాతకచర్యలో నాస్వామితోఁదమ్ము పోల్చుకొనుచు శ్లేషాలంకారమున నిట్లు చమత్కరించినారు.

సీ. "శ్రీమహా లక్ష్మ్మి విశిష్టుఁడా నయశాలి
శ్రీమహా లక్ష్మ్మి విశిష్టుఁ డితఁడు;

నీలాచలాదరాన్వితుఁడా చమత్కారి
నీలాచలాదరాన్వితుఁ డితండు;
విబుధ రాజ స్తవ్య విభవుఁ డామహితుండు
విబుధ రాజ స్తవ్య విభవుఁ డితఁడు;
బ్రహ్మగురుత్వ వైభవుఁ డాయశోరాశి
బ్రహ్మగురుత్వ వైభవుఁ డితండు;

తే. గీ. నిరత తిరుపతి విరచితాదరుఁ డతండు
నిరత తిరుపతి విరచితాదరుఁ డితండు;
వేంకటేశ్వరుఁ డాతండు; వేంకటేశ్వ
రుం డితం డన నప్పుండితుండు తనరె." —జాత. పూ. 389.

పారలౌకిక మైన పరమాత్మతత్త్వము పరివేషముగా భాసించిన తిరుపతి వేంకట కవుల నామధేయము తెలుఁగువారి భక్తిపుష్పాంజలులకు పాత్రమై విలసిల్లినది!

"అడివి యుసిరికాయయు నుప్పును" కలియురీతి తిరుపతి వేంకటకవులకు నేస్తము కడు విచిత్రముగా సంఘటితమైనది. తిరుపతిశాస్త్రిగారు వెల్నాటివారు; వేంకటశాస్త్రిగారు ఆరామద్రావిడులు; ఒకరు యండగండిగ్రామస్థులు, మఱియొకరు యానాము వాస్తవ్యులు. ఒకరు దివాకరాన్వయవారినిధి శీతరోచి, మఱియొకరు చెళ్లపిళ్ల విఖ్యాతవంశ్యులు. వీరిరువురు కులరూపగుణములందు సములై చెర్ల బ్రహ్మగురునొద్ద సహాధ్యాయులై మైత్రి కలిసి జంటకవులైరి. వీరి స్నేహము అమలము, నిత్యము, సత్యము, ఆదర్శప్రాయము!

శా. "నీరక్షీరములట్లు లెల్లపుడు నీనేస్తంబు గైకొంటి మ
క్రూరంబైన మనంబుతో నిదియ మాకుం దెచ్చెఁ గీర్త్యాదికం
బేరే మైత్రినిగూర్చి చెప్పుకొనుచో దృష్టాంతమౌఁ గాక పెం
పారం దిర్పతి వేంకటేశ్వరుల సఖ్యం బెల్లకాలంబులన్.
—శతావధానసారము – ఉత్త. పుట. 90

చ. "ఇరువురుఁ గూడియే రచన యెప్పుడు చేయుదు రొక్కవేళ నొ
క్కరొకటి, యొక్క రింకొకటి కైకొని చేయుదు, రందుహెచ్చుత
గ్గొరులకుఁ గానరాక యది యొక్కరు చేసినభంగి నుండు, నొ
క్కరు రచియించిరేనియును గాఁదగు తిర్పతివేంకటీయమై."
—జాతకచర్య. పూ. 240. ప.

అనిన ప్రతిజ్ఞలు వీరి యభేదస్నేహమూర్తిని సాక్షాత్కరింపఁ జేసినవి. ప్రత్యర్థు లెందఱో వీరి స్నేహమును భగ్నపరుప యత్నించిరి కాని అకృత్రిమమైన వారి ప్రవృత్తిపట్ల విఫలులైరి.

తిరుపతివేంకటకవు లాశుకవిత్వము చెప్పి అవధానసభలను రంజించునంత వఱకు జంటకవులు కవిత్వ మెట్లు చెప్పెదరో తెలుఁగువారికి స్పష్టమైన తెలివిడి లేదు.

చ. "ఒక చరణం బతండు మఱియొక్కటి నేను మఱొక్కఁ డాతఁడున్
సకలకవీంద్ర సంతతులు సమ్మతిచేఁ దలలూచి మెచ్చఁగాఁ
బ్రకటతరాశుధార దనరన్ రచియింపఁగ నేర్తుమయ్య! 'నూ
టికిసెల'గయ్య! నిక్కమిది డెబ్బదిమాటలు సెప్ప నేటికిన్?"

నానారాజసం. పూ. 44. ప.

అని మొదటిసారి విడమరిచి చెప్పినవారు తి. వేం. కవులే. పద్యములో నొక్కొక్క చరణ మొక్కొక్కరు చెప్పుట, ఆశువుగా శతావధాన మొనర్చుట అనునీ కవుల రెండుగుణములు లోకమున కాశ్చర్యముద్రఁ గల్పించినవి. ఏకకవిబుద్ధి విలసితమైన యొకసంపూర్ణభావావేశము ఛందోమయముగా నొక పద్య మగుటయు లేక ఒకకావ్య మగుటయు లోకమున సహజముగా గోచరించు విషయము. కాని తి. వేం. కవులు ఒక్కొక్కచరణ మొక్కొక్కరు చెప్పి రనఁగా నొక్క వ్యక్తి యం దుండవలసిన సమాహితబుద్ధిప్రాభవము జంటకవులలో నిద్దఱి నాశ్రయించి యేకోన్ముఖముగాఁ బ్రవహించు నని స్పష్టమగుచున్నది. భావయిత్రీ కారయిత్రీ ప్రతిభలయందు ఈకవులు సాధించిన సమన్వయసంసిద్ధి యపూర్వము. జ్ఞానేచ్ఛా క్రియా వృత్తులు భవ్యకవితావేశోన్ముఖములై జంటకవులయందు భావసంస్కారము నేకరూపముగా నావిష్కరింపఁ జేసినవని యిందు తాత్పర్యము. మానసిక స్నేహము తాదాత్మ్యావస్థ నందెడి యుత్తమస్థితికి తి. వేం. కవుల భావైక్యము ఒక విశిష్టదృష్టాంతము! అట్టిది జంటకవులలో నభూతోనభవిష్యతి!

జంటకవుల మనఃప్రవృత్తి కావ్యసృజనవ్యాపారమం దేకైకమార్గావలంబి యైనట్లు ఇతరవిషయములం దుండ నవసరము లేదు. వ్యక్తిగతములైన అభిరుచులు, అభిప్రాయములు భిన్నభిన్నములుగా భాసింపవచ్చును. అనఁగా కవన వ్యాపారమందు కవలబిడ్డల మనఃప్రవృత్తిని, జీవితవ్యాపారమునందు స్నేహ

ప్రవృత్తిని జంటకవులు ప్రపంచించెద రని తాత్పర్యము. సామాన్యముగా కవల బిడ్డ లొకనిర్దిష్టవిషయమునం దొకేవిధముగా వర్తించుటయు, స్నేహితుల హృదయము లొకటయ్యు అభిరుచులు వేరై యుండుటయు లోకప్రసిద్ధము. అట్లే తి. వేం. కవులు తమ కవిత్వ మొక్క కవి రచించినట్లే భాసింపఁజేయు భావైక్యము కవిత్వమున సాధించిన వారయ్యు జీవితమున భిన్న దృక్పథములు కల వారై యుండిరని వారి గ్రంథములు నిరూపించుచున్నవి. మచ్చునకు వీరివి కొన్ని విభిన్నాశయముల నిచ్చట నుదాహరించుచున్నాను.

1. తిరుపతివేంకటకవులు ఇరువురు నానారాజసందర్శన మొనర్చి వారిచే గౌరవసత్కారాదులు పొంది యుండిరి. వేంకటశాస్త్రిగారికి రాజదర్శనము ప్రీతి దాయకమే కాని, వారి నాశ్రయించుకొని బ్రతుకెల్ల నస్వతంత్రముగా నడపుట మాత్ర మిష్ట మయ్యెడిది కాదు.

మ. "నరనాథుల్ పలుమంది మిత్రులయి యున్నన్ గాని తత్సన్నిధిన్
స్థిర వాస మ్మొనరించు నట్టిపని నాచేఁ గాదు నీవంటి స
త్కరుణాశాలిని పెంపఁగా బెరిఁగి విద్యాబుద్ధుల న్నేర్చి నేఁ
బరుల న్నిత్యము గొల్చు టొప్పగునె ? యంబా ! దేవి కామేశ్వరీ !"

అని వేంకటశాస్త్రిగారు తమ యభిమతమును స్పష్టపఱిచినారు. తిరుపతిశాస్త్రిగారు దీనికి విరుద్ధము. అందువలననే పోలవరము జమీందారు గారి యాస్థానమునువా రలంకరింపఁ గల్గినాఁడు. అందు తప్పేమియు లేదు కాని, వేంకటశాస్త్రిగా రొకసారి కోరినప్పుడు వెంటనే తిరుపతిశాస్త్రిగారు అవధానయాత్రకు ప్రభుసేవకారణముగా రాఁ జాలక పోయినారు. "నిరంకుశాః కవయః" అన్న సూక్తిని వేంకటశాస్త్రిగారు నూరుపాళ్లనుసరించిన స్వతంత్రులు.

2. "అవధానాలలో కొన్ని విషయాలు క్రొత్తరకాలు ప్రవేశపెట్టా లని అతనికి (తిరుపతిశాస్త్రిగారికి) వుత్సాహం వుండేది. వాట్లను నేను (వేంకటశాస్త్రిగారు) వప్పుకుండేవాణ్ణికాను. యెందుచేతనంటే- ఆవిషయాలు గారడిబాపతులో చేరుతాయి. కాని కేవలప్రతిభైకస్ఫోరకాలు కావు. సార్వత్రికంగా కాకపోయినా క్వాచిత్కంగా నేనా ఆవిషయాలు యితరులున్నూ చేసే కిటుకులు. మన అవధానంలో ఆకిటుకుకాస్తా బయటపడ్డప్పుడు మన అవధాన మంతా ఇలాంటిదే అనే అపప్రథకు అది కారణం కావలసివస్తుం దని నాభయం. అతఁడు అప్పటికప్పుడు

దాటుకపోవడమే చూచేవాఁడు కాని, భవిష్యత్తును విచారించేవాఁడే కాఁడు. మాయిద్దఱికీ యీవిషయంలో చాలా ప్రభేదం." —కథలు-గాథలు-పుట. 427.

3. "యేదేనా తన్మయత్వం తటస్థిస్తేమాత్రం యిప్పుడు కూడా అన్నాహారాలు తోచకుండా కవితాధార నడుస్తున్నందుకు నిన్నమొన్న రచించిన 'జయంతిన్నీ' 'క్షమాపణమున్నూ' లోకానికి సాక్ష్య మీయడానికి సందేహంలేదు. యిదే నాప్రవృతిలో వున్న విశేషం. ఇట్టి పట్టుదలగాని, తన్మయత్వంగాని అతని ప్రకృతిలో లేదు." —కథలు-గాథలు-I పుట 437.

4. "పరిణతి రవధార్యా యత్నతః పండితేన" అనే భర్తృహరి వాక్యాన్ని ప్రతికవిన్నీ అనుసరించి తీరాలి. అది అతఁడు ఏవిషయంలోనూ పాటించేవాఁడు కాఁడు. గ్రంథారంభం చేసేటప్పటికే ముగింపు మనస్సులో నాటుకపోవాలి కాని ముగింపును గూర్చి యెప్పుడో ఆలోచిద్దామంటే కార్యకారి కాదు.

—కథలు-గాథలు సం. I-438.

5. "సభాముఖంలో వంకరమార్గం త్రొక్కి, ముఖవిధానంచేసి, యెదటివాళ్ళకు నోరాడనివ్వక పోవడంలో అతనికి మంచి శక్తి వుండేది. కాని, అది తావన్మాత్రంలో ఆఁగిపోతే యేం లాభం? మర్నాడు మళ్ళా అడిగితేకూడా నిలిచే పద్ధతి వాదంగాని పనికిరాదనే వాణ్ణినేను. అందుకోసం తాత్కాలిక విజయానికి యెన్నడూ ప్రయత్నించక వొక్కొక్కదానికి యెన్నోప్రయోగాలు వెదికి వెదికి వేసారి అప్పుడు దాన్ని బయటికి పెట్టడమే అప్పటికీ ఇప్పటికీ నాప్రకృతి. యిందుకోసం అతఁడు నాయందు ఆంతరంగికంగా చాలా కృతజ్ఞత చూపేవాఁడు, నామాటను పరమప్రమాణంగా భావించేవాఁడు." —కథలు—గాథలు. I పుట. 440.

6. "వ్యాకరణం ఇద్దరమూ సమానంగానే చదువుకున్నాం. మధ్యకాలంలో నేను కాశీకి వెళ్ళినా చాలామంది మహాపండితులను సందర్శించడం తప్ప దేశంలో వున్న తిర్పతిశాస్త్రికంటే విశేషం చదివిం దేమీ లేదు. మళ్ళా దేశంలో యిద్దరమూ కలిసే తరువాయి గ్రంథాలు మొదటిగురువుగారి దగ్గిరే అభ్యసించాము. సంస్కృతంలో కావ్యనాటకాలు చదవడంలో నాకన్నా అతని గురుశుశ్రూష హెచ్చు. నాశుశ్రూష ఆవిషయంలో అతనికంటే కొంచెం లొచ్చు. ఈభేదం మేము కలుసుకొన్న కొన్నియేళ్ళవఱకు- అంటే అధమం రెండేళ్లవఱకూ— వుండేది. పిమ్మట సరిసమానంగానే మామాసాహిత్యాలు తయారైనాయి. అతఁడు

తీవ్రమైన బుద్ధిశాలి. అయినా నాలాగ సర్వదా విద్యావ్యాసంగాన్ని చేస్తూ దాన్నే వక తపస్సుగా పెట్టుకొనే స్వభావం కలవాఁడు కాఁడు. నేనో? సర్వదా దాన్నే మననం చేస్తూ కాలక్షేపం చేసే స్వభావం కలవాణ్ణి. అందుచేత శుశ్రూష విషయంలో తక్కువ అయినా పరినిష్ఠితసాహిత్యంలో అతనికంటేకూడా అంతో ఇంతో నాశక్తి అతిశయించిందని పరిశీలకులు గుర్తించవలసివస్తుంది. యీఅతిశయం దేనిలోను? యేవేనా ఖండనమండనాలప్రసక్తిలో మాత్రమే. దేన్నేనా అన్వయించడం వస్తే నాకన్న అతఁడే అన్వయించే వాఁడు. యీలాంటి స్వల్పభేదం వున్నా అతనివాదం "యేయెండ కాగొడుగు"గా వుండే దవడంచేత దురుద్ధరంగా పూర్వపక్షాలు చేయడానికేకాని శాశ్వతమైన సిద్ధాంతకల్పనకు పనికివచ్చేది కాదు. యీవ్రాసిన సోదెవల్ల ముఖ్యఫలితం సంస్కృతసాహిత్యవిషయంలో అతనిది సర్వమూ అంతోఇంతో గురుశుశ్రూషా లబ్ధం; కాని తక్కిన యావత్తూ స్వయంకృషి చేత తోడివిద్యార్థులతో కయికురు బొయికురులాడడం వగయిరా వ్యాసంగంవల్ల సంపాదించుకున్న దనిన్నీ చదువరులు తెలుసుకోవలసి వుంటుంది."—కథలు-గాథలు I-పుట. 464.

7. "తిరుపతిశాస్త్రికీ నాకూ ఉన్నభేదం ఒకస్వయంకృషిలోనే. నేనెప్పుడూ 'చింత కవులందుఁ దపసుల చిత్తమందు' అని మొల్ల వ్రాసిన పద్యపాదానికి వుదాహరణంగా వుంటాను. అతఁడు నావలె కాక యెప్పుడో పని పడ్డప్పుడు రచన చేసినా చాలాకాలం స్నేహితులతో యితర కాలక్షేపంతో వెళ్ళించేవాఁడు. అందుచేతనే నాకంటే అతని ఆరోగ్యం బాగుండేది. నాఆరోగ్యం యెప్పుడూ అంతంతగానే వుండేది. ఆరోగ్యంలో ఉన్నప్పటి కంటే కూడా అనారోగ్యంలో ఉన్నప్పుడే నాకు విశేషించి రచనసాగడం అనుభూతం ...మేమిద్దఱమూ పట్టుదల కలవాళ్ళమే. ... వొప్పు తప్పంటేనే పరాక్రమిస్తాను గాని తప్పుతప్పంటే వప్పుకుంటాను. తప్పుగూడా మార్గాంతరంగా సాధిస్తాను గాని దానితత్త్వం ఇలాంటిది అని వెంటనే కాకపోయినా నిజం మఱికొన్నినాళ్ళకైనా చెప్పేస్తాను. "నాఽమూలం లఖ్యతే కించిత్', అని వ్రాసిన పెద్దిబొట్లుగారి వాక్యం నాకు ప్రాణప్రదం—క. గా. I పుట. 471.

8. 'యద్దేవా' కవిత్వం చెప్పడానికేమి, వీరరసకవిత్వానికేమి తగాయిదాలు తెచ్చేకవిత్వం చెప్పడానికేమి అతఁడు మంచిమొనగాడు. —క. గా. I 484.

9. నాకొక నియమము కలదు.

ఉ. "ఆవలఁ నెవ్వడేని కవి యల్లిన పద్యములం బఠించుచో
నీవిధమెల్ల నిశ్చయము; ఈనుతికిన్ దగు నీతఁ డంచు సం

భావన గల్గఁగా వలయు భావమటుల్ పొడగట్టకున్న నా
'దేవురుగొట్టు పద్దెముల దీవనలేమిటి కప్పురాట్ప్రభూ !"
—క. గా. I. 542.

10. వీలిచ్చినంతలో శబ్దాలకు ప్రాధాన్యం యివ్వక అర్థానికే యిస్తే 'పండితపామర సాధారణ్యేనా' ఆకవిత్వం ఆనందజనకంగా వుంటుం దని నేను తలుస్తాను.

"బ్రతికిన నాల్గునాళ్ళు ఋతవాది యుధిష్ఠిరుఁ డన్న మేటి కీ
రితి గలవాఁడనై ధరజరించి తుది న్నృపకోటి మెచ్చ దు
ర్గతి గనకుండ స్వర్గమునఁ గాపుర ముండఁ దలంచు నాకు నీ
యతు కొనరించితే కటకటా ! యదునందను పేరుమీఁదుగన్."

ఆయీపద్యమైతే నారచన కాదు (తి. శా. ది) గాని నాకు యిలాటి రచనే యిష్టం. అయితే లోకంమాత్రం యిది తి. శా. రచన కాదనిన్నీ—

"పటుజంఝానిలధోరణీరణరణత్ప్రాగ్భారనున్నాటవీ
తటశాఖాపటలాంతరుద్గతనితాంతస్ఫారఘోరాగ్నిరు
ఘుటనాధూపితభస్మసాత్కృతకురుట్కాండమ్ముతో వహ్నికిన్
ఘటియింపం దలపెట్టినారుగద సఖ్యమ్మార్యచూడామణుల్."

యిది తి. శా. గారి రచనన్నీ చెప్పుకుంటారు. "లోకము మాయను మూకు డున్నదే" (క. గా. III పుట. 454). సంస్కృతసమాసాలు వున్న కవిత్వం తి. శా. గారి దనిన్నీ తెలుఁగుజిలుగుపదాలు వేంకటశాస్త్రిగారిదనిన్నీ అనుకొనేవారు చాల అమాయకులు. అలావ్రాసేవారి వ్రాతలు ఆదరించే యెడల తి. శా. గారికి చాలా అన్యాయం జరుగుతుంది.

—కథలు-గాథలు-I పు. 430.

11. వేంకటశాస్త్రిగారికి స్వయముగా నేగ్రంథమును అనువదింపవలెనను అభిప్రాయ ముండెడిదికాదు. ఇతరుల ప్రోద్బలమువలననే మొగమాటము కొఱకు అనువాదము నొనర్చుటకు అంగీకరించెడివాఁడు. తిరుపతిశాస్త్రిగారు అనువాదనాటకములలో చాలభాగము రచించినారు.

12. "బుద్ధికి రెండు శక్తులుగలవు. అందొకటి గ్రహణశక్తి. రెండవది ధారణశక్తి. గ్రహణశక్తిలోఁ దిరుపతికి వేంకటేశ్వరుఁ డించుక లొచ్చు. కావుననే

గురువుగారు శాస్త్రాధ్యయనకాలములోఁ దిరుపతిశాస్త్రి నెక్కుడు మెచ్చుకొనినారు. ధారణాశక్తిలోనో వెంకటేశ్వరునికి తిరుపతిశాస్త్రి ఇంచుకలొచ్చు. వీరలిరువురకుఁ బ్రధానవిద్య యగు శతావధానమున కీధారణయే ముఖ్య మగుటచే వేంకటశాస్త్రి నతఁడు కొనియాడవలసివచ్చె ననునది యిందలి రహస్యము."

—దివాకరాస్తమయము. 17 పు.

13. "తిరుపతిశాస్త్రికన్న వేంకటశాస్త్రి వయస్సున నెంతపెద్దయో వేంకటశాస్త్రికన్నఁ దిరుపతిశాస్త్రి బుద్ధిలో నంత పెద్దయని లోకము విశ్వసించుఁగాక."

—ది. అస్త. పు. 17.

"లోకోభిన్నరుచిః." అన్నన్యాయము ననుసరించి, వ్యక్తిగతములైన అభిరుచులు, అధికారములు, ఆకాంక్షలు, ఆచరణములు వేరువేరుగానున్నను కావ్యనిర్వహణమునందు మాత్రము అట్టివి తమసమైక్యకవిత్వశక్తి కవరోధములు కాకుండ కవితసాగించిన జంటకవులు తిరుపతివేంకటకవులు. విభిన్నత్వము నేకత్వము వీరి కావ్యనిర్మాణప్రతిభ !

తిరుపతివేంకటకవులు తెలుఁగు దేశమునకు ప్రప్రథమమున శతావధానులుగా పరిచయమైరి. శతలేఖిన్యవధానప్రక్రియ 'సంస్కృతాంధ్రములందు వేర్వేరుగా చేఁబట్టి నిర్వహించినవారు ప్రాచీన కవులలో లేకపోలేదు. కాని అట్టివారు నూటికి కోటికి ఒక్కరు. తెలుఁగులో చరికొండ ధర్మన, రామరాజభూషణుఁడు, మాడభూషి వేంకటాచార్యులు మొ॥ వారిటువంటివారే. కాని వారి శతావధాన ప్రక్రియ దేశవ్యాప్తము కాలేదు. ప్రజలలో సాహిత్యచైతన్యము కల్గింపలేదు. కాగా - సంస్కృతాంధ్రములందు నల్లేరుపై బండినడకవలె నాశుకవిత్వమును ధారావాహిగానడిపి' "రెండుబాసలకు మేమె కవీంద్రులమంచు" శతావధానములే కాక అష్టావధాన సహస్రావధానములుసైతము సల్పి మేటికవు లనిపించుకొన్నవారు తి. వేం. కవులు. పూర్వకవులలో నొక్కొక్క రొక్కొక్క భాషలో నొక్కొక్క అవధానప్రక్రియను ప్రదర్శించియుండ, వీరు జంటకవులుగా అవధానప్రక్రియలన్నియుఁ బ్రదర్శించి చూపినారు. ఇట్టి విశిష్టావధానప్రజ్ఞకు వీరే ఆద్యులు, అనవద్యులు ! ఉభయభాషా కవిత్వ సవ్యసాచులు ! నానారాజ కవిపండితప్రజాపరిషత్తులందు అవధానకవితా కళాసౌందర్యావిష్కార మొనర్చి ఆంధ్రావళికి కవిత్వభిక్ష పెట్టిన అమృతమూర్తులు ! ఆంధ్రసాహిత్య మొకసారి "శ్రీనాథుండు ప్రోవన్" సొంపువాటిల్లినది. మఱల తిరుపతివేంకటేశ్వరులు "సాఁకన్" ఇంపువాటిల్లినది.

శృంగారరసకావ్యనిర్మాతలుగా తి. వేం. కవులకు తెలుఁగునాఁట నఖండ కీర్తి వచ్చినది. పరభాషాసాహిత్యాచార ప్రభావమువలన జాతిలో దేశీయభాషా సాహిత్యాభిరుచి మందగించి, తత్పఠనపాఠనాదు లస్తినాస్తివిచికిత్సలోఁ బడిన గడ్డు దినములలోఁ 'ప్రజామనఃప్రవృత్తిని అవధానప్రక్రియచే నాకర్షించి, సర్వజనహృద యాహ్లాదియు, రసరాజము నగు శృంగారరస మాత్మగాఁగల కావ్యరచనాప్రక్రియతో మురిపించి, సాహిత్యోపాసనాభ్యాసమును జాతిలోఁ బునరుజ్జీవింపఁజేసినారు. వీరి రసికానందము, శ్రవణానందము, పాణిగృహీత లక్షణాపరిణయము, శుకరంభా సంవాదము జాతిలో సాహిత్యచైతన్యము కల్గించినట్టివే. "శృంగారీ చేత్ కవిః కావ్యే జాతంరసమయం జగత్" అన్నట్లు వీరు రసమయమైన కావ్యజగత్తునే కాక, రసావిష్టమైన సహృదయ జగత్తును కూడ సృష్టింపఁ గల్గిరి.

ఆంధ్రావళికి శ్రవణానందమునే గాక నయనానందము గల్గించు రూపక ప్రక్రియను నిర్వహించి ప్రజాహృదయానంద రససింధువులై ప్రసిద్ధికెక్కినారు జంటకవులు. తెలుఁగువారి అభిమాన కావ్యమైన మహాభారతములోని కథను నాటకములుగాఁ దీర్చిదిద్దిన గౌరవము తిరుపతివేంకటకవులకే తొలిసారి దక్కినది. వీరి పాండవోద్యోగవిజయములు తెలుఁగునాఁట వీరరస విజయయాత్రలు సాగించి నవి. వీరిప్రహసనాదులు ప్రజలలోఁ పేరుకొనిన మూఢాచారములను, అర్థములేని పట్టు దలలను, సానుభూతిలేని విమర్శలను, వింతవింత వితండవాదములను. వెక్కిరించి వెలివైచినవి. కందుకూరి వీరేశలింగముపంతులుగారి సాంఘిక సంస్కరణోద్యమము, గిడుగువారి భాషా సంస్కరణోద్యమము పూర్వరంగము సిద్ధము చేయగా తిరుపతి వేంకటకవుల కవిత్వ సంస్కరణోద్యమము రసవంతముగా తెలుఁగునాట నిర్వ హింపఁబడినది. ముగ్గురికిని ప్రజాశక్తులే మూలాధారములు. సమకాలీన సాంఘికా వసరములను గుర్తించి ప్రాతను సంస్కరించి క్రొత్తనుప్రదర్శించి భావిపురోభివృద్ధికి దోహదమైన నవ్యాలోకమును జాతి కందించుటయే వీరి యుద్యమముల పరమ తాత్ప ర్యము ! అందు తి. వేం. కవుల ఉద్యమలక్ష్యము సాహిత్యనవ్యాలోకము !

తి. వేం. కవులు కవిత్వము నొక ఆరాధనావిశేషముగను, పారమార్థిక పురుషార్థ సాధకముగను భావించిన మనీషులు. అర్షసంప్రదాయము వీరి యాదర్శ సాహిత్యమున కాయుస్సూత్రమైనను నవ్యత నందగించుకొనియే ముముక్షువులను మురిపించినది. జగదంబ వీరి యుపాస్యదైవము. ఆమెచల్లని చూపులలో నెల్లలు వైచికొన్నది వీరి పురాణస్తోత్రశతక వాఙ్మయసామ్రాజ్యము ! దేవీభాగవతమాము

ష్మిక ఫలప్రదాయి యగు నలౌకిక కావ్యకల్పవృక్షము. కామేశ్వరీశతకాదులు, కామేశ్వరీస్తోత్రాదులు భక్తిబోధసుధానిధులే కాక, అనామయప్రసాద మహిమా గరిమాన్వితములు. శివకేశవసూర్యాదులను వారు స్తుతించినను వారి దద్వైతభక్తి. దైవికమైనశక్తి వీరి యుక్తి నాశ్రయించి భక్తసంతతికి సాహిత్యోపాసనానురక్తిని గల్గించి వీరిని గురుపీఠమునఁ గూర్చుండబెట్టినది !

అధిక్షేపసాహిత్యము వీరియభిమానధననిక్షేపము. సత్యధర్మ సూత్రాచరణవిధికిఁ దొడిగిన కవచము ! పరిశుద్ధ మైన ప్రాచీనగురుశిష్యధర్మము, మహిమాన్వితమైన సత్యవాక్యప్రభావము, సమసామర్థ్యము గల పండితప్రకాండులతోడనే శాస్త్రచర్చలు సల్పెడి వీరోచితగుణసంపత్తి, ఉన్మార్గవర్తనులైన ఆప్తులను ముఖాముఖి మందలించియు వ్యంగ్యముగా నధిక్షేపించియు సన్మార్గవర్తనులుగా నొనర్చెడి పవిత్రోద్దేశము వీరి యధిక్షేపసాహిత్యమునకుఁ బరమప్రయోజనములు. దీనికి ఫలము విశ్వశ్రేయస్సే !

తిరుపతివేంకటకవుల కఖండకీర్తి వచ్చుటకు వారి శతావధానప్రక్రియ యొక్కటియే కాదు హేతువైనది. దానికితోడు వారు వైవిధ్యముతోఁ గూడుకొనిన సాహిత్యమును సృజించి సమకాలీన కావ్యజగత్తులో లేని నవ్యత నావిష్కరింపవలెననెడి వారివిశిష్టప్రయత్నము మఱియొక ముఖ్యకారణము. ఈజంటకవులు కావ్యప్రక్రియలలో నొకసారిపట్టినప్రక్రియ మఱలఁ బట్టలేదు; పట్టినదానిని బంగారము చేయక విడువలేదు. వారికావ్యజాలములో నొక్కొక్కటి ఒక్కొక్క విశిష్టసృష్టి ! మచ్చునకు కొన్ని—

1. శ్రవణానందము : శృంగారరసప్రధానమైన సాంఘికకావ్యము.

2. పాణిగృహీత : ప్రహసనతుల్య మైన శృంగారరసాభాసకావ్యము; మనస్తత్వశాస్త్ర రహస్యప్రతిపాదక పద్యకావ్యము.

3. లక్షణాపరిణయము : ఆశువుగాఁజెప్పఁబడిన వర్ణనాత్మకకావ్యము.

4. ఏలామాహాత్మ్యము : పుణ్యతీర్థ మాహాత్మ్యము.

5. సుశీల : యుత్రాకావ్యము, సాంఘికవిమర్శయు, పాత్రచిత్రణము ప్రధానమైన పద్యకావ్యము.

6. పూర్వహరిశ్చంద్ర చరిత్రము : పురాణపాత్రల పూర్వకథలను దెల్పెడి కథాకావ్యము.

7. జాతకచర్య : ప్రథమాంధ్ర పద్యాత్మక స్వీయచరిత్ర.

8. పురాణకథలు :

9. వ్రతకథలు : భక్తిరస కథాకావ్యము.

10. స్తోత్రవాఙ్మయము: భక్తిశతక కవిత్వము(Devotional Poetry).

11. పాండవోద్యోగవిజయములు : వీరరసరూపకములు.

12. పాండవ జననాదులు : వస్తురూపకములు.

13. పండితరాజము : ప్రతీకార్థ ప్రధానమైన రూపకము, కవి జీవితగాథ.

14. అనర్ఘనారదము : తత్త్వార్థ ప్రధానమైన రూపకము.

15. సుకన్య : సాంఘిక సంస్కరణోద్దిష్టమైన పౌరాణికరూపకము.

16. ప్రభావతీప్రద్యుమ్నము : ఒక తెలుఁగుప్రబంధమును నాటకీకరించుట.

17. బొబ్బిలి పట్టాభిషేకము : సమకాలీన రాజకీయసంఘటన వర్ణనము.

18. బిడాలోపాఖ్యానాదులు : అన్యాపదేశ కావ్యము (Satirical Poem)

19. గుంటూరు సీమాదులు : వివాదసాహిత్యము (ప్రమాణసహితము.)

20. వచన రచనలలో వ్యాసములు :

(1) సాహిత్యచర్చలకు సంబంధించిన వ్యాసములు.
(2) స్వీయచరిత్రకు ,, ,,
(3) ప్రసిద్ధుల చరిత్రకు ,, ,,
(4) సాంఘిక విమర్శకు ,, ,,

21. కావ్యనాటక శతకానువాదములు : ఆంగ్ల - గీర్వాణభాషలనుండి.

కవిత్వాదులలో నింత వైవిధ్యముతోఁగూడిన నవ్యతాదర్శనముచేసి సాహిత్య సృష్టి యొనర్చినారు కావుననే వీరు నవ్యకవితాపితామహు లనుటకు అర్హులగు చున్నారు. అల్లసానిపెద్దన ప్రబంధనిర్మాణమునకు మూలకర్తయై ఆంధ్రకవితా

పితామహుఁడు కాఁగా తి. వేం. కవులు నవ్యకవిత్వశాఖావిస్తృతికి మూలకందములై నవ్యసాహిత్యపితామహు లగుచున్నారు. తిరుపతివేంకటకవుల సాహిత్యోద్యమము ప్రాచీన మూఢవిశ్వాసముల కెదురుచుక్క! సరస నవ్యకవితాదర్శములకు పొడుపు చుక్క!

ప్రాతపునాదులపై నూతనభవనము కట్టినా రీజంటకవులు. ఒక్కసంస్కృత పాండిత్యముతో నాంధ్రకవిత్వము కరతలామలక మౌనన్న సిద్ధాంతమునకు వీరు బద్ధవిరోధులుః

"తెలుఁగు తెలుఁగని యద్దాన దిగుటె కాని
సంస్కృతమ్మన కన్నఁ గష్టమ్మ హెచ్చు
ఒక్కదానఁ బరిశ్రమ మున్నఁజాలు
దాని, కిద్దానికో రెంటఁ దగులవలయు." —పాణి. పం. 53.

అని వీరి ప్రబోధము. గీర్వాణాంధ్రములఁ దఱచి నిగ్గుఁదేల్చినశబ్దశాస్త్ర పారగు లన్న మాటలివి! శుకరంభాసంవాదముతో సంస్కృతకవనమునకు స్వస్తిచెప్పి ఆంధ్రకావ్యనిర్మాణరంగమునందు దుమికిన మాతృభాషాభక్తులన్నమాట లివి! తెలుఁగునిఘంటువులు, తెలుఁగువ్యాకరణగ్రంథములు, లక్షణగ్రంథములు ఎట్లసమగ్రములై ప్రతిభావంతులగు కవుల ప్రయోగములకు ప్రామాణ్యతను సిద్ధింపఁ జేయఁజాలకపోవుచున్నవో, కల్పనాస్వతంత్రములగు కవులకావ్యప్రక్రియలకు సహృదయపూర్వకమైన లక్షణసూత్రముల నందింపఁజాలకపోవు చున్నవో నిరూపించి, ఇట్టి విషయములలో కవిత్రయప్రామాణ్యము నంగీకరించి పండితప్రకాండులతో వాదులాడి తి. వేం. కవులు భాషాసారస్వతోపాసకుల ఇనుపసంకెళ్ళను పటాపంచలొనర్చి స్వేచ్ఛను ప్రసాదించిరి. దేశస్వాతంత్ర్యముతోపాటు శాస్త్రసాహిత్య ప్రక్రియా స్వాతంత్ర్యమును జోడుకలిపి వీరుచాటించిరి.

చ. "తెలుఁగున కున్న వ్యాకరణ దీపము చిన్నది! గ్రాహ్య మంచుఁ బె
ద్దలు కొనియాడు భారతము తప్పన శక్యము కాదు; దానిలోఁ
గలిగిన లక్ష్యభేదములు కాదన కాదృతి సంగ్రహించి ని
శ్చలగతి నిందుఁ గూర్చెదరు చక్కఁగ దిర్పతివేంకటేశ్వరుల్."
—దేవీభాగ. ప్ర. 35 ప.

కవిత్రయ ప్రయోగములను పాక్షికముగా నంగీకరించి పాక్షికముగా నంగీకరింపని అప్పకవి, బాలవ్యాకరణకర్త, శబ్దార్థరత్నాకరకర్త మొ॥ వారు, వారిని ప్రమాణముగాఁ గొని వాదులాడెడి కవిపండితులకు తి. వేం. కవుల వేడిచూపునకు గురికాక తప్పినది కాదు.

క. వ్యాకరణ మొక్కత్రోవ, మ
హాకవు లొకత్రోవ. కోశ మఖిల మ్మొక త్రో
వై కనుపట్టెడి, నీ భా
షా కావ్యమ్ములను దఱచు చదివిన కొలఁదిన్.

క. కేవల సంస్కృత మర్యా
దావిదులును గేవ లాంధ్ర తత్పరులును గా
కేవార లుభయభాషా
కోవిదు లవ్వారు దీని గురువులు జగతిన్. —దేవీభా. ప్ర. 26, 27.

అని మొగమాటము లేకుండ సత్యము కుండబ్రద్దలగునట్లు చెప్పి—

గీ. కేవల గ్రామ్యపదముల నేవగించి
జనులు వాడెడి పదములు సమ్మతములు
"కలవు లే" వని పెనఁగ శక్యంబె ? భార
తాదులను లేనిపదములు నవనిఁ గలవె ? —దేవీభా. ప్ర.25 ప.

అని సిద్ధాంతీకరించిరి. హేతువాదముతో సరసమైనదని కనుపడినంతవఱకు ఏసిద్ధాంతమైనను కాదని త్రోసివేయలేదు. గిడుగువారి వ్యావహారికవాదమును బరిశీలించి పద్యకవనమునందును, పాఠశాలలలో పఠన పాఠన సాహిత్యమునందును, గ్రాంథికభాష యుండవచ్చు ననియు, వచనరచనకుఁ గచ్ఛత్సాహిత్యమునకు వ్యావహారికభాష యుపాదేయ మనియు కవులంగీకరించిరి. కావ్యములందు రసవంతముగా నుండునట్లు వ్యావహారికపదములు ప్రయోగించినను దోషము లేదని వీరిమతము. అన్యదేశ్యాలను తమరచనలలో విచ్చలవిడిగా వాడిన విశాలహృదయము వీరిది !

ఉ. కాలముఁబట్టి దేశమును గాంచి ప్రభుత్వము నెంచి దేశభా
షాలలితాంగి మాఱుటది సత్కవిసమ్మత మౌట నన్యదే
శ్యాలును నాంధ్రభాషఁగలవౌటను నౌచితిఁబట్టి మేము క
బ్బాలను వాడుచుంటి మని పండితు లేగతి నొప్పకుందురో.

—పాణి. ప్ర. 19.

అని తమ మతమును సవినయముగను, సహేతుకముగను ప్రపంచించియున్నారు. ఇట్లు స్వాతంత్ర్యము ప్రకటించియు దేశీయభాషామర్యాదకు విరోధములైన ప్రయోగములనుగాని, ఎరువుసొమ్ములవంటి భావములను గాని, తెలుఁగువారి ప్రవృత్తియం దమరని కవిత్వప్రక్రియలను గాని వీరు సమర్థింపలేదు. అనఁగా తాత్కాలికావేశముతో ప్రాతను విరుగఁద్రొక్కి ముందు కనాలోచితముగా దూసుకొని పోయినవారు కారనియు, శాస్త్రసమ్మతములును, ఔచితీసహితములును, విశ్వ శ్రేయోరూపములును, సమకాలీన సాంఘికావసరానుగుణములునైన నవ్యమార్గము లనే వీ రనుసరించి రనియు ఒకసాహిత్యపరిణామ విప్లవమునకు వీరు మూలకారకు లై రనియు ఈచర్చవలని తాత్పర్యము.

తిరుపతివేంకటేశ్వరుల నవ్యాలోకము నలవరించుకొన్న తెలుఁగుకవికి భయము తొలఁగినది, కలము సాగినది. ఉజ్జ్వలమైన భవిష్యత్తు గోచరించినది. ఇఁక కొన్నిశతాబ్దుల వఱకు కవిత్వము చావదను ధైర్యము జనించినది. ఆజంట కవులదృష్టి ప్రాచీనకవితపై నొక దివ్యాలోకము, నవీనకవితపై నొక నవ్యా లోకము !

తిరుపతివేంకటకవులు సమకాలీన కవిలోకములో మకుటములేని మహా రాజులవలె భాసించిరి. ప్రత్యక్షముగనో పరోక్షముగనో వీరిప్రభావము పడని కవి ఇరువదవశతాబ్ది పూర్వార్ధమునందు లేఁడన్నచో సత్యదూరము కాజాలదు !

ఇంత ప్రజాశక్తిని వీరికి సంపాదించిపెట్టిన అంశములలో వారి ప్రసన్న కవితాశైలి ప్రధానమైనది. జాతిలో చైతన్యము కల్పించుట వీరి కవితాలక్ష్యము. అందులకై ప్రసన్నగంభీరమైన శైలిని వీ రెన్నుకొనినారు. వేంకటశాస్త్రిగారొకచో నిట్లనిరి. "రచన అనేది సుబోధంగా వుండా లనునది ముందు జనించిన పిమ్మట నాజనన మని నన్ను మన్నించువారు సంభావింతురుగాక ! ఏమంటే కవిత్వ మనేది తనమనస్సులో వుండే అభిప్రాయాన్ని యితరులకు తెలుపుడు చేయడానికి పుట్టింది కాబట్టిన్నీ, ఆయితరులలో భాషాపాండిత్యం ఎక్కువ ఉన్నవాళ్ళేకాక తక్కుగా ఉన్నవారూ వుంటారు కనుకున్నూ యీఅభిప్రాయం పండితులలో చాలామందికి రుచింపదు. (కథలు - గాథలు I-275 పు,) పండితులకు రుచింపనంతమాత్రమున స్వీయసిద్ధాంతమును మార్చుకొనలేదు తి. వేం. కవులు. మఱొకవిధముగా అన్వ యము చెప్పినచో - వారు పండితుల కొఱకేకాదు కవిత్వమువ్రాసినది. "ఆంధ్రావళి

మోదముంబొరయునట్లుగ" "మహాకవిత్వదీక్షావిధి నందినవారు." తెలుఁగు జాతీయత కెత్తిన నవ్యపతాక వీరికవితాశైలీ సిద్ధాంతము !

"రమణీయార్థప్రతిపాదికశబ్దః కావ్య"మ్మనునది వీరి కవిత్వశైలికి మూల సూత్రము! యాంత్రికముగా రోజురోజునకు ప్రపంచజీవితము వేగవంతమగు చున్నది. సామాజికులలోఁ దీరికగాఁ గూర్చుండి బృహత్సంహితలను మననముచేసి కొనెడి వ్యవధానము క్రమముగా సన్నగిల్లుచున్నది. ఆశుగవేగము ననుగమించు చున్న జాతిచైతనమును విస్మరింపకుండ ప్రబోధింప నిలిచిన వైతాళికు లీ జంట కవులు, ఒక్కసారి గొంతెత్తి కవన మాలపించుచో శ్రోతహృదయ మట్టె యాకృష్టమై కవితాస్వాదనోన్ముఖము కావలెను! అప్పై నాలోచించినంత మేర అమృతము వాని భావుకత కందీయవలెను. దోబూచులాడు వ్యంగ్యవిలాసము, అరసిచూచిన గాని అంతుదొరకని అర్థగాంభీర్యము వీరికవితకు ప్రధానలక్షణములు. దీనినే ప్రసన్నగంభీరగుణములని జెప్పుకొనవచ్చును. లాక్షణికులు చెప్పు ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, అర్థవ్యక్తి, ఔదార్యము, కాంతి, ఓజస్సు అనుగుణములు రసోచితములుగా కావ్యములందు బ్రయుక్తమైనను ప్రసాదగుణమే వీరి శైలికి నైజము.

"కవుల మున్నటి రూల్సుకు కట్టుపడము
ఘనులు పండితరాయాది కవులు చూపు
త్రోవలం బట్టి పోదుము దేవునైన
లక్ష్యపెట్టము.... ...."

"తనకు నాల్గు నిఘంటు పదములు వచ్చు
ననుచుఁ బదిమందికినిఁ దెలియంగ మాఱు
మూలపదముల గుప్పిన ముచ్చటగునె ?
ప్రతిపదంబున రస ముట్టిపడినఁ గాక" —శ్రీ. ప్ర. 12.

అన్నది వీరి కవితాశైలికిసంబంధించిన ప్రతిజ్ఞ. భరతమహర్షి కవిత్వనిర్వచనము వీరి రూపకకవితాశైలికి చక్కని లక్షణసూత్ర మగు ననుటలో విప్రతిపత్తిలేదు.

"మృదులలిత పదాఢ్యం, గూఢ శబ్దార్థహీనమ్
జనపద సుఖబోధ్యం, యుక్తిమ న్నృత్య యోగ్యమ్

బహుకృతరసమార్గం సంధిసంధానయుక్తమ్
సభవతి శుభకావ్యం నాటకప్రేక్షకాణామ్."

అని భరతుని నిర్వచనము. దీని నొజ్జబంతిగా గొని రచించిన కవుల కవిత్వరచనము నాటకమున నుండదగినది పద్యమా ? గద్యమా ? అని వివాదములు రేగిన సమకాలీన పరిస్థితులలో గద్యముకన్న శ్రవణసుభగము, సులభసుగమము నైన పద్యము నాటకమున రసవత్తరముగా నుపయోగింపవచ్చునని నిరూపించి పద్యగద్యాత్మకమైన నాటకరచనాశిల్పమునకు అమృతభిక్ష పెట్టినది. వీరిభారతనాటకములు పెక్కురు నటకుల కెనలేని కీర్తిప్రపత్తులను గల్పించినవి. పశులకాపరుల నుండి పండితప్రకాండుల వఱకు ముఖస్థములై వీరికావ్యములలోని పద్యములు వారికి ప్రజాహృదయములలోఁగల గౌరవస్థానమును వేనోళ్ళఁ జాటుచున్నవి.

తిరుపతివేంకటకవుల కవిత్వము వినినతోడనే కల్గునది శ్రవణానందము ! వీరి కవిత్వ మాలోచించిన కొలఁది కల్గునది రసప్రవణానందము ! !

తిరుపతివేంకటకవులు మహాకవులు, పండితులు, శాస్త్రదృష్టులు, విమర్శకులు, రసజ్ఞులు, తాత్త్వికులు, దేవీభక్తులు. లోకజ్ఞులు, సంస్కర్తలు, విప్లవజ్యోతులు !!

వీరికి కింకవీంద్రఘటాపంచానన, విద్వత్కవి, బాలకళానిధి. బాలసరస్వతి, శతావధాని, కళాప్రపూర్ణ, మహాకవి చక్రవర్తి ! ఇత్యాది బిరుదములు సార్థకములై యొప్పారుచున్నవి. ఇందులో 'కింకవీంద్రఘటాపంచానన' బిరుదము స్వదత్తాంకము గాని తదితరము లితరు లిచ్చినవే ! తిరుపతిశాస్త్రిగారు గతించిన తరువాత వేంకటశాస్త్రిగారికి మహాకవిచక్రవర్తిబిరుదమును, కళాప్రపూర్ణ అనెడి ఆంధ్రవిశ్వవిద్యాలయ గౌరవబిరుదమును లభించినవి. మద్రాసురాష్ట్ర ఆస్థానకవిపీఠము వేంకటకవిగారు మొదటిసారి అధిష్ఠించినారు. ఇట్లొక్కరికి ప్రత్యేకగౌరవములు జరిగినను— అది "తిరుపతివేంకట కవులకు" జరిగినట్లే వేంకటశాస్త్రిగారు భావించిరి; అట్లే తెలుఁగుదేశము కూడ భావించినది !

తిరుపతివేంకటకవుల కవిత ప్రాచీనకవితకు భరతవాక్య మనియు, నవీన కవితకు నాందీవాక్య మనియు ప్రసిద్ధిఁ గాంచినది. అనఁగా ప్రాచీనకవిత వీరితో ముగిసిన దనియు, నవ్యకవిత వీరితో నారంభమైనదనియు, స్థూలమైన అర్థము. పై ప్రసిద్ధవాక్యములో చమత్కారమైన అర్థప్రతీతి గలదు. వీరికవిత ఒకవైపు భరత

వాక్యముగను, ఒకవైపు నాందీవాక్యముగను ఉన్నదట. లోకమున సామాన్యముగా భరతవాక్యముగా నున్న వాక్యము నాందీవాక్యముగా నుండఁజాలదు. అచ్చట వాచ్యార్థము బాధిత మగుచున్నది. ఇఁక లక్ష్యవ్యంగ్యముల నాశ్రయించి, గుణప్రాధాన్య వివక్షతో నన్వయము కుదుర్పవలెను. భరతవాక్యము విశ్వశ్రేయోరూపమై పూర్వకార్యార్థసంపుటి కొక సమన్వయసిద్ధిని ధ్వనింపఁజేయుచుండును. నాందీవాక్యము అశీర్నమస్క్రియారూపమై భావికావ్యార్థములసంపుటిని తనయందు వ్యంగ్యముగా భాసింపఁజేయుచుండును. ఇట్టిదృష్టితో నన్వయించుచో నీజంటకవుల కవిత్వమునందు ప్రాచీనప్రసిద్ధ కవిత్వ మర్యాదలన్నియు నొకవిశిష్టసమన్వయము పొంది యిందొదిగి నిల్చినవనియు, భావికాల కవితామర్యాదలు ఇందు బీజప్రాయముగా నాటఁబడియుండి మంగళారంభమును సూచించుచున్న వనియు తాత్పర్యము కాఁగలదు. మఱియు ప్రాచీనకవిత్వమునందు గోచరించు ధారాళమైన ప్రవాహశైలి, సౌకుమార్యముతోకూడిన ప్రసన్నత, అర్థపుష్టి అనెడి లక్షణములు తిరుపతివేంకట కవులయందు సమకాలీనులు సాధింపలేని విశిష్టస్వాతంత్ర్యభావములతో ప్రజాశక్తిని పుంజించుకొని నీటిబుగ్గలవలె పునరావిర్భవించి సారస్వతరంగము నావరించినవి.

"వానలోఁ దడియనివారు మద్గురువధానమ్మృదూక్తిమరందధారలోఁ గడుగని వారు మా కెచట కానఁగరా రిలఁ దెల్గునాఁడునన్" అని ప్రశంసించిన శ్రీవిశ్వనాథ వారి వాక్కులో సమకాలీనకవులపైఁబడిన కవుల కవితాప్రభావము వర్ణితమైనది. అవధానకళ, మృదూక్తి, మరందమాధుర్యము, అవిచ్ఛిన్నధార, కల్మషక్షాళనము అనునవియే వీరికవితాలక్షణములఁట! వానలోఁ దడియనివాఁడు లోకమున గానఁబడని యట్లే ఈకవుల కవిత్వధారలో మునుఁగని వాఁడే తెలుఁగునాఁట లేఁడఁట! ప్రజాహృదయములందు కవులకవితకు కట్టఁబడిన పట్టమును నుట్టంకించు వాక్యములివి!

"జగద్ధితముగను," "ఆంధ్రావళిమోదముం బొరయునట్లుగను," "ఆలకించిన సొగసుకోడ్కలు వచ్చునట్లును," "విరిపొట్లము విప్పినగతి" "వ్యంగ్యరస భావములు గుబాళించునట్లును," "రసాభ్యుదయోల్లాసి"యగు సాహిత్యమును సృజింప "మహాకవిత్వదీక్షావిధి"నొందినవారు తిరుపతివేంకట కవులు. కవిత్రయ కవిత్వము వీరికొజ్జబంతి. వారితోపాటు మఱికొందరి ప్రభావము వీరిపైఁబడినది. నిరంకుశులైన ఈజంటకవు లాప్రభావమును తమస్వాతంత్ర్యశక్తితో జీర్ణించుకొని వినూత్నవ్యక్తిత్వమును ప్రకటించిరి. ఆవ్యక్తిత్వమే సమకాలీనులకు ఒకచైతన్య శక్తిగా గోచరించినది. నాఁటికిని నేఁటికిని దానిమహత్తుకు తరుగులేదు!

"కవిబ్రహ్మ"వలె తిరుపతివేంకటకవులు కావ్యకర్తలే కాక కావ్యభర్తలునై కవిలోకభక్తి నీరాజనములకుఁ బాత్రులైరి. పింగళి కాటూరుల సౌందరనందము, సర్వా శేషయ్యగారి సుదర్శనోపాఖ్యానమనెడి శశికళాస్వయంవరము మొదలగునవి వీరిని వరించిన కావ్యకన్యలు.

తిరుపతివేంకటకవులను చూచి దేశమున కవులు శతసంఖ్యలలో అవధాన కళను చేపట్టి అవధాని బిరుదాంకితులైవారి ప్రతిబింబసౌభాగ్యమును సాధించిరి. అవధానమును వారికన్న వేగముగ చేసినవారు, అధిక చమత్కారములు ప్రదర్శించిన వారు వీరితర్వాత కనవత్తురు కాని వీరివలెశాస్త్ర పాండిత్య ప్రాభవముతో వాదు లలో జయపత్రములు పొంది, సభారంజకముగా గీర్వాణాంధ్రములలో నవధానము నడపినవా రరుదు; వీరివలె తోడ్తోడ బహుళసాహిత్యప్రక్రియలు నిర్వహించిన వారును కానరారు.

వీరి భారతనాటకములు పెక్కురు కవులకు సంపూర్ణ భారతనాటకములు రచించుటకు త్తేజము కల్పించినవి. వీరి బుద్ధచరిత్రము బుద్ధదేవుని జీవితచరిత్రము నితివృత్తముగాఁ గైకొన్న పెక్కుకావ్యములకు మార్గదర్శకమైనది. వీరి జాతకచర్య పద్యాత్మక స్వీయచరిత్రలకు త్రోవచూపినది. వీరి జీవితరసఘట్టములు దర్శించి భావించిన సమకాలీనులకు కవిత్వముపై రక్తి కల్గినది; నవ్యతపై భక్తి కుదిరినది; కలముపట్టు శక్తి కలిగినది : తెలుఁగు కవితకు బంధవిముక్తి సిద్ధించినది.

తి. వేం. కవుల కవిత్వ వ్యక్తిత్వప్రభావము భావకవిత్వముపైఁ బ్రస్ఫుట ముగా గోచరించుచున్నది. ఆకాశపురాణాదులరూపమున నొక సంగ్రహకథావస్తువును లఘుకావ్యముగా రచించువైఖరి అష్టావధానప్రక్రియయందును, ఒకనిర్దిష్టమైన అంశముపై గిలిగింతలువెట్టు చమత్కారభావములతో సంగ్రహము, రసవంతము నైన కావ్యఖండికను సృజించుతీరు శతావధానప్రక్రియలందును పొడకట్టి కవుల కొక క్రొత్తచూపును ప్రసాదించెను. వానిలో నిబద్ధమైన కవితాశైలి సహజభావావేము యొక్క సరళావిష్కారమున కుపయుక్తమగు ధారామాధుర్యస్వరూపము నందించినది తి. వేం. కవులు తమరచనాప్రక్రియ లన్నిఁటియందును ప్రస్ఫుటముగాఁ బ్రపంచించిన ఆత్మాశ్రయవస్తుశిల్పము భావికవులకు స్వీయభావానుభూతిని అత్మనాయకమైన కవితగా జెప్పుటకు ప్రోత్సహించినది. దీనికిఁదోడు ఆంగ్లసాహిత్య పరిచయముచేఁ గల్గిన నూతనభావోత్తేజమును తమకవితారీతులలోఁ బ్రవేశపెట్టి ప్రయోగాత్మకముగా

కావ్యరచన మొనరించెడి నిర్భయస్వాతంత్ర్యము వీరి సహజప్రవృత్తినుండి కవులు గ్రహించిరి. ఇట్టి స్వాతంత్ర్యప్రవృత్తికి వీరేశలింగము పంతులుగారు సూత్రదారులుకాగా, తిరుపతివేంకటకవులు స్థాపకులై సామాజికులలో నున్ముఖీకరణము నిర్వహించిరి.

తెలుఁగులో భావకవిత్వమునఁ బైలక్షణములన్నియు ప్రతిబింబించినవి. లఘుకావ్యములు, ఖండకావ్యములు, ఆత్మాశ్రయకవిత్వము, వాస్తవికవాదము-మొ. వాని బాహ్యకృతులుకొన్ని పాశ్చాత్యప్రభావముద్రితములై యున్నను అంతరాకృతులన్నియు తి. వేం. కవుల విశిష్ట కవిత్వప్రసాదవ్యక్తిత్వము నందగించుకొని అవతరించినవే. ఇట్టి కవితాప్రసాదమును భక్తిమై సేవించిన భావకవులు తిరుపతివేంకటేశ్వరులకు కృతజ్ఞతాంజలులఁబట్టి వేనోళ్ళఁ గీర్తించియున్నారు.

ద్రుతస్వరూపము

ఆంధ్రభాషలో ద్రుత(ప్రకృతిక)విచారమునకుఁ బ్రత్యేకస్థాన మున్నది. తత్స్వరూపము సమగ్రముగాఁ దెలిసినఁ గాని తదీయములగు కొన్నిసమస్యలు పరిష్కరింపఁబడినట్లు కావు.

"ద్రుతాంతము లయిన పదములు ద్రుతప్రకృతికము" లని బాలవ్యాకరణము. ద్రుతప్రకృతికములనుగూర్చి 'ద్రుతప్రకృతయో, యే స్యు ర్న్యానుజీవిత ద్రుతా నిత్య' మ్మని ఆంధ్రశబ్దచింతామణి. 'యే= ఏవి, నిత్యం= నిత్యమును, అనుజీవిత= అనువర్తించియున్న, ద్రుతాః= నకారము గలవి, స్యుః= అగునో, అవి ద్రుతప్రకృతు లనఁబడునను. 'సూత్రప్రాప్తులచేత లోపములు వచ్చిన వచ్చునే కాని యవి పొల్లునకారముచేఁ గూడియుండునవే యనుట' యని బాలసరస్వతీయము. 'సదానాంతౌ' అని అథర్వణకారికావళి. 'నాంతంబైన పదంబు' లని ఆంధ్రభాషా భూషణము. 'ద్రుతప్రకృతు లనఁబరగున్, లలిఁ బొల్లునకారముపైఁ, గలిగించుట' నని సర్వలక్షణసారసంగ్రహము. పైవ్యాకరణగ్రంథములందలి నిర్వచనములవలన పొల్లునకారము నంతమునందుఁ గలపదములు ద్రుతప్రకృతికము లని యేర్పడుచున్నది.

"నకారంబు ద్రుతం' బని బాలవ్యాకరణము ద్రుతస్వరూపమును నిర్దేశించినది. అందుకు 'ద్రుతాఖ్యో నః' అనుచింతామణిసూత్రము మూల మనఁదగియున్నది. 'కారప్రత్యయము చేర్చిన హల్లు పొల్లుమాత్రమే యగును' అను ఆంధ్రభాషానుశాసనసూత్రముచే 'నకారంబు ద్రుతం' బను సూత్రమునందలి నకారము పొల్లునకారమే యగుచున్నది. 'నాంతాదియోఽపి' (ఆం. శ. చిం.), 'నాంతౌ' (అ. కా.), 'నాతంబైన' (ఆం. భా. భూ.), 'నుడువులపై నకారంపుఁబొల్లుల్ నిలుచుఁ బోవు' (ఆంధ్రకౌముది) 'పొల్లునకారము ద్రుతసంజ్ఞ కల దని పైసూత్రముల కర్థము (చింతామణివిషయపరిశోధనము)- మొదలగు నిరుక్తులనుబట్టి సాధారణదృష్టితో నకారపుఁబొల్లు ద్రుతముగాఁ బెక్కురువైయాకరణులచే నంగీకరింపఁబడియున్నది.

చిన్నయసూరి పైరీతిగా ద్రుతస్వరూపమును దెల్పి, యందుల కుదాహరణములుగా 'నన్నున్- నాచేతన్- నాతోడన్- నాకొఱకున్- నావలనన్- నాకంటెన్- నాకున్- మాలోపలన్-మాయందున్- వత్తున్- వచ్చెదన్- వచ్చెన్- వచ్చున్- వచ్చెదున్- ప్రసన్నులయ్యెడున్- కావుతన్- కొట్టుచున్- కొట్టెన్- కొట్టఁగన్- కొట్టుడున్- కొట్టినన్- వలెన్- ఎంతయున్- పోలెన్- అయ్యెన్- ఇత్యాదు లూహ్యంబు' లని నిబంధించియున్నాఁడు. ఆసందర్భముననే 'నేను- తాను పదంబులును ద్రుతప్రకృతికంబు' లని చెప్పి పైయుదాహరణపట్టికలో 'నేన్- తాన్' అని చేర్చుటకు మఱచినవాఁ డయ్యెను. పైయుదాహరణములనుబట్టి చిన్నయసూరిభావమున ద్రుత మనఁగా నకారపుఁబొల్లే యని స్పష్టమగుచున్నది.

కాని పై ద్రుతప్రకృతికముల నాయాపరిచ్ఛేదములలో సూత్రములచే నిరూపించు సందర్భములలో- 'నన్నున్ + అడిగెన్); నాకొఱకున్ + ఇచ్చె(న్); వచ్చుచున్ + ఉండెను; చూచుచున్ + ఏగెను; అమ్మ + ఇచ్చెను; వచ్చున్ + ఇప్పుడు; పూచెను + కలువలు; తోఁచెను + చుక్కలు; మొగిడెను + పద్మము; వచ్చెను + గోవులు; కన్ + దోయి; వాఁడు వచ్చెన్- వాఁడువచ్చె- వాఁడువచ్చెను; తాఁజదివె తానుజదివె'-అని ద్రుతమును హల్మాత్రనకారముగనే కాక, ఉత్వవిశిష్టమగు నకారముగాఁ గూడ చిన్నయసూరి నిబంధించియున్నాఁడు. కావుననే 'చింతామణి పక్షమున ద్రుతము పొల్లునకారస్వరూపము గలది. సూరిపక్షమున 'ను'స్వరూపము గలది' యని ఆంధ్రవ్యాకరణసంహితాసర్వస్వకారులు వక్కాణించుట జరిగియుండును.

బాలవ్యాకరణమునకు వ్యాఖ్యానమగు 'గుప్తార్థప్రకాశిక'లో 'కేవలనకారంబు ద్రుతనామంబున సామాన్యంబుగా వాడఁబడుచున్నను, ప్రత్యయంబును....ఆగమంబును అన్వయంబునునైన యుకారాంతనకారంబే ద్రుతసంజ్ఞ గలది యని చెప్పుట యుక్త' మని చెప్పఁబడినది. అట్లే బాలవ్యాకరణసారస్యసర్వస్వపేటికలో 'నాకారంబు ద్రుతంబు' అనుసూత్ర ముత్వవిశిష్టమును బొల్లురూపమునునైన నకారములను రెండిటిని బోధించు నని నిబంధింపఁబడి, తత్స్వరూపము నిర్దేశింపఁబడియున్నది. త్రిలింగలక్షణశేష (ప్రౌఢవ్యాకరణ) కర్తయు 'నకారంబసాధారణంబు ద్రుతంబు- ప్రత్యయాగమాన్వయాత్మక మయి యుత్వవిశిష్ట మయిన నకారంబు ద్రుతసంజ్ఞకంబని యర్థము' అని కంఠోక్తిగాఁ జెప్పివైచెను. అట్లేఆంధ్రభాషానుశాసనకర్తయు 'ఇకారఉకారముతోఁ గూడినదియు' పొల్లుగా నుండునదియు నయిన నకారమునకు

ద్రుత మని పే' రనియు, 'సంధి' గ్రంథకర్తయు 'ఆంధ్రమునఁ గూడ దుది నుకారము లేక హల్మాత్రనకారముతోఁ గూడిన రూపములే ప్రాచుర్యమును వహించి యున్న' వనియు, ఆంధ్రభాషావికాసకర్తయు 'న్, ను, ని అనునవి యన్ని యును ద్రుతస్వరూపములే' యనియు, ద్రుతమును ద్విస్వభావవిశిష్టముగా సంభా వించియున్నారు. 'ఇకారంబుమీఁది కు-ను-వు క్రియావిభక్తుల యుత్వంబున కిత్వం బగు (బా. వ్యా, తత్స. 26. సూ.) నను సూత్రముచే ద్రుత-ను—వర్ణము ని-వర్ణ మయి. దానికిఁ దత్తృతీయరూప మేర్పడుటయు సంభవించును. ఈవిధ ముగా ద్రుతస్వరూపనిరూపణమునుగూర్చి మతభేదము లున్నట్లు గోచరింపఁగలదు !

కాని, సాధారణదృష్టితోఁ జూచినయెడల 'ద్రుతాఖ్యో నః' అన్న చింతామణి కిని, 'నకారంబు ద్రుతం' బనిన బాలవ్యాకరణమునకును మతభేద ముండుట కవ కాశ ముండఁగూడదు. 'కళాద్రుతో న యేషాం స్యాత్, అన్యే ద్రుతప్రకృతయో, యేష్యు ర్హ్యాస్యనుజీవితా నిత్య' మ్మని చింతామణి పొల్లునకారము గలశబ్దములను ద్రుతప్రకృతికములుగాఁ జెప్పి, 'దేశ్యా దస్మ ద్యుష్మ చ్ఛబ్దాత్సు జసో ర్మమూవు రూచస్తః' అనియు, 'హ్రస్వే టాదౌ నమవాఙ, ద్వయవ ద్వవచనద్వయేఽన్యయో రాత్మా' అనియుఁ దెల్పి 'నేను- తాను' లకు 'ను'వర్ణకములను విధించి, ఆ'ను' వర్ణకమునందలి యుకారమును 'కవిభల్లబైః క్రియాణాం. నామ్నాం చోల్లోప ఇష్యతే హ్యేషు' అను సూత్రముచే లుప్తపఱచి, వానిని 'నాంతాదయోఽపి గృహ్యతే' యన్నట్లు ద్రుతప్రకృతికములుగా మలఁచినట్లు తేటపడుచున్నది. బాలవ్యాకరణము గూడ 'నేనుతాను' పదంబులును, వలెప్రభృతులును ద్రుతప్రకృతికంబు' లని చెప్పి, 'వలెన్- ఎంతయున్- పోలెన్' అని యుదాహరించుటచే, 'వలె' కెట్లు ద్రుతము చేరెనో, అట్లే 'నేను'తాను'లకుఁ గూడ ద్రుతము చేరి 'నేనున్- తానున్' అని యేర్పడుట కవకాశ మేర్పడినది. చింతామణి యట్లుగాక 'నేను- తాను'లలోని 'ను'వర్ణమునందలి యుత్వమునుండి తల్లోపముచే తద్ద్రుతమును సాధించుకొని. వానిని ద్రుతప్రకృతికములుగాఁ జేసికొన్నది. బాలవ్యాకరణము 'తాను-నేను' పదంబుల ద్రుతంబునకు సంశ్లేషంబులేదు (బా. వ్యా. సం. 23 సూ.), (ఉదా: తాఁజదివె; తానుజదివె) అని యందలి నువర్ణమునే ద్రుతముగాఁ బేర్కొని, దానికి సంశ్లేషము లేదని చెప్పుటయు. 'తాను-నేను'లు పైనఁ జూపినట్లు 'తానున్— నేనున్' అని యేర్పడుట కవకాశము గల్పించుటయు, వచ్చున్-వచ్చెన్-వచ్చెదన్' మొదలగు క్రియారూపములకు 'పూచెను + కలువలు (సంధి. 16 సూ.) వచ్చు

చున్ + ఉండెను (సంధి. సూ. 2.) అనునప్పుడు ద్రుతప్రకృతికముల పట్టికలో 'పొల్లునకారముగా నుండు ద్రుతమునకు 'ఉత్వ' విధాయక మగు సూత్రమును నిబంధింపక 'అవసానంబునందు ద్రుతస్వరంబున కేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగా నగు నని సూత్రించి వాక్య(పాదా)వసానములందలి యుత్వవిశిష్ట ద్రుత- కేవలద్రుత- ప్రకృతికములకుఁ దమత్వ-తద్ద్రుతలోపమును మాత్రమే సాధించి, తదనురూపముగానే 'వాఁడువచ్చెన్- వాఁడువచ్చె- వాఁడువచ్చెను' అనియు, 'అతిశయముగ బుద్ధిమంతుఁ డగు బుధసేవన్' అనియు నుదాహరణము లిచ్చుటయుఁ బట్టి ద్రుతస్వరూపనిరూపణవిషయమున నం దెంతయుఁ బ్రక్రమ భంగము గోచరించుచున్నది. అందువలననే ప్రౌఢవ్యాకరణ, ఆంధ్రభాషాను శాసనకర్తలును, బా. వ్యా. గుప్తార్థప్రకాశికా,సారస్యసర్వస్వపేటికా- ఆంధ్ర వ్యాకరణసంహితాసర్వస్వకర్తలును 'ను' వర్ణాత్మకద్రుతమునకే ప్రాధాన్య మిచ్చినట్లు గుర్తింపవచ్చును. ఆంధ్రభాషాచరిత్రకారులు 'ఈరీతిగ సంపూర్ణముగా లోపింపఁ గల నకారమే అనఁగా 'న్' అనుపొల్లే ద్రుత మనియు, నీపొల్లుపైఁ గొన్నియెడల అఇఉలు చేరుటయు లోపించుటయుఁ గలుగు ననియు, పదములందు సిద్ధము లగు నినులు ద్రుతములు కావనియు, నయినను నట్టి సిద్ధములగు నినులకు ద్రుతము నకువలె వ్యాకరణకార్యములు గలుగుననియుఁ జెప్పఁబడియున్నది' యని నిర్దేశించి, పొల్లునకారరూప మగు ద్రుతమునకు 'అఇఉ'లు చేరి 'నని'లుగా రూపొందుట కవకాశమును జూపెట్టియున్నారు.

కాని నాయభిప్రాయమున చిన్నయసూరి ద్రుతస్వరూపము పొల్లునకారమే కాని, నువర్ణము గాదు. చింతామణి 'ద్రుతాఖ్యోనః' అను సూత్రమున కనువాదరూప మగు 'నకారంబు ద్రుతం' బను సూత్రమునుబట్టియు, దానిక్రింద నీయఁబడిన 'నన్నున్— నాచేతన్....పోలెన్' వంటి యుదాహరణములనుబట్టియు, చిన్నయ సూరిదృష్టిలో 'నకారమే (పొల్లునకారమే) ద్రుత మని స్పష్టపడుచున్నది. ఇంక 'తాను—నేను' అనుపదములవిషయమునఁ గూడ 'తాఁజదివె; తాను జదివె' వంటి యుదాహరణములనుబట్టి, తద్గత నువర్ణమున కుత్వలోపము కల్గుటయు సూచింపఁ బడినది. కాని, యది సూత్రింపఁబడకపోయినంతమాత్రమునఁ దత్స్వరూపతత్త్వ మన్యథా గ్రహించుట న్యాయముగాదు కదా! మఱియు 'అవసానంబునందు ద్రుత స్వరంబున కేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగా నగు' (సంధి. 20 సూ.) నను సూత్రమునందలి 'అవసాన' మను పదముచే నది వాక్య-పదావసానము లని

యర్థము చెప్పుకొన వీలు గల్గించుకొనిన యెడల, తాను—నేనుల'ను' వర్ణోత్వ లోపమునుబట్టి వానికి 'తాన్-నేన్' అని ద్రుతప్రకృతికత్వము సిద్ధించుచున్నది. కాని, యాసూత్రమునందలి 'వాఁడువచ్చెన్— వాఁడువచ్చె— వాఁడువచ్చెను; ....బుధసేవన్' అనునుదాహరణస్వారస్యమునుబట్టియు, తద్గత 'అవసాన' మనఁగా 'వాక్యాంతగతపదానాం చ' (చింతామణి) అనుసూత్రపు మూలమునుబట్టియు వాక్యాంత మని చెప్పవలసియున్నను కేవలసూత్రమునుబట్టి అవసానమును బదాంత ముగాఁ గూడఁ జెప్పి, తాను—నేనులను బయివిధముగాఁ గూడ సాధించుకొనవచ్చును గదా! అట్లు చేయుట సాంప్రదాయికముగా లేదనుకొన్నయెడల 'నన్నున్—నాచేతన్' వంటి యుదాహరణములనుబట్టి 'కందోయి— ముంగొంగు— క్రొంబసిడి-' వంటి వానియందలి బిందురూపమునకు తద్భూతత్వవిధాయకసూత్రములు లేవుగనుక ద్రుతత్వము సిద్ధింపదుగదా! అందుచే వ్యాకరణ-సూత్రోదాహరణములను 'స్థితస్య గతి శ్చింతనీయా' అను న్యాయముచొప్పున సమన్వయించుకొనినయెడల నట్టిది సాధ్యము కాకపోదు. అప్పుడు సాంప్రదాయకము గాకపోదు! అందుచే తాఁజదివె, తానుజదివె' వంటి యుదాహరణములనుబట్టి 'తానునేనులు' ద్రుతప్రకృతికములే కాక తప్పదు. అట్టిచో తానునేనుపదములు వలె ప్రభృతులలోఁ జేర్చి నిబంధించుట ప్రామాదిక మనక తీరదు! చిన్నయసూరి 'వచ్చెన్— వచ్చున్; వచ్చెను— వచ్చును' అని యుదాహరణముల నిచ్చుచో, మొట్టమొదటి ద్రుతప్రకృతికవర్గమునఁ గేవలనామాంతరరూపములను, దరువాత నువర్ణాంతరరూపములను నిబంధించి. అతరువాత 'అవసానంబునందు ద్రుత....బహుళంబుగ నగు' (సంధి. సూ. 20) నని చెప్పుటనుబట్టియు, నకారంబు ద్రుత మనుటను బట్టియు, నాయనదృష్టిలోఁ గేవలనకారమే- పొల్లునకారమే— ద్రుత మని నిశ్చయింపవచ్చును. నకారపుఁ బొల్లు ద్రుత మగుచో 'ను'వర్ణద్రుతము, దాని కుత్వసంయోగముచే నేర్పడునట్టిదే యనియు, మొదట నకారపుఁబొల్లుండి, దాని కుత్వము పిదపఁ జేరినదే గాని స్వతస్సిద్ధము గాదనియుఁ, గావుననే 'అవసానంబునందు ద్రుతస్వరంబేని....లోపంబు బహుళంబుగ నగు' ననుట కవకాశము చిక్కె ననియుఁ దల్లోపవిధాయకసూత్రస్వారస్యబలముచే నుత్వము ద్రుతముపై దాని 'ప్రకృతిభావ(స్వత్వ)నివారణమునకై దానిస్థిరత్వమునకై— చేరినట్లు గ్రహింపఁదగుననియు, నందుచే నువర్ణద్రుతము బాలవ్యాకరణమున నెక్కడఁ గానవచ్చుచున్నను. నది నకారపుఁబొల్లు రూపమే ననియు, నదియే చిన్నయసూరి హృదయ మనియు మనము నిర్బాధముగా నిశ్చయింప వచ్చును. అప్పు డాంధ్రవ్యాకరణసంహితాసర్వస్వకారు లన్నట్లు 'చింతామణిపక్ష

మున ద్రుతము పొల్లునకారపురూపము గలది- సూరిపక్షమున 'ను'స్వరూపము గలది' యని తద్భేదనిరూపణమున కవసరము లేకుండగనే, బాలవ్యాకరణము ద్రుతము నకారపుఁబొల్లే యను నిరుక్తివిషయమునఁ జింతామణితో నేకీభవించు నని సిద్ధాంతరూపమునఁ జెప్పవచ్చును.

నకారపుఁబొల్లయిన ద్రుతమునకు 'ను'స్వరూప మేర్పడుటకై చిన్నయ సూరి ప్రత్యేకముగా నొకసూత్రము రచింపకున్నను, తత్పూర్వపరానువృత్తి కవకాశము గల్గునట్లు సంధి - 17వసూత్రాంతర్భాగముగా 'పూచెను + గలువలు' వంటి యుదాహరణములయందలి 'ను'వర్ణంబునకు' పక్షంబున స్వత్వం బగు; స్వత్వం బనఁగా ద్రుతంబునకుఁ బ్రకృతిభావ' మని నిబంధించెను. ఇం దప్పకవి 'కూర్చుండిరి యొండొరు నని కానక, పరపురుషక్రియలఁ బ్రకృతిభావము గలదే ? (అప్పక.) యని చెప్పి 'అజ్విశిష్టత'నే ప్రకృతిభావముగాఁ జెప్పినట్లయ్యెను. ఇట్లజ్విశిష్టతయే 'ప్రకృతిభావము కాఁగా, నదియే 'స్వత్వము'ను గాఁగా ద్రుతమునకు 'స్వత్వం బగు' నన్నప్పుడు దానికి 'అజ్విశిష్టత' గల్గునని యేర్పడును. 'పక్షంబున స్వత్వం బగు నన్నప్పుడు ఆయజ్విష్టత పాక్షిక మని భావము. ఇచ్చట ద్రుతమున కజ్విశిష్టత యనఁగా 'ఉకారముతోఁ గూడియుండుట' యని చెప్పనగును. అట్లేర్పడిన ద్రుతము 'ను'స్వరూపము గలది కాఁగా, 'ఇకారంబుమీఁది కునుపు.... ఇత్వం బగు (తత్స. 26)' ననుసూత్రముచే దానికి 'ఇ'త్వము ప్రాప్తించి, 'ని'స్వరూప మగును. ఇట్లు ద్రుతముయొక్క న్—ను—ని స్వరూపత్రయమున కాకరములు లభించుచున్నవి. 'పరపురుషక్రియలఁ బ్రకృతిభావము గలదే ?' అను నప్పకవిని బట్టి యజంతభాష యగు నాంధ్రభాషాశబ్దముల కజ్విశిష్టతయే స్వరూప మనియు, అట్టి తత్స్వరూపమే 'స్వత్వ'మనఁదగు ననియు. నజ్విష్టతాస్వత్వము ద్రుతమునకుఁ గల్గి, 'ను'స్వరూపము ధరించు ననియుఁ జెప్పవచ్చును. నన్నయభట్టారకుఁడు 'తిఙ్మధ్యశేషషష్ఠీ....తూష్ణీమాద్యా; నభిదధతి కళాద్రుతో నయేషాం స్యా' త్తని ముందుగాఁ గళాపదనిరూపణము చేయుటమూలమున ఆంధ్రభాష యజంతభాష యని వ్యంగ్యముగా స్థాపించి, ద్రుతసంబంధమాత్రముచేతనే దానికి హలంతత్వము ప్రాప్తించునట్లు సూచించినవాఁ డయ్యెను. కావున నజ్విశిష్టతయే కళాపదములకుఁ దోఁచు ప్రకృతిభావము- స్వరూపత్వము- స్వత్వము ననవచ్చునుగదా ! అట్టి స్వత్వమే ద్రుతమునకు స్థిరత్వమును, ఆంధ్రభాషాస్వాభావ్యమును సంపాదించి యిచ్చుచున్నది ! ఈస్వత్వ మనునది భాషాసహజ మైనట్టిదిగా సంభావ్యము గాని, కేవలద్రుతమాత్రసిద్ధముగా భావింపరాదు. ఈదృష్టితోఁ జూచినయెడల హల్మాత్ర

సకారస్వరూప మగు ద్రుతమునకు 'పక్షంబున స్వత్వం బగు' నను స్వత్వవిధాయక సూత్రాంశము అజ్యోగమున కవకాశ మొసఁగునట్టిది కాఁగా, దానికి తరువాతి 'అవసానంబునందు ద్రుతస్వరంబునకేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగా నగు' నను తల్లోప విధాయకసూత్రము శేషభూతమై, ద్రుతనకారపుఁబొల్లునకుఁ బ్రాప్తించిన యచ్చునకుఁ దల్లోపము సాధించుటకుఁ దోడ్పడఁగలదు ! ఈసూత్రద్వయపర్యాలోచనచేఁగూడ ద్రుతస్వరూపము నకారపుఁబొల్లే యని నిరుపద్రవముగా నిరూపితమగుచున్నది. ద్రుతమున కీస్వత్వవిధానమును అథర్వణుఁడు 'ద్రుతస్య హాలి బిందుస్స్యాళ్లిష్టత్వం చ క్వచి త్స్వతా' యను సూత్రముచే సంపాదించెను.

ద్రుతస్వభావము :

ద్రుతస్వభావమునుగూర్చి సూచించుచు 'ఉగ్వా ద్రుతప్రకృతికా, త్వరత స్సరశే స్థిరే చ నస్యస్యాత్ – నస్యా త్తద్ధర్మేతః – అనాదిషు విభక్తిషూతోవా' అను ద్రుతసంబంధము గల శబ్దములయందలి కొన్నియెడల లోపము చెందునట్లును, గొన్నియెడల లోపము చెందునట్లును చింతామణిలోఁ జెప్పఁబడియున్నది. ఆభావమునే 'అచాం సంధౌ ద్రుతోఽదృశ్యః స్థితోఽపి చ భవే త్సదా' యను సూత్రమున నిబంధించి అథర్వణుఁడు ద్రుతమున కదృశ్యతయు స్థితిని సాధించెను. ద్రుతస్వభావమును చిన్నయసూరి స్పష్టముగా నిరూపింపకున్నను, ప్రౌఢవ్యాకరణకర్త 'ద్రుతమనఁగా నొల్లనియెడ మఱఁగిపోవు నది యనుట' యని నిర్దేశించి, తత్స్వభావమును వివరించెను. పద్యాంధ్రవ్యాకరణకర్త (మల్లంపల్లి మల్లికార్జునశాస్త్రి-1897) 'ద్రుతము చలభావము గలది' యనియు, గుప్తార్థప్రకాశికాకారుఁడు 'నకారంబునకు ద్రుతం (చలనభావము గలది) బని పే' రనియు, 'ద్రుత మనఁగా జాఱిపోవునది, లేక కరఁగిపోవునది యని యర్థ' మనియు, అంధ్రభాషాచరిత్రకర్త 'కావలసినప్పుడు వచ్చి యక్కఱలేనప్పుడు లోపించునది ద్రుత' మనియు, ఆంధ్రవ్యాకరణసంహితాసర్వస్వకారులు "ద్రుతః, పుం–త్రి. జాతద్రవీభావే ఘృతసువర్ణాదౌ" (శబ్దార్థచింతామణి) అనుచొప్పున ద్రుతిని బొందు స్వభావము గలది యనఁగా నొల్లనియెడల లోపించుస్వభావము గలది కాన నీపేరు ద్రుతమునకు సార్థక మగుచున్న" దనియు; దెల్పి తత్స్వభావమును నిరూపించియున్నారు. పైవాక్యములచే ద్రుతమునకు దృశ్యాదృశ్యస్థితులు రెండు గల వనియు, నవి 'తత్ర వక్తా చ కవిః కవి నిబద్ధోవా' (ధ్వన్యాలోకము) అన్నట్లు వక్త్రధీనము లయినట్లును దెలియఁగలము. ఉదా : పూచెన్ + జలజము = పూచెన్ జలజము; పూచెను జలజము; పూచె జలజము— ఇంకన్ +

ఎప్పుడు= ఇంకెప్పుడు- ఇంకనెప్పుడు మొ॥నవి. కాని, 'అఁట యిఁక చుఁడు శబ్దంబులం దప్ప నుడితొలిహ్రస్వంబుమీఁద ఖండబిందువును, ద్రుతంబునకు లోపంబును లేవు' (సంధి - సూ. 22) అను సూత్రముక్రిందను, వర్గయుక్సరళములు పరము లగునపు డొకానొకచో ద్రుతంబునకుఁ బూర్ణబిందువు గానంబడియెడి (సంధి సూ. 19) అనుసూత్రము క్రిందను నియ్యఁబడిన 'కన్దోయి- కందోయి (కన్ + దోయి)' అను నుదాహరణములందు ద్రుతప్రకృతిక మగు 'కన్'శబ్దమునందలి ద్రుతమునకు సహజధోరణిలో లోపము గలుగవలసియున్నను నది పైసూత్రముచేఁ బ్రత్యేకముగా నపవాదరూపమున నివారింపఁబడి, ద్రుతమునకు ద్రుతత్వమే లుప్తపడిచిన ట్లయినది ! అనఁగా నిట్టి ప్రత్యేకస్థలములలో ద్రుతము సర్వాంగముగా లోపింప దనియుఁ దేలుచున్నది. ఇట్లు 'అవసానంబునందు.... బహుళంబుగా నగు' మొ॥ సూత్రములచే ద్రుతపుద్రుతత్వము సమాస-వాక్యావసానములలో, దృశ్యాదృశ్యమై వక్త్రధీనమై యున్నట్లు గోచరించును.

ద్రుతస్వభావమునుగూర్చి వ్రాయుచు ఆంధ్రవ్యాకరణసంహితాసర్వస్వకారులు "తుదిని బ్రకృతిచేతనే నిల్చియుండునది యనఁగ నయ్యది యర్థవిశేషబోధకము గాదు. అట్టిపదము ద్రుతప్రకృతిక మనఁబడును. ఇట్లగుటచే 'రాముఁడును గృష్ణుఁడును వచ్చిరి' మున్నగుచోట్ల 'రాముఁడును గృష్ణుఁడును' మున్నగునవి ద్రుతప్రకృతికము లనిపించుకొనవు. అవి ద్రుతాంతము లనిపించుకొనును. ద్రుతప్రకృతికముల ద్రుత మవసానాదులలో సంధిసూత్రములచొప్పున లోపించునపుడును వాని కవయవార్థభంగము గలుగదు. ఉదా : రామునిచేతను, రామునిచేత మొ॥ పదాంతేతరస్థలస్థితనకారము ద్రుతము కాదు.... ఎద్దానికి ద్రుతవిరహితముగాఁ బ్రయోగముండదో యది ద్రుతప్రకృతిక మనియు, నెయ్యది ద్రుతవిరహితమె యై యుండి యర్థవిశేషకబోధక మగు 'ను'శబ్దముతోఁ జేరుటచే ద్రుతాంతమగుచు నుండునో యది ప్రకృతిక మనిపించుకొనక ద్రుతాంత మనిపించుకొను ననియు గ్రహింపవలయు' నని నిర్ధారించియున్నారు. ఈదృష్టితో నర్థవిశేషబోధకత్వము ద్రుతమునకుఁ గలుగ దని భావింపఁబడినది ! కాని బాలవ్యాకరణదృష్టితో 'ద్రుతాంతము లయిన పదంబులు ద్రుతప్రకృతికంబు లనఁబడుటచే ద్రుతాంతములకును ద్రుతప్రకృతికములకును భేదము సాధింపఁబడలే దని చెప్పవచ్చును. పైవ్రాతచే నర్థవిశేషబోధకతారాహిత్యమే ద్రుతస్వభావ మని యేర్పడుచున్నది. కాని, ద్రుతాంతములయందును, ద్రుతప్రకృతికములయందును నుండునది ద్రుతమే

యగుటచేఁ బై వ్రాతనుబట్టికూడ ద్రుతమున కర్థవిశేషబోధకత్వము నివారింప వీలు లేకపోవుచున్నదిగదా! అట్లుగాక ప్రకృతులయం దున్నను, బదాంతములయం దున్నను ద్రుతమున కర్థవిశేషబోధకత్వము కలుగ దని నిష్కర్షింపఁబడుచో సముచ్చయార్థక 'ను'వర్ణసిద్ధద్రుతమునకు ద్రుతత్వమే లేకపోవలసివచ్చును! అట్టిది ఆంధ్రవైయాకరణుల కభిప్రేతము గాక పోవుటవలన ద్రుతస్వభావము నట్లు నిశ్చయించుటకు వీలుగాదేమో!

ద్రుతభేదములు :

ఆంధ్రవ్యాకరణములలో నెచ్చటను ద్రుతభేదము ప్రస్తావింపఁబడలేదు. తొలిసారిగ ఆంధ్రవ్యాకరణసంహితాసర్వస్వకారులే ద్రుతాంతము లనియు, ద్రుత ప్రకృతికము లనియు ద్రుతవిశిష్టపదములలో భేదము సాధించుటకుఁ బ్రయత్నించి యున్నారు. అవి ద్రుతతత్త్వమున నవిశిష్టము లగుటచేఁ దద్భేదకరణ మంత సాధకముకాదు. కాని నాయభిప్రాయమున "సిద్ధస్సాధ్య శ్చానుస్వారః పూర్ణార్ధ భేదతో ద్వివిధః (ఆం. శ. చిం.)" అని నన్నయభట్టారకుఁ డుపదేశించినట్లు కేవలము పొల్లునకారపురూపము గల ద్రుతమునకు 'తద్ద్రుతం చ బిందుః స్యాత్' అని బిందుత్వముగూడ వ్యపదేశింపఁబడుట వలన ద్రుతముగూడఁ- దత్స్థానీయ మగు బిందువువలెనే- సిద్ధసాధ్యభేదముచే ద్వివిధ మని చెప్పుట యుక్తము. అనఁగా నేద్రుతము వ్యాకరణసూత్రములచే సాధ్యము గాక ప్రకృతియందే గోచరించునో, అది సిద్ధద్రుతము; తదన్యము సాధ్యద్రుత మని భేదింపవచ్చును.

సిద్ధద్రుతము :- బాలవ్యాకరణమునుబట్టి 'వలెన్-పోలెన్- (కడున్) మొదలగు వానియందలి వ్యాకరణసూత్రసాధ్యము గాక పదసిద్ధముగా నుండుటచే, నట్టి ద్రుతము సిద్ధద్రుతమే యనఁదగును. అది- ఆం. వ్యా. సం. సర్వస్వకారు లన్నట్లు అర్థవిశేషబోధక మైనను గాకున్నను, పదమునుండి విడఁదీయరాకుండుటచే సిద్ధమే యనక తప్పదు. దానిస్వరూపమును శబ్దశాస్త్రదృష్టితోఁ గాని, యన్యథా గాని సాధించు ననవలసియుండును!

సాధ్యద్రుతము :- ద్రుతప్రకృతికక్షేత్రమున సాధ్యద్రుతమున కున్న ప్రాచుర్యము సిద్ధద్రుతమునకుఁ గనఁబడదు. చిన్నయసూరి యిచ్చిన ద్రుతప్రకృతిక వర్గమునందలి 'నన్నున్' నుండి కొట్టినన్.... ఎంతయున్- అయ్యున్' వఱకుఁ గల పదములయందలి ద్రుతము సంధి-సమాస-తత్సమాదిపరిచ్ఛేదములయందలి వివిధసూత్రములచే సాధ్యపడి యీవిభాగమునఁ జేరుచున్నది.

ఈసాధ్యద్రుతముగూడ ఆగమ–లోపవిధానప్రక్రియల ననుసరించి ద్వివిధముగాఁ గనఁబడుచున్నది. బాలవ్యాకరణమునందలి—

"సమాసంబుల నుదంతంబు లగు స్త్రీసమంబులకుం బుంపులకుం బరుషసరళంబులు పరంబు లగునపుడు నుగాగమం బగు."

"తలఁద్రాలు మొదలగు సమాసంబుల ద్రుతమునకు లోపము లేదు" (తలఁద్రాలు, సేసఁద్రాలు మొ॥).

"ఉదంత మగు తద్ధర్మార్థవిశేషణంబున కచ్చు పరంబగునపుడు నుగాగమం బగు." (చేయునతఁడు మొ॥)

మొదలగుసూత్రములచే నజంత మగు పూర్వపదముపై 'ను'గాగమము(న్) విధింపఁబడి, ఆ 'నుక్కు'నందలి నకారపుఁబొల్లు ద్రుతరూపమును ధరించి, పూర్వపదమున కంటుకొనియుండి పరపదముమీఁద ద్రుతకార్యములు జరుపుటచే, నది సాధ్యద్రుతమే యనఁదగి యున్నది. ద్రుతకార్యములస్వరూప మిప్పుడే విచారింపఁబడును. కొన్నియెడల 'ఆగమ ముపు వర్ణంబుల కందు వర్ణంబు పరం బగునపుడు నుగాగమం బగు' (తత్స. 29) ననుసూత్రముచే 'వనమునందు' మొదలగుచోట్ల ద్రుతము కలిగి పదప్రత్యయముల కనుసంధాయక మగుచున్నది. 'కొన్నియెడల ద్రుతంబుమీఁద నకారంబు గానంబడియెడి (సంధి. సూ. 21) (ఉదా; అదియునున్నాక, దివంబునుంబోలె) ననుసూత్రముచే సముచ్చయార్థక 'ను'వరము ద్రుతీకరింపఁబడి, అట్టి ద్రుతముపై మఱియొక (నకారరూప) ద్రుతము వచ్చి ద్రుతకార్యములు నిర్వహింపఁబడుటయుఁ గలదు! ప్రౌఢవ్యాకరణమునఁ 'గొన్నియెడలఁ బ్రామాణికప్రయోగములం ద్రుతంబుల కచ్చు పరంబగునపుడు ద్విత్వము చూపట్టెడి (సంధి. సూ. 3) నను సూత్రముచే 'సర్వమున్ + అతని= సర్వమున్ + న్ + అతని= సర్వమున్నతని' అని యేర్పడుట కాకర మేర్పడుచున్నది. కాని, ద్రుతముపై నకారము కలుగుట సాధ్యపడిన పై బాలవ్యాకరణసూత్రమునందలి నకారమును ప్రౌఢవ్యాకరణము ద్విత్వ మని నిబంధించెను గాని, బాల–ప్రౌఢవ్యాకరణముల కీవిషయమున వస్తుతః భేద మున్నట్లు కన్పట్టదు! చిన్నయసూరి 'కొన్నియెడల ద్రుతంబుమీఁద నకారంబు గానంబడియెడి' నను సూత్రమునందలి 'కొన్నియెడల' నను పదము పరమగు పదము నచ్చునిగాని హల్లునిగాని నిర్దేశింపక పోవుటచే 'సర్వము న్నతని' యను నుదాహరణము దానిచేతనే సాధ్య మగుటకు

వీలుగలుగకపోదు ! సూరి యిచ్చినయుత్తరపదపు హలాదిత్వమునుబట్టి (అది యును + గాక; దివంబును + బోలె) యాసూత్రము హలాదిపద మని ప్రౌఢ వ్యాకరణకర్త భావించుకొని తనసూత్రమును నిర్మించియున్నాఁ డనవచ్చును. ఈ విధముగా నీసాధ్యద్రుతము నామ-క్రియావిభక్తి-ప్రత్యయములందే గాక, సమాసమునను లేక పదద్వయమధ్యమునను నాగమించి ద్రుతకార్యములు నిర్వహించుచున్నది. ఇట్లే యాలోచించి యాగమసాధ్యద్రుతస్వరూపస్వభావములను సాధించుకొనవచ్చును !

ఇఁక లోపవిధానప్రక్రియనుబట్టి సాధ్యద్రుతస్వరూపము పరికింతము. బాలవ్యాకరణమునందలి- "అవసానంబునందు ద్రుతస్వరంబునకేని లోపంబు బహుళంబుగా నగు- వాఁడు వచ్చెన్- వాఁడు వచ్చె" మొదలగునవి. అట్లే తాను + జదివె' వంటి చోట్ల 'తాను'నందలి యుత్వము లోపించినచో 'తాన్' అయి, 'తాఁ జదివె' నని యగుట సుకరము; లేదా యందలి 'ను'వర్ణద్రుతమునే స్వరసహితముగా లోపింపఁజేయవలసిన పరిస్థితి యేర్పడును. సంధిసూత్రము 19చే నకారమాత్రద్రుతమున కేర్పడు నజ్విశిష్టత యీసూత్రముచే వారింపఁబడుటయే గాక, ప్రధానద్రుతముగూడ లోపించుట కవకాశము సంభవించును. ఇట్టిది యీసాధ్యద్రుతమునకుఁ గల సామాన్యప్రక్రియ !

కాని ద్రుతాంతములు గాక యజంతము లగు కొన్నిశబ్దములను సమాసవిషయమునను, దదితరత్రను, ద్రుతాంతములుగా మలఁచుటకై లోపప్రక్రియ యాశ్రయింపఁబడి, అట్లు సాధింపఁబడి పదావయవరూపముగా నుండు నకారముగూడ 'ద్రుతమే' యని పారిభాషికముగా సంభావింపఁబడినది. ఉదాహరణార్థము ; 'కన్ను + దోయి' అను సమాస—సంధి సందర్భమున— 'అకారంబుల క్రింది అకారంబులకుం దుది ములుల క్రింది నలలకు లోపంబు బహుళంబుగా నగు, (ప్రకీ. ప. సూ. 7)- అను సూత్రముచే పైసమాసము 'కను + దోయి' యని కాఁగా, 'పదాంతంబు లయి యసంయుక్తంబు లయిన ను-లు-రుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు (మ్రాను + పడె= మ్రాన్పడె; మిను + వడె = మిన్వడె)' (ప్రకీ. ప. సూ. 16) నను సూత్రముచే, కన్ + దోయి = కన్దోయి' యని కాఁగా అఁట యికఁ చుఁడు శబ్దంబులం దప్ప నుడితొలిహ్రస్వంబుమీఁది ఖండబిందువును, ద్రుతంబునకు లోపంబును లేవు' '(ఉదా ; కన్దోయి)' (సంధి. సూ. 22) అను సూత్రముచే నిందలి 'కన్'శబ్దమునందలి యవయవరూపనకారము

ద్రుతముగానే చిన్నయసూరికి భావించినట్లును, అదినుడితొలిహ్రస్వంబుపై నుండుటచే 17వసూత్రముచేఁ గల్గఁదగినట్లు, దానికి లోపము లేనట్లును గ్రహింపవచ్చును. అనఁగా నిచ్చటి 'కన్'నందలి ద్రుతము పదావయవరూప మనియే బాలవ్యాకరణమునుబట్టి తెలియుచున్నది. అనఁగాఁ బదావయవరూప నకారముగూడ నిట్లు ద్రుతముగా భావింపఁబడుట ఆంధ్రవ్యాకరణసంప్రదాయ మనియు, నది బాహుళక మగుటచే నన్నియెడల గానరా దనియు గ్రహింపవచ్చును. ఇట్లే- ఏఁబది (ప్రౌఢ. వ్యా. సమా. 24) అనుదానియందలి యవయవరూపనకారము ద్రుతముగా గ్రహింపఁబడి, ద్రుతకార్యములు నిర్వర్తించినది! సుప్రార్థప్రకాశికాకారుఁడు 'కన్దోయి'యందలి ద్రుతసాధనము నిట్లే గావించెను. సారస్యసర్వస్వపేటికాకర్తయు నట్లే తెల్పి, 'యిందలి పొల్లునకారము శబ్దసహజమే యనక తీరదు ... గత్యంతరము లేమి నిచ్చోమాత్రము 'కన్'అను నవయవనకారమే సూరి ద్రుత మని వ్యవహరించి బిందువిధానముం జేసి 'కందోయి' రూపసిద్ధి యొనర్చె ననియుఁ, గొంద ఱంద్రు. సూరి యిచ్చోఁ దన ద్రుతసంజ్ఞ గుదుర మిని, ప్రౌఢవ్యాకర్త ఏఁబది యిత్యాదులయందుఁ బలె (చూ. ప్రౌ. సమా. 24) నేమియు నెఱుంగని వానివలె బిందువు నవయవనకారమునకు విధించె నని మాత్ర మనకతీరదని 'కన్' నందలి నకారపుఁబొల్లున కిష్టములేకయే సూరిమతము ననుసరించి ద్రుతత్వము చెప్పుకొనుట జరిగినది. ఈసందర్భమున ఆంధ్రవ్యాకరణసంహితాసర్వస్వకారులిచ్చటి నకారపు టావయవిత్వమును నివారించి యది యాగమనకారమే యని నిరూపించుటకై యిట్లు మఱొకవిధముగాఁ బ్రక్రియను జూపియున్నారు. "కన్నుయొక్క + దోయి = కన్ను + దోయి' యను షష్ఠీసమాసమున బా. వ్యా. సంధి. 25వసూత్రము చొప్పున నుక్కు రాగా 'కన్ను + ను + దోయి' అని యేర్పడును. ఇట నిక్కలాదిసూత్రముచొప్పున (బా. సమా. 20 సూ. దీని వివరణము ప్రౌఢ సమా. 36 సూ.) 'కన్ను' అను దానిలోని 'న్ను' అనుభాగము లోపింపఁగా, 'క + ను + దోయి' అని యేర్పడును. ఇందలి నుగాగమద్రుతము ప్రకృత సూత్రము (19సూ.)చే నిండుసున్న కాఁగా 'కందోయి' అనురూపము సిద్ధించు" నని సాధింపఁబడినది. కాని యిట్టిప్రక్రియగూడఁ 'గృతక మగుచు' శబ్దతత్త్వశాస్త్రపద్ధతికి విలక్షణ మగుచు' న్నట్లు చింతామణివిషయపరిశోధనమున వారే వ్రాక్రుచ్చియున్నారు. ఏది యెట్లున్నను 'కన్'అందలి నకారమునకు ద్రుతత్వము మాత్ర మంగీకరింపఁబడుటచే నది సాధ్యద్రుతముక్రిందికి వచ్చునని చెప్పవచ్చును.

ద్రుతపరిణతు (వికారము)లు :

స్వరూపముచే ద్రుతము నకారపుఁబోల్లే యైనను, నది పదమధ్యమునఁ గాని, పదాంతమునఁ గాని, వాక్యాంతమునఁ గాని యట్లే యుండక కొన్నిపరిణతులను బొందుచున్నది. ఈవిషయమున సర్వాంధ్రవ్యాకరణములును దమసమ్మతిని జూపుచునే యున్నవి.

ద్రుతమునకు స్వత్వ-బిందు- సంశ్లేష- లోపములు— అను చతుర్విధపరిణతులు గలవు. ఇవి ద్రుతము యొక్క పరిణతులు. ద్రుతముమీఁది పరుషములను సరళములుగాఁ జేయుట ద్రుతమువలని పరిణతి యని చెప్పవచ్చును. ఈవిధముగా ద్రుతముయొక్క ద్రుతమువలని పరిణతి యని యది ముందు ద్వివిధ మగుచున్నది. ఆతరువాత ద్రుతముయొక్క పరిణతి చతుర్విధ మగుచున్నది. అందు స్వత్వ మనఁగా ద్రుతముపయి 'ఉ, ఇ, అ'లచే దాని కుచ్చారణ స్థిరత్వము గల్పించుట యగును. బిందువు పూర్ణార్థబిందురూపమున ద్వివిధము, సంశ్లేషము 'మీఁది హల్లుతోఁ గూడికొనుట' యని బాలవ్యాకరణము; లోపము ద్రుతలోపము, ద్రుతస్వరలోపము నని ద్వివిధముగాఁ గానవచ్చుచున్నది. ఇట్లు ద్రుతముయొక్క పరిణతి వివరముగా షడ్విధముగాఁ నున్నట్లు తెలియవచ్చును. బాలవ్యాకరణసూత్రములనుబట్టి యీవిషయ మిచ్చట నిరూపింపఁబడును.

(1) "ద్రుతప్రకృతికములమీఁది పరుషములకు సరళము లగు" (సంధి. సూ. 16)

ఇది ద్రుతమువలని పరిణతి యనఁ దగును.

(2) "ఆదేశసరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషలు విభాష నగు. పక్షంబున స్వత్వం బగు" (సూ. 17)

పూచెను గలువలు; పూచెఁ గలువలు; పూచెం గలువలు; పూచె న్గలువలు.

(3) "అవసానంబునందు ద్రుతస్వరంబునకేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగా నగు" (సూ. 20)

(వాఁడు వచ్చెను) వాఁడు వచ్చెన్— వాఁడు వచ్చె.

(4) "సమాసంబునయందు ద్రుతంబునకు లోపంబగు." (సూ. 24)

(5) "సమాసంబులందు ద్రుతంబునకు స్వత్వంబు లేదు." (సూ. 26)

ఇట్టి పైసూత్రములచే ద్రుత మెట్టిపరిణతులను బొందుచుండునో నిరూపిత మైనది.

కాని 'సంశ్లేషపరిణతి'నిగూర్చి వ్యాకర్తలలో నభిప్రాయభేదము గానవచ్చుచున్నది. 'సంశ్లేషం బనఁగా మీఁదిహల్లుతోఁ గూడికొనుట' యని బాలవ్యాకరణము నిర్దేశించి; 'పూచెన్గలువలు' వంటి యుదాహరణముల నిచ్చినది. కాని, ఆంధ్ర శబ్దచింతామణి వ్యాఖ్యాత యగు బాలసరస్వతి 'అవికారగతే తస్మి న్నపి సరళా ఏవ సంతి తే పరతః- అలుకిచ సంశ్లేష స్స్యాత్' అను సూత్రములకు వ్యాఖ్య వ్రాయుచు—

(అ) తస్మిన్నపి = అద్రుతమును, అవికారగతే సతి = బింద్వాదివికారమును బొందక పోవుచుండఁగా, తే = ఆపరుషవర్ణములు, పరతః = పరమందున్నప్పుడు, సరళావివ = గజడదబలే యగును. అంబన్ గొలిచెద; శుభమున్ బడసెద, నిన్ గనియెద; తన్ గొలుతురు.

(ఆ) అలుకిచ = లోపములేని పక్షమందు, సంశ్లేషః = పూర్వవర్ణముతో సంయోగము, స్యాత్ = అగును. ఉ ; కాంచెన్ బావ; రక్షించెన్ మాధవుఁడు" అని చెప్పెను. ఈభాగమును వివరించుచు ఆంధ్రవ్యాకరణసంహితాసర్వస్వకారులు- "దీనినిబట్టి ద్రుతము నకారవ్యంజనముతో నుండి పరహల్లులో సంయోగించి యుండుట చింతామణిమతమున స్వత్వ మని విశదమగుచున్నది. 'లుక్సంశ్లేషౌ నాఽచిగ్రుతస్య' అనుసూత్రముదొప్పున నకారవ్యంజ్యనరూపద్రుతము పూర్వాచ్చునత్తియుండుట చింతామణిమతమున సంశ్లేషము. 'వచ్చెన్ వాఁడు' మున్నగుచోటులందు ద్రుతమునకు వకారముతోఁ గల సంయోగములో నట్టిసంయోగాది నున్న ద్రుతము పూర్వస్వరమునకుఁగాని పరస్వరమునకుఁగాని యంగముగాఁ బల్కనగును గాన నందుఁ బూర్వస్వరాంగ మగుట సంశ్లేష మనఁబడును! పరస్వరాంగ మగుట స్వత్వ మనిపించుకొనును. సంశ్లేషము- వచ్చెన్ వాఁడు. స్వత్వము— వచ్చెన్వాఁడు." అని నిరూపించియున్నారు. ఇదే భావము చింతామణివిషయ పరిశోధన (131-132 పేరాల) లో సాధింపఁబడినది.

అహోబలపత్యాదులు 'లుగభావే నస్య పరవర్ణే నసాకం సంశ్లేష శ్చ భవేత్ చకారేణ స్వరూపేణావస్థితిః' అనినట్లు అధర్వణకారికావళి టీకాకారుఁడగు ద్వితిం త్రిణీ సీతారామకవి 'ద్రుతస్య హలి బిందుస్స్యాత్, శ్లిష్టత్వం చ క్వచిత్స్వతా'

అను సూత్రమునకు టీక వ్రాసి యుదాహరణము లిచ్చుచు 'ఉదా : వచ్చెం గమలాక్షుఁడు, వచ్చె న్గమలాక్షుఁడు, వచ్చెను గమలాక్షుఁడు- వచ్చె గదాధరుఁడు ఇవి మొ.' అని చూపెను. బాలవ్యాకరణపు సంశ్లేషస్వరూపము లహోబలపత్యాదుల యను సరణరూపము లని ఆం. వ్యా. సం. సర్వస్వకారు లనుచున్నారు. ఔను గూడ.

కాని, ఆం. వ్యా. సం. సర్వస్వకారులు బహుశః బాలసరస్వతీయమునుండి సంశ్లేషస్వరూపమును గ్రహించి, దానిని 'సంయోగాది ర్వా (ఋ. ప్రాతిశాఖ్య)' అను ప్రాతిశాఖ్యయొక్క పార్షదవ్యాఖ్య (సంయోగాదిభూతో వర్ణః స్వరాంతరే వర్తమానః పూర్వస్య వా స్వరస్యాంగం భవతి పరస్య వా) తో సమర్థించి యున్నారు. వారినిబట్టి 'వచ్చెఁ వాఁడు' అనుదానియందలి ద్రుతము పూర్వస్వరాంగముగను, 'వచ్చెన్వాఁడు' అను దానియందలి ద్రుతము పరస్వరాంగముగను బలుకుటయే ద్రుత–సంశ్లేషస్వత్వములకు హేతు వగును. అదియే చింతామణికారుని యభిప్రాయ మైనచో, రెండుదాహరణములలోని ద్రుతము బింద్వాది వికారములను బొందక నకారవ్యంజనరూపముతో నున్న దని మాత్రము చెప్పవచ్చును. ద్రుతమును 'వచ్చెఁవాఁడు' అని యత్యంతసూక్ష్మ మగు వ్యవధానముతో నైనను ద్రుతము నుచ్చరించినపుడే యది పూర్వస్వరాంగము గాఁ గలదు గాని యన్యథా కానేరదు గదా ! ద్రుతముమీఁది ప్రత్యేకదృష్టితో న ట్లుచ్చరించునప్పుడు పూర్వస్వరమున కూఁత (accent) యేర్పడును గదా ! అట్లూతతోఁ గూడిన పూర్వస్వరము నత్తియుండు నట్లును, బరపదముతోడి స్వల్పవ్యవధానము గల్గునట్లును నుచ్చరించినయెడల నట్టి ద్రుతస్థితికి సంశ్లేష మని పేరనఁబడినది. ఇది బాలసరస్వతీయకర్త ననుసరించిన ఆం. వ్యా. సం. సర్వస్వకారుల వ్యాఖ్యానము గాని నన్నయభట్టుహృదయ మగునో కాదో తెలియదు. తత్స్వరూపనిర్దేశ మాయనచే స్పష్టముగాఁ జేయఁబడలేదు. అవికారగతే తస్మి న్నపి సరళా ఏవ సంతి తే పరతః' అను సూత్రసందర్భమునుబట్టి ద్రుతస్పర్శచేఁ బరుషములు సరళములగుటయుఁ దద్ద్రుతము బిందు వగుటయుఁ దత్సూత్రపూర్వభాగముననే నిర్దేశింపఁబడినది గనుక- ద్రుతము బింద్వాదివికారము పొందక ద్రుత (నకారవ్యంజన) రూపముననే నిల్చియుఁ బరుషసరళీకరణరూపద్రుతకార్యము నిర్వహించు స్థలము లెట్టివో, తత్ప్రయోజన మేమో నిష్కృష్టముగా నిర్ణయింపఁబడలేదు ! 'అంబన్ గొలిచెద' 'శుభమున్ బడసెద' (బాలసరస్వతీయము) వంటి యుదాహరణములచే నిందలి ద్రుతాంతపూర్వపదము పూర్వపాదాంతముననను, బరపదము పరపదాదియందును నుండుచోఁ దదుచ్చారణకుఁ గావలసినంత స్వల్పవ్యవధానము

లభించి, యట్టి ద్రుతస్థితికిఁ గొంతయాకర మేర్పడును. మఱియు బాలసరస్వతీ యాదులనుబట్టి ద్రుతము పూర్వస్వరము నత్తియుండుట యనఁగా నేమి ? పదాంత మందలి ద్రుతమునకుఁ బూర్వ మెప్పుడును స్వరమే యుండునుగాని వ్యంజన ముండదు గదా ! అప్పు డాద్రుతము పూర్వస్వరము నంటి (యత్తి) యుండక యన్యథా యెట్లుండఁగలదు ? అట్లున్నను ద్రుతము స్వస్వరూపమున- నకార వ్యంజనరూపమున నున్నదే గనుక. దానిని మఱల ననవసరముగా 'సంశ్లేష' మని మఱియొకపేరు పెట్టనేల ? అనఁగా ద్రుత మెక్కడ- నెప్పు- డున్నను స్వరాశ్ర యము లేక యుండదు గనుక, అట్టి స్వరాశ్రయమునే 'సంశ్లేష' మనునెడల, ద్రుతము యొక్క సహజస్థితియే సంశ్లేషము కాఁగలదుగదా ! అట్టిదానికి- అనఁగాఁ దత్సం శ్లేషరూపమునకు అథర్వణాదులు 'సత్వ' మని పిల్చుటలో విశేషమేమి గలదు ?

మఱియుఁ బరస్వరాంగ మయి దాని నత్తియుండు ద్రుతముయొక్కస్థితి- 'వచ్చెన్వాఁడు' వంటి యుదాహరణములలో వలె స్వత్వ మనఁబడుట యెట్లో తెలియకున్నది. 'వచ్చెన్వాడు'లోని ద్రుతము తర్వాత వ్యంజన మగు వకార మున్నది గాని స్వరము లేకపోవుట వలన నది పరస్వరాంగ మగుట యెట్లు ? తరువాతి వకారముమీఁది 'అ'కారమున కది యంగ మని చెప్పుచో, నప్పుడు ద్రుతము ప్రథమమున వకారముతోఁ గూడి- అనఁగా సంశ్లిష్టపడి- అప్పు డా సంశ్లిష్ట (సంయుక్త) వర్ణ మాకారాంగ మగుచోఁ గానవచ్చును గాని, ద్రుతమే తదాకారాంగ మగు నని చెప్పవలసిన యవసర మేమి కలిగినట్లు ? అట్టిది దూరా న్వయము కాదా ? అందుచే 'సంయోగాదిర్వా' యను ప్రాతిశాఖ్య 'పార్షద'వ్యాఖ్య యిచ్చిన పరస్వరాంగత్వవ్యవహారము ఆంధ్రభాషయందలి ద్రుతస్వత్వనిర్ణాయకము కాఁజాలదు. పైఁగా నిచ్చిన యుదాహరణమున ద్రుతమునకుఁ బరముగా స్వరమును లేదు. ఉన్న 'ఆ'కారస్వరమునకుఁ బ్రథమాంగము వకారము గాని నకారము గాదు. ద్రుతస్వత్వదృష్టితోఁ జూచినయెడల నది రెండుదాహరణములలోను నొక్క రూపముతో నున్న దగుటచే- నయిన నది సంశ్లేషమైనఁ గావలయును; స్వత్వ మైనఁ గావలయును గాని రెండును గానేరదు ! ఒక్కొక్కప్పుడు కవి 'వచ్చె, న్వాఁడు' అని పద్యపాదమును బ్రారంభించి, యతిస్థానమున వకారమునకు యతి వేయక నకారమునకు యతివేయఁ దలఁచినప్పు డిట్టి సంశ్లిష్టద్రుతనిబంధనమున కవసర మేర్పడవచ్చునుగదా ! అట్టియెడల నిట్టి ద్రుతసంశ్లేషపరిణతి సప్రయోజ నము కాఁగలఁదు ! సాధారణదృష్టితో రెండుమూఁడువ్యంజనముల సంయుక్తతను

బట్టి యది 'సంయుక్తవర్ణ' మనఁబడినట్లు, ద్రుతపరిణతిస్థలమునఁ బారిభాషికముగా ద్రుతసంయుక్త వర్ణము 'సంశ్లిష్ట' మనియు. అట్టి ద్రుతపరిణతికి 'సంశ్లేష' మనియుఁ జెప్పినఁ జాల సమంజసముగా నుండునుగదా! ద్రుతస్వత్వ మనఁగా నాంధ్రభాషాపవసాధారణ మగు నజ్విశిష్టత యని యీవ్యాసముననే ముందు సూచించినవిధముగా గ్రహించుచో ద్రుతపరిణతినిగూర్చి స్పష్టనిర్దేశములు లభించుట కవకాశ మున్నది.

ద్రుతపరిణతిసందర్భమున 'ఎదు త-ల ద్రుతంబున కచ్చు పరంబగు నపుడు మకారం బగు' (బాల. వ్యా. క్రియా. 28) నను సూత్రముచేతను, 'ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశం బగు (ప్రౌఢ. వ్యా. సంధి. సూ. 22) అను సూత్రముచేతను, ద్రుతమునకు బింద్వాదిపూర్వోక్తవికారములే గాక, మకారాదేశముచేఁ దాద్రూప్యమును బొందుటయుఁ గలదు! అట్టి పరిణతియు మహాకవిప్రయోగసిద్ధ మయియున్నది.

ఈచిన్నవ్యాసమున ద్రుతస్వరూపనిరూపణమును గూర్చి యథాశక్తి వ్రాయఁబడినది. ద్రుత మనఁగా ఆం. వ్యా. సం. సర్వస్వకారులు నన్నయభట్టారక హృదయముగా నిశ్చయించినట్లు నకారవ్యంజనరూపమే ననియు, దాని కాంధ్రభాషా సంప్రదాయానురోధముగా- అది హల్మాత్రము గనుక- తత్స్థిరత్వసిద్ధికై ఇ-ఉ-అకారములు చేరుట యను యజ్విశిష్టతయే స్వత్వము గల్గుట యనియు నేర్పడుచున్నవి. స్వాభావికదృష్టితో ద్రుతము వక్త్రభిప్రాయానుసారముగా దృశ్యాదృశ్య వికృత(పరిణత)స్థితులు గల దనియుఁ జెప్పఁబడుచున్నది. అట్లే ద్రుతము విభేద దృష్టితో సిద్ధ-సాధ్యము లని ద్వివిధముగా వెలయుచున్నది. అది మఱియుఁ బరిణతిదృష్టితో బిందు-లోప-సంశ్లేష-స్వత్వా-న్యథారూపములుగా గోచరించుచున్నది. ఇంతటి స్వరూపప్రభావము గల ద్రుతమునకు భాషాశాస్త్రదృష్టితోఁ జూచినయెడలఁ దచ్చరిత్ర మింకను లభించును!

బుద్ధ చరిత్రము

పరమదయావిదగ్ధుఁ డగు బుద్ధుఁడు జగత్ప్రసిద్ధుఁడు. భరతఖండమునందు ప్రభవించి అసియాఖండమంతటను తన దివ్యప్రబోధప్రకాశముచే వెలుగులు నింపిన దివ్యజ్యోతి యాదయామయుఁడు. అట్టివిశిష్టమతప్రవక్త యగు బుద్ధుఁడు ప్రాచ్య పాశ్చాత్య కావ్యములందుఁ గీర్తింపఁబడియున్నాఁడు. అందు గీర్వాణసాహిత్యము నందలి అశ్వఘోషుని బుద్ధచరిత్రకును, పాశ్చాత్యసాహిత్యములలో నెడ్విన్ ఆర్నాల్డ్ ఆంగ్లమున రచించిన 'లైట్ ఆఫ్ ఏసియా' (Light of Asia) కును ప్రపంచమున నధికమైన ప్రఖ్యాతి కలదు. ఆరెండుకావ్యముల నాధారముగాఁగొని తిరుపతివేంకటకవులచే తెలుఁగున రచింపఁబడిన కావ్యము 'బుద్ధచరిత్రము.' ఏతద్రచనకు పోలవరముజమీందా రగు శ్రీవేంకటకృష్ణరావుభూపతిగారి యాదర ప్రోత్సాహములు లభించినవి

బుద్ధచరిత్ర మొక విచిత్రమైన అనువాదము. అడ్విన్ ఆర్నాల్డు వ్రాసిన Light of Asia ను బుద్ధచరిత్రగా మొదట కవు లనువదించిరి. కవుల కాంగ్లము రామి బ్ర. శ్రీ. చావలి సూర్యప్రకాశరావుగారిచే మూలమునందలిభావము వ్రాయించుకొని దాని నాధారముగాఁ గొని వారు కావ్యరచన మొనర్చియుండిరి. కావున నిందు శబ్దానుకరణ మంత యుండక భావానువాద ముండుటకే అధికావకాశము కలదు. అటుతరువాత కవులు అశ్వఘోషుని "బుద్ధచరితము" నుండి కొన్ని శ్లోకముల ననువదించి యిందుఁ జొప్పించియుండుటచే [1]నీకావ్యమునకు మూలద్వయ మేర్పడినది. సంస్కృతశ్లోకముల ననువదించుపట్లయు భావానువాదప్రక్రియయే కవులచే ననుసరింపఁబడినది.

బుద్ధచరిత్రమునందలి యంగిరసము దయావీరము. దయాసముద్రుఁడగు సిద్ధార్థుఁడు వార్ధకరుజామరణాదులచే వ్యథచెందు జగత్తును గాంచి, జాలిఁజెంది తత్తరణోపాయమునుగూర్చి చింతించుచు సన్యస్తుఁడై సాధకుఁడై ధ్యానియై,

---

1. దివాకరాస్తమయము - పు. 4-8.

బుద్ధుఁడై, ప్రబోధకుఁడై లోకకల్యాణమును సాధించిన మహావీరుఁడు. అతనిచిత్త మొక మహాసముద్ర మగుచో నందలి జలము దయ; అందలి అలలు జ్ఞానసాధనోత్సాహప్రవృత్తులు; ఆజ్ఞానతరంగములు బ్రెత్తుగాలేచి ఉన్నత సిద్ధినిపొంది లోకులకు దానిని బోధించి, వారినిఁదరింపఁజేసి మఱల సముద్రములో లీనమైపోవును. అనఁగా దయావీరమునకు, జ్ఞానవీరము దీపక మనిభావము. దయావీర మంగి, జ్ఞానవీర మంగము. అందువలననే కవులు—

"బుద్ధునకుఁ గల యెక్కుండు భూతదయను
గూర్చి మానేర్చుగతి నిట్లు గొంతదనుక
వ్రాసినారము" అని పేర్కొనియున్నారు. —షష్ఠాం. 102.

అశ్వఘోషుఁడు బుద్ధచరితమును ముముక్షుభావోపేతముగాఁ దీర్చి దిద్ది శాంతరసప్రధానమొనర్చినాఁడు. కాని ఆర్నాల్డు బుద్ధదేవునిచరితను దయా ప్రధానముగా దర్శించి తదనుగుణముగా దానిని మలచినాఁడు. అందువలననే బుద్ధచరితమునందులేనివి, బుద్ధుని దయారసపోషకములైనవి యగు. హంసప్రాణరక్షణము, బింబిసారుని యజ్ఞపశువును విశనమునుండి రక్షించుట, మృతబాలుని గూర్చిన కథ మొ॥ ఉపాఖ్యానములు Light of Asia లోఁ జోటుచేసికొనినవి. అశ్వఘోషుని దృష్టి నాయకునియందు విషయవైముఖ్యముతోఁ గూడిన ముముక్షుభావము ప్రదర్శించుట కాగా అర్నాల్డు దృష్టి విశ్వభూతదయామూలకమైన నాయకప్రవృత్తి దయాచోదితమైన జ్ఞానవృత్తి నాశ్రయించి, దయాభావముచేతనే క్రమోన్మీలనము చెంది ఫలించి దయా ప్రేరణచే మఱల లోకోద్ధరణ మొనర్చినట్లు గ్రహించుటయైనది. ఆత్మసిద్ధిని పొందుటతో నాఁగక లోకాభ్యున్నతి నభిలషించు బుద్ధునియం దార్నాల్డు అశ్వఘోషుఁడు చూడని దయాభావోన్నతిని దర్శించి యావేశముతో వర్ణించియున్నాఁడు. వీరిలో నొకరు నివృత్తికి ప్రవృత్తి నంగముగా నిల్ప మఱియొకరు ప్రవృత్తికి నివృత్తి నంగముగా నిల్పినారు. ఇద్దఱును వారివారి దృష్టులచే నభినందనీయులే. వీరిరువురిలో తి. వేం. కవులు రసవిషయమున నార్నాల్డునే యొజ్జబంతిగాఁ బెట్టుకొనినారు.

బుద్ధచరిత్రమందలి యితివృత్తమంతయు Light of Asia ననుసరించియే వ్రాయఁబడినది. ఆశ్వాసవిభజనాదులు కూడ కొన్నిఁట యథాతథముగా నొనర్పబడినవి. Light of Asia 8 అధ్యాయములలో (Books) రచింపఁబడఁగా బుద్ధచరిత్రము 6 ఆశ్వాసములలో ముగింపఁబడినది. కాని మూలమునందలి యే ప్రధానాంశమును ఇందువదలఁబడలేదు. మూలమునందు చిన్నవిగా నున్న ద్వితీయ

తృతీయాధ్యాయములను పంచమ షష్ఠాశ్వాసములను కలిపివైచి ద్వితీయ చతుర్థాశ్వాసములుగా కవులు నిర్మించుటచే నాయాశ్వాససంఖ్యావ్యత్యాసము గోచరించుచున్నది. విషయవిభాగసౌలభ్యము, విభాగమునం దొక స్వయంసమగ్రత గల్పించుట, నాతివైపుల్యము నాతిసంగ్రహమునై యుండుట యనెడిగుణములచే తెలుఁగున నాశ్వాసవిభాగ మౌచిత్యభరితమై యొప్పుచున్నది.

Light of Asia లోని భావములు కాక సంస్కృత బుద్ధచరిత్రమునుండి కవులు దాదాపు పదిచోట్ల అశ్వఘోషుని భావములను అనుసరించి యిందుఁబొందుపఱిచినట్లు పరిశీలించినచో తేలుచున్నది. సంస్కృతమునందలి ప్రథమ ద్వితీయ చతుర్థషష్ఠాష్ట మైకాదశద్వాదశత్రయోదశాధ్యాయములనుండి రమ్యములైన కథార్థములను గ్రహించినను అష్టమద్వాదశాధ్యాయములను చాలవరకుఁ దెలుఁగునకుఁ దీసికొనివచ్చిరి. సంస్కృతమునుండి యీకావ్యమునఁజేరిన నూతన ఘట్టములు ఈ క్రిందఁ బేర్కొనఁబడుచున్నవి. .1 కావ్యారంభమునందలి నగరవర్ణనము 2. పురోహితనందనుఁడు బుద్ధునికొనర్చు హితబోధ, 3. మహాభినిష్క్రమణానంతరము అంతఃపురజనము బుద్ధవియోగమువలన దుఃఖించుట, 4. సిద్ధార్థుఁడు బింబిసారునితో 'కామనిగర్హణము' గూర్చిచేసిన యుపన్యాసముమొదలగునవి. అంతియగాక అసితఋషిభాషణములు, సర్వార్థసిద్ధునిజన్మసమయమున లోకమునఁ గానఁబడిన శుభలక్షణములవర్ణనము; పుష్పవనవిహారవర్ణనము అనువానిని కవులాంగ్లమూలముకంటెఁ బెంచిరచించిరి. మారవిజయఘట్టము, సిద్ధార్థుని విద్యాభ్యాసవర్ణనము, నగరవిహారసన్నివేశములు, సిద్ధార్థుఁడు మహాభినిష్క్రమణానంతరము చెన్నునికిచ్చు సందేశము, అరాడముని తాత్త్వికోపదేశము, బుద్ధుని ధర్మబోధ- వీనిని కవులు మూలముకంటె సంగ్రహించి రచించిరి.

1. కావ్యారంభమునందలి నగర వర్ణనము :

ప్రాచీనగీర్వాణాంధ్రకావ్యములు నగరవర్ణనముతోఁ దఱచు ప్రారంభ మగుట యొక సంప్రదాయము. తత్సంప్రదాయపోషణార్థమై యీవర్ణన మశ్వఘోషుని ననుసరించి యొనర్పఁబడినది. ఇది ఆర్నాల్డులో లేదు. ఇది భావానువాదము: అందు మూలమునందలి భావము గైకొనుచు తద్విరుద్ధముగాఁ దెలుఁగున ననువదించి స్వీయకల్పనాచమత్కృతి ప్రదర్శించుట కుదాహరణము నగరకాంతాసౌందర్యవర్ణనము.

(a) మూలము :

శ్లో. "రామా ముఖేన్దూన్ పరిభూత పద్మాన్
దృష్ట్వాభిమానీ శిశిరాంశురేవ
సంతాప యోగా దివ వారి వేష్టుం
పశ్చాత్సముద్రాభిముఖం ప్రతస్థే." —సం. బు. 1-6.

అనువాదము :

మ. తనపై నేస్తము గల్గు తమ్ములకు సంతాపంబు గావించు వా
రని కాంతాముఖ చంద్రులం జెనక నిత్యంబుం బతంగుండు త
ద్ఘన సౌధంబులు త్రోవఁబోవుచుఁ గడుం గాలించియుం జూచి కా
నని చింతం బడుచుండుఁ బ్రత్యగుదధిం దాఁ గోపరక్తాంగుఁడై.
—బుద్ధ. ప్ర. 54.

సంస్కృతమున సంతాపయోగముచే పశ్చిమాంబుధిఁ గ్రుంకినది చంద్రుఁడు. తెలుఁగున సూర్యుఁడు. రామాముఖేందుబింబములను గాంచి యీర్ష్యతో చంద్రుడు నరాభూతుఁడైనాఁడనుటవలన స్త్రీముఖ రామణీయకము చంద్రాతిశాయిగాఁ జెప్పఁబడుచున్నది. మూలమున నది యొక్కటే ప్రయోజనము. తెలుఁగునఁ జేసిన మార్పువలన బహ్వర్థప్రయోజనములు సాధితములగుచున్నవి. 1. కాంతాముఖములు చంద్రబింబములనుట, 2. స్త్రీ లసూర్యంపశ్యలనుట, 3. భవనరాజములున్నతములనుట, 4. అవమానముచే మొదట చింతించినను కాంతలు కానరాలే దను క్రోధముచే సూర్యుఁడు రక్తాంగుఁడయ్యెనని వర్ణించుట, 5. 'ఘనసౌధంబులత్రోవ' యనుటలోని శ్లేషయందు "మేఘములనెడి భవనములుగలత్రోవ" యని యేర్పడి అకాశమనెడి యర్థముస్ఫురించుట. మూలాతిశయముగా నాంధ్రీకరించెడి కవులప్రతిభ నీ పద్యము చాటిచెప్పుచున్నది.

(b) మూలభావము నౌచిత్యదృష్టితోఁ బెంచి రచించుట కుదాహరణము : నగరహర్మ్యముల వర్ణనము.

మూలము :

"సితోన్నతత్వేన గుణేన హృత్వా
కైలాసశైలస్య యదగ్రశోభాం
భ్రమా దుపేతాన్ వహ దంబువాహాన్
సంభావనాం కిం సఫలీ చకార." —సం. బు. 1–3.

అనువాదము :

చ. అమితసితోన్నతంబు లగు హర్మ్యములం గని వెండికొండ నె
త్తము లను భ్రాంతినొంది జలదంబులు నిచ్చలు విశ్రమించుచున్
బ్రమదమున న్నయంబునఁ బ్రభావమున న్రజతాద్రితోడఁ దు
ల్యమని తలంచు పౌరుల యథార్థమనీషలఁ జేయుఁ దత్పురిన్.

—బుద్ధ. 1-51.

ఇందలి చివరి రెండుపాదము లించుమించు అమూలకములే. మూలమున భవన శిఖరములు సితోన్నతత్వగుణమాత్రముచే కైలాసతుల్యము లగుచుండ తెలుఁగున ప్రమదము, నయము, ప్రభావము అనెడి గుణములు కూడ చేర్పఁబడినవి. మూల మున యథార్థబుద్ధి అచేతనము లగు మేఘములకుఁ గల్గుచున్నది. అందుఁ గల ననౌ చిత్యమును తొలఁగించి తెలుఁగునఁ బౌరులకు యథార్థమనీషిత్వము గల్పింపఁబడి నది. కవుల యౌచిత్యపోషణ మపారమీ పద్యమున.

2. పురోహితనందనుని ప్రబోధము :

సంస్కృత బుద్ధచరితములో నిది చతుర్థాశ్వాసమునఁ గలదు. నగరవిహార మందు సిద్ధార్థుఁడు వృద్ధరోగశవాదులఁ గన్గొని సంవేగమానసుఁడై యున్న తరుణ మున నగరోద్యానవనమున స్త్రీవిలాసములఁ జూడఁ బంపఁబడును. అచ్చట విషయ సుఖభోగానుకూలప్రబోధము పురోహితుఁడు రెండుపర్యాయము లొనర్చును. దానికి బుద్ధుఁడు సముచిత సమాధాన మిచ్చును. కవు లీపురోహితనందనుని ప్రబోధము ద్వితీయాశ్వాసమున ననుసంధించిరి. ఇం దాతఁడు సిద్ధార్థుని హృదయమును వివాహో న్ముఖముగా నొనర్చుటకు ప్రబోధించెను. ఈపురోహితుని పాత్రకల్పనకు సంస్కృత బుద్ధచరిత్రము మూలమైనను కవులు మూలముకన్న కావ్యార్థముల నధికముగా నాపాత్రవలన సాధింపఁగల్గిరి. మూలమున ప్రబోధము విఫలమై వ్యర్థమగుచుండ తెలుఁగున సఫలమై నాయకుని వివాహమున కొప్పించినది. ఈఘట్టమునందలి కొన్ని యనువాదాంశములు :

(a) ఛాయానువాదము :

శ్లో. అహితాత్ ప్రతిషేధశ్చ హితే చానుప్రవర్తనమ్
వ్యసనే చాపరిత్యాగ స్త్రివిధం మిత్రలక్షణమ్. —సం. బు. 4-64.

క. హితమార్గము గఱపుటయు న
హితమార్గమునందు నడువనీకుంటయు దు
స్థితి గతియును దుర్వ్యసనా
వృత్తియును మరలించుటయు సుహృల్లక్షణముల్. —బు. 2-22.

(b) కొన్నిశ్లోకముల తాత్పర్యభావము నొక్కవృత్తమునఁ దెనిఁగించుట :

శ్లో. కామం పరమితి జ్ఞాత్వా దేవోఽపి హి పురన్దరః
గౌతమస్య మునేఃపత్నీ మహల్యాం చకమేపురా.

శ్లో. అగస్త్యః ప్రార్థయామాస సోమభార్యాం చ రోహిణీం
తస్మాత్తత్సదృశీం లేభే లోపాముద్రా మితి శ్రుతిః.

శ్లో. బృహస్పతే ర్మహిష్యాం చ జుహ్వాత్యాం జుహ్వతాంవరః
బుధం విబుధ కర్మాణం జనయామాస చంద్రమాః.

శ్లో. ఉతథ్యస్య చ భార్యాయాం మమతాయాం మహాతపః
మారుత్యాం జనయామాస భరద్వాజం బృహస్పతిః.

శ్లో. కాలీం చైవ పురాకన్యాం జలప్రభవసంభవాం
జగామ యమునా తీరే జాతరాగః పరాశరః.

—సం. బు. 4 సర్గ. శ్లో. 72, 73. 74. 75, 76.

సీ. జడదారిసకితోఁడ జతగూడె వేవేలు
వెలఁదులు గలవాఁడు వేల్పుతేఁడు;
జాబిల్లిపడతితో సరసంబు గావించెఁ
దపసి లోపాముద్రధర్మభర్త;
దైవతగురుని కాంతాలలామము తోడఁ
గవగూడె శిష్యుఁడై కలువతేఁడు;
ఔతథ్యఋషిపత్ని యగు మరుత్పుత్రితో
సావాస మొనరించె దేవగురుఁడు;

తే. గీ. దాశపుత్త్రికతోడఁ బరాశరుండు
పట్టపవలు నదీతటీభాగమందు
దగులు గావించె; నిన్ని వింతలును దలఁపఁ
గామమును గెల్చువారు లోకమునఁ గలరె? —బు. ద్వి. 31.

అంతఃపుర విలాపము :

"అంతఃపుర విలాపః" అనెడి నామముతో నశ్వఘోషుని బుద్ధచరితమున 87 శ్లోకములుగల అష్టమాధ్యాయము చాలవఱకు తెలుఁగున సంగ్రహముగ ననువదింపఁబడినది. పునస్సమాగమాకాంక్షావిరహితులై శుద్ధోదన యశోధరాదులు సిద్ధార్థుని కొఱకై విలపించుట యిందలి యితివృత్త మగుటచే నిది కరుణరస ప్రధానమైనది. పఠితకు కరుణమిశ్రితమైన దయాభావము పాత్రలయందు స్ఫురించు నట్లు చిత్రించుట యిందలి శిల్పము. ఇందు యశోధరా శోక మతిరసవత్తరముగ వర్ణితమై యున్నది. ఉ॥ సర్వార్థసిద్ధుని నరణ్యమున దింపివచ్చిన కంటకాశ్వము నుద్దేశించి విలపించుచు యశోధర యనినమాటలు భావానువాదమునకుఁ జక్కని యుదాహరణములు :

శ్లో. వరం మనుష్యస్య విచక్షణో రిపు
ర్నమిత్ర మప్రాజ్ఞ మయోగపేశలమ్
సుహృద్బ్రువేణ హ్యవిపశ్చితా త్వయా
కుతః కులస్యాస్య మహానుపప్లవః.

శ్లో. ఇమా హి శోచ్యా వ్యవముక్తభూషణాః
ప్రసక్తబాష్పావిలరక్తలోచనాః
స్థితేఽపి పత్యౌ హిమవన్మహీసమే
ప్రనష్టశోభా విధవా ఇవ స్త్రియః.

శ్లో. అనార్యకర్మా భృశ మద్య హేషతే
నరేంద్ర ధిష్ణ్యం ప్రతిపూరయ న్నివ
యదాతు నిర్వాహయతిస్మ మే ప్రియం
తదా హి మూకస్తురగాధమోఽభవత్. —సం. బు; 8-35, 36, 40.

ఆ. వె. తెలివి లేని స్నేహితులు గల్గుటయెకంటెఁ
దెలివి గల్గు శత్రుకులమ మేలు;
మిత్రరూప మైన శత్రువవై శాక్య
వంశ మంతరింప వచ్చి తీవు.

చ. అవిరళబాష్పపాత గమితారుణభావము లైన కన్నులున్
రవణము లుజ్జగించి నునురాణకుఁ బాసిన మేనుఁగల్గునీ

యువిదలు నీకతంబున నలో యని యేడ్చుచు భర్తయుండియున్
ధవుఁడు గతించియుండిన యనాథలచందముఁ బొంది రర్వమా!

చ. మగటిమి లేని యీతెలివిమాలిన కృత్యముఁ జేసి యిప్పు డి
ప్పగిది నరేంద్రసద్మ మద్రువన్ సకిలించిన నేమిలాభ ? మ
మ్మగల విభూషణంబు ధృతిమంతునిఁ దోడ్కొనిపోవువేళ నీ
మొగమున ముల్లునాటెనె ప్రబోధ మొనర్పకపోతి మమ్ములన్.

—బుద్ధ. తృ. 155-156.

4. కామనిగర్హణము :

"కామనిగర్హణః" అనుపేరుతో సంస్కృతమున నేకాదశాశ్వాస మశ్వఘోషునిచే రచింపఁబడెను. సన్న్యాసియై యున్న సిద్ధార్థునిఁ గాంచి బింబిసారుఁడు జాలిపడి సంసారసుఖములఁ గైకొను మని ప్రబోధించెను. బుద్ధుఁడు కామనిగర్హాణాత్మకమైన యుపన్యాస మొనర్చి తన కృతనిశ్చయమును దెల్పెను. ఈసన్నివేశము సిద్ధార్థుని యకుంఠితదీక్ష కొక్కపరీక్ష. కామనిగర్హణముచే నతని సుస్థిరమైన మనస్సంకల్పము ద్యోతమాన మగుట యీసన్నివేశఫలము. జ్ఞానవీర ముజ్జ్వలమై భాసించుట ప్రయోజనము. రుచిరార్థదము లగు సూక్తుల నెన్నుకొని కవులను వదించియుండుట యిందలి ప్రత్యేకత. మచ్చునకు :

శ్లో. అన్ధాయ యశ్చ స్పృహయే దనన్ధో
బుద్ధాయ ముక్తో విధనాయ చాఢ్యః
ఉన్మత్తచిత్తాయ చ కల్య చిత్తః
స్పృహాం స కుర్యా ద్విషయాత్మకాయ. —సం. బు. 11-53.

క. అంధు ననంధుఁడు, నిర్ధను
నిం ధని, యున్మత్తచిత్తునిం దృఢమతియున్
సంధింపని గతి దుర్విష
యాంధులతో మైత్రిఁ జేయు ప్రాజ్ఞుఁడు గలఁడే. —బు. 4-79.

అసితఋషిభాషణములు :

ఆంగ్లమూలమందలి రసార్ద్రములగు వాక్యములను యథాతథముగ ననువదించి, గీర్వాణమునుండి యలంకారవైభవము వెలార్చెడి నాల్గైదు శ్లోకములను

గైకొని యీఘట్టమును కవులు విపులరమణీయముగా నొనర్చి యుండిరి. ఆంగ్లానువాదమున కుదాహరణము :

"...........Thou art Budh
And thou wilt preach the Law and save all flesh
Who learn the Law, though I shall never hear
Dying too soon, who lately longed to die."

Light of Asia I-5p.

క. బుద్ధుఁడ వై జగముల కవి
రుద్ధం బగు జ్ఞాన మిచ్చి ప్రోచుచును నసం
బద్ధపు మతములఁ ద్రుంచుచు
నిద్ధచరిత నెగడఁ బుట్టి తీవు మహాత్మా !

క. ఏ నతివృద్ధుఁడ నగుటన్
జ్ఞానము నీవలనఁ బొందఁగా నోఁచఁగ లే
దైనను జగమెల్లను ని
న్నాని తరించుటకు శంకయుండదు దేవా ! —బు. ప్ర. 108-109.

సంస్కృతానువాదమునకు :

శ్లో. ప్రజ్ఞాంబువేగాం స్థిరశీలవప్రాం
సమాధి శీతాం వ్రతచక్రవాకం
అస్యోత్తమాం ధర్మనదీం ప్రవృత్తాం
తృష్ణార్దితః పశ్యతి జీవలోకః. —సం. బు. 1-71.

ఆంధ్రానువాదము :

క. వ్రతములు చక్రంబులుగాఁ
బ్రతిభ జలంబుగ, సమాధి పారంబులుగా
వితతమగు ధర్మనది నీ
రితఁడే త్రావించువాఁడు తృష్ణార్దితులన్. —బు. 1-113.

రమణీయభావము లేమూలమున నున్న వానిని గ్రహించి గ్రథించెడి కవుల యాశయమే యీవిస్తృత రచనకు హేతువై యుండు నని భావింపవచ్చును.

6. సర్వార్థసిద్ధుని జన్మకాల శుభసూచనములు :

తిరుపతివేంకటకవు లీఘట్టమున సంస్కృతమునుండి గైకొనిన పెక్కు శ్లోకముల భావములను పరిమితవృత్తములలోనే నిమిడ్చి రచించియుండిరి. ఉదా : సం.బు. లోని 2 సర్గలోని 1 నుండి 9 శ్లో. భావము-బు.చ. 1 ఆశ్వా. 125 పద్య. సీసపద్యమునందు కుదింపఁబడినది. అంగ్లమున నశుభసూచనల ప్రసక్తి సూచ్య ప్రాయముగా నుండ దానిని సంస్కృతాధారమునఁ బెంపుచేసి ప్రకృతిపై మహాత్ముల ప్రభావము ప్రసరించినట్లు చిత్రించెడి ప్రాచీనకావ్యమర్యాదను నిలువఁబెట్టి రని యిచ్చట చెప్పవచ్చును.

7. పుష్పవన విహారము :

ఇది అశ్వఘోషుని కావ్యమునుండి గైకొనిన ఘట్టము. కామవిలాసముల నుత్కటముగా నాయకునిముందు బ్రదర్శింపించి చలింపని ధృతిని యతనియందు వ్యంజింపఁజేయుట యీఘట్టమువలని ప్రయోజనము. మూలమునందు విపులముగా నున్న స్త్రీవిలాస వర్ణనలలోఁ గొన్నిఁటినిఁ గైకొని కవులు ద్వితీయాశ్వాసమున రచించిరి. ఉదా: ఉపమాలంకారము :

శ్లో. అథనారీజనవృతః కుమారో వ్యచర ద్వనమ్
వాసితాయూథసహితః కరీవ హిమవద్వనమ్. —సం. బు. 4-27.

క. సరసిఁ గరణీవృతం బగు
కరిపగిది పురస్సహస్ర కాంతలనడుమన్
ధరణీంద్రకుమారుండును
గరము ప్రకాశించెఁ బుష్పకాననమందున్. —బు. ద్వి. 103.

8. మారవిజయఘట్టము :

ఆంగ్లగీర్వాణముల ననుసరించి యీభాగము తెలుఁగున నాతివిపుల మయ్యు సారవంతమై యొప్పుచున్నది, మన్మథునిధాటి కెదురొడ్డి నిర్వాణపదము నందుకొనిన బుద్ధుని తపశ్చర్య కిది పోషకమై వరలుచున్నది. శృంగారరౌద్రరసాభాసము లిందు భాసించి అంగిరసమునకుఁ బుష్టి కల్గించుచున్నవి. తపశ్చర్య యెచ్చట వచ్చినను ఇట్టి మన్మథపరీక్షలు కల్పించుట ప్రాచీనుల తపోవీర పోషణశిల్పమున నొక ప్రక్రియ. తద్రహస్య మెఱిఁగి దీనికి కథలో సముచితస్థాన మిచ్చి కవులు పోషించియుండిరి.

9. సిద్ధార్థుని విద్యాభ్యాసము : Light of Asia లో విపులముగా నున్న యాఘట్టము సారవంతముగను, సంగ్రహముగను దెనుఁగునఁ దేఁబడినది.

10. ఇతరములు : తిరుపతివేంకటకవులు మూలమునందు విపులముగా పెక్కంశముల నౌచిత్య మెఱిఁగి సంగ్రహించి తమకావ్యములందు రచించిరి. వానిని పరిశీలకులు గుర్తించుట సులభము.

బుద్ధచరిత్ర మాంగ్లభాషనుండి యనువదింపఁబడినను భాష, భావము, శైలి, స్వతంత్రకావ్యములందువలెనే సహజమై యొప్పారుచున్నది. అన్యభాషాకావ్య తాత్పర్యమును ప్రతిభచే నాకళించుకొని పునస్సృష్టివలె నొనర్చిన కవులు నిజముగా నభినందనీయులు. అనువాదముతోపాటు స్వీయకల్పనాశక్తిచే కావ్యమునం దొనర్చిన మార్పులలో, కొన్ని అతిరమణీయములుగా నున్నవి.

1. బుద్ధుఁ డయోనిజుఁ డని అశ్వఘోషుని కావ్యము. యోనిజుఁ డని ఆర్నాల్డు. రెండవమతము ననుసరించి కవులు కథాస్వాభావికత్వమును రక్షించిరి.

2. గర్భిణీస్త్రీలు కాన్పునకుఁ బుట్టింటికిఁ బోవు నాచారము మాయాదేవిపట్ల వర్ణించి లుంబినీవనగమనమునకుఁ జక్కని హేతువును కవులు కల్పించిరి.

3. వసంతఋతువున ప్రకృతి జంతుసంతతిపై వేయు ప్రభావమును వర్ణించుచు కావ్యార్థములకును, కథాగమనమునకును, తోడ్పడునట్లు చేయుట : ప్రథమాశ్వాసమున సర్వార్థసిద్ధుఁడు వసంతశోభను జూచుటకై పురబహిర్భూములందలి వనములందు చరింప నిచ్చగించెను. తత్కార్యమునకుఁ గారణముగా ఋతువర్ణనము చేయుట యిందు గమనింపఁదగినది. లేనిచో—

తే. గీ. "పట్టణముకన్నఁ బల్లెయుఁ బల్లెకంటె
నుపవనంబును మఱియు నయ్యుపవనంబు
కంటె వనమును మేటిసౌఖ్యంబు గూర్ప
గలవి యై యొప్పె నామని బలియు కొలఁది."

(బు. ప్ర. 174) అను అమూల్య వర్ణనాంశమునకు స్థాన మెక్కడిది ? కల్పితకావ్యార్థ సంచయమంతయు నిరర్థకము కాదని యిందు తెలిన సారాంశము.

4. నాయకునియందు ధీరవీరగుణ ముద్దీపించునట్లు సుప్రబుద్ధునిచేఁ గల్పింపఁబడిన స్వయంవర పరీక్షలయందు సిద్ధార్థుని పరాక్రమము రసవంతముగ వర్ణితమైనది.

5. మనోభావ సంఘర్షణకు అమూలకమైన ఉదాహరణము :

మ. ఒకకొం తేగును, సంశయించును; సముద్యుక్తత్వముం జెందు వే
ఱొకకొం తేగు, యథాస్థితిం గను; నిరుద్యోగమ్ము వాటించు; వె
న్కకుఁ దోతెంచుట కిచ్చగించు నఁట; సన్న్యాసార్థియే యౌనుగా
కకటా! యెవ్వనికేని శక్యమగునా? యర్ధాంగి వర్జించుటల్.

—బు. 3-69.

6. సూర్యోదయ సూర్యాస్తమయ వర్ణనములు కల్పితములై వర్తిల్లుట మఱియొక విశేషము. ఉదా : తృతీయాశ్వాసమునందలి సూర్యాస్తమయ వర్ణనము :

శా. సిద్ధార్థుడిఁక నేటిరాత్రి మొద లాసింపండు సంసార మా
నర్థజ్ఞానమునం జగం బఖిలము న్సంధింప సన్న్యాసమ
న్సద్ధర్మంబు వహించు నంచుఁ బృథివిం జాటించి యాపై నుద
న్వద్ధామస్థులకు న్వచింపఁ జనె నా వారాశిఁ జేరె న్వడిన్. —బు. 3.15.

"తరుణి ననన్యకాంత" యను పద్యము రచించిన పెద్దన ప్రభావ మిందు స్పష్టము. సిద్ధార్థునికి దివ్యదృష్టి యొదవినపిదప చతుర్థాశ్వాసమున వర్ణితమైన సూర్యోదయ వర్ణనము ప్రకృతిపురుష పరస్పర ప్రభావనిరూపణ సమర్థమై యలరారుచున్నది.

7. బుద్ధధర్మబోధసుధామృతమునందలి క్లిష్టతరము లగు, తాత్త్వికబోధలను Light of Asia ననుసరించి అరటిపండొలిచి చేతికిచ్చినయట్లు సరళసుందరముగా రచించుట కవులసామర్థ్యనకుఁ జక్కని తార్కాణము. కొన్ని యుదాహరణములు :

బుద్ధుఁడు నిర్వాణకాంక్షులకుఁ జెప్పిన నాల్గుతత్త్వములు :

(a) ప్రథమతత్త్వమున నొక్క పద్యము.

"The First Truth is of Sorrow. Be not mocked!
Life which ye prize is long-rawn dagony;

Only its pains abide; its pleasures are
As birds which light and fly.'' —Book VIII-F 147p.

చ. ప్రతి నరజీవితమ్ముఁ గడుబాములపా లని నమ్ముఁ డుద్భవ
స్థితి మొద లెన్నియో కలుగు జీవునకుం దురవస్థ; లెన్నఁడే
నతితరసౌఖ్య మబ్బినను నయ్యది పక్షివిధమ్మున న్రయో
ద్గతిఁ గనుఁగాని శాశ్వతము గా దది మీ కనుభూతమౌ కదా!
—బు. 6-49.

(b) ద్వితీయతత్త్వమున నొక పద్యము :

"The Second Truth is Sorrow's Cause. What grief
Springs of itself and springs not of Desire ?
Senses and things perceived mingle and light
Passion's quick spark of fire." —(Book VIII-147p.)

తే. గీ. సర్వదుఃఖమ్ములకును దృష్ణయె ప్రధాన
కారణంబు తనంతన కల్గు దుఃఖ
మెయ్యదియు నెందుఁ గావరా దింద్రియమ్ము
లర్థములును మనోవృత్తి నలముఁజేయు. —షష్ఠా. 56.

(c) తృతీయ తత్త్వమున నొక పద్యము :

"Then sorrow ends, for Life and Death have ceased;
How should lamps flicker when their oil is spent ?
The old sad count is clear, the new is clean,
Thus hath a man content" —(Book VIII. 149p,

తే. గీ. స్వచ్ఛముగ వెల్గి దీపంబు చమురుతోడ
న శమియించెడి చందమ్మునఁ గ్రమముగఁ బొ
సంగుఁ గర్మరాహిత్యంబు జన్మరహిత
తయును సమకాలమున నింత తథ్య మరయ. —షష్ఠా. 61.

(d) చతుర్థతత్త్వమైన నిర్వాణపథమునకుఁ గొన్ని సోపానములు చెప్పఁబడినవి. అందు మూఁడవదానిని గూర్చిన పద్యము :

"The Third is Right Discourse. Govern the lips
As they were palace-doors, the King within;
Tranquil and fair and courteous be all words
Which from that presence win." —Book VIII. 150p.

తే. గీ. "భూపతి వసించు కోటతల్పుల విధమునఁ
దమ పెదవు లెల్లపుడు మూయఁ దలఁపవలయు
నెప్పుడేనియునుఁ దెరచిర యేని వచ్చు
పల్కులన్నియు శాంతిమైఁ బరఁగవలయు." —షష్ఠ. 66.

9. తిరుపతివేంకటకవులు ఆయాసమయములం దుచితమైన మనఃప్రవృత్తులను సుస్పష్టముగాఁ జిత్రించి నాయకపాత్రను క్రమోన్మీలితముగాఁ దీర్చిదిద్దిరి.

కపిలవస్తుపురాధీశుఁ డగు శుద్ధోదనుని పట్టమహిషి దైవసంకల్పమున గాంచిన స్వప్నము బుద్ధభగవానుని యవతారమునకు నాంది నాలపించినది. స్వాప్నికఫల దర్శకులు తదర్థ వివరణము సేయుచు, నిట్లు ప్రాక్రుచ్చిరి :

"ఆ పుణ్యాత్ముఁడు సార్వభౌమ పదవిం బ్రాపించి సామంతభూ
మీపాలు ర్దనుఁ గొల్వ నెల్లరును మేల్మేలంచు శ్లాఘింప నా
శాపాలేశుని భంగి యీ భువనము న్పాసించుఁ గాదేని వి
ద్యాపూర్ణుం డయి సర్వలోకులకు నిత్యానంద మిచ్చున్ గృపన్."-ప్ర.77

అం దెట్టివాఁడైనను సిద్ధార్థుఁడు ప్రసిద్ధుఁడే యగును. మహారాజును, ప్రజలును, అతఁడు సమ్రాట్టు కావలె నని ఆశించిరి; దేవతలును, తపస్వులు నాతఁడు జ్ఞాని కావలె నని వాంఛించిరి. మహాయోగి యగు అసితుఁడు బుద్ధుని జన్మము విని కపిలవస్తుపురమునకు వచ్చి బాలుని దర్శించి—

"బుద్ధుఁడవై జగముల కవిరుద్ధం బగు జ్ఞాన మిచ్చి ప్రోచుచును నసం
బద్ధపు మతములఁ ద్రుంచుచు నిద్ధచరిత నెగడఁ బుట్టితీవు మహాత్మా !"
—ప్ర. 108;

అని అతని జన్మహేతువును నిరూపించి తెల్పినాఁడు.

సిద్ధార్థునకు పుట్టుకతోడనే సూక్ష్మమైనబుద్ధియు, నిశితపరిశీలనా పాటవమును, శీలసంపదయు, దయామయత్వమును నైజముగా నుదయించినవి. సర్వవిద్యా

విశారదుఁడయి సర్వభూతదయామయుఁడై చరించినాఁడు. మహారాజునకు గారాబపు బిడ్డఁ డగుటచే కష్టమనునది లేశమైన నెఱుఁగఁడు.

"శోకము బాధయుఁ గన్నీ
రాఁకలి యను శబ్దములన యతఁ డెఱుఁగుం; ద
ద్వ్యాకులత యించుకేనియు
నా కరుణాకరున కెఱుక యనఁదగ దొకటన్." —ప్ర. 144.

సిద్ధార్థుఁ డొకనాఁడు మిత్రులగు దేవదత్తాదులతో హిమవత్పర్వత పాదమున విహరించుచుండెను. ఆకసమున నంచలబారులు రమ్యముగా ధవళతోరణములవలె నొప్పారుచు నెగురుచుండెను. దేవదత్తుఁ డొక యంచను బాణమునఁ గొట్టెను. అది విలవిలఁ దన్నికొనుచు సిద్ధార్థునిముందు పడెను. దానిని గాంచిన తోడనే సిద్ధార్థుని హృదయమున వాసనామయముగా నున్న దయ మేల్కాంచినది.

"గిలగిల గొట్టికొనఁగ న
య్యలఘుం డిది యేల యిట్టు లార్తింగను? న
మ్ములికిం బుచ్చితిగాఁదే
కలిగెనె వేతెద్దియేనిఁ గారణ మనుచున్."

"తన కాయమునం దయ్యలుఁ
గును గ్రుచ్చియుఁ బుచ్చియును బుగుల్కొను నార్తిన్
దనలో నెఱింగి యనుభవ
మునకుం దెచ్చుకొని మిగుల మొనసిన కరుణిన్."
—ప్ర. 151, 152,

అరటి పూరేకులవంటి ఆ యంచ రెక్కలను నేర్పుతో నిమురుచు, వనౌషధులఁ బూసి దాని బాధను కొంత యుపశమింపఁజేసెను. లౌకిక విభావములఁ గాంచిన తోడనే తాదాత్మ్యవస్థ నొంది ద్రవీభూతుఁడగు సిద్ధార్థుఁ డసమానదయామయుఁడు, రసార్ద్ర హృదయుఁడు, ఉత్తమ సంస్కారి.

దేవదత్తుఁడు కర్కశుఁడై పక్కి నడిగినాఁడు; తనదని వాదించినాఁడు. దానికి సిద్ధార్థుఁడు "మృగయావినోదంబునం బాణహతం బగు ప్రాణి యేదేనియుఁ

ప్రాణి యున్నంత దనుక నాహతకునిది కా" దను న్యాయముచే నాతని వాదమును ఖండించుచు :

"దైవవిహితమైన దయకల్మి నాకు నీ
యంచ బ్రతుకఁజేయు నంతపాటి
యవసరంబు గల్గె, నకార్ణమున నా
యదియె యిద్ది యొరుల దగుట యెట్లు ?"

అని దయా ప్రేరితమైన యుత్సాహమును బ్రకటించెను. న్యాయాధినేతయు నట్టి ధర్మమే నిర్ణయించి ప్రకటించినాఁడు. ఈ ఘట్టము సిద్ధార్థుని జీవితములో లోతైన అనుభవమును దెచ్చిపెట్టి జీవకారణ్యము నందలి గాంభీర్యమును అతనియందు సంతరించి పెట్టినది.

తండ్రి పంపున పట్టణ దర్శనార్థ మేగిన సిద్ధార్థునకు ప్రకృతిలోని హింసాత్మక ప్రవృత్తి గోచరించినది. అది యతనిలోని అహింసాతత్వమును ప్రబోధించి పటిష్ఠ మొనర్చినది. ఆతనికి విభావము లయిన దృశ్యములు :

"అతితికాయలు గాయ నవని దున్నుచుఁ గష్ట
పడుచుండు కాసరద్వయము నొకటఁ
జెన్నుగా దున్నిన చేలలో విత్తుల
వైచుచుండెడు కాపుఁవాండ్ర నొకట
ఫలపుష్ప వితతులఁ దులఁదూఁగి నేలకు
నంటుచున్నట్టి వృక్షాళి నొకట
వాని ఫలంబుల భక్షించి సుఖియించు
కీరాదిక పతత్రివార మొకటఁ
బట్టి చీమల మ్రింగెడి బల్లిని, మఱి
దాని మ్రింగెడు పాము, నద్దాని మ్రింగు
వైనతేయునిఁ, జిన్న చేఁపలను మ్రింగు
పెద్ద చేఁపలఁ దిను పక్షిబృంద మొకట;"

"వానిఁ బట్టి భక్షించెడి శ్యేనములను
నొకట వేఱొక్క యెడ మనుష్యులను దిను న, ఘోరులను........"

—ప్ర. 195, 196.

జూచుటచే నాతనికి లోకమంతయు హింసాప్రవృత్తి ప్రధాన మనియే స్ఫురించినది. దయాహృదయమున నిర్వేదము జనించినది. అది జ్ఞానమార్గము నావిష్కరించి నది. వెంటనే తీవ్రవిచారముద్రను వహించి ప్రక్కనున్న నేరెడు చెట్టుక్రింద కూర్చుండి యతఁడు ధ్యాననిశ్చలుఁ డయ్యెను. ధ్యానవిఘ్నము నాపాదింప యత్నించు నతని మిత్రులఁ గాంచి అంబరవాణి :

"ఈతఁడు పర సంరక్షణ
కై తా జన్మంబు నెత్తి నట్టిఁడు సుగుణా
న్వీతుఁడు మహానుభావుఁడు
చేతమ్మునఁ గరుణఁ దక్కఁ జేర్పఁ డితరమున్." —ప్ర. 200.

అని అతనియందు సంపూర్ణదశ నొందిన దయాభావమును నిరూపించి చెప్పినది. అది యతనికి పై మెట్టున కధికారము సంతరించినది. అతని చిత్తము తత్త్వ జ్ఞానార్జన కున్ముఖమైనది. కన్యాబహుమాన ప్రదానోత్సవమునకుఁ ప్రబోధించు పురోహిత సుతునితో నతఁడు—

"పరిణయ మొల్లక నేన
స్థిర మగు సంసార మనెడు తెరువునఁ బడ కాం
తరమగు తత్త్వ జ్ఞానాం
తరమునఁ జరియింతు" నని పల్కినాఁడు. —ద్వి. 24.

సిద్ధార్థుఁడు ప్రకృతి విద్యార్థి. అతఁడు జీవితములోఁ బొందిన అనుభూతు లన్నిఁటిని నొక్క జ్ఞానమునుదప్ప - ప్రకృతినుండియే గ్రహించినాఁడు. జీవితము నాత్మోన్నత్యమునకును పరహితార్థమునకు నెట్లు వినియోగము చేయవలెనో స్వయముగా జ్ఞానవంతుఁడై నిశ్చయించుకొని అట్లే నడచి చూపి లోకమున కాదర్శవంతుఁడై నాఁడు.

అతని బ్రతుకుబాటను వెలుఁగుబాటకుఁ ద్రిప్పిన నిశితానుభూతులు మఱియు మూఁడు కలవు. అవి యాతఁడు కపిలవస్తు నగరమున నొంటిగా రథారూఢుఁడై వెడలుచుఁ గావించిన వృద్ధరోగశవ దర్శనములు. అని యతని హృదయమును వికలపఱిచి విరక్తి పథమును బట్టించినవి. దానికిఁదోడు మరునాఁ డాతఁడు వేటకు వెడలి యొక కొండగుహలో నొక సన్యాసినిఁ గాంచి, అతని వలన—

"అవని మోక్షేచ్ఛ గల వా రఖిలబంధు
పుత్ర మిత్ర కళత్రంబు పూరితమగు
సంసరణవార్ధిఁ బడకయే చనఁగవలయు
నుగ్రకాంతారములవంక కూరు విడిచి"

అని ప్రబోధముఁ బడయుటచే జ్ఞానేచ్ఛాగ్నికి సన్న్యాస మారుతము తోడై నట్లైనది. సతీవిలాస విషయాసక్తము లగు నింద్రియముల నతఁడు నిగ్రహించి వెనుకకు మరలించినాఁడు. అంతరముగా దైవప్రబోధము రింగున నతని చెవులలో మ్రోఁగినది. యశోధరకు వచ్చిన కల అతని మార్గమును స్థిరీకరించినది. కాల మాసన్నమైనది. మోహపాశంబులఁ ద్రెంచి, భార్యను వదలి, చెన్నునికిఁ దన యాశయముఁ దెల్పి, కంటకము నెక్కి నిష్కంటకముగా నతఁడు తపోవనముఁ జేరినాఁడు. రాజగృహనగర ప్రాంతములో సన్న్యాసివేషమున సత్యజిజ్ఞాసలో మునిఁగి భైక్షుకవృత్తితో తపోనిష్ఠతో జీవించినాఁడు. ఆతని నిష్ఠను గాంచి జనులతఁడు సర్వసిద్ధుఁడని భావించిరి. కాని తానొక సాధకుఁడనని వినయముతోఁ బ్రతివారితోడను దెల్పెడివాఁడు సిద్ధార్థుఁడు. పుత్త్రశోకార్త యగు నొక తల్లికి దుఃఖావృతమగు లోక స్వభావమును నిదర్శనాత్మకముగా నిరూపించి చెప్పి—

"మరణంబు సర్వసామాన్యంబు దుఃఖంబు
గాంచని వారు లోకమున లేరు
నిజ మిది యనుమాట నీయంత నీకు గో
చరముగా నీయుక్తి నలిపినాఁడ
నీదృశ దారుణ ఖేదమ్ములకుఁ గత
మెద్దియో తెలియఁగ నెంచి నేను
దిరుగుచున్నాఁడఁ దెలియుటకై ప్రాణ
మైనను విడుచు సాహసము కలదు." —చతు. 28.

అని తన జ్ఞానసాధనౌత్సుక్యమును బ్రదర్శించినాఁడు. జ్ఞానదీక్షను బూని సాధకునిగా ప్రాణత్యాగమునకైన నుత్సహించు సిద్ధార్థుఁడు జ్ఞానదయావీరుఁడు.

యజ్ఞపశువులు సవనమున హననము చేయఁబడుట మొదటిసారి చూచిన సిద్ధార్థుని యెదంద యేరై పోయినది. బింబిసారనృపతి చేయు యజ్ఞమును గాంచిన గౌతముఁడు ఋత్విజులతో—

"ప్రాణహననంబు గడు సులభంబు గాని
ప్రాణ మిచ్చుట మనకు సాధ్యంబు కాదు
ప్రాణరక్షణకై పాటుపడనివారు,
ప్రాణిపైఁ బ్రేమలేని వారలును గలరె."

"జీవములయాత్ర సంపూర్తి చేయకుండఁ
జంపువారికిఁ బాపంబు సంభవించు
జీవహింస యొనర్చెడి చేఁత సేయు
వారలకుఁ బాపముక్తి చేకూర దెపుడు." —చతు. 51. 52.

అని ప్రబోధించి జంతుసంహారము మాన్పించి అహింసను స్థాపించెను. బింబిసారునకు తన జ్ఞానపిపాసను గూర్చి తెల్పినాఁడు సిద్ధార్థుఁడు. అతనితోఁ గలిసి అరాడుఁడను మునిం జేరి మోక్షమార్గముఁ దెలిసికొనినాఁడు. ఆత్మ సాక్షాత్కార సాధనోత్సాహముతో ప్రయాగక్షేత్రమునకు నడచి పోయినాఁడు. నిత్యోపవాసాదులతో దేహముఁ గృశింపఁ జేసినాఁడు; జ్ఞానసాధనలోఁ దీవ్రతపస్సునకు గడఁగినాఁడు. శుష్క దేహము జ్ఞానసాధనపటువు కాలేదు. ఈసత్య మాతఁడు వారాంగనా వాక్యము వలన గ్రహించినాఁడు.

"బిగువుగ సారించితివేఁ
దెగుఁ దంత్రులు, వదలు చేసితేనిన్ సరిగాఁ
దగదు శ్రుతిగాన సమముగఁ
దగుగతి సారింపు మీ చితారు లతాంగీ." —చతు. 114.

అనునవి ఆమె పల్కులు. అవి సిద్ధార్థుని చెవులఁ బడినవి. జ్ఞానవాసనలు నిండిన అతని హృదయము నీరసములైన అప్పలుకులనుండి మహత్తరగంభీరార్థమును సారవంతముగా నూహింపఁ గల్గినది.

"నీచులనుండియుం దగిన నీతులు కొన్ని గ్రహింప వచ్చుఁ దం
త్రీచయముల్ బిగించి తెగఁ దీసినచో శ్రుతి వోవు భంగిఁ గా
ఠ్యాచరణంబు దేహమున కబ్బినవేళలఁ దత్త్వచింతయుం
దోఁచునె ? యే నెఱుంగ కిటు తోరముగా మెయిఁ జిక్కఁజేసితిన్"
—చతు. 117.

అని వితర్కించి సుజాత దైవదత్తముగాఁ దన కిచ్చిన క్షీరాదులను గ్రహించి తనువును జ్ఞానసాధనపటిష్ఠముగా నొనర్చుకొనెను. సుజాత యిచ్చిన క్షీరసారమునుండి అతఁడు నేర్చుకొనిన పాఠ మిది :

"క్రమముగా నైకజంతుసారంబు కతన
నీపదార్థంబు రుచ్యమై యెసఁగినట్లు
నైకజన్మంబు లెత్తి యనంతరంబ
జీవుఁడును ముక్తి యను ఘన స్థితికి వచ్చు." —చతు. 139.

నని. అతని కంటఁ గానఁబడిన ప్రతి లౌకిక సన్నివేశమును జ్ఞాన ప్రవృత్తికి విభావమై లోని సంస్కారములను బలీయ మొనర్చినది; అతని భావోత్కర్ష స్థితి జ్ఞానోదయాధికారము నందుకొని పండి పలించినది.

బుద్ధగయలో బోధివృక్షమునీడ సిద్ధార్థుఁడు బుద్ధుఁడైనాఁడు. తాను పొందిన జ్ఞానానుభూతిని బింబిసారాది ప్రముఖుల కమృతోపన్యాసములఁ బ్రబోధించినాఁడు. శిష్యు లసంఖ్యాకులైరి. చివర కతని భార్యాదులు కూడ శిష్యత్వము స్వీకరించినారు. అతఁ డమరజీవియు, జ్ఞానవీర జ్యోతియు నయి భరతఖండమును వెలుఁగుల నింపి విషయ దుఃఖితుల కఖండానంద మార్గమును జూపించినాఁడు.

10. నాయక పాత్రపోషణతోపాటు మిగిలిన పాత్రలను గూడ నత్యంత శ్రద్ధతో కవులు తీర్చిదిద్దిరి. ఉదా : శుద్ధోదనుని పాత్రను గైకొందము. అతఁడు పుత్త్రుని విషయాసక్తునిగా నొనర్చి చక్రవర్తిగాఁ జూడవలె నని సమస్త పురుషకారము వెచ్చించి యత్నించినవాఁడు. యోగిగా మారు సూచనలు తనయునియందు తలయెత్తినప్పుడెల్ల అతని హృదయ క్షోభ అంతయింత యనుటకు వీలులేదు. తత్సంఘర్షణ నాయువుపట్టుగాఁ జిత్రించి యా పాత్రకు కవులు జీవము పోసినారు. మూలమునందుకన్న తెలుఁగున నీపాత్ర సజీవమై సుస్పష్ట రేఖలతో శోభిల్లుచున్నది. ఇట్లే యశోధర పాత్రయు. ఉత్తమక్షత్రియవంశజగా, సుగుణఖనిగా, సౌమ్యమూర్తిగా, భార్యగా, తల్లిగా, విరహోత్కంఠితగా, బౌద్ధ భిక్షుకిగా కవులు పఠితల చిత్తముల కెక్కునట్లాపాత్రను చిత్రించి యున్నారు.

బుద్ధ చరిత్రము ననుసరించుటలో తి. వేం. కవులు మూలమునందున్న కథాంశములఁ గొన్నింటిని వ్యత్యస్తము లొనర్చుటయు, కొన్నింటిని వదలివేయు

టయు నొనర్చి యుండిరి. వాని నట్లే యాంధ్రీకరించినచో నీ కావ్య మింకను రస వత్తరముగా నుండెడి దనుటలో సంశయము లేదు. అట్టి వానిని గొన్నింటినిఁ బేర్కొందును.

1. సిద్ధార్థుని నగరయాత్రకు హేతువు లగు దేవతా ప్రబోధము, చిత్ర యను దాసి సంగీతము అనునవి మూలమున విపులముగా వర్ణితములై యుండ కవులు తెలుఁగున సూచించి మాత్రమే వదలిపెట్టిరి. ప్రథమనగరయాత్రయందు సిద్ధార్థుఁడు – "పూర్ణ రతోత్సవ మొప్ప నేఁగి కాంచెన్నరులందుఁ గల్గెడు విశేష ముల న్మది కెక్కునట్లుగన్." ఇట్లు కొంతవడి వీక్షించి మరలి స్వస్థానంబున కరిగి సుఖంబుండె" నని కవులు వర్ణించిరి. ద్వితీయ నగరయాత్ర యందుఁ గ్రమ ముగా రోగిని – శవమును – వృద్ధుని – గాంచినట్లు సంగ్రహముగా రచించి ముగించిరి. మూలముతోఁ బోల్చి చూచుచో నీ కథా ఘట్టములు నీరసములై యున్న వనుటలో విప్రతిపత్తిలేదు. మూలమున ఆర్నాల్డు కవిత్వావేశముతో నీ ఘట్టము లను వర్ణించి యున్నాఁడు. ప్రాకారత్రయావృత మైన సుందరప్రాసాదమున నివసించు రాజకుమారుఁడు నగరి వెడలి నగరమునం దడుగిడుటకు బలమైన హేతువులే కావలయును. అందు దేవతాప్రబోధ మొకటి. సిద్ధార్థుని చెవులలో సుర దివ్యవాణు లెల్లప్పుడు మారుమ్రోఁగు చుండెడివఁట! ఇది దాదాపు 50 పంక్తు లలో మూలమున నుండ, తెలుఁగున నిస్సారమైన యొక పద్యమై నిలిచినది. ఆంగ్లపంక్తు లెంత రసవత్తరములో కొన్నింటిని చూడుడు:

"O Maya's son! because we roam the earth
Moan we upon these strings; we make no mirth,
So many woes we see in many lands,
So many streaming eyes and wringing hands".

"Yet mock we while we wail, for, could they know,
This life they cling to is but empty show;
'T were all as well to bid a cloud to stand,
Or hold a running river with the hand".

"But thou that art to save, thine hour is nigh!
The sad world waiteth in its misery,

The blind world stumbleth on its round of pain;
Rise, Maya's child ! wake ! slumber not again !".

"We are the voices of the wandering wind:
Wander thou, too, O Prince, thy rest to find;
Leave love for love of lovers; for woe's sake
Quit state for sorrow, and deliverance make".

(Book III - 34 p.)

ఇందులో కనీసము ద్వితీయ చతుర్థపద్యములనైనను కవులు అనువదించినచో బాగుండెడిది.

2. ఇఁక రెండవది చిత్రాగానము : మూలమున చిత్ర ఒక వైణిక. ఆమె సిద్ధార్థుని విలాసమందిరములో గానమాధుర్యముతో వీణపై - ప్రేమ, మాయాశ్వము, సుదూర విచిత్రాద్భుత దేవలోకములు, అస్తాద్రి, సూర్యుడు సముద్రములో మునుఁగు దృశ్యములు మొ॥ వానిని స్ఫురింపఁజేయు గానకల్పన మొనర్చి ఆలపించును. తత్ గానగాథాశ్రవణము సిద్ధార్థునిలో లోకవైచిత్రిని చూడవలె నను కోర్కెను రేకెత్తించినది. అట్టి విశిష్టకథాఘట్టము తెలుఁగున వదలఁబడినది. బుద్ధుని హృదయమునఁ గల్గిన వితర్క మెంత మధురముగా వర్ణితమైనదో Light of Asia లోని ఈ క్రింది పంక్తులను గాంచుడు :

"Then spake he, sighing, – 'Chitra brings me back
The wind's song in the strings with that fairy tale:
Give her, Yasodhara, thy pearl for thanks. ....
There must be many we should love–how else ?.......
O Chitra ! you that know of fairy land !
Where tether they that swift steed of thy tale ?
My palace for one day upon his back,
To ride and ride and see the spread of the earth;
Nay, if I had yon callow vulture's plumes–
The carrion heir of wider realms than mine–
How would I stretch for topmost Himalay,

Light where the rose-gleam lingers on those snows,
And strain my gaze with searching what is round!
Why have I never seen and never sought?
Tell me what lies beyond our brazen gates?"

(Book III - 35-36 P.)

3. బుద్ధుని ప్రథమనగరయాత్రలో నొక వృద్ధుని దర్శనమైనట్లును, ఆ రాత్రి వార్ధకముగూర్చి బుద్ధుఁడు క్షుభితుఁడైనట్లును మూలమున వర్ణితమైయున్నది. శుద్ధోదనుని యేర్పాట్లలో లోపము సూచింప కుండుటకై కవులు వీనిని తీసివైచిరేమో కాని ఆ రాత్రి రాజునకు స్వప్నము వచ్చుటకు తగిన హేతువు గల్పింపలేక పోయిరి. దానిని వదలుటవలన కార్యకారణ పటిష్ఠములైన కావ్యార్థములు బలహీనము లగుచున్నవి. వృద్ధ దర్శనము శవ దర్శనానంతరము సూచించుటలో తెలుఁగు కవు లంత యౌచిత్యము పాటింపలే దని స్ఫురించుచున్నది.

4. ద్వితీయనగరయాత్రకు సిద్ధార్థుఁడు రాజానుమతిని గైకొని రాత్రివేళ సార్ధవాహుల వేషమున నగరమున సంచరించినట్లు మూలమున నుండ తి. వేం. కవు లా రమణీయకథాకల్పన మేలనో విడిచివైచిరి.

5. ద్వితీయ నగరయాత్రలో మూలములోవలెనే సిద్ధార్థుఁడు వృద్ధుని, శవమును, గాంచినట్లు కవులు వర్ణించిరి గాని మూలమునందున్న రమణీయతను తీసికొని రాజాలక పోయిరి.

కవులు వదలిన కమనీయ భావములు కొన్ని—

(a) వార్ధక నిరూపణము :

"This is no other than an aged man;
Some fourscore years ago his back was straight,
His eye bright, and his body goodly : now
The thievish years have sucked his sap away,
Pillaged his strength and filched his will and wit;
His lamp has lost its oil; the wick burns black;

What life he keeps is one poor lingering spark
Which flickers for the finish : such is age."

L. O. A. Book III Page 39.

(b) వ్యాధులు మానవులను బాధించు విధము వర్ణించుట :

"And channa said, 'Like the sly snake they come,
That stings unseen; like the striped murderer,
Who waits to spring from the Karunda bush,
Hiding beside the jungle path; or like
The lightning, striking these and sparing those'
As chance may send."

L. O. A. Book III Page 48.

(c) సిద్ధార్థుని మనస్సంక్షోభము :

"Me too this lure hath cheated, so it seemed
Lovely to live and life a sunlit stream
For ever flowing in a changeless peace;
Whereas the foolish ripple of the flood
Dances so lightly down by bloom and lawn
Only to pour its crystal quicklier
Into the foul salt sea". ....

L. O. A. Book III – Page 51.

వీనిలో నున్న భావౌన్నత్యము, అలంకారశోభ, శిల్ప విన్యాసము, రమణీయ దర్శనము, రసావేశము తెలుఁగుకావ్యమున నదృశ్యములైనవి.

ఒక్కొకసారి ఒక భాషలో నున్న సున్నితమైన వాక్శిల్పము, భావతీవ్రత, వ్యంగ్యగౌరవము, పలుకుబడి సొంపు, సంస్కారవిశేషము మఱియొక భాష లోనికిఁ దెచ్చుట కష్టమగును. కావున నట్టి కారణముచే కొన్ని రమణీయ భావము లను ఆర్నాల్డు కవిత్వమునుండి కవు లనువదింప లేకపోయిరి.

ఉదా : ప్రథమాశ్వాసాంతమున జంబూవృక్షమునుండి వెలువడిన మాటలు—

"Let be the king's son ! till the shadow goes
Forth from his heart my shadow will not shift."

L. O. A. Book I—Page 15.

ఈ పలుకులు తెలుఁగులో కథగా చెప్పఁబడినవి—

క. జంబూ వృక్షము రవి కిర
ణంబులు పయి సోఁకకుండ నరనాథ తనూ
జుం బేర్మిఁ గాచుచుండె; సు
ఖంబులు తమయంతఁ గల్గుఁగా జ్ఞానులకున్." (1-202)

2. దుస్స్వప్నభీత యైన యశోధర నూరార్చ సిద్ధార్థుఁడు పల్కిన పల్కులు—

"But then take comfort; and, if sorrow falls,
Take comfort still in deeming if there may be
A way to peace on earth by woes of ours;
And have with this embrace what faithful love
Can think of thanks or frame for benison—
Too little, seeing love's strong self is weak....
Yet kiss me on the mouth and drink these words
From heart to heart therewith, that thou mayst know—
What others will not-that I loved thee most
Because I loved so well all living souls."

L. O. A. Book, IV—Page 60,

ఈ మాటలు తెలుఁగులో పేలవములైనవి. ఆర్నాల్డు కవిత్వము భావావేశముతో నిస్సీమమగు లాస్య మొనర్చుచుండ కవులకవిత్వము నిగ్రహాత్మకమైన నడకతో

పరిమిత భావపరిధిలో పచారులు చేసినది. ఇట్లగుటకు కారణము మూలము పర దేశభాషలో నుండియుండుట యనియే నా భావము.

ప్రాచీన లాక్షణిక సంస్కార హృదయులైన తి. వేం. కవులు పాశ్చాత్య కవి సమయములు రుచింపక వదలిన భావములు కొన్ని యున్నవి. సిద్ధార్థుని చూపును అర్నాల్డు వర్ణించిన విధము—

> ...."Soft
> As the last smile of sunset was the look
> Siddhartha bent upon his weeping wife."
>
> L. O. A. Book IV P. 59.

ఈ భావమును కవులు వదలిరి. చూపులను సాయంసంధ్యతోఁ బోల్చుట భారతీయ కవి సంప్రదాయము కాదు. ఇట్టివి పెక్కులు.

ఇట్లు చర్చించుచు పోవుచో వ్యాసము పెరిగి పోవును. మొత్తమునకు కవుల స్వభావభేదముచే కావ్యరచనలయందు భేదము కానవచ్చుచున్నది. ఆర్నాల్డులో వీరశైవ కవుల కవిత్వావేశము కాననగును. అతని కవిత్వము చదువునప్పుడు పఠిత కొక రసావేశము కలిగిన యనుభవము కలుగును. ఆనందావేశములకు సంగమస్థానము ఆర్నాల్డు కవిత్వము. అశ్వఘోషుని కావ్యము శాంత రససాగరము. అతని కవిత్వమునందు రసనిర్భరత్వము, మతాభినివేశము, తాత్త్విక భావౌన్నత్యము అడుగడుగున ప్రత్యక్షమగును. ఏదో ఒక మానవాతీతమైన దైవికశక్తి కావ్యమంతయు నావరించి కథ నడపించుచున్న దను 'మిస్టిక్' భావము కల్గి పఠిత నాశ్చర్యమగ్ను నొనర్చును. తిరుపతి వేంకట కవులు బుద్ధచరిత్రమును ప్రసన్న మధురమైన శైలిలో రచించి యుండిరి. ఆర్నాల్డు ఆవేశముగాని, అశ్వఘోషుని తాత్త్వికౌన్నత్యము గాని తిరుపతి వేంకట కవుల కవితలో కానరాదు. కాని కవిత్వమునందలి సహజప్రసాదగుణముచేతను, వస్తువులోని సహజ పటుత్వముచేతను తి. వేం. కవుల బుద్ధ చరిత్రము తెలుఁగున నొక రమణీయ కావ్యమై రాణించుచున్నది. మూలములు చదివిన సహృదయులకు మాత్రము తి. వేం. కవుల కావ్యము సంతృప్తిని గల్గించుట కష్టము! అయినను తి. వేం. కవుల కావ్య మవతరించి మూలములను జదువవలసిన యావశ్యకతను ఆంధ్రావళిచే మరపింపఁజేసినది. ఆకవులకవిత్వశక్తిపై నాంధ్రుల కున్న యాదర మంతగొప్పది!

594.5134
3LB
ACC NO. 2847

తెలుఁగున వెలసిన బుద్ధచరిత్రలలో తిరుపతివేంకటకవుల కృతిని మించిన కావ్యము కానరాదు! కావున తెలుఁగున నీ కావ్యమున కేర్పడిన గౌరవము సార్థక మగుచున్నది.

బుద్ధదేవుని చరిత్ర రచనకుఁ బరోక్షముగా సమకాలీన దేశ పరిస్థితులు ప్రేరకములై యుండవచ్చును. జాతిపిత బాపూజీ నాయకత్వమున భారతదేశము స్వాతంత్ర్య శాంతి సమరమునకు సిద్ధమైనట్టి తరుణ మది. ప్రతి భారతీయుఁడును బాపూజీని బుద్ధదేవునిగా భావించి యుత్తేజము వహించినాఁడు. దానికిఁ దోడు ప్రాచీన భారత చరిత్రను త్రవ్వి, పూర్వవీరులపౌరుషము లెంచి యుత్సాహముఁ బెంచుకొనినాఁడు. ఇట్టి జాగృతి కలిగిన సమయమున నీ కావ్యము జన్మించి "ఆసియా జ్యోతి"ని ఆంధ్రుల ముందుంచి, అతని ప్రజాహితైకతత్పరత్వమును, దయాపారమ్యమును, అకుంఠితజ్ఞానసాధనదీక్షను వర్ణించి, ఆత్మాభ్యున్నతితోపాటు సంఘాభ్యున్నతి యవసర మనెడి ప్రబోధము చాటి చెప్పినది. జాతి చైతన్యము ఈ కావ్యజన్మహేతువులలో ముఖ్యమైనది.

ఈ యుగములో వెలసిన వగు దొరసానయ్యగారి గౌతమబుద్ధచరిత్ర చిలకమర్తివారి సిద్ధార్థచరిత్ర, పానుగంటివారి బుద్ధబోధసుధ, సన్నిధానమువారి జాతకథాగుచ్ఛము. దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారి బుద్ధపురాణము, మొ॥ కావ్యములలో నిది మేలుబంతి. పింగళి కాటూరిగారల "సౌందర నందము" – జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి "కరుణశ్రీ" – బుద్ధచరిత్ర కల్పించిన చైతన్య ప్రాభవముచేత వెలుగొందిన కళాజ్యోతులు. తిరుపతి వేంకట కవులు కావ్యకళాజ్ఞానసిద్ధులై, తత్కవిత్వధారామాధుర్యమును దయాబుద్ధితో దేశస్థులకుఁ బంచిపెట్టిన మహాత్ములు! జ్ఞానసిద్ధిని గడించి, భూతదయతో దివ్య జ్ఞానామృతమును లోకమునకుఁ బంచిపెట్టిన బుద్ధదేవునిచరిత్రను కావ్యముగా తిరుపతి వేంకట కవులు రచించుట కంటె పరమ సార్థక్యము మఱియేమి కలదు! 'ఆసియా జ్ఞానజ్యోతి' యగు బుద్ధుని దయాచరిత్రమును తెలుఁగున వెలుఁగుల జాలుగా వెలువరించిన రససిద్ధులు తిరుపతి వేంకట కవులు!